# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 8(2) జూన్- 2025 ISSN 2457-0796

## అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

# తెలుగు శతక సాహిత్యం-సామాజిక దృక్పథం

## 25-26 నవంబరు, 2024



సదస్సు నిర్వహణ

తెలుగుశాఖ, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**



# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 8(2) జూన్- 2025

**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
**Dr. DATTAIAH ATTEM**

**Printed and Published by**
**B. Anantha Laxmi**
*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**
**Printed at : Sri Sai Process Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

# తెలుగు శతక సాహిత్యం - సామాజిక దృక్పథం

**25-26 నవంబరు, 2024**

**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక**

**ప్రథమ ముద్రణ** : జూన్, 2025

**ప్రతులు** : 500

**కాపీలకు** : **తెలుగుశాఖ, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం**

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు.

**ఎడిటోరియల్ చిరునామా**

మేనేజర్, **మూసీ మాసపత్రిక,**

2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట,

బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013

ఫోన్ : 934 797 1177

**email : editormusi@gmail.com**

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -28 : సంచిక - 8(2) హైదరాబాద్ జూన్- 2025

## అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

# తెలుగు శతక సాహిత్యం - సామాజిక దృక్పథం

**25-26 నవంబరు, 2024**

గౌరవ సంపాదకులు

**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్**

ప్రధాన సంపాదకులు

**డాక్టర్ గరికిపాటి గురజాడ**

**డాక్టర్ మల్లిపూడి రవిచంద్ర**

**తెలుగు శాఖ**

## ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

**అనంతపురం**

## ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం

**నెల్లూరు**

# ముందుగా ఒక మాట

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంయుక్తంగా 2024 నవంబర్ 24,25 తేదీలలో "తెలుగు శతక సాహిత్యం – సామాజిక దృక్పథం" అన్న శీర్షికతో ఒక అంతర్జాతీయ సదస్సును అంతర్జాలంలో నిర్వహించింది. ఈ సదస్సు తెలుగులో శతక సాహిత్యానికున్న విస్తృత పరిధిని తెలియజేయడంతోపాటు, దానికున్న సామాజిక దృక్పథాన్ని కూడా తెలియజేస్తుంది.

తెలుగులో ఎన్నో సాహిత్య ప్రక్రియలు వెలువడ్డాయి, అయితే వాటిలో చాలా ప్రక్రియలు మధ్యలోనే ఆగిపోయాయి. కానీ మొదలయినప్పటినుంచీ నేటివరకూ కొనసాగుతున్న ప్రక్రియ శతక సాహిత్యం. శతక ప్రక్రియకు ఆనవాళ్ళు ఆంధ్ర మహాభారతాది రచనల్లో కనిపిస్తున్నా పూర్తి ప్రక్రియగా కనిపిస్తున్నది మాత్రం పాల్కురిసోమన వృషాధిప శతకం. శతకానికున్న ప్రధాన లక్షణాలలో మకుటం, శతపద్యాలు అన్న రెండు ప్రధానమైనవి. ఆ రెండు లక్షణాలతో వెలువడిన శతకం వృషాధిప శతకం. అంతకుముందు వెలువడిన శతకాల్లో శతకానికి సంబంధించిన ఈ రెండు లక్షణాలు పూర్తిగా లేవు. ఈ శతకాలను వస్తువును బట్టి అనేక విధాలుగా విభజించినా వీటిల్లో ప్రధానంగా సామాజికత అన్నది ప్రధానంగా కనిపిస్తుంది. అందుకే ఈ సదస్సుకు సామాజిక దృక్పథం అన్న శీర్షిక ఉచితంగా ఉంటుందని భావించాం.

ఈ సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాల, కళాశాలలనుంచి ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు. సదస్సులో పాల్గొని పత్ర సమర్పణ చేసిన వాటిలో కొన్నిటిని ఎంపికచేసి ఇప్పుడు పుస్తక రూపంలో తెస్తున్నాం. ఈ పత్రాలను ప్రచురించిన తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకోవడంతో పాటు, యుజిసి గుర్తింపును కూడా పొందిన 'మూసీ' సాహిత్య పత్రిక సంపాదకులు ఆచార్య సాగి కమలాకర శర్మగారికి ప్రత్యేక ధన్యవాలు తెలియజేస్తున్నాం. అదేవిధంగా ఉపసంపాదకులుగానే కాక ఈ వ్యాసాలు ప్రచురించడానికి దోహదం చేసిన డాక్టర్ అట్టెం దత్తయ్యగారికి కృతజ్ఞతలు.

ఈ సదస్సులో పాల్గొనడంతోపాటు వ్యాసాలను సకాలంలో అందజేసి ఈ వ్యాససంపుటిని ప్రచురించడానికి దోహదపడిన వ్యాసకర్తలకు కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. అదే సమయంలో ఆయా వ్యాసాల్లో ఉన్న అభిప్రాయాలు ఆయా వ్యాసకర్తలకు సంబంధించినవే. సంపాదకులకు వాటితో ప్రమేయం లేదన్న విషయాన్ని కూడా పాఠకలోకం గుర్తించగలదు.

తెలుగుశాఖ, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలచం, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నిర్వహించబోయే సదస్సులను కూడా ఆదరిస్తారని ఆశిస్తూ, ఈ సంచిక సాహిత్య ప్రయోజనాలు నెరవేర్చడంలో ఏ మాత్రం సహకరించినా అది ఈ సదస్సు విజయానికి గురుతుగా భావిస్తున్నాం. అందరికీ ధన్యవాదాలు.

ఈ సదస్సు నిర్వహణకు అత్యంత సానుకూలంగా స్పందించి సహకరించిన ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య ఎన్.ఎ.కోరిగారికి, డీన్ ఆచార్య సి.షీలారెడ్డిగారికి ప్రత్యేక ధన్యవాదాలు.

**–సంపాదకులు**

# అభినందన

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (నెల్లూరు) సంయుక్త నిర్వహణలో "తెలుగు శతక సాహిత్యం–సామాజిక దృక్పథం" అనే అంశంపై 2024 నవంబర్ 25,26 తేదీలలో రెండు రోజుల అంతర్జాతీయ అంతర్జాల సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సదస్సును ఉన్నతస్థాయి ప్రమాణాలతో నిర్వహించిన సదస్సు అధ్యక్షులు డా. గరికిపాటి గురజాడ (సహాయ ఆచార్యులు, తెలుగు శాఖాధ్యక్షులు)ను, సమన్వయకర్త డా. మల్లిపూడి రవిచంద్రను ముందుగా అభినందిస్తున్నాను. సదస్సు విజయంలో కీలక పాత్ర పోషించిన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారికి, వారి సిబ్బందికి, సదస్సు పత్రాలను ముద్రించడానికి ముందుకు వచ్చిన మూసీ పత్రిక సంపాదక మండలికి హృదయపూర్వక అభినందనలు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పండితులు, పరిశోధకులు ఈ సదస్సులో పాల్గొని తెలుగు శతక సాహిత్యంలో దాగి ఉన్న సామాజిక దృక్పథాన్ని తమ పరిశోధన పత్రాల ద్వారా వివరించిన తీరు అత్యంత అభినందనీయం. వాటిలో ఎంపిక చేసిన పత్రాలను ఈ రూపంలో పాఠక లోకానికి అందిస్తున్నందుకు సంతోషిస్తున్నాను. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులు తెలుగు భాషాసాహిత్య పరిశోధనలకు నూతన దిశానిర్దేశం చేయడమే కాకుండా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేస్తాయని నేను విశ్వసిస్తున్నాను. ఈ సదస్సు విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, సాంకేతిక సిబ్బంది... ప్రతి ఒక్కరికి నా ప్రత్యేక అభినందనలు. భవిష్యత్తులో తెలుగుశాఖ ఇలాంటి సదస్సులు మరిన్నిటిని నిర్వహించాలని ఆకాంక్షిస్తున్నాను.

**–ఆచార్య ఎస్. ఎ. కోరి**
**ఉపకులపతి, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం**

# శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం (నెల్లూరు) సంయుక్త నిర్వహణలో "తెలుగు శతక సాహిత్యం-సామాజిక దృక్పథం" అనే అంశంపై 2024 నవంబర్ 25-26 తేదీలలో అంతర్జాతీయ అంతర్జాల సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సదస్సు నిర్వహణలో కీలకపాత్ర పోషించిన సదస్సు అధ్యక్షులు డా. గరికిపాటి గురజాడ (సహాయ ఆచార్యులు, తెలుగు శాఖాధ్యక్షులు)కు, సమన్వయకర్త డా. మల్లిపూడి రవిచంద్రకు అభినందనలు. సదస్సు విజయానికి సహకారం అందించిన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారికి, వారి సిబ్బందికి, సదస్సు పత్రాలను ముద్రించడానికి ముందుకు వచ్చిన మూసీ పత్రిక సంపాదక మండలికి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సదస్సులో పాల్గొని విలువైన పత్రాలను సమర్పించిన వారందరికీ అభినందన పూర్వక కృతజ్ఞతలు.

తెలుగుసాహిత్యంలో శతకాలకు ఉన్న వైశిష్ట్యాన్ని, వాటిలో దాగి ఉన్న సామాజిక అంశాలను నేటి సమాజానికి అవసరమైన రీతిలో పత్ర సమర్పకులు తమ పత్రాలలో విశ్లేషించిన విధానం అపూర్వం. అలాంటి విలువైన పత్రాలను గాలికి పోకుండా ముద్రణలోకి తీసుకురావడం ముదావహం. శతక కవులు తమ శతకాలలో కాలానుగుణంగా నిక్షిప్తం చేసిన జ్ఞానాన్ని నేటి పాఠక లోకానికి అందించడానికి ఇదొక సదవకాశం. ఇందుకు కృషిచేసిన తెలుగుశాఖ అధ్యాపకులను, పరిశోధకులను, విద్యార్థులను, సాంకేతిక సిబ్బందిని... ప్రతి ఒక్కరిని మరొక్కసారి పేరు పేరున అభినందిస్తున్నాను. ఇటువంటి సదస్సులు తెలుగుశాఖ మరిన్ని నిర్వహించాలని మనసారా కోరుకుంటూ, పాఠక లోకానికి స్వాగతం పలుకుతున్నాను.

**-ఆచార్య సి. షీలారెడ్డి**
**డీన్, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం**

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. దాశరథి శతకం – ఆధ్యాత్మిక చైతన్యం | – డా. గరికిపాటి గురజాడ | 1 |
| 2. శేషప్పకవి శతకత్రయం – సమకాలీన సామాజికంశాలు | – డా. మల్లిపూడి రవిచంద్ర | 5 |
| 3. చోడగిరి చంద్రరావుగారి 'భీమశతకము':సామాజిక సమస్యల చిత్రణ | – ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు | 11 |
| 4. సుమతీ శతకం – సామాజికత | – ఆచార్య ఏటూరి జ్యోతి | 16 |
| 5. కుమారీ శతకము – యువతులకందిస్తున్న సందేశం | – ఆచార్య ఇరపని మాధని | 20 |
| 6. వేమన – బద్దెనల దృక్పథంలో స్త్రీ | – ఆచార్య వి.నారాయణప్ప | 28 |
| 7. తెలుగు పూలు – సామాజిక విలువలు | – డా. డి. నల్లన్న | 34 |
| 8. కూచిమంచి జగ్గకవి – భక్తమందార శతకము సామాజిక దృక్పథం | – శతావధాని ఆముదాల మురళి | 38 |
| 9. వేమన ప్రజాస్వామిక దృక్పథం | – డా.ఎన్.రజిని | 42 |
| 10. యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకం – తాత్త్విక వివేచన | – డా॥ పి. విజయకుమార్ | 47 |
| 11. పాపసాబుమాట పైడిమూట – సామాజిక సమీక్ష | – డా.పఠాన్ ఖాసింఖాన్ | 52 |
| 12. నరసింహ శతకం –వర్తమానసామాజిక అన్వయము | – డా.ఎన్.సంధ్యారాణి | 57 |
| 13. గురజాడ వారి 'ఋత శతకం' – సత్యవైశిష్ట్యం | – డా.ఎం.మంజుశ్రీ | 60 |
| 14. నరసింహ శతకం– విభిన్న దృక్పథాలు | – డా.ఎం.మునిరత్నం | 64 |
| 15. నీతి సీస శతకం– వస్తు పరిశీలన | – డా.వి.వింధ్యవాసినీ దేవి | 70 |
| 16. భర్తృహరి నీతి శతకం– వ్యక్తిత్వ వికాసం | – డా. రంగ సాయి కృష్ణ | 75 |
| 17. వజ్రగిరి నరసింహ శతకం– సామాజికత | – డా.కల్యాడపు రమేశ్ | 78 |
| 18. బద్దెన సుమతీ శతకం–నీతిప్రబోధాత్మకం | – డా.ఈతకోట ఈశ్వర రావు | 83 |
| 19. పోతులూరి వీరబ్రహ్మం గారి కాళికాంబ శతకము– సమకాలీనత | – డా॥ బత్తల అశోక్ కుమార్ | 88 |
| 20. శ్రీ కాళహస్తీశ్వర శతకం – నవజీవన సందేశం | – డా.బి.వి.యస్.గౌతమ | 94 |
| 21. కుమారశతకంలో చతుర్విధ పురుషార్థాలు – నవజీవన దృక్పథం | – ఎ. ఆశాజ్యోతి | 97 |
| 22. సుమతీ శతకం– సామాజిక దృక్పథం | – గడ్డం నాగేందర్ | 103 |
| 23. భర్తృహరి నీతి శతకం – ఆధునిక రాజకీయ నేపథ్యం | – కర్నె మల్లికార్జున్ | 109 |
| 24. భాస్కర శతకము – ఆధునిక జీవన సమన్వయం | – నడింపల్లి నీరజ | 114 |
| 25. దార్ల మాట శతకం – సామాజిక దృక్కోణం | – బొమ్ము మహాలక్ష్మి | 118 |
| 26. ఆంధ్రనాయక శతకం – కుటుంబ వ్యవస్థ | – కొమరం అనిత | 122 |

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# దాశరథి శతకం - ఆధ్యాత్మిక చైతన్యం

**డా. గరికిపాటి గురజాడ**

సహాయాచార్యులు, తెలుగు శాఖాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురము,

విద్యుల్లేఖ:dr.gurajada@cuap.edu.in, ఫోన్ నెం: 9010176407

**పరిచయం**

నిత్య జీవితంలో రాకరకాల సమస్యలతో సతమతమయ్యే మనిషి, ఆ సమస్యలనన్నింటినీ పరిష్కరించలేక పోయినా, కనీసం వాటిని కాసేపు మర్చిపోయేందుకు వేర్వేరు మార్గాలను అన్వేషిస్తుంటాడు. అలా అన్వేషించే మనుషులకు అతి పెద్ద ఊరట సాహిత్యం. ఆ సాహిత్యం తన మాతృభాషలో ఉంటే పాఠకుడికి/శ్రోతకి మరింత ఊరట. విభిన్నమైన ప్రక్రియలతో, ధోరణులతో, వాదాలతో కొన్ని కోట్ల మందికి ఊరట కలిగించిన సాహిత్యం తెలుగు సాహిత్యం. తెలుగు సాహిత్యంలో పండితులను సైతం పరీక్షించగలిగిన ప్రక్రియలు కొన్నైతే, విద్యాభ్యాసం చేసే భాగ్యానికి నోచుకోని పామరుడిని సైతం ఉత్సాహపరిచేవి కొన్ని. ఏ తరం వారినైనా, ఏ వాదం వారినైనా రంజింపజేయగలిగిన ప్రక్రియలలో శతక ప్రక్రియది అగ్రస్థానం.

అటువంటి శతకాలలో భక్తి మార్గాన్ని ప్రబోధిస్తూ, పండిత, పామర రంజకమై చిరస్థాయిలో నిలిచిపోయిన శతకం దాశరథి శతకం. ఈ శతక కర్త కంచెర్ల గోపన్న భక్త రామదాసుగా తెలుగువారికే కాదు, భారత దేశంలో ఎంతో మందికి సుపరిచితుడే. భద్రాచల సన్నిధిలో పట్టాభిరాముడిని దర్శించుకునే ప్రతీ భక్తుడూ రామదాసును కూడా తప్పకుండా స్మరిస్తాడు. తన సాహిత్యంతో భక్తులపై చెరగని ముద్ర వేశాడు రామదాసు. దాశరథి శతకం రామదాసు సాహిత్యానికే కాదు మొత్తం తెలుగు శతక సాహిత్యానికే తలమానికమైనది.

**సామాజికం- ఆధ్యాత్మికం**

ఈ పత్ర శీర్షిక చూడగానే వచ్చే మొదటి సందేహం, ఆధ్యాత్మికతకీ, సమాజానికి ఉన్న సంబంధం ఏంటని. లోతుగా ఆలోచిస్తే అసలు సామాజికం కానిది అంటూ ఏదీ లేదు. సమాజంలో ఎంతో మంది విలువలకు కట్టుబడి ఉండడానికి, ఇంద్రియనిగ్రహాన్ని కలిగి ఉండడానికి, బాధ్యతగా మెలగడానికి ప్రధానమైన కారణం ఆధ్యాత్మికత. ఆధ్యాత్మికంగా పురోగతి సాధించినవారు చాలా పరిపక్వమైన జీవనాన్ని సాగిస్తారు. తక్కువ ఆశపడతారు, సమాజానికి ఏదైనా చేయాలని భావిస్తారు. స్వార్థరహితంగా జీవితాన్ని గడుపుతారు. కొన్ని వందల న్యాయస్థానాలు, ఠాణాలు సంపూర్ణంగా సాధించలేని శాంతిని, ధర్మాన్ని ఆధ్యాత్మికత సాధించగలదు. అందుకే,దైనందిన జీవితంలో ఎన్నో సమస్యలతో సతమతవుతున్న నేటి అత్యాధునిక తరానికి ఆధ్యాత్మిక చైతన్యం అత్యంతావశ్యకం.

భక్తి శతకాలు, మరీ ముఖ్యంగా దాశరథి శతకం, శ్రీకాళహస్తీశ్వర శతకాల వంటివి ప్రతీ ఇంట్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని కలిగించగలవు. దాశరథి శతకం ఏదో పదవీ విరమణ అయిపోయాక చదివే కాలక్షేప గ్రంథం కాదు. ఆబాలగోపాలం ఆస్వాదించాల్సిన శతకరాజం.

**ఆధ్యాత్మిక చైతన్యం- ఆవశ్యకత**

ఆధ్యాత్మిక చైతన్యం ఎందుకు అవసరం? లేకపోతే నష్టం ఏంటి? చిన్న వయస్సులోనే ఆధ్యాత్మికత అవసరమా? వృద్ధాప్యం వచ్చాక భగవంతుడి గురించి ఆలోచించవచ్చు కదా! ఇప్పుడే ఎందుకు? వంటి ప్రశ్నలకు సమాధానం ఈ పద్యం.

ఉ. ముప్పునఁ గాలకింకరులు ముంగిట నిల్చినవేళ, రోగముల్
గొప్పరమైనచో గఫము కుత్తుక నిండిన వేళ, బాంధవుల్
గప్పినవేళ, మీస్మరణ గల్గునొ, గల్గదొ నాటికిప్పుడే
తప్పక చేతు మీభజన, దాశరథీ కరుణాపయోనిధీ. (దాశ: 16)

ఆధ్యాత్మిక చైతన్యం కలిగినవారిలో ఆత్మ సంతృప్తి ఉంటుంది. దేనికీ పెద్దగా ఆశపడరు. మానసికంగా చాలా దృఢంగా ఉంటారు. ఎన్ని సమస్యలు వచ్చినా ఒత్తిడి దరిచేరనివ్వరు. తద్వారా ఎంతో ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగిస్తారు. సాధారణంగా భక్తి, ఆధ్యాత్మికత అనగానే అదేదో పెద్ద వయస్సు వారికి సంబంధించింది అనుకుంటారు. పొరపాటు. కుటుంబ సమస్యల దగ్గర నుండి ఉద్యోగ సమస్యల వరకు ప్రతీ విషయం తలనొప్పిగా మారిన ఈ తరుణంలో ఆధ్యాత్మిక చైతన్యం చిన్నతనం నుండే అవసరం. 'దంతంబుల్ పడనప్పుడే, తనువునందారూఢి యున్నప్పుడే..' అంటూ ధూర్జటి మహాకవి చెప్పినట్టు భక్తి, ఆధ్యాత్మికతను ఎంత చిన్న వయస్సులో అలవర్చుకుంటే అంత మంచిది. అప్పుడే మనిషి ఆశాపాశానికి బందీ కాకుండా ఉంటాడు. అతడి ఆలోచనలు అదుపులో ఉంటాయి. ఒకవేళ ఆలోచనలు మితిమీరినా అవి చేతల వరకు రాకుండా ఉంటాయి.

అదుపు తప్పిన ఆలోచనలు, విచక్షణ లేని చేతల వల్లే ఈరోజు సమాజంలో అనేకానేక దురాచారాలు పెచ్చులు మీరుతున్నాయి, రకరకాల అక్రమాలకు కారణమవుతున్నాయి. ఆధ్యాత్మిక చైతన్యం ద్వారా జీవితం అశాశ్వతమని, అది అత్యంత కృత్రిమమని మనిషి తెలుసుకుంటాడు. ఆ విజ్ఞత కలిగినవాడు ఇతరుల సంపద కోసం ఆశపడడు. ఇటువంటి వ్యక్తుల సమూహం ఒక మెరుగైన సమాజానికి బాటలు వేస్తుంది.

**ఆధ్యాత్మిక చైతన్యం- అవినీతి,అత్యాచార నివారణ**

ఆధ్యాత్మిక చైతన్యంతో సమాజాన్ని పట్టి పీడిస్తున్న రెండు అతిపెద్ద సమస్యలైన అవినీతి, అత్యాచారాలను నివారించవచ్చు.దాసరథి శతకంలోని ఈ రెండు పద్యాలూ రెండు అతిపెద్ద సమస్యలను ప్రస్తావించి, పరిష్కారాన్ని సూచిస్తున్నాయి.

చ. పరధనముల్ హరించి, పరభామలనంటి, పరాన్నమబ్బినన్
మురిపముకాని, మీఁదనగు మోసమెరుంగదు మానసంబు, దు
స్తరమిది, కాలకింకర గదాహతి పాల్పడనీక, మమ్ము నే
తరి దరిఁజేర్చి కాచెదవో? దాశరథీ కరుణాపయోనిధీ. (దాశ: 48)

చ. పరులధనంబుఁ జూచి, పరభామలఁ జూచి, హరింపఁగోరు మ
ద్గురుతర మానసంబనెడి దొంగనుబట్టి నిరూఢదాస్య వి
స్ఫురిత వివేకపాశములఁ జుట్టి, భవచ్చరణంబనే మరు
త్తరువునఁ గట్టివేయఁగదెదాశరథీ కరుణాపయోనిధీ. (దాశ: 50)

మొదటి పద్యంలో ఇతరుల ధనాన్ని, పరస్త్రీలను పొందాలని దురాశపడే ఈ మనస్సును ఎలా అదుపు చేయాలో, అదుపు చేయకపోతే ఎంతటి పర్యవసానాలను ఎదుర్కోవాలో అంటూ వాపోయిన భక్త రామదాసు, రెండవ పద్యంలో పరిష్కారం కూడా సూచించాడు.

మనస్సు ఎప్పుడూ మనిషికి ఏది సౌకర్యమో అదే చేయమని చెబుతుంది. ధర్మం వైపు నిలబడేలా ప్రోత్సహించదు. బుద్ధి, అనుభవాలు మనిషి పెడదోవ పట్టకుండా అదుపు చేయడానికి ప్రయత్నం చేస్తుంటాయి. నిజానికి మనసు ఎక్కడ ఉంది? అదొక ప్రత్యక్ష అవయవమా? కాదు. అంటే ఇదంతా అంతః సంఘర్షణ మాత్రమే. 'ఆశపడు, ఇంకా కావాలి' అని మనసు ప్రేరేపిస్తే, 'వద్దు, ఇది ధర్మం కాదు, ఇబ్బందులు పడతావు' అని బుద్ధి హెచ్చరిస్తుంటుంది. మనిషి గమనించాల్సింది మనస్సుని కాదు, మనఃసాక్షిని.

ఆధ్యాత్మిక చైతన్యం మనిషిని ధర్మం వైపు నడిపిస్తుంది. సంపదలు, సుఖాలు అశాశ్వతమని, కృత్రిమమని నిరూపణ చేస్తుంది. కోరికలు తీర్చిన కొద్దీ తీరేవే తప్ప, వాటికి అంతు లేదని అవగతమయ్యేలా చేస్తుంది. ఉన్నదాంతో సంతృప్తిగా ఉండడం అలవారుస్తుంది. తద్వారా మనిషి నడవడికను సరిచేస్తుంది. ఈ ఆలోచనావిధానం, ఇటువంటి శతక పద్యాలు మనిషికి మానసిక వైద్యం చేసి అడుగులు తడబడకుండా అదుపు చేస్తాయి. తద్వారా ఒక బాధ్యతాయుత సమాజ నిర్మాణానికి బాటలు వేస్తాయి.

భగవద్భక్తి అనే బంధనంతో మనిషిలోని అత్యాశని నిర్మూలించవచ్చని రామదాసు ఈ రెండు పద్యాల ద్వారా ఉపదేశిస్తున్నాడు.

**నామస్మరణ- సమస్యల నుండి ఉపశమనం**

ఒక రోజుకి మనిషి సగటున అరవై వేల ఆలోచనలు చేస్తాడట. అందులో 95 శాతానికి పైగా నిన్న ఆలోచించినవే. ఇన్ని వ్యర్థపు ఆలోచనలు చేయడం వల్ల ఎంతో సమయం వృథా అయిపోతోందని, సమయాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నామని, ఒత్తిడికి గురవుతున్నామని నేటి యువతలో ఎక్కువమంది మానసిక వైద్యులను సంప్రదిస్తున్నారు. ఈ సమస్యకి దాశరథి శతకం అన్ని భక్తి శతకాల మార్గంలోనే ఒక తేలికైన పరిష్కారాన్ని చెప్పింది. అదే నామ స్మరణ.

ఒకే సమయంలో ఎక్కువ ఆలోచనలు చేసే మనస్సును ఒక్క అంశంపైనే దృష్టి సారించేలా చేయడం ఒక పెద్ద సవాల్. ఇందుకు పరిష్కారంగా ఎన్నో పాశ్చాత్య సిద్ధాంతాలు అంకెలపై దృష్టి సారించమని, వస్తువులపై దృష్టి సారించమని బోధిస్తున్నాయి. అదే విషయాన్ని భారతీయులు ఒక నామం మీద దృష్టి సారించమని చెప్పారు. ఎవరు ఉన్నా, లేకున్నా దైవమనే ఒక అతీత శక్తి మనవెంటే ఉందన్న భరోసా నామాన్ని ఎంచుకోవడంలో ఉన్న అదనపు ప్రయోజనం. దాశరథి శతకంలోని ఈ కింది పద్యం ఆ విషయాన్నే బోధిస్తోంది.

చ. హరునకు నవ్విభీషణున కద్రిజకుం దిరుమంత్రరాజమై
కరికి నహల్యకున్ ద్రుపదకన్యకు నార్తిహరించు చుట్టమై
పరగినయట్టి నీ పతితపావననామము జిహ్వపై నిరం
తరమునటింపఁజేయుమిఁక దాశరథీ కరుణాపయోనిధీ. (దాశ: 15)

శివుడు, విభీషణుడు, పార్వతీదేవి, ఏనుగు, అహల్య, ద్రౌపది వంటి ఎంతో మందికి హరినామ స్మరణ ఉపశమనం కలిగించింది. హరి హరుడినీ, హరుడు హరినీ స్మరిస్తారని పురాణ ప్రశస్తి. కంచెర్ల గోపన్న తన నిజ జీవితంలో ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నాడో అందరికీ తెలుసు. అటువంటి కష్టాల నుండి తాను ఉపశమనం పొందడానికి హరి నామస్మరణనే ఆశ్రయించాడు. ఒకే పద్యంలో ఇందరి పేర్లు ప్రస్తావించడం ద్వారా ఆయా రసవత్తర గాథలను రచయిత మనకు గుర్తు చేస్తున్నాడు. ఈ పేర్లు వినగానే శివపురాణం, భాగవత పురాణం, రామాయణం, మహాభారతం జ్ఞప్తికి వస్తాయి. 'వారందరినీ హరి రక్షించాడు కాబట్టి నేనూ అతడిని ఆశ్రయిస్తున్నాను, మీరూ ఆశ్రయించండి' అని పిలుపునిస్తున్నాడు భక్త రామదాసు.

నామస్మరణ ఒత్తిడిని దూరం చేయడంతో పాటు, ఒకే అంశంపై గురి కుదిరేలా చేస్తుంది. ఎన్నో ఆలోచనల్లో నిమగ్నమైపోయి అలసిపోయిన మనస్సుని ఒక్క విషయంపైనే దృష్టి కేంద్రీకరించేలా చేసి ఉపశమనాన్ని అందిస్తుంది. దాని ప్రభావంతో నామస్మరణ కాసేపు ఆగినా కూడా ఆ వ్యక్తికి ఒక సమయంలో ఒక విషయంపైనే గురి కుదరడం అలవాటవుతుంది.

**ముగింపు**

పద్యాలు చదివే ఇష్టం లేకనో, అర్థం చేసుకునే పరిణతి లేకనో పద్య సాహిత్యాన్ని విస్మరిస్తే అపురూపమైన విజ్ఞానాన్ని కోల్పోకతప్పదు. ప్రాచీన సాహిత్యం ఒక విజ్ఞాన భాండాగారం. ప్రబంధాలు చదివే తీరిక లేకపోయినా,

కనీసం దాశరథి వంటి శతకాలనైనా అధ్యయనం చేసి భవిష్యత్తరాలకు అందించాల్సిన బాధ్యత పరిశోధకులపై ఉంది. ప్రతీ ప్రాచీన గ్రంథాన్ని సామాజిక కోణంలో దర్శించగలిగితే ఎన్నో ఆధునిక సమస్యలకు పరిష్కారాలను తెలుసుకోవచ్చు. ఆ పరిష్కార సూత్రాలను నిత్యజీవితానికి అన్వయించుకొని, ఆచరించగలిగితే ఆనందం, ఆరోగ్యం మనిషి సొంతమవుతాయి.

**ఆధార గ్రంథాలు**

1. కులశేఖరరావు, ఎం (వ్యాఖ్యాత). 1999. దాశరథి శతకము. హైదరాబాద్: పావని సేవా సమితి.
2. నాగఫణిశర్మ, మాడుగుల (వ్యాఖ్యాత). 1984. శ్రీకాళహస్తీశ్వర శతకము. అనంతపురం: మాడుగుల సుశీలమ్మ ప్రచురణ.
3. నాగయ్య. జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటం -2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.
4. భర్తృహరి. 2012. భర్తృహరి సుభాషితములు. విజయవాడ: లిఖిత ప్రచురణలు.

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక** సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# శేషప్పకవి శతకత్రయం - సమకాలీన సామాజికంశాలు

**డా.మల్లిపూడి రవిచంద్ర**

తెలుగు అధ్యాపకులు, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.

ఫోన్ నెం: 9573449282, Email: ravi.hcu32@gmail.com

## 1. పరిచయం

తెలుగుసాహిత్యంలోశతకాలది ప్రత్యేకస్థానం. శివకవియుగం మొదలు నేటి వరకూ తెలుగుశతకం విరాజమానమవుతూనే ఉంది. తెలుగుపద్యం జనబాహుళ్యానికి చేరువవ్వడానికి కీలకభూమిక పోషించిన ప్రక్రియల్లో శతకానిది అగ్రపీఠం. నీతి, భక్తి, వైరాగ్యం, అధిక్షేపం... మొదలైన రూపాలలో మూడుపువ్వులు ఆరు కాయలుగా వృద్ధి చెందింది. శతకం రాయడం వల్ల పద్యంతోపాటు, శతక కవులు కూడా తెలుగు ప్రజల హృదయాలలో చిరంజీవులయ్యారు. కేవలం శతకం ద్వారానే అఖండమైన కీర్తిని గడించిన కవులూ ఉన్నారు. వారిలో ధర్మపురి శేషప్ప ఒకరు.

## 2. కవి జీవితం- ఇతర విశేషాలు

ధర్మపురి శేషప్పగా మిక్కిలి ప్రసిద్ధుడైన ఈ కవి అసలు పేరు కాకుత్సం శేషప్ప. ఈయనకు శేషయ్య, శేషాచలదాసు అన్న నామాంతరాలున్నాయి. “మస్తకంబున హేమ మణి కిరీటము నీకు? పేద నెత్తికి బట్ట పేగునాకు? శత్రువుల ఖండించ చక్రాయుధము నీకు? దొంగ బర్లను గొట్టదుడ్డునాకు”(నరహరి.:8), “పైనంబునకు నీకు పక్షివాహనముంటె? నడువ కాళ్ళున్నవి నాకురెండు? పవ్వళించను నీకు ఫణిశయ్యగలిగుంటె? కట్టె మంచపు కుక్కి కలదునాకు!”(నరహరి.:23)వంటిపద్యాల ఆధారంగా శేషప్పకవి పేదవాడని, ఇతర రచనల ద్వారా విష్ణుభక్తుడని, చాత్తాద వైష్ణవుడని, ధర్మపురి నరసింహస్వామికి తన జీవితాన్ని అంకితం చేశాడని తెలుస్తోంది.

ఈ కవి ఎక్కడా తన ఊరిని గురించి, తన కాలాన్ని గురించి చెప్పుకోలేదు కానీ ధర్మపురి పేర, అక్కడ కొలువైన నరసింహస్వామి పేర రచనలు చేయడంవల్ల ఆయన ధర్మపురి వాసుడని పరిశోధకులు నిర్ణయించారు. అది తెలంగాణ రాష్ట్రంలోని (పూర్వం కరీంనగర్) ప్రస్తుత జగిత్యాల జిల్లాలోని ధర్మపురి. గోదావరీ తీరప్రాంతాన ఉన్నది. అక్కడే నరసింహస్వామి కొలువై ఉన్నాడు. ఆ స్వామిపేరునే మకుటంగా పెట్టుకొని శతకాలు చెప్పాడు.

ధర్మపురి శేషప్ప కవి తన జీవిత కాలంలో 1. నరహరి శతకం2. ధర్మపురి రామాయణం3. శ్రీనృకేసరిశతకం4. నరసింహశతకం5. అవనిజాచరిత్రం అనేఅయిదు రచనలు చేసినట్టు ప్రసిద్ధి.వీటిలోఅవనిజా చరిత్రంతప్ప మిగిలిన అన్ని రచనలూ లభిస్తున్నాయి. పౌర్వాపర్యాలు చెప్పటం కష్టం కానీ వాటిలోనరసింహశతకంమిక్కిలి జనాదరణను పొందినది. శేషప్ప కవి రచించిన నరహరి, నరసింహ, నృకేసరి మూడు శతకాలలో ఉన్న నైతిక విషయాలు, జీవిత సత్యాలు, కార్యసాధకుల లక్షణాలు, చారిత్రకాంశాలు వంటి సమకాలీన సామాజిక అంశాలను ప్రస్తావించడం ప్రస్తుత పత్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

## 3. నైతికవిషయాలు

పూర్వం ఆనందోపదేశాత్మకమైనదే కవిత్వం లేదా సాహిత్యంగా భావించారు.సహితస్యభావం సాహిత్యంఅనే నిర్వచనం కూడా దానినే ఋజువు చేస్తుంది. అందుకే అప్పటి కవులు తాము రాసే కవిత్వం జగద్ధితం కోసం రాస్తున్నామన్నారు. ఆధునిక కాలంలో ఉపదేశాత్మకమైనదై సమాజానికి ఉపయోగపడేదాన్ని మాత్రమే సాహిత్యంగా విమర్శకులు భావిస్తున్నారు. ఆ కోణంలో సమాజ హితాన్ని కోరే నైతిక ప్రబోధాత్మక అంశాలు శేషప్ప శతకాలల్లో పుష్కలంగా ఉన్నాయి. స్థలాభావం చేత స్థాలీపులాకంగా కొన్నిటిని మాత్రమే ఈ వ్యాసంలో ప్రస్తావించడం జరిగింది.

శేషప్ప మూడు శతకాలూ ఎన్నో నైతిక విషయాలకు ఆలవాలం. మనిషి జీవితానికి సంబంధించిన అనేక విషయాలు తన శతకాల ద్వారా తెలియజేశాడు. మహాత్ముల సాంగత్యం వల్ల సాధారణ మానవులు, దుర్మార్గులు కూడా ఏ రకంగా మహాత్ములవుతారో కింది పద్యంలో వివరించాడు.

సీ. ఘనమైన పరుసవేదిని సోకినంత లో/ హపుముద్ద బంగారమైన రీతి
పాపకర్ములకు నీ భక్తుల స్నేహ/ మబ్బెనా పుణ్యాత్ము లౌదురయ్య
పుడమిలో భృంగంబు పురుగు నొక్కటి దెచ్చి/ చేయదా తనరూపు చెలువుగాను
అడవిలోపల చోరుడమలాత్ముని వలన/దండిగా వాల్మీకి తపసియయ్యె

తే. తొలుత దుర్మార్గులైనను తుదకు సజ్జ/ నాశ్రయంబున మోక్షార్హు లౌదురయ్య (నరహరి.:93)

ఒక సాధారణ లోహం పరుసవేది విద్యద్వారా బంగారంగా, పాపాత్ములు భగవద్భక్తుల స్నేహంవల్ల పుణ్యాత్ములుగా, అడవిదొంగయైన వాల్మీకి మహితాత్ముల వల్ల మహర్షిగా, ఒక తుమ్మెద వల్ల పురుగు తుమ్మెదగా (భ్రమరకీటన్యాయంద్వారా) మారినట్లు దుర్మార్గులైనవారు సజ్జనుల సాంగత్యం వల్ల సజ్జనులవుతారు. చివరికి మోక్షార్హులు కూడా అవుతారని భావం. అలాంటి భావాన్ని కలిగిన పద్యమే కిందిది కూడా.

చ. భ్రమరము కీటకంబు నొగిc బట్టుకవచ్చి నిజస్వరూపమున్
సమముగc జేసినట్లు ఘన సజ్జనులైన మహాత్ములున్నc బా
పమతులc జేరcబిల్చుకొని భక్తులc జేయరె నిశ్చయంబుగన్
విమల సరోజ లోచన వివేకులు ధర్మపురీ నృకేసరీ(నృకేసరి.:55)

### 4. మహాత్ముల/కార్యసాధకుల లక్షణాలు

మహాత్ములు, కార్యసాధకులు ఎప్పుడూ చేయాల్సిన కార్యం మీద దృష్టి పెడతారే తప్ప అనవసర కార్యాలపట్ల తమ సమయాన్ని వృథా చేసుకోరు. ఏనుగు దారిలో వెళుతూ ఉంటే కుక్కలు మొరుగుతూ ఉంటాయి. వాటికి స్పందిస్తే ఏనుగు తన గమ్యాన్ని చేరుకోలేదు. అలాగే మహాత్ములను, కార్యసాధకులను కొంతమంది నిష్కారణంగా గేలి చేస్తూ ఉంటారు. వారందరికీ బదులిచ్చుకుంటూ విలువైన సమయాన్ని వృథాచేసుకోరు. పని ద్వారానే సమాధానం చెబుతారు. అదే ఎగతాళి చేసే వారికి చెప్పే సరైన గుణపాఠం. దానిని తెలిపేది కింది పద్యం. నేటి తరానికి ఈ పద్యం స్ఫూర్తిదాయకమైనది.

ఉ. ఏనుcగు బోవcజూచి ధ్వను లెత్తుచుc గుక్కలు గూయసాగుచో
దాని మనస్సు కోపపడి దండడి వానిని వెంబడించునే
మానవులందు సజ్జనుల మత్తులు కొందఱు గేలిచేయుచో
ఆనరుc దల్గి వాండ్ర బదులాడునె ధర్మపురీ నృకేసరీ!(నృకేసరి.:72)

### 5. జీవితసత్యాలు

శతకాలలో నీతితోపాటు జీవిత సత్యాలను కూడా చెప్పడం పరిపాటి. తద్వారా మనిషి వాస్తవాన్ని తెలిసికొని సత్ప్రవర్తనను కలిగి ఉంటాడనేది కవుల కాంక్ష. అదే జగద్ధిత కాంక్ష. మనుషులకు శరీరమంటే వ్యామోహం. దాని సంరక్షణ కోసం మొత్తం జీవితాన్నే వెచ్చిస్తారు. రకరకాల లేపనాలు పూస్తారు. ఎంత చేసినా అది మురికిదని, నరాలగుత్తి అని, చిన్న ముల్లు గుచ్చుకున్నా తట్టుకోలేని తోలుతిత్తి అని, నెత్తుటి మడుగు అని, నవరంధ్రాల మట్టి కుండ అనీ గ్రహించరు. అందుకే బాధ్యతగల కవిగా శేషప్ప సమాజానికి

చ. నరములగుత్తి ముల్లొకటి నాcటినcదాళని తోలుతిత్తి నె
త్తురు గదె దీనినిండ బలు తొమ్మిది చిల్లులు గల్గుకుండ భూ
నరున కిదేమి లెస్స యగు నమ్మినవారికి లావు పిస్స భీ
మురి కిది పాడుమొక్క సుమి ముప్పిది ధర్మపురీ నృకేసరీ(నృకేసరి.:97) అని హితబోధ చేశాడు.

"కాయంబు నాపాయమే" అని, "చావున కొల్లక డాగ వచ్చునే"అని పోతన అన్నా, "తనువే నిత్యముగా నొనర్చు మది" అని, "తామెన్నడు జావరో తమకు బోవో సంపదల్"అని ధూర్జటి అన్నా, ఇతర కవులు, శాస్త్రాలు, కావ్యాలు ఎంత బోధించినా మనుషులు మారడం లేదని శేషప్ప బాధపడ్డాడు. తాను కూడా పూర్వ కవుల మాదిరి

ఉ. కొండలుగావు దేహములు కుంభినిలోపల శాశ్వతంబుగా
సుండవు ప్రాణముల్ విడువ నొప్పుగ మిత్రులు గాలవేతురో
కండలు మాంస మొల్చుకొని కాకులు గద్దలు మేసిపోవునో
పండితులైననుం బ్రదు కబద్ధము ధర్మపురీ నృకేసరీ(నృకేసరి.:96) అనీ,

సీ. కాయమెంత భయానఁ గాపాడినను గాని/ ధాత్రిలోనది చూడఁదక్కఁబోదు, ఏ వేళనే రోగ మేమరించునొ సత్త్వ/ మొందఁగఁజేయ నేచందముననను, ఔషధంబులు మంచి వనుభవించినఁగాని/ కర్మక్షీణంబైనఁ గాకవిడదు, కోటివైద్యులు గుంపు గూడి వచ్చినఁగాని/ మరణమయ్యెడి వ్యాధి మాన్పలేరు(నరహరి.:37) అనీ అసలు సత్యాన్ని తెలుసుకోమనే గట్టిసూచన చేశాడు. అయినా మారకపోతే వారు పిచ్చివారే అన్నాడు. ఆ పిచ్చిలో అశాశ్వతమైన శరీరం కోసం ధనాన్ని కూడా కూడగడతారని, ఆ ధనం కోసం నానా అడ్డదారులు తొక్కుతారని చెప్పాడు.

సీ. తల్లి గర్భమునుండి ధనము తేఁడెవ్వఁడు/ వెళ్ళిపోయెడి నాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని/ మెఱుఁగు బంగారంబు మ్రింగఁబోఁడు
విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటెగాని/ కూడఁబెట్టిన సొమ్ము కుడువఁబోదు
పొందుగా మఱుగైన భూమిలోపలఁబెట్టి/ దానధర్మములేక దాచిదాచి

తే. గీ. తుదకు దొంగలకిత్తురో దొరలకవునొ/ తేనె జుంటీగలియ్యవా తెరువరులకు! (నరసింహ.:15) అనే సత్యాన్ని మాత్రం విస్మరిస్తారన్నాడు. ఇది నేటి రాజకీయ నాయకులకు, ధనదాహులకు చెంపపెట్టు లాంటి పద్యం.

**6. సార్వకాలికాంశాలు**

ప్రతి కవి తన కాలానికి సంబంధించిన అనేకాంశాలను తన రచనలలో వ్యక్తం చేస్తాడు. వాటిలో కొన్ని చరిత్రగా మిగిలితే, మరికొన్ని సార్వకాలికాంశాలవుతాయి. చదువరి ఏ కాలంవాడైతే ఆ కాలానికవి సమకాలికాంశాలవుతూ చక్కగా అన్వయమవుతాయి.

సీ. అధికవిద్యావంతుల ప్రయోజకులైరి/పూర్ణశుంఠలు సభాపూజ్యులైరి
సత్యవంతుల మాట జనవిరోధంబాయె/ వదరుబోతుల మాట వాసికెక్కె
ధర్మవాదనపరుల్ దారిద్ర్యమొందిరి/ పరమలోభులు ధనప్రాప్తులైరి
పుణ్యవంతులు రోగ భూతపీడితులైరి /దుష్టమానవులు వర్ధిష్ణులైరి(నరసింహ.:26)

అంటూశేషప్ప చెప్పిన పద్యం ఈ కాలానికే ఎక్కువ అన్వయం అవుతుంది.బాగా చదువుకున్నవారికి ఉద్యోగాలు లేవు. అర్హతకు తగిన గుర్తింపూ ఉండడం లేదు. అంతంత మాత్రం చదివిన, అసలు చదవకపోయినా కొందరికి డబ్బును బట్టో, రాజకీయ నేపథ్యాన్ని బట్టో, పైరవీలను బట్టో సభలలోనూ, సమాజంలోనూ ఎనలేని గౌరవం దక్కుతోంది. నిజం ఈ రోజు ఎవరికీ అవసరం లేదు. అబద్ధం చెప్పేవారి మాటలే చెల్లుతున్నాయి. దానధర్మాలు చేసినవారు పేదరికాన్ని, పిసినారులు మరింత ధనాన్ని పొందుతున్నారు. పుణ్యులు రోగాల పాలవుతున్నారు. చెడ్డవారికి ఆరోగ్యమూ, ఆయుస్సూ కలుగుతున్నాయి. ధర్మానికి, సత్యానికి, నీతికి, నిజాయితీకి విలువ లేదిప్పుడు. ఏ నియమమూ పాటించనివారికి మాత్రం ఎనలేని గౌరవం. ఇలాంటి విషయాలనే మహాభారతం ఆరణ్యపర్వంలో ఎఱ్ఱన....

ఆ. సాధు చరితులైన జనులు దుర్గతుల రో/ గముల తెగుదు రల్ప కాలమునన
పాపపరులు లగ్గుఁ బరమాయువును నరో/ గతయు సిరియు బొంద గాంతు రెందు(భారత. ఆరణ్య.4: 293) అంటూ ప్రస్తావనచేశాడు. అది కలియుగ ప్రభావమన్నాడు. ఈ కలియుగంలో సమాజం ఏయే తప్పులు జరుగుతున్నాయో, బాధ్యులెవరో మొహమాటం లేకుండా కింది పద్యంలో తెలియ చెప్పాడు.

సీ. పసరంబు బందైనఁ బసులకాపరితప్పు/ ప్రజలు దుర్జనులైన ప్రభునితప్పు
భార్య గయ్యాళైనఁ బ్రాణనాథుని తప్పు/ తనయుఁడు దుష్టైనఁ దండ్రితప్పు
సైన్యంబు చెదరిన సైన్యనాథుని తప్పు/ కూతురు చెడుగైన మాతతప్పు
అశ్వంబు చెడుగైన నారోహకుని తప్పు/ ఇభమది చెడ మావటీని తప్పు(నరసింహ.:12)

అని ఎవరు చెడుత్రోవ పడుతున్నా తప్పు వారి యజమానులదే అన్నాడు. ఉపేక్ష చేయకుండా వారే బాగుచేయాలని చెప్పాడు. ఎప్పుడో చెబితే ఇప్పుడది బాగు పడకపోగా మరింత చెడబారిని వ్యవస్థగా మారింది. రాజకీయ ప్రభుత్వ రంగాలు మరీ దారుణంగా తయారయ్యాయి. వాటిని బాగు చేయాల్సిన బాధ్యత అధినేతలదే. అది తెలుసుకొన్న రోజు శేషప్ప కోరుకున్న సమాజం ఏర్పడుతుంది.

## 7. సామాజిక సమానత్వం

భారతదేశంలో సామాజిక అసమానత్వం అనేది కులం ఆధారంగా 165 మిలియన్ల పైగా ప్రజలను పీడించింది అని హ్యూమన్ రైట్స్ వాచ్ అనే అంతర్జాతీయ పరిశోధన సంస్థ తెలియజేసింది."చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః(4:13) అని భగవద్గీతలో కృష్ణుడు అన్నాడు. అంటే వ్యక్తుల గుణాన్ని బట్టి, చేసే పనినిబట్టి వారి కులాలు సృష్టి చేసినట్టు చెప్పాడు. నేటి సమాజంలో గుణంతోనూ, చేసే పనితోనూ సంబంధం లేదు. తక్కువ ఎక్కువ అంటూ కులాన్ని ఒక కొలమానంగా చేసి అంటరాని వారిగా దూరం పెడుతూనే ఉన్నారు. దానినే శేషప్ప

చ. ఇలను మనుష్యజాలమున నెక్కువతక్కువ లున్నవన్నచోఁ
గులముల శ్రేష్ఠ మెవ్వరిది కొంచెము గానఁగరాదు వారు ని
ర్మలినశరీరులో గుమగుమా యనుకుక్షిని గందమున్నదా
తెలిసిన నిండుభక్తులె సుధీరులు నృకేసరీ(నృకేసరి.:52) అంటూ గట్టిగా ప్రశ్నించాడు. గుణం ప్రధానం కానీ కులం కాదన్నాడు.

సీ. వ్యాసుఁడే కులమందు వాసిగా జన్మించె ?/ విదురుఁడే కులమందు వృద్ధిపొందె?
కర్ణుఁడే కులమందు ఘనముగా వర్ధిల్లె?/ నా వసిష్ఠుండెందు నవతరించె?
నింపుగా వాల్మీకి యే కులంబునఁ బుట్టె?/ గుహుఁడను పుణ్యుఁడే కులమువాఁడు? (నరసింహ.:74)

అంటూకులాన్ని బట్టి గౌరవమిస్తే ప్రాతః స్మరణీయులైన పురాణపురుషులు ఏ కులంలో జన్మించారని ప్రశ్నించాడు. భగవంతుని దృష్టిలో అందరూ సమానమే అయినప్పుడు ఈ కులభేదం మనుష్యులలో ఎందుకు అన్నాడు. "వేదముల్ చదివెడు విప్రవర్యుండైన/ రణము సాధించెడు రాజులైన" అంటూవేదాలను చదివే బ్రాహ్మణులు, యుద్ధం చేసే రాజులు, వ్యాపారం చేసే వైశ్యులు, పరిచర్య చేసే శూద్రులు, బట్టలుతికే రజకులు, చర్మకారులు... ఇలా ఎవరైనా భగవంతుని కృపకు పాత్రులే. వీటిలో జాతి భేదం కూడదని గర్హించాడు.

సీ. ఇనుపగుండేకాని యిత్తడైనను కాని/ కనకమైననుగాని కంచు గాని?
అగ్నిలో పడినప్పుడన్ని కాలెవిగాని/ వొకటిచల్లదనంబు వుండబోదు?
యీవస్తువులలోన యినుము కొంచెపుదంచు/ చెయ్యి మోపితెకాలిచెడక బోదు?
విప్రుడైనను గాని వెలయశూద్రుడెకాని/ అవనిలోనీదాసు లంతఘనులె?

తే. యెట్టి వాడైన నీదాసు డెక్కువతడె/ తక్కువనితలుచువాడెల్ల ధ్వంసమౌను?(నరహరి.:4)

ఇనుము, ఇత్తడి, బంగారం, కంచు... మొ. వి సమాజంలో ఎక్కువ తక్కువ విలువ కలిగిన లోహాలు. అగ్నిలో వేస్తే అన్నీ కాలుతాయి. ఇందులో ఇనుము చాలా తక్కువ విలువైనది కాబట్టి కాలదు అనుకొంటే పొరపాటు. పట్టుకొంటే తెలుస్తుంది కాలుతుందో లేదో. అలాగే సమాజంలో బ్రాహ్మణులైనా, శూద్రులైనా అందరూ సమానమే. ఎవరైతే ఇతరులను తక్కువగా చూస్తారో వారు తప్పకుండా నాశనమవుతారు అన్నాడు. కులభేదాన్ని ఖండిచడానికి శేషప్ప తన కలాన్ని ఆయుధంగా వాడుకున్నాడు. ఇలా సమాజానికి అవసరమైన, సమాజ రుగ్మతలను పోగొట్టే ఎన్నో విషయాలను శేషప్ప తన శతకాల ద్వారా తెలియజేశాడు.

**8. చారిత్రకాంశాలు**

మొఘలాయిలు కీ.శ. 1526 నుండి 1707 వరకు భారత ఉపఖండాన్నిపరిపాలించారు. ఆరవ మొఘల్ చక్రవర్తి అయిన ఔరంగజేబు 1707లో మరణించాక నిజాం రాజ్యం ఏర్పడింది. శేషప్ప కాలానికి నిజాం ఆలీఖాన్ అసఫ్ జా %××% దక్కన్ ప్రాంతాన్ని పరిపాలిస్తున్నాడు. అప్పటికే బ్రిటిష్ వారి ఒప్పందంతో పాలన సాగుతోంది. ఈ రెండిటి ప్రభావం తెలుగు నేలపై విస్తరించింది. అది ఆ కాలపు కవుల రచనలలో కూడా మనకు కనిపిస్తుంది. శేషప్ప కాలంలో మహ్మదీయులకు ఎలాంటి గౌరవం ఉండేదో కింది పద్యం వల్ల తెలుస్తుంది.

ఉ. దేవరవారిభక్తులకుఁ దిన్నగ మ్రొక్కరు భక్తు లందఱున్
గోవధఁ జేయు మ్లేచ్ఛులకు గొబ్బున లేచి సలాము చేతురున్
కేవల పారమార్థికులకే సుమి పెద్దలమీఁదిప్రేమలున్
గావరు లైన దుర్జనులు గానరు ధర్మపురీ నృకేసరీ(నృకేసరి.:92) ? 93

అని హైందవ భక్తులందరూ తోటి హైందవ భక్తులకు నమస్కారం చేయరు, తగిన గౌరవమివ్వరు. కానీ మహమ్మదీయులకు మాత్రం లేచి మరీ సలాం చేస్తారని చెప్పాడు.

బ్రిటిష్ వారు, తమ మిషనరీలు క్రైస్తవ మతబోధ చేస్తూ నెమ్మదిగా మతాన్ని చాప కింద నీరులా భారతదేశంలో ప్రవేశపెట్టారు. తరువాత బైబిలును అనువాదం చేసి క్రైస్తవ వ్యాప్తికి విశేషమైన కృషి చేశారు. తదనంతర కాలంలో మిషనరీలతోపాటు క్రైస్తవులుగా మారిన భారతీయులు కూడా జీతం కోసమో, పాలకుల ప్రాపకం కోసమో క్రైస్తవ మతవ్యాప్తికి తలపడ్డారు. అలాంటి పరిస్థితులను, తాను చూసిన క్రైస్తవ మతం మార్పిడి విధానాన్ని కళ్ళకు కట్టినట్టు వివరించాడు శేషప్ప.వాస్తవానికి కోస్తాప్రాంతాలతో పోలిస్తే తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలలో క్రైస్తవ మత వ్యాప్తి ఇప్పటికీ తక్కువే. అయినప్పటికీ శేషప్ప జీవించిన ప్రాంతంలో అప్పటికే క్రైస్తవ మతంలోకి మార్పిడి ఎలా జరిగేదో కింది పద్యం వల్ల తెలుస్తుంది. అది ఈనాటి పటిష్ఠమైన క్రైస్తవ మతానికి ఏ రకంగా పునాది అయ్యిందో మనకు అవగతమవుతుంది. చరిత్ర రచనకు సాహిత్యం ఆధారం కాదు అన్న కొందరి మాటలకు గొడ్డలిపెట్టుగా ఈ పద్యం నిలుస్తుంది.

ఉ. పెద్దలమంచుఁ బ్రశ్నలిడి పెక్కులు జెప్పెడి పాపకర్ములన్
వద్దికిఁ జేరఁబిల్చుకొని వారిమనస్సుల శోధజేయకే ?
దిద్దక యేసుమంత్ర ముపదేశము లిత్తురు కాసులాసకై
గద్దరివారి కీపనులు కైకిలి ధర్మపురీ నృకేసరీ(నృకేసరి .:93) ?

ఇలా అనేక సామాజిక, సమకాలీన అంశాలను తన శతకాల ద్వారా తెలియజేసి, సమాజ రుగ్మతలను పోగెట్టే ప్రయత్నం చేశాడు. అద్భుతమైన ధారతో పద్యాలను చెప్పి, ధర్మపురి శేషప్ప సత్కవితా విశేషప్పగా తెలుగువారి హృదయాలో కొలువున్నాడు. "శేషప్ప యను కవి చెప్పిన పద్యముల్/చెవులకానందమై చెలగుచుండు అని కవే చెప్పుచున్నాడు"- అన్న ఆరుద్రగారి మాటలు ప్రతి పద్య సమన్వయాలు.

8. ఉపయుక్త గ్రంథాలు.

1. ఆరుద్ర. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. (సంపుటం -4 ). హైదరాబాదు: తెలుగు అకాడమి.
2. ఎఱ్ఱన. 2013.శ్రీమదాంధ్ర మహాభారమము (ఆరణ్యపర్వశేషము). తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానము ప్రచురణ.
3. మలయశ్రీ. 1997. కరీం నగర్ జిల్లా తెలుగు సాహిత్యచరిత్ర. కరీంనరగ్: సత్యార్థి పబ్లికేషన్స్.
4. వెంకటపతి రెడ్డి, కసిరెడ్డి. 2007 (వ్యాఖ్యాత) శ్రీనరసింహ శతకము. హైదరాబాదు: శ్రీ పావని సేవా సమితి ప్రచురణ.
5. వేంకటకృష్ణశర్మ, వేదము. 1954. శతకవ్మాయ సర్వస్వము(సంపుటం-1). మద్రాసు: వేదము వేంకటరాయశాస్త్రి & బ్రదర్స్ ప్రచురణ.
6. వేంకటావధాని, దివాకర్ల. 1961. ఆంధ్రవ్మాయ చరిత్రము. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ.
7. శేషప్ప. 1880. శ్రీధర్మపురీ రామాయాణము. చిత్తూరు: కవిరంజనీ ముద్రాక్షరశాల ప్రచురణ.
8. శేషాద్రిరమణ కవులు (పరిష్కర్తలు) 1928. నృకేసరీశతకము(భక్తిరసశతకసంపుటము-3). మద్రాసు: వావిళ్ళ రామస్వామి శాస్త్రులు & సన్స్ ప్రచురణ.
9. సుబ్బారావు, వంగూరి. 1957. శతక కవుల చరిత్రము. నరసాపురము: కమల కుటీర్ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్.
URL: https://www.youtube.com/@bapureddyennamdharmapuri/videos.

❖❖❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# చోడగిరి చంద్రరావుగారి 'భీమశతకము': సామాజిక సమస్యల చిత్రణ

**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**

ప్రొఫెసర్ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు, మానవీయశాస్త్రాల విభాగం, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్ -500 046, ఫోన్: 9989628049, Email: darlahcu@gmail.com

తెలుగు సాహిత్యంలో అంబేద్కర్ ని కీర్తిస్తూ అనేక ప్రక్రియల్లో సాహిత్యం వచ్చింది. పద్యకావ్యాలు, శతకాలు, గేయాలు, వచన కవితలు, నాటకాలు, బుర్రకథలు, హరికథలు వంటి ప్రక్రియల్లో అంబేద్కర్ గురించి అనేకమంది కవులు, రచయితలు అనేక రచనలు చేశారు. అటువంటి వారిలో చోడగిరి చంద్రరావు ఒకరు. ఆయన 'భీమశతకం' పేరుతో అంబేద్కర్ భావాలను, ఆనాటి చారిత్రక సామాజిక రాజకీయ సాంస్కృతిక అంశాలను వర్ణిస్తూ రెండు భాగాలుగా ఆ శతకాన్ని వెలువరించారు. ఆ శతకంలోని సామాజిక అంశాలను వివరించటం ఈ పత్ర లక్ష్యం. ఈ శతకం గురించి వివరించే ముందు కవి పరిచయాన్ని తెలుసుకుందాం.

**కవి చోడగిరి చంద్రరావు పరిచయం:**

ప్రముఖపద్య కవి చోడగిరి చంద్రరావు సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా కోరుమిల్లి గ్రామంలో బుల్లెమాంబ, వెంకటస్వామి దంపతులకు 1932 జూలై 15న జన్మించాడు. వృత్తి రీత్యా రైల్వేలో పనిచేసినా, ప్రవృత్తి రీత్యా సాహిత్యాన్ని చదవడం, రాయడం విస్తృతంగానే చేశాడు. ఈయన భీమశతకము పేరుతో రెండు భాగాలగా రాశాడు. మొదటి భాగం 1974లోను, రెండవ భాగం 1989లోను ముద్రించారు. వీటితో పాటు వేకువ, మన గేయాలు, హృదయవీణ (1968), చంద్రరావు గీతాలు (1974), చంద్రరావు కవిత (1977), "అన్వేషణ" ఖండకావ్య సంపుటి (1981) మొదలైన రచనలు కూడా వీరి కలం నుండి వెలువడ్డాయి. ఛందోబద్ధపద్యాలతో పాటు మాత్రాఛందస్సులో కూడా మృదు మధురమైన కవిత్వాన్ని వర్ణించడం ఈ కవి ప్రత్యేకత. ఈ కవికి 'మధురకవి' అనే బిరుదు ఉంది.

'భీమశతకము' మొదటి భాగాన్ని శ్రీ సి. పావనమూర్తిగార్కి అంకితమిచ్చాడు. దీనిలో 144 పద్యాలు ఉన్నాయి. ఇవి కాకుండా ఈ శతకంలో 'అంజలి' పేరుతో మరో ఎనిమిది పద్యాలలో పూర్వ శతక కర్తలకు, పిల్లి శతకం రచించిన బోయి భీమన్నగార్కి, ఛందోబద్ధంగా పద్య కవిత్వం రాస్తున్న కవులకు ముందుగా అంజలి ఘటించాడు కవి.

"శతకకర్తలైన సత్కవీశ్వరులకు
సత్కవులను గెల్చు సరసులకు
అండదండ లేని యజ్ఞాత కవులకు
అంజలింతు నిట్టి యవసరమున" అని కవులను నమస్కరించిన తర్వాత అండదండలు లేని ఎంతోమంది కవులు ప్రాచుర్యంలోకి రాలేకపోయారని మరొక పద్య గుర్తుచేసుకుంటాడు కవి.

"కులముబట్ట కవిత విలువ గట్టెడివారు
కులము గొప్పచెప్పుకొనెడివారు
కులమునొక్క క్షణము గోతిలో పాతగా
నంజలింతునిట్టి యవసరమున"

అని కవిత్వమనేది వంశపారంపర్యంగా మాత్రమే వస్తుందనేవారి మాటలను, కులాన్నే గొప్పగా చెప్పేవారిని గోతిలో పాతేసి, ఎవరైరా కవిత్వాన్ని చెప్పవచ్చని భావిస్తున్న కవులకు నమస్కరించాడు కవి. ఈ శతకంలో ముందుగా

డా.బి.ఆర్. అంబేద్కర్ జీవిత ఘట్టాలను కొండను అద్దంలో చూపించినట్లుగా సంక్షిప్తంగా వచనంలో చక్కగా వివరించాడు కవి.

గౌతమీ గోదావరి నది ఒడ్డున జన్మించిన తనకు ప్రకృతి నేర్పిన సంగీతాన్ని ఆధారంగా చేసుకుని తాను ఈ శతకాన్ని రచిస్తున్నానని తన తొలి పద్యంలో ప్రకటించుకున్నాడు కవి. అంతేకాకుండా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని తన తండ్రిగా భావిస్తాడు కవి. తండ్రికి తనయుడిచ్చే ఒక సత్కార్యంగా ఈ శతకాన్ని అభివర్ణించాడు.

అదియె నాదు కవిత అదియె నా గానమ్ము
తండ్రి వైన నీకు తనయు డిచ్చు నదియె
భీమశతక మర్త్యసత్కారమ్ము
ఏమి సెప్పనయ్య ! భీమరాయ! (భీమశతకం - పద్యంః2)

తన కవిత్వానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రేరణ అనీ, ఆయనే తన కావ్య వస్తువనీ, తన చూపులో, తన మాటలో అన్నీ అంబేద్కర్ ప్రతిబింబిస్తారనీ ఈ పద్యంలో వర్ణించాడు. ఈ పద్యంలో ఆత్మాశ్రయంగా చెప్పిన ఆ భావం కేవలం కవి జీవితానికి సంబంధించినది మాత్రమే కాదు. భారతదేశంలో ప్రతి దళితుడి భావనగా దీన్ని భావించవచ్చు.

కవిత నీవు నాకు కావ్యవస్తువు నీవు
కంఠమందు నీవు కనుల నీవు
నీవు లేని నేను నిర్జీవ ప్రతిమనే
ఏమి సెప్పనయ్య! భీమరాయ! (పద్యం:3)

తాను గాని, దళితులంతా గాని డాక్టర్ అంబేద్కర్ గార్ని ఆ విధంగా భావించడానికి గల కారణం ఆయన జాతి కోసం ఎంతగానో ఆరాటపడ్డాడని, అయినా ఆయనకు వ్యక్తి పూజకు ఇష్టపడే వ్యక్తిత్వం కాదనీ అంబేద్కర్ చేసిన మహోన్నత కృషినీ, త్యాగాన్నీ ఇలా ప్రశంసిస్తాడు కవి.

వ్యక్తిపూజ యన్న వల్లమాలిన బాధ
నందె దీవు గాని యెంద రిటుల
ఆత్మ జాతిప్రగతి కారాట పడినారు.
ఏమి సెప్పనయ్య ! భీమరాయ!

భారత రాజ్యాంగాన్ని రాసిన గొప్ప మేధావిగాను, ప్రపంచదేశాల రాజనీతినీ, ఆ రాజ్యాంగాలనూ అధ్యయనం చేసి, ఉత్తమమైన రాజ్యాంగాన్ని రచించాడని వర్ణిస్తాడు కవి.

భరతదేశమునకు సరియైన రాజ్యాంగ
చట్ట మొసగజాలు దిట్ట యొకడె
భీమరావటంచు సీమవారలు జెప్పి
రేమి సెప్పనయ్య ! భీమరాయ !....

భారత రాజ్యాంగ కమిటీకి సరైన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని బ్రిటీష్ పాలకులు సైతం చెప్పారని వివరించాడు కవి. భారతదేశం భిన్న సంస్కృతులు భిన్నజాతుల కలయిక. వీరందరినీ ఏకతాటిగా సమైక్యతతో నడిపించాలంటే వారి వారి మత సంస్కృతులు సంప్రదాయాలు తెలిసి వాటికి భంగం కలగకుండా రాజ్యాంగాన్ని రచించాలి. అలా చేయాలంటే అనేకమైన ధర్మశాస్త్రాలు సంప్రదాయాలు తెలియాలి. అవన్నీ చదివిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని చెబుతూ

"నీవు చదివినట్టి నిఖిలధర్మమ్ములు
సకలదేశ నీతిశాస్త్రములను

లెక్కలేని స్మృతుల పుక్కిటంబట్టితే
ఏమి సెప్పనయ్య ! భీమరాయ !” అని పేర్కొన్నాడు కవి.

తెల్లదొరలు గాని తెల్లటోపీ గాని
జాలి చూప నట్టికాలమందు
ఆత్మజాతి కిచ్చె అసలైన చేయూత
ఏమి సెప్పనయ్య ! భీమరాయ! (60)

ఈ పద్యం బ్రిటిష్ వలస పాలనా కాలంలో దళితులు ఎదుర్కొన్న అణచివేతను, ఆ కాలంలో వారికి ఎవరూ అండగా లేని పరిస్థితులను వివరిస్తుంది. అయితే, అటువంటి కష్టకాలంలో అంబేద్కర్ గారు దళితులకు అసలైన నాయకుడిగా నిలిచి, వారికి అండగా నిలిచారని ఈ పద్యం చెబుతుంది.

అయ్యగారు తప్పు అనడు వేరొకమాట
పిన్నవైన మంతి రన్ననైన
వినయమతనిసొమ్మువేయియెందుకులెమ్ము
ఏమి సెప్పనయ్య ! భీమరాయ !

అతని కరుణవలన అధికారులై నేడు విఱ్ఱ
వీగుచుండు వెకిలిజనులు
అతని కొఱకు విడువ రశ్రు వొక్కటియైన
ఏమి సెప్పనయ్య ! భీమరాయ !

ఈ పద్యంలో అంబేద్కర్ గారి కారణంగా దళితులు ఎంతో ఉన్నతిని సాధించారని, అధికార స్థానాలకు చేరుకున్నారని తెలియజేస్తుంది. అయినప్పటికీ, కొంతమంది దళితులు తమ పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి కష్టపడిన అంబేద్కర్ గురించి ఒక్క కన్నీటి చుక్కను కూడా విడవరనడం-కనీసం ఆ కృతజ్ఞతలు లేని దళితులను సూచిస్తుంది. ఈ శతకంలో అంబేద్కర్ గారి జీవితం, ఆయన చేసిన సేవలను, దళితుల పట్ల ఆయనకున్న ప్రేమను ఎంతో చక్కగా వర్ణించాయి. అంబేద్కర్ గారు లేకపోతే దళితుల జీవితాలు ఇంకా ఎంత కష్టంగా ఉండేవో ఈ పద్యాల ద్వారా మనకు అర్థమవుతుంది.

తెల్లదొరలు నీదు ధిషణామహత్వమ్ము
మెచ్చి డాక్టరేటు లిచ్చినారు.
దొరలు మెచ్చ నల్లదొర లిచ్చగింసరే
ఏమి సెప్పనయ్య! భీమరాయ !... అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గొప్పతనాన్ని వర్ణించింది.

కవి ఇక్కడ అంబేద్కర్ గారి విద్యాభ్యాసం, తెలివితేటలు, అలాగే ఆయన ఎదుర్కొన్న సామాజిక అవమానాలను సూక్ష్మంగా వర్ణించారు. భారత దేశంలో అంబేద్కర్ విద్యాభ్యాసం చేసిన కాలంలో దేశీయవిద్యావిధానంలో దళితులకు ఇప్పుడున్నన్ని అవకాశాలు లేవు. ఆ కాలంలో అంటరాని వర్గానికి చెందిన వారికి ఉన్నత చదువులు చదవడానికి అనుమతి ఉండేది కాదు. అయినప్పటికీ, అంబేద్కర్ గారు తన తెలివితేటలతో బ్రిటిష్ వారిని ఆకట్టుకుని డాక్టరేట్ పట్టాను సంపాదించారు.

దొరలు మెచ్చ నల్లదొర లిచ్చగింసరే ఏమి సెప్పనయ్య! భీమరాయ!: ఈ వాక్యంలో ‘తెల్లదొరలు’ అంటే బ్రిటిష్ వారు. ‘నల్లదొరలు’ అంటే అంబేద్కర్ గారిని గౌరవించని భారతీయ కుల దురాహంకారులను ఉద్దేశించి చెప్పబడింది.

అంబేద్కర్ గారు తమ తెలివితేటలతో బ్రిటిష్ వారిని మెప్పించినప్పటికీ, భారతదేశంలోని ఉన్నత కులాలుగా భావింపబడేవారు ఆయనను గౌరవించలేదని ఈ వాక్యం సూచిస్తుంది. అంటే, బ్రిటిష్ వారు అంబేద్కర్ గారి తెలివితేటలను గుర్తించి ఆయనకు డాక్టరేట్ ఇచ్చినా, భారతీయ సమాజం మాత్రం ఆయనను తనలో ఒకరిగా అంగీకరించడానికి ఇష్టపడలేదని అర్థం. "నల్లదొర" అనే పదం సాంప్రదాయకంగా భారతీయ సమాజంలోని ఉన్నత కులాల వారిని ఉద్దేశించి ఉపయోగించే ఒక విమర్శనాత్మక పదం. ఈ పదం వారి కుల గర్వం, అధికార దుర్వినియోగం, దళితులపై చేసే అణచివేతను సూచిస్తుంది. కంచికచెర్ల కోటీశు హత్యః (1968)

ఆంధ్రప్రదేశ్ లోని కంచికచర్లలో ఒక దళిత యువకుడు అగ్ర వర్ణ యువతిని ప్రేమించాడని తెలిసి, ఆ విషయాన్ని పైకి చెప్పకుండా ఒక దొంగతనం నెపం పెట్టి అగ్ర వర్ణాల వారు సజీవ దహనం చేశారు. దీన్ని ఉద్దేశిస్తూ కవి ఈ కింది పద్యంలో కుల వ్యవస్థ వల్ల జరిగే అన్యాయాలను బహిర్గతం చేస్తున్నాడు.

బ్రతికియున్న వానిపైన కిరోసిన్ను
పోసి కొట్టి అగ్గిపుల్ల గీచి దొంగ
కేసుమోపి దొరలు చంపారయా
ఏమి సెప్పనయ్య! భీమరాయ ! (46)

కంచె చేను మేసె కంచికచెర్లలో
పెదవి కదువలేదు పెద్దవారు
కాల్చి చంపరేని కసితీరదా యేమి?
ఏమి సెప్పనయ్య! భీమరాయ ! (47)

యువకుడిని సజీవ దహనం చేయడం అనేది అత్యంత క్రూరమైన చర్య. ఈ సంఘటన మానవత్వం పూర్తిగా మరచిపోయిన క్రూరత్వానికి నిదర్శనం.దొరలు అని పిలువబడే అధికార వర్గం ఈ హత్యకు కారణమైందనీ, వారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేసి, ఒక అమాయకుడిని చంపారనే వేదన వర్ణితమైంది. "కంచె చేను మేసె కంచికచర్లలో పెదవి కదువలేదు పెద్దవారు" అనే పంక్తి సమాజంలోని నిశ్శబ్దతను తెలియజేస్తుంది.

వ్యాసు దెవడు పోని వాల్మీకి యెవ్వండు
అతని కులము నెవడు యడుగలేదే?
మనకు పనికివచ్చు మానవులున్నచో
ఏమి సెప్పనయ్య ! భీమరాయ!

ఇలా సందర్భానుసారంగా భారతీయ సమాజంలో కులం మతం వల్ల జరిగే మానసిక వేదనలను, హింసను, ఆవేదనలను వర్ణించాడు కవి.

భీమశతకం (రెండవ భాగం)

చోడగిరి చంద్రరావుగారు భీమశతకం రెండవ భాగం 1989 జూలై 15 వ తేదీన ప్రచురించాడు. దీన్ని డా.బి.ఆర్.అంబేద్కర్ కే అంకితం చేశాడు. దీని మకుటం కూడా తొలిశతకంలో ప్రయోగించినట్లే. 'ఏమి సెప్పనయ్య భీమరాయ' అనే ఉపయోగించుకున్నాడు. తనను అభినందించినవారికి 'వందనములు' చెప్తూ తొమ్మిది పద్యాలు, మరలా భీమద్వశతి రాయాల్సిన అవసరమేమిటో తెలియజేస్తూ 'ఎందుకు?' అనే శీర్షికతో ఐదు పద్యాలు రచించాడుకవి. ఈ ద్వితీయ భాగంలో 108 పద్యాలు వర్ణించాడు. సందర్భంగా కవిత్వం యొక్క శక్తిని ఈ శతకంలో వివరిస్తాడు.

రఘుపతి వెంకటరత్నం నాయుడు లాంటి కొంతమంది అంబేద్కర్ ఆశయాలతో కుల నిర్మూలన పనిచేస్తారని కవి ప్రశంసిస్తాడు. "అంబేద్కర్ ఆలోచనల వెలుగుల్లోనే కుల మత, వర్గాల ప్రాతిపదికగా రూపుదిద్దుకున్న మనువాదాన్ని,

సమాజంలో వేళ్లూనుకున్న మూఢనమ్మకాలను చంద్రరావు తన కవిత్వం ద్వారా ఖండించాడు. మనిషి బతుకును మతంతో ముడివేసి, మనిషి గుండెను గుడిలో దాచిపెట్టి, మనిషి తెలివిని మంటగలిపారని అర్ధ శతాబ్దం క్రితమే చంద్రరావు రాసిన కవిత్వానికి ఈనాటికీ ప్రాసంగికత ఉందని చెప్పవచ్చు." ( ఆంధ్రజ్యోతి దినపత్రిక, 14 ఏప్రిల్ 2024. పుట: 2)అని చెప్పిన డా.కోయి కోటేశ్వరరావు అభిప్రాయం ఎంతో సమంజసంగా ఉంది. ఇలా అంబేద్కర్ శతకం అంతా కూడా సామాజిక సమస్యలపై తన అభిప్రాయాలను పద్యాలు కవితాత్మకంగా వ్యక్తం చేశారు. అంబేద్కర్ చెప్పిన భావాలు, సమకాలీన సమస్యలు వీటన్నింటి గురించి ఈ పత్రంలో నేను ప్రత్యేకించి రిఫరెన్స్ లు ఇవ్వడం లేదు. ఆ రిఫరెన్స్ లే ఎక్కువ అయిపోతాయి. ఇంట్లో ప్రస్తావించిన సమస్యలు ఇంచుమించు అందరికీ తెలిసిన సమస్యలు. అందరికీ తెలిసిన అంబేద్కర్ భావాలు. మరుగుదపడిన చోడగిరిచంద్రరావు గారి గురించీ, ఆయన పద్య కృషి గురించీ తెలియజేయడమే ఈ పత్ర లక్ష్యం.

(తెలుగుశాఖ – ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం, ఆం.ప్ర. ,ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు వారు 25 26 నవంబరు 2024 తేదీలలో 'తెలుగు శతక సాహిత్యం – సామాజిక దృక్పథం' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ అంతర్జాల సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రం)

**ఆధార గ్రంథాలు:**

1.నాగయ్య. జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటం -2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.

2.భర్తృహరి. 2012. భర్తృహరి సుభాషితములు. విజయవాడ, లిఖిత ప్రచురణలు.

3.ఆరుద్ర. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. (సంపుటం -4). హైదరాబాదు: తెలుగు అకాడమి.

4.సుబ్బారావు, వంగూరి. 1957, శతక కవుల చరిత్రము. నరసాపురము: కమల కుటీర్ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్.

❖❖❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# సుమతీ శతకం - సామాజికత

**ఆచార్య ఏటూరి జ్యోతి**

అధ్యాపకులు, కాకతీయ విశ్వవిద్యాలయం, ఫోన్ నెం: 9248414442, Email: ajyothijj@gmail.com

తెలుగు సాహిత్యంలో శతక ప్రక్రియకు ప్రత్యేక స్థానం ఉంది. సాధారణంగా ఇతర కావ్య ప్రక్రియలు పండితులకు పరిమితమైనా గాని, శతకాలు మాత్రం సామాన్య ప్రజానీకంలో ఆదరణ పొందినవి. బహుజన ప్రియమైన శతకాలలో సుమతీ శతకం ఒకటి. బద్దెన కవి విరచితమైన సుమతీ శతక నీతి పద్య మధురిమలు నేటికీ గుబాలిస్తున్నాయి. సరళ సుందరమైన చిన్న చిన్న పద్యాలలో చెప్పబడిన నీతులు తెలుగు వారి నిత్య జీవితంలో కలసిపోయాయి. అకారాది క్రమాన్ని బట్టి రాసిన శతకాలలో సుమతీ శతకం అగ్రగణ్యమైనది. "సిరిదా వచ్చిన వచ్చును", "తన కోపమే తన శత్రువు", "అక్కరకు రాని చుట్టము" , ఇత్తడి బంగారమగునే, తను వలచినదియె రంభ, వంటి పద్యాలు తెలియని వారు ఉండరు. పూర్తి పద్యం రానివారు కూడా ఒకటి రెండు పద్య పాదాలను ఉటంకిస్తుంటారు. శతకంలో ఎన్నో పద్య భాగాలను సామెతలుగా, జాతీయలుగా చెప్పవచ్చు. ఈ శతకంలో అనేక విషయాలు అందరికి అర్థమయ్యే భాషలో తెలిపారు. శతక సాహిత్యంలో సామాన్యుని జీవనం, సాంఘిక పరిస్థితులను ప్రస్తావించడం వంటి సమకాలీన అంశాలను తన పద్యాలలో వ్యక్తం చేశారు. మచ్చుకు గ్రామీణ వ్యవస్థ, స్త్రీ పురుష సంబంధ విలువలు, కరణాలు, రాజులు, మిత్రులు, మనిషి ప్రవర్తన వంటి ఎన్నో విషయాలను ప్రస్తావించారు.

**కరణాలు :**

సుమతీ శతకంలో దాదాపు పది పద్యాలలో కరణాల గురించి ప్రస్తావించారు. దీని ద్వారా కరణాల ప్రాముఖ్యత తెలుసుకోవచ్చును. "కరణం గ్రామభరణం" అనే పద్యం ఎంతో ప్రసిద్ధి కెక్కింది. ప్రాచీన గ్రామ వ్యవస్థ నుండి మొన్నటి వరకు కరణం గ్రామానికి ఉపకరణం అనడంలో అతిశయోక్తి లేదు. గ్రామంలోని రైతు వ్యవహారాల్లో కరణం ప్రమేయం అపారంగా ఉండేది. సుమతీ శతకంలో కరణం ఎంత ముఖ్యుడో , అతనితో పగ ఎంత ప్రమాదాన్ని తెచ్చి పెడుతుందో వివరించి హెచ్చరించాడు. గ్రామాల్లో "కరణంపగ" అనే మాట వ్యవహారంలో అప్పుడప్పుడు వినిపిస్తుంది. కరణంతో శత్రుత్వం ఇంట్లో " కరిచే కుక్కను" పెంచుకోవడం వంటిదని, ఊరిసే ఇంట నివసించడం వంటిదని అంటాడు. రైతులకు కరణాలతో అడుగడుగునా ఇబ్బందులే కాబట్టి అతనికి ఎదురు మాట్లాడరాదని హితవు చెప్తాడు. "కరణము దన సరి కరణము మరి నమ్మక మర్మ మీక మనవలె" ఒక కరణము మరొక కరణంతో తన గుట్టు ఈయక జీవించవలే అని చెప్పాడు. ఇరుసున కందెన బెట్టక భగవంతుని బండియాయిన బండి చక్రానికి కందెన పెట్టకుండా త్వరగా పరిగెత్తదో అలాగే కరణంతో విరోధం ఉంటే సుఖంగా ఉండలేరు అని వ్యక్తపరిచారు. ఎంత గొప్పవాడైన కరణాన్ని ప్రసన్నం చేసుకోకుండా, అతనికి ఎంతో కొంత లంచం ముట్టచెప్పకుండా తన పనులను నెరవేర్చుకోలేడు. అలా వ్యక్తులు మసులుకోలేకపోతే అతని జీవిత శకటం ముందుకు సాగదు. కరణమంటే అనుకువ చూపని రైతులకు హెచ్చరికలు చేస్తూనే కరణాలకు కరణికం నిర్వహించే లోపాలను ప్రభోధిస్తాడు. తెలివి, గడుసుదనం ఉన్నవాడే కరణికం నెరవాలి. కరణం లౌఖ్యుడు కాకపోతే గ్రామస్తులతనని లెక్క చేయరు. మదముడిగిన యెనుగును, కరవని పామును, కుట్టని తేలును లోకం ఎట్లా లెక్కించదో, అలాగే కరణం నెమ్మదస్తుడు అయితే ప్రజలు అతన్ని మిక్కిలి ఆశ్చర్యంతో తేలికగా చూస్తారని చెప్పారు. అధికారం చెలాయించని కరణానికి గ్రామస్తులు భయ భక్తులను చూపరు.

కరణాల కష్ట నష్టాలపట్ల బద్దెన సానుభూతి ప్రదర్శించాడు. కరణం వృత్తి కత్తి మీద సాము వంటిది. ఒక ఊరికి ఒక్క కరణం కంటే ఎక్కువ ఉంటే కలిగే ఇబ్బందులని చెప్తూ వృత్తి పరమైన పోటీ ఏర్పడి ఒకరి మీద

మరొకరు ఆపద పొందుతారు. ఒక కరణం మరో కరణాన్ని నమ్మరాదు మర్మం విప్పారాదు. రైతుల పట్ల దయతో మెలగలి అని సూచించారు. రైతులకు సంబందించి ఏమయినా పనులుంటే వెంటనే చేసిపెట్టకూడదంటాడు. "కాదన్న వాడే కరణం" అనే నానుడి ఇందుకే అన్నరేమో అనిపిస్తుంది. లౌక్యంతో ఒకటికి నాలుగుసార్లు తిప్పుకోవాలి.

గిట్టుబాటు అయితేనే విన్నపాలు
అలకించాలి లేకపోతే బధిరత్వం నటించాలి.

సుమతీ శతకకారుని అభిప్రాయాలు ఒక చారిత్రక సంధి దశలోని పరిస్థితులను సూచిస్తున్నాయని గ్రహించవచ్చు.

**రాజుల పాలనపై అభిప్రాయం:**

కరణాల విషయంలో ప్రజలకు హెచ్చరికలు చేసిన సుమతీ శతకం రాజుల విషయానికి వచ్చేసరికి ప్రజల పక్షాన పాత్ర పోషించాడు. ప్రజలను పట్టించుకోని రాజులను నిరసించాడు. రాజులు ఉండే పద్ధతులను, ప్రజల పట్ల రాజు నిర్వర్తించే భాధ్యతను గుర్తు చేస్తుంటాడు. రాజు దైవాంశ సంభూతుడని, సర్వాధికారి. రాజు ప్రజల పట్ల ఆదర్శవంతంగా ప్రవర్తించాలని ప్రజలను కన్నా బిడ్డలుగా కంటికి రెప్పలగా కాపాడాలని కర్తవ్యపాలన చేయాలని సూచించాడు. "నర పతులు మేర దప్పిన" అంటూ రాజు హద్దు మీరుతూ ప్రవర్తించకూడదని అలా ప్రవర్తిస్తే ప్రజలు ఎదురు తిరిగే అవకాశం ఉంటూ ప్రాణం మీదకి వచ్చుట తప్పదంటాడు. "మండల పతి సముఖంబున మెండైన ప్రధాని లేక మెలగుట యెల్లన్ " పద్య పాదంలో కొండంత ఏనుగు ఉన్న తొండం లేఖపోతే ఎలా ఉంటుందో ఆ విధంగా గొప్ప గొప్ప రాజ్యాలు పరిపాలిస్తున్న రాజుల వద్ద సమర్ధుడైన మంత్రి లేకపోతే రాజు పాలన అస్తవ్యస్తంగా ఉంటుందని రాజు పాలన సమగ్రంగా ఉండాలని హితవు పలికాడు. "మంత్రి గలవాని రాజ్యము తంత్రము సెడకుండ నిలుచు దరచుగ ధరలో" అంటూ సమర్ధవంతుడు అయిన మంత్రి కలిగిన రాజు యొక్క దొరతనం, రాజు సామ, దాన, భేద,దండన ఉపాయాలు పాడుకాకుండా సాగిపోతుందని, మంత్రి లేని రాజ్య పాలన నట్లు ఉ డిపోయిన యంత్రము లాగా వుంటుంది. రాజు లేని రాజ్యాన్ని స్మశానంతో సమానంగా పోల్చారు. "రాపొమ్మని పిలువని యా భూపాలుని గొల్వ భుక్తి ముక్తులు గలవే" చెప్తూ రామ్మని గాని పొమ్మని గాని చెప్పని రాజును సేవించడం వలన ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదని సత్యాన్ని చెప్పారు. "నేలిన నరపతి రాజ్యము నేల గలసి పోవుగాని నెగడదు సుమతీ" ప్రజలకు హితవు చేయని రాజుల పరిపాలన కాలంతో పాటు రాజు యొక్క రాజ్యం మట్టిలో కలసి నాశనం అవుతుంది కానీ కీర్తిని పొందలేదు. "రాజు గానని కొలువును", "పాటెరుగని పతి కొలువును" అంటూ రాజ్య పాలకుల చేత గుర్తించబడని సేవ చేయడం వ్యర్ధం. రాజు పాలన విచక్షణతో ఉండాలని చెప్పుడు మాటలు వినకూడదని "దగ్గర కొండెము సెప్పడు ప్రేగ్గడ పలుకులకు రాజు ప్రియుడై మరి దా నెగ్గు బ్రజ కారించుట" రాజు తన మంత్రి చెప్పడి చాడీ మాటలకు లోబడి మంచి చెడు ఆలోచించకుండా విషయం తెలుసుకోకుండా జనులను హింసించుట అనేది బొగ్గులు కావాలని కల్పవృక్షాన్ని కాల్చడం వంటిదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అడిగిన జీతం ఇవ్వని ప్రభువు దగ్గర పని చేసే కన్నా ఎద్దును కట్టుకొని వ్యవసాయం చేయడం మేలని చెప్పారు. సాహసం చేయలేనివాడు రాజు కాలేడు. సమర భీరువు అసమర్ధుడైన రాజ్యాన్ని పరాధీనం చేస్తాడు. "పిరికికి దళవాయి తనము" కట్టబడితే సైన్యాన్ని అయోమయ స్థితిలో విడిచిపెట్టి యుద్ధ భూమి నుండి పారిపోయి వస్తాడు. అందుకని అన్నీ పరీక్షలు నెగ్గిన తగినవానికి అధికారం అప్పగించాలి. కనుక సాటివీరునితో పోరాడి "రణమున చచ్చునదే మగతనంబు" అంటాడు సుమతీ శతక కర్త.

**స్త్రీలు :** సుమతీ శతకంలో స్త్రీల విషయంలో తన అభిప్రాయాలను వెలిబుచ్చాడు. 'కలకంటి కంట కన్నీరొలికిన సిరి ఇంట నుండ నోల్లదు' అన్న కవికి స్త్రీల పట్ల సభిప్రాయాలు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇందులో ముఖ్యంగా స్త్రీల గురించి మూడు రకాలుగా కనిపిస్తుంది.

1.సమాజంలో స్త్రీల స్థానాన్ని నిర్దేశించడం. 2. భార్యల పట్ల అనేక కారణాలతో అపనమ్మకం

3. వేశ్య నిరసన.

ఇల్లాలు భర్తకు దాసిలాగా, మంత్రిలాగ, రంభలాగ, తల్లిలాగ ఆయా సమయాల్లో మెలగాలనే నీతికి పద్య రూపమిచ్చాడు. "అట్టి నారె నరులకు రత్నమే" అని చెప్తున్నాడు. సర్వ సామన్యంగా ఇలాంటి విషయాలను జానపద గేయాలలో చెప్పుతూ ఉంటారు. భార్యల విషయంలో సుమతి కారుడు ఆవేశపూరితమయిన విషయాలను ఆత్మీయ స్పర్శతో వెలిబుచ్చాడు. ఆ కాలంలో ఉన్న వివిధ దాంపత్య లోపాలను మనం గమనించవచ్చు. ఎంత బలవంతుడైన సరే యవ్వనంలో ఉన్న పడుచు భార్యను పుట్టింటిలో ఎక్కువ కాలం ఉంచడం బహిరంగ వ్యభిచారాన్ని ప్రోత్సహించడం వంటిదని "చిరకాలం ఉండ నిచ్చుట" అంటూ ఆ భర్తను సమాజంలో హీనంగా చూడబడుతాడు అనే సత్యాన్ని తెలిపాడు. ఒక స్త్రీ తరచూ ఇరుగు పొరుగు ఇంటిలోకి పోతున్నపు, ఇతర మగవాళ్ళతో నవ్వుతూ మాట్లాడుతున్నాడు మందలించక పోతే ఆమెను చెడగొట్టడమే అవుతుంది. ఆలు "ఇహపర సౌఖ్యలకు ఆలయమైతే" ఆమె ఆలు అని అవుతుందని లేకపోతే "కాలుని ధూతయె" అంటాడు. భార్య అనుకులవతి కాకపోతే మనుజునికది "మందులేని మరణమే". "ధనం మూలం ఇదం జగత్" అనే వాక్కుని నిజం చేస్తూ "గడన గల మగని జూచిన" స్త్రీలు సంపద కలిగిన భర్తను చూచిన అడుగులకు మడుగులొత్తుతారు. సంపదలేని మగనిని చూస్తే చచ్చిన శవంతో సమానంగా చూస్తారు. అతిగా మహిళల యందు విశ్వాసము చూపడం అసత్యంగా చెప్పుతాడు.స్త్రీలు డబ్బునే ప్రేమిస్తారు కాబట్టి "ఇంతలు వలుతురని"ఎప్పుడు నమ్మవద్దు. "సతుల వలపు కల్లలు"ప్రధానంగా లేమి సమయంలో సతుల వలపు ఆశించడం చివరికి నిరాశపడి చింతించడం వెర్రితనమే అంటాడు. అందుకనే "మగువకు మనసియ్యవద్దని" "సతి మాటలకు కుబ్బి మిగుల చానువియ్యు" కూడదని "తరుణుల యెడ వ్యామోహం" వెంటనే విడిచిపెట్టాలంటాడు. ఇల్లాలి విషయంలోనే ఇలాంటి భావాలు వ్యక్తం చేసిన సుమతీ కారుడు వేశ్యాల విషయంలో బద్దెన భావాలు నైతికతకు తాత్కారణాలు మాత్రమే.

వేశ్యాల నీతిని చెప్తూ "తల పొదవు ధనము పోసిన వెలియాలిని మెప్పులేదు" విశ్వాసము లేదు అని "తల తడివి బాస చేసిన వెలియాలిని నమ్మరాదనీ, వేశ్యాల వల్ల కూరిమి కలుగదని, కలిగిన అది కాడదాకా నిలబడి వుండలేదని "వార భామల వలపు వేముల తియ్యదనం" లాగ అసహజంగా ఉంటుందని సుమతీ శాతంలో ద్వేషిస్తాడు. వీరిని గురించి ఒక్కమాటలో చెప్పుతూ కాముకుడు అనుభవించి వదలిన కోమలిని మరొక విటుడు పొందగోరుట "మిక్కిలి ప్రేమతో చెరుకు పిప్పికై చీమలు మూగునట్లే వ్యర్ధము" అని వెలకాంతను హీనంగా వర్ణించాడు. ప్రేమించని స్త్రీని పురుషుడు బలవంత పెట్టడం నీళ్ళు లేకుండా గంధపు చెక్కను సాన బెట్టడం లాగా వ్యర్ధంగా చెప్పాడు సుమతీ కర్త. శతక కర్తలు తమకు తోచిన లేదా కనిపించిన వ్యక్తుల గుణశీలలను కాలానికి అనుగుణమైన రీతిలో రాశారు. అప్పుడప్పుడు ఒకే అంశంపై భిన్న అభిప్రాయాలను చూడవచ్చు.

**సామాన్య నీతి భోధలు :**

సుమతి శతకంలో సామాన్య నీతులు ఎక్కువ. "నవ్విన నాప చేనే పండుతుంది" వీధి ఎలా జరుగలని ఉంటే అలాగే జరుగుతుంది అని "కస్టాలు మనకు రాకుండా మానులకు వస్తాయా" "ఓడలు బండ్లు అవుతాయ బండ్లు ఓడలు అవుతాయ" ఓదార్చే ఆశ పూరిత వాక్యాలు కనిపిస్తాయి. ఉపకారికి ఉపకారం అందరూ చేస్తారు అంధులో గొప్ప ఏమి లేదు కానీ కీడు చేయు వానికి కూడా ఉపకారం చేసినప్పుడే గొప్ప అని చెప్పుతాడు.తాను మునిగిందే గంగ తాను వలచినదే రంభ అన్న విషయాన్ని "తన కలిమి ఇంద్ర భోగము" అన్న పద్యంలో వివరించారు. నేడు

సమాజంలో ఉన్న విషయాలను స్పష్టం చేశారు. "పరోపకారం ఇదం శరీరం" అనే నానుడిని నిరూపిస్తూ పరులకోసం ధన ప్రాణాన్ని పణంగా పెట్టేవాడే పరోపకారి. అవసరానికి మించి ధనాన్ని పొదుపు చేసి తాను తినడు ఇతరులకు దానం ఇవ్వడు. అలాంటి వాడి సొమ్ము చివరికి రాజుపాలో దొంగలపాలో కావడం జరుగుతుంది అనే విషయాన్ని "చీమలు పెట్టిన పుట్టలు పాములకిరాయినట్లు .. హేమంబు కూడ బెట్టిన భూమీషుల పాలగును" అనే పద్యంలో వ్యక్తీకరించాడు. ఈ విషయాన్ని ఏకంగా నాలుగు పద్యాలలో వివరించారు.

"ఎవరికెంత రాసిపెట్టి ఉంటే అంతే జరుగుతుంది" కాని ఒకరి అదృష్టాన్ని మరొకరు మార్చలేరు. తన వాళ్ళకెంత సంపద ఉన్న పూర్వ జన్మ సుకృతం వల్లవచ్చే భాగ్యమే తనకు దక్కుతుందని చెప్పటానికి కుబేరుడు ఇష్టసఖుడైన కూడ శివుడు బిచ్చమెత్తాడు అనే ఐతిహ్యాన్ని ఉదాహరించాడు. ఉపకారికి ఉపకారం చేయడంకన్నా హాని చేసిన వారికైనా ఉపకారం చేసేవాడే ఉత్తముడుఅని చెప్పాడు. పరుల మనసు నొప్పించకుండా, పరులు అలిగినప్పటికి తాను అలుగకుండా, ఎవరితోనూ పగ పెంచుకోకుండా స్నేహశీలిగా ఉండేవాడే పరముడు. గర్వంతో మాట్లాడకుండా, తోటివారితో హితుడానిపించుకుంటూ, పరులు పొగిడేటట్లు మసులుకోవాలని సుమతీ కారుడు హితభోద చేస్తాడు.

సుమతికారునికి వాదులాడటం అస్సలు గిట్టదు. "వాదుకు వచ్చేదే అవగుణం" అంటాడు. అందరికీ అనుకలంగా నడుచుకుంటూ ఎవరినీ "నొప్పించక, తానోవ్వక తప్పించకొని తిరిగేవాడే ధన్యుడు. "సరసము విరసము కొరకే – పరిపూర్ణ సుఖంబు లధిక బాధల కొరకే పెరుగుట విరుగుట కొరకే –ధర బుట్టుట హెచ్చు కొరకే తధ్యము సుమతీ" ఈ పద్యంలో ప్రతి పాదము ఒక నానుడి లాగా చెప్పుకోవచ్చు. జగడాలు పుట్టించి ఆనందాన్ని కోరుకునేవాళు ్ళ కొందరు ఉంటారు. వారు ఒకరిజుట్టు మరొకరి జుట్టుతో ముడిపెట్టి వినోదిస్తూంటారు. వారి గురించి తస్మాత్ అంటారు. "వినుదగు నెవ్వరు చెప్పిన వినినంతనే వేగ పడక" అంటూ ఎవరేమి చెప్పిన వేగిరపడక ప్రశాంతంగా విని, నిజానిజాలు నిలకడమీద తెలుసుకొని వివేకం ప్రదర్శించేవాడే ఉత్తమమైన మానవుడు. నీతిమంతుడు అని అభిప్రాయాన్ని వెల్లడించాడు. "ఇమ్ముగ చదవని నోరును, అమ్మాయని పిలిచి యున్న మడుగని నోరును, తమ్ముల బిలువని నోరును, కుమ్మరి మను ద్రవ్వినట్టి గుంట"తో పోల్చాడు. నవరస భావాలంకృత కవితలను, మధురగానాన్ని అవివేకి ముందు ప్రదర్శిస్తే అది బధిరని ముందు శంఖారావం లాగా ఉంటుందని చెప్పారు. మొత్తం మీద సుమతి శతక కర్త ప్రజలకు అర్థమయ్యే భాషలో అలతి అలతి పదాలను, మధురమైన మహత్తరమైన అర్థాలను ఇచ్చే పద్య పాదాలను అందంగా వెలువరించారు. తెలుగులో అసంఖ్యాకంగా ఉన్న అన్ని శతకాలను సమగ్ర పరిశీలన చేసిన ఆచార్య కె. గోపాలకృష్ణారావు గారు ఇలా ప్రతి పద్యంలోనూ విషయాన్ని హితాన్ని చెప్పుతాడు. మానవ సంఘంలోని వివిధ వ్యక్తులకు సంబంధించిన నీతి బోధలిందులో ఉంటాయి. పూర్వ గ్రంధాలు, ధర్మశాస్త్రాలను లోకనుభవాన్ని ఆధారంగా చేసుకొని జీవితాన్నిపురస్కరించుకొని రచించబడింది. సుమతి శతకంలో రాజనీతి, గృహనీతి, లోకనీతి, ప్రవృత్తినీతి ముఖ్యమైనవి. వీటిలో రాజ ధర్మాలు, ప్రజా రక్షణ, సేవక ధర్మాలు, మాతపితృ పుత్ర సంబంధాలు, అనుకులమైన భార్య, ఇతర స్త్రీల పట్ల ప్రవర్తన, స్త్రీ ధర్మాలు, సమాజం, బంధువులు, ఆశ్రితులు, సమకాలీన జీవితం, విషయ సంపద, మనిషి నైతిక ప్రవర్తన, సత్యము, దయ, దానం, లోభిత్వం, శౌర్యం వంటి విషయాలు అనేక రీతుల్లో సుమతీ శతకంలో అధ్యయనం చేయవచ్చు. "సుభోదములగు దుస్టాంతముల వలన నీతి బోధన గావించుట బద్దెన సిద్ధహస్తుడు".

ఆధార గ్రంథాలు:

1.నాగయ్య. జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటం –2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.

2.భర్తృహరి. 2012. భర్తృహరి సుభాషితములు. విజయవాడ, లిఖిత ప్రచురణలు.

3.ఆరుద్ర. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. (సంపుటం –4). హైదరాబాదు: తెలుగు అకాడమి.

4.సుబ్బారావు, వంగూరి. 1957, శతక కవుల చరిత్రము. నరసాపురము: కమల కుటీర్ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# కుమారీ శతకము - యువతులకందిస్తున్న సందేశం

**ఆచార్య ఇరపని మాధవి**
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.
ఫోన్ నెం: 94401 87512, Email: erapanimadhavi@gmail.com

"బాలలకు విద్యాబుద్ధులు నేర్పించాలి" అనేది అందరూ ఆమోదించే విషయమే అయినప్పటికీ నేటి సమాజంలో విద్యకే ప్రాధాన్యత హెచ్చింది. గురువులు నేర్పే శాస్త్రపరిజ్ఞానం చిన్నారులను విద్యావంతులను చేస్తుంది, కానీ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దలేకపోతుంది. విద్య ఒక్కటే ఉంటే చాలదు. సద్బుద్ధి లేకపోతే విద్య, విత్తం అహంకారాన్ని కలిగించటమే కాక దుర్వినియోగం చేయబడతాయి. అందుకే విద్యతోపాటు విద్యార్థిని వినయవంతుడిని, సద్వర్తనుడిని చేయటానికి ఉపకరించే సాహిత్య అధ్యయనం ఎంతో అవసరం. అందులోనూ చిన్నారులకు మంచి బుద్ధులు నేర్పించే శతక సాహిత్యం చదవటం అవసరం. చిన్నతనం నుంచే శతకపద్యాల పఠనం వలన బాలలు మంచి, చెడు, లోకరీతి తెలుసుకోగలుగుతారు. పసితనంలో వల్లెవేసిన పద్యాలు అప్పుడు అర్థంకాకపోయినా యుక్తవయస్సుకి వచ్చిన తర్వాత అవగతమవుతాయి. నీతిశతకాలు విద్యార్థిని సామాజిక బాధ్యత గుర్తెరిగిన ఉత్తమపౌరుడిగా తీర్చిదిద్దుతాయి. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం వెంట పరిగెడుతున్న ఈ రోజుల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్కులకే ప్రాధాన్యతనిచ్చి శతకసాహిత్య పఠనావశ్యకతను విస్మరిస్తున్నారు. "మొక్కైవంగనిది మ్రానై వంగునా" అనేది మరిచి అసలు ఇంత చిన్నవయస్సులో నీతి గురించి పిల్లలకు చెప్పాల్సిన అవసరమే లేదనే గురువులు కనిపిస్తున్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్నప్పుడు కుటుంబంలోని పెద్దలు పిన్నలకు బుద్ధులు చెప్పేవారు. చాలా సందర్భాలలో పెద్దలు చెప్పవలసిన అవసరమే లేకుండా వారిని చూస్తూ, అనుకరిస్తూ తోటివారితో, కుటుంబ సభ్యులతో, సమాజంతో ఎలా మెలగాలో తెలుసుకునేవారు. వ్యష్టి కుటుంబాలు, తల్లిదండ్రులిద్దరూ సంపాదించవలసిన పరిస్థితులు కలగటంతో చిన్నపిల్లలకు ఏ వయస్సులో ఏ బుద్ధులు చెప్పాలో అవి చెప్పే తీరిక, ఓపిక తల్లిదండ్రులకు ఉండడం లేదు. ర్యాంక్‌ల వెంట పరిగెడుతున్న విద్యాసంస్థలు ఆ బాధ్యతను విస్మరిస్తున్నాయి. ఏది మంచి, ఏది చెడు అనే అవగాహన లేక స్వార్థపరులుగా బాలలు ఎదుగుతున్నారు. కాబట్టి ఇలాంటి పరిస్థితులు మారాలి. అంటే శతక సాహిత్య అధ్యయనం అత్యంత ఆవశ్యకం.

"ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి ఇల్లాలే ఈ జగతికి జీవనజ్యోతి" అని ఇల్లాలి ఔన్నత్యాన్ని కొనియాడినా "ఆడదె ఆధారం మన కథ ఆడనె ఆరంభం" అని కుటుంబ అభ్యున్నతికి, పతనానికి స్త్రీనే మూలం అని సినీకవులు ఆలపించినవి అక్షరసత్యాలు. కుటుంబంలో పిల్లలపై తల్లి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. స్త్రీ విద్యావంతురాలు, బుద్ధిమంతురాలు, వివేకవంతురాలు, సద్వర్తన కలిగినది అయినప్పుడు తల్లిగా ఆమె తన బిడ్డలను మంచిగా తీర్చిదిద్దుతుంది. అదే ఆమె దుర్వర్తన కలిగినదైతే పిల్లలపై ఆ ప్రభావం తప్పనిసరిగా పడుతుంది. కుటుంబమే సక్రమంగా లేనప్పుడు దాని ప్రభావం సమాజంపై పడుతుంది. వ్యష్టి నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణం అన్నవి ఒకదానిపై ఒకటి ఆధారపడినవే. ఒకప్పుడు ఆడపిల్లలకు పుట్టింటివారు మెట్టినింట్లో ఎలా మెలగాలో చెప్పేవారు. చిన్నతనంలోనే వివాహం జరగటం వలన తల్లిదండ్రులు చెప్పినవి పాటించి అత్తింటివారితో కలిసిపోయేవారు, ఆ కుటుంబానికి మేలు జరిగేవిధంగా ప్రవర్తించేవారు. మెట్టినింటివారే తనవారు, పుట్టింటివారే పరాయివారు అని భావించేవారు. ఆడపిల్లలు విద్యనేర్వకున్నా కుటుంబ బాధ్యతలు నిర్వర్తించగలిగిన సామర్థ్యం కలిగి ఉండేవారు. పిల్లల ఆలనాపాలనా, పనివారిపై అజమాయిషీ ఎంతో సమర్థవంతంగా చేసేవారు. కానీ ఈ రోజుల్లో కొందరు యువతులు ఉన్నత విద్యావంతులై, పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ వివాహం జరిగిన తర్వాత అత్తింటిలో ఇమడలేకపోతున్నారు. భర్తతోనూ సఖ్యంగా ఉండలేకపోతున్నారు. కన్నబిడ్డలను బాధ్యతగా పెంచటం కూడా భారంగా

భావిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం చిన్నతనం నుంచి ఎవరితో ఎలా ప్రవర్తించాలో నేర్పకపోవటమే. అత్తింటివారితో ఎలా మెలగాలో తెలియక అహంకారాలకు పోయి సంసారాలు విచ్ఛిన్నం చేసుకుంటున్న సంఘటనలు ఈ రోజుల్లో కోకొల్లలు.

వివాహం జరిగిన తర్వాత ఆడపిల్ల ఎలా మెలగాలో, ఏమి చేయదగిన పనులో, ఏమి చేయకూడనివో తెలియజేస్తూ శ్రీ ప్రక్కి వెంకట నరసింహకవి రచించిన "కుమారీ శతకం" నేటి యువతులకు మార్గనిర్దేశం చేయగలదు. శ్రీ ప్రక్కి వెంకట నరసింహకవి 19వ శతాబ్దానికి చెందిన కవి. వీరి తండ్రి నారాయణమంత్రి. విశాఖపట్నం మిషన్ హైస్కూల్‌లో నరసింహకవి తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1836లో 3 ఆశ్వాసాల ప్రబంధంగా "శకుంతలా పరిణయము" వెలయించారు. వీరి మరొక రచన అయిన "కుమారీ శతకము" 1869లో ప్రథమ ముద్రణ పొందింది. ఆనంద కల్పద్రుమ కావ్యము, నారాయణ స్తవము, నారాయణ శతకము, మదన నాయకా పరిణయము, కవి దర్పణచ్ఛందము మొదలైనవి వీరి ఇతర రచనలు. వీరికి మంచి పేరు ప్రఖ్యాతులు, సాహితీ జగత్తులో సుస్థిర స్థానాన్ని తెచ్చిన రచన "కుమారీ శతకము". తన కాలానికి తగినరీతిలో ఆడపిల్లలందరికీ ఎలా మెలగాలో తెలియజేశారీ శతకంలో. కొన్ని ఈ కాలానికి సరిపోని అంశాలున్నప్పటికీ ఎక్కువభాగం సర్వకాలాలలో అనుసరించదగినవే.

"చెప్పెడి బుద్ధులలోపల
దప్పకు మొకటైన సర్వధర్మములందున్
మెప్పొంది యిహపరంబులఁ
దప్పింతయు లేక మెఁగ దగును కుమారీ"

అని తాను చెప్పే బుద్ధులన్నిటినీ పాటించమని తన కుమార్తెలకే కాక తెలుగు ఆడబిడ్డలందరినీ తన కుమార్తెలుగానే భావించి చెప్పారు నరసింహకవి. కనిపించే ఇహానికి కాక కనిపించని పరానికి అధిక ప్రాధాన్యతనిచ్చే లోకరీతి నెరిగిన కవి ఇహం గురించే కాక పరంగురించి ప్రస్తావించారు. అయితే ఈ కవి చెప్పిన బుద్ధులు ఇంతక్రితం రామాయణ భారతాలలో చెప్పబడినవే. ఎక్కువగా ఈ కవి "కుమారీ శతకం"పై మహాభారత ప్రభావం ఉన్నట్లు కనిపిస్తుంది.

తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో సీతనోట...

"పతియ చుట్టంబుఁ బక్కంబుఁ బతియ చెలియఁ
బతియ తల్లియుఁ దండ్రియుఁ బతియ గురుఁడు
పతియ దైవంబుఁ గావున నతని పం పొ
నర్చుటయ కాదె ధర్మంబు నాతి కరయ" అని

మహాభారతంలో ద్రౌపదిచే...

"పతిఁ గడవంగ దైవతము భామల కెందును లేదు ప్రీతుఁడై
పతి గరుణించెనేనిఁ గలభాషిణి భాసురభూషణంబరా
న్వీత ధనధాన్య గౌరవము విశ్రుత సంతతియున్ యశంబు స
ద్గతియును గల్గు నొందుమెయిఁ గల్గనె యెన్ని తెఱంగులారయన్"

అని పలికించారు. ఇలాగే ఎర్రన సావిత్రిచే...

"పతి విరహంబు దుస్సహము భర్తృ వినాకృతయైన కాంత దూ
షితయగు సర్వ మంగళ విశేషములందు" అనిపించారు.

నరసింహకవి కూడా స్త్రీకి భర్తే సర్వస్వం అని

"మృతియైనను బ్రతుకైనం
బతితోడనె సతికిఁ జెల్లఁ బతిబాసియా
బ్రతుకొక బ్రతుకొ? జీవ
న్మృతిగాక వధూటికెన్న నిదియఁ గుమారీ!" చెబుతారు.

పుట్టింటిని వీడి అత్తింటికి వచ్చిన అమ్మాయి తన పుట్టింటి బాంధవ్యాలన్నీ అత్తింటివారిలో చూసినపుడే సంతోషంగా ఉండగలుగుతుంది. తాను వారిని తనవారిగా భావించి అభిమానించినపుడే వారి నుంచి ప్రేమాభిమానాలు పొందగలుగుతుంది. ఏ కాలమైనా ఇది మారదు. మనం ఇతరులనుంచి ఆదరాభిమానాలు ఆశించే ముందు ముందుగా మనం ఎంతో కొంత వారిని అభిమానించి గౌరవప్రదంగా చూసుకోవాలి. ఏదైనా మనం ఇచ్చిందే మనం తిరిగి పొందగలం. అది ప్రకృతి ధర్మం. ఇవ్వకుండా ఏదీ తిరిగిరాదు కదా! అది నేటి యువతీయువకులు తెలుసుకోవలసిన విషయం. తమకిష్టమైనట్లు తమ జీవిత భాగస్వామి ఉండాల్సిందే అనుకుంటున్నారుగానీ, తాము ఎంతవరకు ఎదుటివారి కిష్టమైనట్లు ఉంటున్నారో ఆలోచించటం లేదు. దాని కారణంగానే కొత్త కాపురాలలో సమస్యలొస్తున్నాయి.

స్త్రీకి సహనమే ఆభరణం. ఏ కష్టం కలిగినా, సమస్య వచ్చినా కొంచెం సహనం వహిస్తే అవి తొలగిపోతాయి. ఎదుటి వ్యక్తి కోపంలో ఉండి ఆవేశంతో దుర్భాషలాడేటప్పుడు కోపపడితే దానివలన నష్టం కలుగుతుంది, ఒక్కోసారి అనుబంధాలు తెగిపోతాయి. అప్పటికి సహనం వహించి మౌనం పాటించి వారి కోపం తగ్గిన తర్వాత ప్రశాంతంగా వారిమాటల వలన, చేతల వలన కలిగిన మానసిక వేదనని వివరించాలి. అప్పుడు వారి ప్రవర్తనకి వారు పశ్చాత్తాపపడతారు, మరొకసారి అలా ప్రవర్తించరు. అదే విషయాన్ని కవి...

"తిట్టినఁ దిట్టక కొట్టిన
గొట్టక కోపించెనేనిఁ గోపింపక నీ
పుట్టిన యింటికిఁ బాదము
పెట్టిన యింటికి వన్నె పెట్టు కుమారీ!" అని చెప్పారు.

ఈ సందర్భంలో మహాభారతంలో నన్నయ శుక్రాచార్యుడి చేత పలికించిన ఈ పద్యం స్ఫురణకు రాకమానదు.

"అలిగిన నలుగక యెగ్గులు
పలికిన మఱి విననియట్ల ప్రతివచనంబుల్
వలువక బన్నము వడి యెడఁ
దలఁపక యున్నతఁడె చూవె ధర్మజ్ఞుడిలన్"

ఆడపిల్ల అణకువగా లేకున్నా, పనీపాటలు రాకున్నా అత్తింటివారు ఆమె తల్లిదండ్రులనే నిందిస్తారు. కాబట్టి తల్లిదండ్రులకు తలవొంపులు కలిగించకూడదంటే పిల్లలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి. ఈ విషయాన్ని...

"కూతురుఁ చెడుగైయుండిన
మాతది తప్పన్న మాట మది నెఱుంగుదుగా
నీ తల్లిదండ్రులకు నప
ఖ్యాతులు రానీయగూడదమ్మ కుమారీ!" అంటూ నరసింహకవి చెబుతారు.

వివాహం తర్వాత అత్తింటివారి దగ్గర పుట్టింటివారి గొప్పలు చెప్పటం, మెట్టినింటివారిని చులకనగా చూడటం వలన సమస్యలు తలెత్తుతాయి. అలాగే పుట్టింట్లో అత్తింటివారిని తక్కువచేసినా, అత్తింటిలో పుట్టింటివారిని చులకన చేసినా భవిష్యత్తులో తన గౌరవమే దెబ్బతింటుంది. అదే విషయాన్ని కవి...

"పుట్టింటివారి నీచతఁ
బెట్టకు మత్తింటివారు పెట్టెడి బాధల్
పుట్టింటఁ దెలియనీయకు
రట్టడి చెలి యందురదియె అవ్వ కుమారీ!" అని చెబుతారు.

ఒకవేళ భర్త అపురూపంగా చూసుకుంటుంటే ఆ భార్య అహంకరించి ఎవరినీ లక్ష్యపెట్టకపోవటం సహజంగా జరుగుతుంది. భర్త తల్లిదండ్రులను తోబుట్టువులను చులకనగా చూస్తుంది. కొందరైతే వారిని దగ్గరకు కూడా రానివ్వరు. కవి అది తప్పని అలా ప్రవర్తించకూడదని...

"మగని ప్రియమబ్బెననుచును
దెగ నీలిగి యింటివారి దిగఁ ద్రొక్కుచు దుం
డగురాలై తిరిగిన సరి
మగువలలో నిదియె తప్పుమాట కుమారీ!" అని తెలిపారు.

ముఖ్యంగా భార్యాభర్తల మధ్య కీచులాటలు రావటానికి, భర్త అవినీతికి పాల్పడటానికి ఆ స్త్రీ కోరే కోరికలే కారణమవుతుంటాయి. ప్రక్కవారికుందని తమకు కావాలని కోరటం, అప్పులు చేసి మరీ కొనటం వంటివి చేస్తుంటారు. గొప్పలకు పోయి అప్పుల పాలవుతారు. ఉన్నదానిలో సర్దుకొనే స్త్రీ వలన కుటుంబానికి మేలు జరిగితే గొంతెమ్మకోరికలు కోరే స్త్రీల వలన నష్టం జరుగుతుంది.

"వారికి వీరికి గలిగెను
గోరిన వస్తువులు మాకుఁ గొదువాయె నటం
చూరక గుటకలు మ్రింగుట
నేరముగాఁ దలపవలయు నెలత కుమారీ!" అని కవి హితవు చెప్పారు.

ఇంకా సహజంగా స్త్రీలు భర్త బాగా సంపాదిస్తే ఒకరకంగా, సంపాదన లేకపోతే మరొకవిధంగా భర్తకు విలువిస్తుంటారు. ఇది కూడా తప్పేనంటూ కవి...

"తెచ్చినఁ దేకుండిన నీ
కిచ్చిన నీకుండిన మగని నెగ్గా
డకుమీ యొచ్చెము నీపై దేలును
రచ్చర కామాట లెక్క అవ్వ కుమారీ!"

అని భర్తను అవమానిస్తే అది తనకే నష్టమని చెప్పారు. మూర్ఖురాలైన స్త్రీ తాను యజమానురాలై భర్తను బానిసను చేస్తుందని, వివేకవంతురాలైన స్త్రీ భర్తను రాజును చేసి తాను మహారాణిగా రాణిస్తుందని పెద్దలు చెప్పిన మాట గుర్తుకొస్తుందీ సందర్భంలో.

స్త్రీలకుండే మరొక లక్షణం ఇరుగమ్మల పొరుగమ్మల గురించి చెప్పుకోవటం. అలాంటి ప్రవర్తన కూడదని కవి...

"ఇక్కడి దక్కడ నక్కడి
దిక్కడ జెప్పినను వారికిద్దరికిఁ బగల్
పొక్కినఁ గల చేడియల
మ్మక్కా యిదుమళ్ళమారి యంద్రు కుమారీ!" అని చెబుతారు.

సేవకులపట్ల ఎలా ప్రవర్తించాలో కూడా చెబుతారు కవి.

“తనకెంత మేలు చేసిన
మనమున కింపైన పనులు మసలిన దాసీ
వనితల కెన్నటికైనను
జనవిచ్చి మెలంగరాదు జగతి కుమారీ!”

ఎంత మేలుచేసినా సేవలకు అతి చనువు ఇవ్వటం తగదు. వారిపై అవసరాన్ని మించి ఆధారపడకూడదు. అలా సేవకులకు అధిక ప్రాధాన్యత ఇస్తే మంథర మాట విన్న కైక పరిస్థితి కలుగక మానదు. అలాగని సేవకులను నీచంగా చూడకూడదు. వారి కష్టాన్ని గుర్తించి తగిన ప్రతిఫలం, గౌరవం వారికి ఇవ్వాలి. కష్టంచేసే సేవకులను నొప్పించటం మంచిపని కాదని కవి...

“విసువగు పని తగిలిన యెడఁ
గసరకు సేవకుల” అంటారు.

ఈ ఆధునిక కాలంలో స్త్రీలు టి.వి. సీరియల్స్ ధ్యాసలోపడి వంటావార్పు విస్మరిస్తున్నారు. అది ఒక పార్శ్వం అయితే మరొకవైపు పూజలు, వ్రతాలు, నోములు, గుళ్ళుగోపురాలు అని స్త్రీలు విపరీతంగా ప్రవర్తించటం చూస్తున్నాం. ఇళ్ళల్లో పెద్దలు, పిల్లల ఆలనాపాలనా మరిచి భక్తి అంటూ, ముక్తి అంటూ తిరుగుతున్నారు. పుణ్యంకోసం అప్పులు చేసిమరీ తీర్థయాత్రలకు వెళ్ళేవారు కొందరున్నారు. మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించకపోతే ఏ భక్తి ముక్తినివ్వదని గ్రహించలేకపోతున్నారు. దాని గురించి కవి...

“జపములు గంగాయాత్రలు
తపములు నోములు దానధర్మంబులు పు
ణ్యపురాణములు పతిభక్తికి
నుపమింపను సాటిరాక యుండు కుమారీ!” అంటారు.

పతిభక్తి అంటే భర్త పాదసేవ చేయమని కాదర్థం. భర్త మనసెరిగి ప్రవర్తించటం, అతని అవసరాలు కనిపెట్టి తీర్చటం, అతడిపట్ల గౌరవాభిమానాలు కలిగి ఉండటంగా భావించాలి. పతిభక్తి గురించి చెబుతూ కవి భర్త అన్యస్త్రీలపట్ల మక్కువ చూపినా చూసీ చూడనట్లు భార్య భావించాలని, భర్త తప్పు పనులు చేసినా తప్పని చెప్పాలి కానీ అతను వినకపోతే కోపగించకూడదని చెబుతారు. దీనిని ఈ రోజుల్లో ఎంతమాత్రం సమర్థించనవసరం లేదు. భర్త గుణవంతుడై తనపట్ల అనురాగం కలిగినప్పుడు ఆ భార్య భర్తపట్ల భక్తిశ్రద్ధలతో మెలగవచ్చు కానీ అసమర్థుడు, స్త్రీలోలుడు, వ్యసనపరుడు, నేర ప్రవృత్తి కలిగినవాడు అయినప్పుడు భార్య తన అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి అతడిని విడిచినా తప్పనలేము కదా!

కవి ఆడపిల్లలు మెలగవలసిన తీరుని, ఉండకూడని రీతిని అనేక పద్యాలలో చెప్పారు. ఒక ఇల్లు ఐశ్వర్యంతో తులతూగుతున్నా అప్పుల ఊబిలో కూరుకుపోయినా అందులో ఆ ఇంటి ఇల్లాలి బాధ్యత తప్పనిసరిగా ఉంటుంది. స్త్రీ జాగ్రత్తపరురాలు అవ్వటం ఆ కుటుంబ అభ్యున్నతికి కారణమవుతుంది. ఆడపిల్లకి ఉండవలసిన లక్షణాలను కవి...

“సరుకుల యెడ జాగ్రత్తయు
జురుకు పనులయందు భక్తి సుజనులయందున్
కరుణ యనాధుల యెడలం
దరుణికిఁ జెలువారవలయు ధరణి కుమారీ!” అంటూ తెలిపారు.

ఒక్క తన కుటుంబాన్ని చూసుకోవటమే కాదు సమాజంపట్ల కూడా ఆడపిల్ల బాధ్యత కలిగి ఉండాలి. సహజంగానే స్త్రీ మనసు దీనులను చూస్తే ద్రవిస్తుంది. తాను చేసే దానధర్మాలే తన బిడ్డలను రక్షిస్తాయని స్త్రీమూర్తులు భావించడం చూస్తుంటాం.

“దానములు ధర్మకార్యము
లూనంగాఁ గలిగినంతఁ యుక్తక్రియలన్
మానవతులకిది ధర్మము
గానెఱిఁగి యొనర్పవలయుఁ గాదె కుమారీ!” అంటారు కవి.

ఇంకా కుడిచేతితో చేసిన దానం ఎడమచేతికి తెలియరాదు అని పెద్దలు చెప్పినట్లుగా ఎవరికైనా మేలు చేశాము కదా అని అందరికీ చెప్పవలసిన అవసరం లేదంటారు కవి.

“చెప్పకు చేసిన మేలు నొ
కప్పుడయినఁగాని దాని హర్షింపరుగా
గొప్పలు సెప్పిన నదియును
దప్పేయని చిత్తమందు దలఁపు కుమారీ!” అంటారు కవి.

ఎంత ఐశ్వర్యమున్నా, అందమున్నా, విద్య ఉన్నా, పదవి ఉన్నా అహంకారం దరిచేరితే వారి ఔన్నత్యం కొద్దిరోజులకే తరిగిపోతుంది. అందుకే గర్వాన్ని దరిచేరనివ్వ వద్దని కవి హెచ్చరిస్తున్నారు. గొప్పదశ కలిగిందని గర్విస్తే అది పోయినరోజు అపహాస్యం కాక తప్పదని ఇంకా...

“కులమున విత్తంబున వి
ద్యలను మదం బుద్భవించు నాయాపెంపుల్
దలపోయ మరలునిది హ్యా
జ్జలజంబునఁ దలఁపవలయు సతము కుమారీ!” అని హితవు పలికారు.

ఏ లక్షణాలు ఆడపిల్ల కలిగి ఉండకూడదో, ఎలా ప్రవర్తించకూడదో కూడా తెలియజేశారు. వేళాకోళాలు ఆడటం, ఊరకనే పగలబడి నవ్వటం, ఎప్పుడూ తలవాకిట నిలిచి ఉండటం, పరపురుషుల పట్ల ఆసక్తి కలిగి ఉండటం, గయ్యాళితనం, జగడాలాడటం, చెడు ఆలోచనలు చేయడం, చెడు స్త్రీలతో స్నేహం చేయడం, అబద్ధాలు చెప్పడం, బట్టలు, నగలు అరువుతేవడం, ఇంటి విషయాలు పరులతో పంచుకోవటం, ఇద్దరు రహస్యంగా మాట్లాడుకుంటుంటే అవి వినటం వంటివి చేయకూడదు. ఇంకా...

“అధికారము లేని పనుల
కధికారము సేయబోకు మంధునఁ గోపం
బధికంబగు నీవారికి
బుధులది విని హర్షమొందఁబోరు కుమారీ!”

అని తనవి కాని పనులలో జోక్యం చేసుకోకూడదని జాగ్రత్తలు చెప్పారు. కొంతమంది ‘అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లుగా’ తమ కోపం పిల్లలపై చూపిస్తుంటారు. పిల్లలను కొట్టడం, తిట్టడం చేస్తారు. తల్లి కోపంతో రగిలిపోతూ పసికందుకు పాలిస్తే ఆ పాలు విషమవుతాయని పెద్దలు చెబుతారు. అందుకే కవి...

“అత్తపయిన్ మఱఁదలిపయి
నెత్తిన కోపమున బిడ్డ నేడ్పించుటకై
మొత్తినఁ దనకే కీడగుఁ
జిత్తములో వీరిఁ జింతసేయు కుమారీ!” అని మంచిమాట చెబుతున్నారు.

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. అత్తమామలు, బావమరుదులు, తోడికోడళ్ళు, వారి పిల్లలు అందరూ కలిసి ఒకే కుటుంబంగా ఉండేవారు. కొన్ని కుటుంబాలలో ఎవరి పిల్లలు ఎవరో అనేది తెలియనంతగా అందరూ కలిసి సఖ్యంగా ఉండేవారు. పిల్లలను అందరూ బాగా చూసుకునేవారు. దాని కారణంగా వారి పిల్లలు వారి దగ్గర

లేకున్నా మిగిలిన బావ, మరుదుల పిల్లలు వీరిని చూసుకునేవారు. పెద్దలు పిల్లలందరినీ సమానంగా చూసేవారు, పిల్లలు పెద్దలందరినీ గౌరవించేవారు. వివాహ సమయంలో వధువు వరుడి కుటుంబ సభ్యులను తన కుటుంబసభ్యులుగా భావిస్తానని ప్రమాణం చేయటం భారతీయ సంస్కృతిలో భాగంగా ఉంది. కాబట్టి ఉమ్మడి కుటుంబంలో ఉండే ఆడపిల్లకు కవి...

“తన బావల పిల్లల యెడఁ
తన మఱదుల పిల్లలందు దన పిల్లల కం
టేను మక్కువ యుండవలెన్
వనితల కటులైన వన్నె వచ్చు కుమారీ!” అని మేలైన మాట నుడివారు.

అత్తమామలను, భర్త తోబుట్టువులను, వారి సంతానాన్ని తనవారిగా భావించి ప్రేమించిన స్త్రీ కీర్తించబడుతుంది. చాలామంది ఆడపిల్లలు ఈ రోజుల్లో అత్త ఆడబిడ్డలు ఉంటే అటువంటి వివాహానికి అంగీకరించని పరిస్థితులు చూస్తున్నాం. పెద్దలుకూడా కూతుర్లను సమర్థిస్తున్నారు. కానీ తాము గతించిన పిదప తమ బిడ్డకు మంచికి చెడుకు తోడుగా ఉండేది ఆ కుటుంబసభ్యులే అని విస్మరిస్తున్నారు. వివాహం జరిగిన తర్వాత కొందరు అత్తమామలను ఇంటి గడప కూడా తొక్కనివ్వటం లేదు. తాను సుఖంగా, సంతోషంగా ఉండటానికి కారకుడైన భర్త వారు పెంచి పోషించకపోతే ఉండేవాడే కాదని మరచిపోతున్నారు. ఈరోజు తాము ఎలా ప్రవర్తిస్తే రేపు తాము అదే తిరిగి పొందుతామనే జ్ఞానం శూన్యమవుతుంది. వయస్సులో ఉన్నారని, సంపద కలిగి ఉన్నారని, భర్త తమ మాట జవదాటడని ఆడపిల్ల అహంకరించకుండా ఉండాలంటే చిన్నతనం నుంచే కొంత వేదాంతధోరణి కూడా అలవరచటం అవసరం. అందుకే కవి...

“దృశ్యపదార్థము లెల్లను
నశ్యములని తలఁపకుండినన లోపంబౌ
దృశ్యంబున నస్థిరత న
వశ్యము చిత్తమునఁ దలప వలదె కుమారీ!”

అని ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదని తెలుపుతున్నారు. ఎంత బలవంతులైనా, గొప్పవారైనా ఏదో ఒక రోజు యమసదనానికి వెళ్ళవలసిందే. మరణం మన పుట్టుకతోనే పుట్టి మన వెంటే ఉంటుందని, ఒక్కోసారి మననీడ మనతో రాకపోవచ్చు కానీ మృత్యు ఒడిలోనే నిరంతరం మనమున్నామనే స్పృహ ప్రతి మనిషికి ఉండాలి. అదుంటే అహంకారంతో విర్రవీగడు. అలాగే ఆప్తులు శాశ్వతంగా దూరమైనపుడు మరణం సహజమని గుర్తుచేసుకొని కృంగిపోకుండా ఉంటాడు. ఆ సంగతి ఆడపిల్లలకు తెలియటం ఎంతో అవసరం. స్త్రీ ఏ పరిస్థితులలోనైనా ధైర్యంగా నిలబడి నిలదొక్కుకోవాలంటే వేదాంతధోరణి అలవరచుకోవలసిందే. అది గుర్తించిన కవి

“ఎన్నాళ్ళు బ్రతుకఁ బోదురు
గొన్నాళ్ళకు మరణదశల గ్రుంగుట జగమం
దున్నట్టివారి కందఱి
కిని హితము సతము మంచి కీర్తి కుమారీ!” అని బోధ చేశారు.

“ధరఁ బ్రక్కికులుఁడు వేంకట
నరసింహ కవీంద్రుఁ డిట్టి నడతలు ధరపై
దెఱవల తెఱవు లటంచును
జిరతర స్మర్తి వెలయఁ జెప్పె కుమారీ!” అంటూ ఈ శతకాన్ని ముగించారు.

'కుమారీ' అనే మకుటంతో వందపద్యాలతో ఈ శతకాన్ని వెలయించారు. ఆడపిల్లలు సుఖంగా, సంతోషంగా సంసారాలు సాగించటానికి ఈ శతకాన్ని చదివి, పాటిస్తే చాలు అయితే 'కుమారీ' అంటూ యువతులకు బోధ చేసినప్పటికీ అనేక అంశాలు యువకులు పాటించదగినవే. భార్య భర్తను తన సర్వస్వంగా భావించాలంటే ఆ భర్త దానికి తగినవాడై ఉండాలి కదా! తనవారిని భార్య ఎలా గౌరవిస్తుందో భర్తకూడా భార్య బంధుమిత్రులను అలాగే గౌరవించాలి. అహంకారాలకు పోకుండా భార్యాభర్తలిరువురు ఒకరి అభిప్రాయాలను ఇష్టాలను మరొకరు గౌరవిస్తూ తాము ఇద్దరు కాదు ఒక్కరే అనేంత సఖ్యంగా సహవాసం చేసిననాడు వేరెవరు నీతులు చెప్పవలసిన అవసరమే లేదు. కోర్టుల్లో రోజుకి వందలసంఖ్యలో విడాకుల కేసులు నమోదవుతున్న ఈ రోజుల్లో మాత్రం కుటుంబాలు విచ్ఛిన్నం కాకుండా ఉండాలంటే, ఆ ప్రభావం పిల్లలపై పడకుండా ఉండాలంటే, సమసమాజం భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను విస్మరించకుండా ఉండాలంటే ఇలాంటి శతకాల అధ్యయనం ఆవశ్యకం.

**ఉపయుక్త గ్రంథాలు**

1. కవిత్రయ భారతం – కవిత్రయం,తి.తి.దే. ప్రచురణ
2. కుమారీ శతకం – శ్రీ ప్రక్కి వేంకట నరసింహకవి
3. నిర్వచనోత్తర రామాయణం – తిక్కన

❖❖❖

# వేమన - బద్దెనల దృక్పథంలో స్త్రీ

**ఆచార్య వి.నారాయణప్ప**

ఆధునిక భారతీయ భాషలు మరియు సాహిత్య అధ్యయన శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం

ఫోన్ నెం: 99586 07783, Email: narayanappav@gmail.com

సామాన్య ప్రజలలో కూడా మంచి ఆదరణ లభించిన తెలుగు శతకాలలో వేమన శతకం ఒకటి. అంత ఆదరణకు కారణం వేమన ప్రజాకవి. ప్రజల కోసమే, ప్రజల మాటలతోనే కవిత్వం చెప్పటం. తాను ఎన్నుకొన్న వస్తువు ప్రజాజీవితం కావటం. వేమనవన్నీ నీతి పద్యాలు కావటం. ప్రతి సమస్యకూ పరిష్కారం లభించటం. అందుకే – ఆచార్య ఎస్.గంగప్పగారు "వేమన వస్తువు జీవితాన్ని, సమాజాన్ని మథించి తీసిన వెన్నలాంటి సారం" అన్నారు. పాశ్చాత్యులు, దేశీయులూ వేమనను కవిగా, తాత్వికునిగా, దార్శనికునిగా, యోగిగా, ఉపదేశకునిగా, సంఘసంస్కర్తగా, లోకకవిగా, విప్లవకవిగా, ప్రజాకవిగా గుర్తించారు. వేమన ఆటవెలది ఛందస్సులో వేలకొలది పద్యాలు చెప్పాడు. ఇతని పద్యాలు ప్రపంచ భాషలలోనికి అనువదించబడ్డాయి. వేమన పద్యమొకటైనా రాని తెలుగు వారుండరు. వేమన పద్యం పూర్తిగా రాకపోయినా వేమన పద్యపాదాలను అక్కడక్కడ సందర్భాన్ని బట్టి సామెతలుగా ప్రయోగిస్తుంటారు.

ఉదాహరణకు :

"కంచు మోగినట్లు కనకంబు మోగునా!"
"చెప్పుదినెడు కుక్క చెరుకు తీపెరుగునా!"
"కుక్కతోక బట్టి గోదావరీదునా"

మొదలైనవి ఎన్నో కనబడుతాయి. ఇలాంటి సామెతలు ప్రజల సొత్తుగా మారిపోయినాయి.

అయినా వేమన పద్యాలు కొన్ని వివాదాస్పదంగా ఉన్నాయని, అతని దేశకాలాదులు స్పష్టంగా లేవని, వేలకొలది పద్యాలు చెప్పిన వేమన శతక కవి ఎలా అవుతాడనీ మొదలైన ప్రశ్నలకు ఎన్నో పరిశోధన పత్రాలు, పుస్తకాలు వచ్చాయి.

నిజానికి సి.పి.బ్రౌన్‌గారి అహోరాత్రాల శ్రమ ఫలితంగా క్రీ.శ.1829లో తొలిసారిగా వేమన పద్యాలు వేల సంఖ్యలో ముద్రింపబడి వెలుగు చూశాయి. వేమన కాలాన్ని పరిశోధకులు క్రీ.శ.1472 నుంచి క్రీ.శ.1672 వరకూ ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా నిర్ణయిస్తున్నారు. అయితే, భారత ప్రభుత్వం తెలిసిన పండితులను, పరిశోధకులను సంప్రదించి వేమన కాలం క్రీ.శ.1672 అని అధికార ముద్ర వేసింది. వేమనది రాయలసీమ ప్రాంతమని చాలా మంది పరిశోధకులు అంగీకరిస్తున్నారు.

వేమన పద్యాలు (ప్రక్షిప్తాలు మినహాయించి) మొదట నుంచీ చివరి దాకా ఆటవెలది ఛందస్సులోనే సాగాయి. పద్యం చివరి పాదం పూర్తిగా "విశ్వదాభిరామ వినురవేమ" అనే మకుటంతో సాగింది. పద్యాలన్నీ ముక్తకాలు కావటం మొదలైన శతక లక్షణాలను గుర్తించిన పండితులు వేమనను శతక కవిగా పరిగణించి ఉండవచ్చు.

వేమన కంటే పూర్వమే ఎన్నో తెలుగు శతకాలు వచ్చాయి. వాటిలో కాలాన్ని బట్టి, గుణాన్ని బట్టి అగ్రగణ్యమైన శతకం మరొకటి ఉంది. అది "సుమతీ శతకం". ఇది 108 నీతి పద్యాల సమాహారం. ఇందులో అన్నీ కంద పద్యాలే. ప్రతి పద్యం చివర 'సుమతీ' అన్న మకుటం ఉంది. ఈ శతకంలోని పద్యాలు సరళభాషలో చెప్పబడిన నీతులు తెలుగు భాషలోను, తెలుగువారి జీవితాలలోనూ పెనవేసుకొన్నాయి. సుమారు ఏడు వందల సంవత్సరాల

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025**

క్రితం వ్రాయబడిన ఈ పద్యాలలోని పదాలన్నీ నేటి భాషలోనూ వున్నాయి. ఇందులో దీర్ఘ సమాసాలుగాని, సంస్కృత పదాలుగాని లేవు. కాబట్టి, అక్షర జ్ఞానం లేనివారికి కూడా వినిన వెంటనే భావం అర్థమవుతుంది. అందుకే బద్దెన శతకంలోని పద్యం పూర్తిగా రానివాళ్ళు కూడా ఒకటి రెండు పాదాలను సులభంగా గుర్తు పెట్టుకొని “కరిమ్రింగిన వెలగపండు”, “తన కోపమే తన శత్రువు”, “చెవిటికి సంకూదినట్లు”, “ఇత్తడి బంగారమగునె” వంటి పద్య భాగాలను జాతీయాలుగా, సామెతలుగా ఉపయోగిస్తుంటారు. కాని, ‘సుమతీ శతకం’ కర్త ఎవరో కచ్చితమైన సమాచారం లభించడం లేదు. అయితే క్రీ.శ. 1220–1280 మధ్య కాలంలో బద్దెన లేదా భద్రభూపాలుడు అనే కవి సుమతీ శతకాన్ని వ్రాశాడని సాహితీ చరిత్రకారుల అభిప్రాయం.

నీతి శతకంలో కవి జీవిత సమస్యలను చర్చిస్తాడు. నీతి శతకాలలో రాజనీతి, గృహనీతి, లోకనీతి, ప్రవృత్తినీతి అనేవి ప్రధానమైనవి.

గృహనీతిలో తల్లి – తండ్రి – పుత్రసంబంధాలు, అనుకూలవతియైన భార్య, పరస్త్రీలపట్ల వర్తన, స్త్రీ ధర్మాలు, స్త్రీల పట్ల ఆనాటి పురుషుల దృష్టి, వారకాంతలు అనే విషయాలు ప్రాముఖ్యం వహిస్తాయి.

లోకనీతిలో లోకవృత్తం, సంఘవిమర్శ, బంధువులు, ఆశ్రితులు ధనార్జన, సమకాలిక జీవితం, విషయ సంపద అనే విషయాలు ముఖ్యమైనవి.

ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటుంది. కవి తన జీవితంలో ప్రత్యక్షంగా అనుభవించిన సమస్యలు పరోక్షంగా తన కవిత్వంలో కొన్ని చోట్ల ప్రతిబింబిస్తాయి. ఆ విధంగా వేమన జీవిత ప్రయాణంలో సమకాలీన సామాజిక పరిస్థితులు, తాను ఎదుర్కొన్న సమస్యలు ఎక్కువగా కనబడుతాయి. దీనికి బద్దెన కూడా భిన్నమైనవాడు కాదు. వీరిద్దరూ తమ నీతి శతకాలలో లోకం తీరుని, గృహనీతిని ఉన్నది ఉన్నట్లు చెప్పినందుకు కొంత విమర్శకు గురి అయ్యారు. ముఖ్యంగా వీరిద్దరు తమ శతకాలలో స్త్రీల పట్ల వివక్ష చూపారని కొంతమంది విమర్శిస్తున్నారు. కాని, ఈ కవులు స్త్రీ – పురుషుల వాస్తవిక మానవ స్వభావాన్ని మాత్రం ఆవిష్కరించారు. నిజానికి ప్రజాకవులు సమాజంలో తప్పులను ఎత్తి చూపి, ప్రజానీకాన్ని ఉత్తమ పాఠకులుగా తయారు చేస్తారు తప్ప, సమాజాన్ని తప్పు దోవను పట్టించరు.

ఎవరైతే ఈ ప్రజా కవులను విమర్శిస్తున్నారో......వారు ఈ కవులను చూసే దృక్కోణంలో లోపం కావచ్చునేమో.

ఆనాడు ఎక్కువగా స్త్రీలోలత్వం, వ్యభిచారం పెరిగింది. అప్పటికే వేమనపై వీరశైవ సిద్ధాంతాల ప్రభావం ఉంది. ఆ సిద్ధాంతాలలో స్త్రీ – పురుష సమానత్వం, స్త్రీ జనోద్ధరణ ప్రముఖ స్థానమాక్రమిస్తాయి.

**వేమన దృష్టిలో స్త్రీ తల్లి**. అందుకే వేమన –

“తల్లి నెరుగువాడు దైవంబు నెరుగును” అన్నాడు.

మరోచోట– “వెలయ భూమి తల్లి, విత్తనం బటు తండ్రి,
పంట లరయ సుతులు, పాడిపరము ;
ధర్మమె తన పాలి దైవంబు తలపోయ” అన్నాడు.

అంటే, మానవునికి భూమి తల్లి, విత్తనం తండ్రి, పంటలు సంతానం, పాడి స్వర్గం, ధర్మం (సత్కార్యాచరణం) దైవం – ధర్మ స్వరూపమైన దైవాన్ని చేరుకోవడానికి మూలం తల్లి అని శ్లాఘించాడు వేమన.

వేమన ఇంకో అడుగు ముందుకు వెళ్ళి, తల్లి రక్షణలో ఉన్నప్పుడు కలిగే ప్రయోజనాలను, విలువలను గూర్చి ఎంత ఉన్నతంగా చెప్పాడో చూడండి :

“తల్లియున్నయపుడె తనదు గారాబము
లామె పోవఁ దన్ను నరయ రెవరు
మంచి కాలమపుడె మర్యాద నార్జింపు” అన్నాడు.

అంటే, తల్లిపోయాక ఎందురుంటే ఏమి లాభం. 'ఆమె పోవ తనను అరయరెవరు' అంటూ నిత్యసత్యాన్ని విన్నవించాడు.

బద్దెన కూడా – 'అమ్మా అని పిలిచి అన్నమడుగని నోటిని కుమ్మరివాడు మన్ను తవ్వినటువంటి గుంటతో సమానం' అన్నాడు.

అలాగే స్త్రీల అదోగతికి కారణం పురుషులేనని గుర్తించిన వేమన–

"తరుణి పుణ్యవతిగ వరుని బట్టియె యగు,

పాపియగు మగని ప్రాపువలన

భర్తవర్తనంబె పడుతుల యందుండు" అన్నాడు.

అంటే, మగని బట్టే భార్య ఉత్తమరాలుగను, పాపాత్మరాలుగను అవుతుంది. భర్త మంచి చెడుగులే ఆమె మంచి చెడ్డలకు కారణం అని స్త్రీల పక్షాన వాదించాడు.

'ఆడది నరక ద్వారమని, పుణ్యం కొద్దీ పురుషుడ'నీ పురాణ ప్రసిద్ధి. కాని, వేమన దృష్టిలో అది స్త్రీల పట్ల పురుషులు చూపిన దారుణమైన వివక్ష అని, దీనిని ఖండిస్తూ 'పురుష భాగ్యముననె పుణ్యవతి దొరకు' అని కళ్ళు తెరిపిస్తాడు.

అందుకే –"కావ వలయు మగఁడు కాంత నెల్లప్పుడు

కావలేనివాడు చావవలయు....." అని

స్త్రీజన సంరక్షణలో పురుషుల బాధ్యతను గుర్తుకు తెస్తాడు.

ఇంతే కాదు, పురాణ పురుషులైన త్రిమూర్తులు కూడా స్త్రీ లేకపోతే తమ తమ ఉనికిని కోల్పోతామని ఎంతో జాగ్రత్త వహించారని పురుషులను మరింత గుర్తు చేస్తూ....

**వేమన –**

"పడఁతి మోసెనొకఁడు పడతి మేసెనొకండు

పడఁతి నురముఁ జేర్చి బ్రతికె నొకఁడు

పడఁతి కొఱకె పెక్కు పాట్లను బడిరయా" అన్నాడు.

ఇక్కడ హాస్యరసాన్ని అమలు చేస్తూ స్త్రీలను కాపాడుకొనే జవాబ్దారితనాన్ని పురుషులకు అప్పజెప్పాడు.

**వేమన ఉత్తమ భార్యను గురించి......**

"సుగుణవంతురాలు సుదతియై యుండిన

బుద్ధిమంతులగుఁచు పుత్రులొప్ప

స్వర్గమేటికయ్య సంసారికింకను" అని ప్రశంసించగా ;

**బద్దెన స్త్రీని గురించి....**

"నీరే ప్రాణాధారము

నారే నరులకు రత్నము" అంటూనే....

"కులకాంత తోడ నెప్పుడుఁ

గలహింపకు వట్టి తప్పు ఘుడియింపకుమీ;

కలకంఠి కంటఁ కన్నీ

రొలికిన సిరియింట నుండనొల్లదు సుమతీ"

అని స్త్రీ ఔన్నత్యాన్ని ప్రశంసించుటను చూస్తే, ఉత్తమ భార్యల పట్ల వేమన – బద్దెనలలో ఎంత ఉత్కృష్టమైన

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక** **సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్** **జూన్- 2025**

భావాలున్నాయో తెలుస్తోంది.

**ఇక బాలికల మీద జరిగే అత్యాచారాలను గురించి వేమన - బద్దెనలు ఏమి చెప్పారో చూద్దాం!**

'బాలిక' అంటే 'యౌవనానికి రానటువంటి ఆడపిల్ల'. బాలికలకు పుష్పవతులు కాక మునుపు కామాపేక్ష ఉండదు. సామాన్యంగా ఇళ్ళల్లో చిన్న ఆడ పిల్లలుంటే అందరూ చూసి ఆనందిస్తారు. అంతేగాని, యౌవనవతులను వర్ణించినట్లు బాలికలను, వృద్ధస్త్రీలను గురించి ఏ కవి ఏ ప్రబంధంలోనూ వర్ణించినట్లు కనిపించదు.

**వేమన** 'బాలికలు సంగమించడానికి భయపడుతార'ని చెప్పాడు.

**కన్నడ కవి సర్వజ్ఞుడు** 'బాలికలకు దృఢ మనస్సు ఉండదు. బాలికలను కామ దృష్టితో చూడకూడదని, వారితో సంభోగించకూడదనీ' చాలా కటువుగా చెప్తూ "ఎవడైతే బాలికలను భోగిస్తాడో వాడి స్థితి బాగా పాలు ఇచ్చే నల్లబర్రె పచ్చిగడ్డిని తినటం మాని, మనిషి యొక్క మలం తినినట్లుంటుంది" అని అసహ్యించుకొన్నాడు.

**బద్దెన** కూడా....

"కసుగాయ కఱచి చూచిన
మసలక తిన వగరుగాక మధురంబగునా?
పస గలుగు యువతలుండగ
పసిబాలలఁ బొందువాడు పశువుర సుమతీ" అన్నాడు.

అంటే - బాలికల పొందు ఎలా ఉంటుందంటే పక్వానికి వచ్చిన తియ్యని పండ్లను వదలి పచ్చి కాయలు కొరికినట్లు, లోకంలో ఎందరో మంచి యౌవనవతులుండగా వారిని విడిచి బాలికలను అనుభవించేవాడు పశువుతో సమానమని దుయ్యబట్టాడు బద్దెన. కాబట్టి, ఆనాటి సమాజంలో బాలికల మీద అత్యాచారాలు చేసే మగమృగాలు ఉండేవారని తెలుస్తోంది. ఆనాడు లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ చట్టం కూడా ఉండేది కాదు.

ఈనాడు నిండా తొమ్మిది పది సంవత్సరాలు కూడా నిండని బాలికల మీద అత్యాచారాలు చేసే మగమృగాలను గురించి మనం రోజూ వార్తా పత్రికలలో చదువుతున్నాం, టీవీలలో చూస్తున్నాం. అందువలన ఆనాటి సమాజానికి మంచిని బోధిస్తూ చెప్పిన ఈ పద్యం నేటి తరానికి కూడా ఎంతో అవసరం.

**ఇక యౌవనవతులను గురించి వేమన - బద్దెనలు ఏమన్నారంటే...**

"బాల చనులఁ పూల బంతులఁ బోల్తురు
పాలు మాటినట్టి భ్రాంతులవని
మాంసఖండమందు మతియేమి యున్నది"
"బాల్యమందు తాను బహువిధములఁబట్టి
చప్పఱచినట్టి స్తనములకును
మోహమింత యేల మూఢాత్మ తెలియరా" అంటాడు వేమన.

అంటే ... అందమైన యువతి స్తనాలను పూలగుత్తులతో పోల్చి జనులు భ్రాంతి పొందుతారు. అవి మాంసపు ఖండలే కదా! పసితనంలో తాను పాలకై చప్పరించినవే ఇవి అని తెలిసికొనక మానవుడు ఆ స్తనాలను చూసి మోహించి భ్రమపడుతున్నాడు. వీటిని తెలుసుకోరా మూఢాత్మ అని వేమన ప్రబోధించాడు.

అయితే, బద్దెన - 'తాంబూలాన్ని వేసుకొనని నోటిని, యౌవనవతులైన స్త్రీల అధరామృతాన్ని గ్రోలని నోటిని బూడిదగుంటతో సమానమ'ని చెప్పాడు. ఇది కొంత విడ్డూరంగానే వుంది. కాని, ఇది నాటి సమాజంలోని పురుషుల మనస్సులయందు గల భావాలను బంధించి ఈ విధంగా బద్దెన తన శతకంలో ప్రతిబింబింపజేసి ఉండవచ్చు.

**వేశ్యలను గురించి వేమన - బద్దెనల అభిప్రాయం ఎలాంటిదో పరిశీలించి చూద్దాం:**

వేశ్యలు అనగానే కొంతమంది వేమనను వేశ్యాలోలుడని గుర్తుకు తెచ్చుకుంటారు. దానికి మొదట అవుననే చెప్పాలి. వేమన తన యౌవనమంతా వెలయాలి కౌగిట్లో గడిపిన వ్యసనలోలుడు. వేశ్యా స్వభావం తెలిసినవాడు. వేశ్యా గృహాలు తిరిగినవాడు. వేశ్యల కొరకు ధనాన్ని వెచ్చించి ఇల్లు గుల్ల చేసుకొన్నవాడు. 'మంచి కాలమపుడె మర్యాద నార్జింప' లేదని వదినగారి (కథలున్నాయి) బోధనలకు తలొగ్గి, కాముకతను రోసి, చివరికి యోగిగా మారాడు. మునపటి వెలయాలి సాంగత్యాన్ని అసహ్యించుకొని "అయ్యో ఇంతకాలం ఈ నీచమైన సుఖం కోసమా నా కాలాన్ని వృథా చేసింది! నా జీవితాన్ని చీకటి కూపంలో మ్రగ్గబెట్టింది" అనుకుంటూ పశ్చాతాపం చెందిన వేమన వెలయాలు పొందులో వచ్చే అనర్థాలను చెప్పాడు. వేశ్య తన నవ్వుతోనే మోహం కలిగిస్తుంది. వారివన్నీ నటనలే! వారికి నిజమైన ప్రేమ ఉండదు. వారికి ధనమే ముఖ్యమని వేమన చెప్పిన పద్యాన్ని గమనించండి :

"కడుపునిండ తవుడు గంపలోఁ బెట్టిన
చన్నుఁ బట్టనీక తన్నుగేదె
వారకాంతలెట్లు వలతురో యూరక"

అని వేశ్యల కొరకు ఎగబడు విటులను హెచ్చరించాడు.

అలాగే యౌవనం శాశ్వతం కాదంటూ వేశ్యావృత్తిలోని అంతరార్థాన్ని విప్పి చెప్తూ.....

"మొలక చనుల నాడు మూడు కోటులు చేయు
కులుకు చనులనాడు కోటి చేయు
తబక చనులనాడు దమ్మిడీ చేయదు"

అని వేశ్యలను కూడా హెచ్చరించాడు వేమన.

**బద్దెన వేశ్యను గురించి ఏమన్నాడంటే...**

వెలయాలి వలన నిజమైన ప్రేమ లభించదు. బోగముది చేయు ప్రమాణాలు నమ్మదగినవి కావు అంటూనే...

"కొక్కోక మెల్లఁ జదివినఁ
చక్కనివాఁడైన రాజ చంద్రుండైనన్
మిక్కిలి రొక్కము లియ్యక
చిక్కదురా వారకాంత ; సిద్ధము సుమతీ" అన్నాడు.

ఈ పద్యాన్ని బట్టి చూస్తే వేశ్యకు ధనమే ప్రధానమని తేటతెల్లమౌతుంది.

ఈ కవుల పద్యాలను విశ్లేషించి చూస్తే వేమన కాలంలోను, బద్దెన కాలంలోనూ వేశ్యా గృహాలు ఎక్కువగా ఉండేవని, ఆ వేశ్యాగృహాలకు సంపన్నమగరాయళ్ళు వెళ్ళేవారని తెలుస్తోంది.

ఈనాడు కూడా రహస్యంగా వేశ్యాగృహాలు నడిపే వాళ్ళు ఉన్నారు. అప్పుడప్పుడు వీరు పోలీసుల చేతికి చిక్కిబిక్కిరిస్తుంటారు. దేశం ఆరోగ్యంగా ఉండాలంటే ఈ ఆధునిక వేశ్యాగృహాలను నిర్మూలించాల్సిన అవసరముంది.

**పై తులనాత్మక పరిశీలనవల్ల తేలిన అంశాలు :**

1. వేమన - బద్దెన కవులిద్దరూ తల్లిని ఉన్నతంగానే ప్రశంసించారు.
2. వేమన ఉత్తమ భార్యల పట్ల హర్షాన్ని వ్యక్తపరుస్తూ, వారిని కాపాడుకొనే బాధ్యతను పురుషులకు అప్పజెప్పాడు. బద్దెన - కులకాంతను రోదించవద్దని సలహానిచ్చాడు.
3. వేమన - బద్దెన లిద్దరూ బాలికలపై జరిగే అత్యాచారాలను తీవ్రంగా ఖండించారు.
4. వేమన యౌవనవతుల స్తనాలను వర్ణించే వారిని మూఢాత్మలన్నాడు. కాని బద్దెన ఈ విధంగా చెప్పలేదు.
5. వేమన - బద్దెనలు ఇద్దరూ వేశ్యకు నిజమైన ప్రేమ ఉండదు. ధనమే ముఖ్యమని చెప్పారు.

6. బద్దెన తన 'సుమతీ శతకం'లో స్త్రీని గురించి చెప్పిన పద్యాలు నలభై తొమ్మిది ఉన్నాయి. వేమన పద్యాలు వందకు పైగానే ఉన్నాయి.
7. వేమన పద్యాలు ఎన్నో భాషలలోకి అనువదించబడ్డాయి. కాని బద్దెన పద్యాలు ఇతర భాషలలోకి తగినంతగా అనువదించబడలేదు.
8. మొత్తానికి వీరి కవిత్వాలు ఒక ప్రయోజనాన్ని ఆశించి ఈ సమాజంలోని బుగ్మతల్ని రూపుమాపి సమసమాజాన్ని ఆకాంక్షించిన దృక్పథంతో వెలువడినవిగా కనిపిస్తాయి. వీరి కవిత్వం సార్వకాలికం సార్వజనీనం.

ఇలాంటి నీతి శతకాలలోని పద్యాలను పిల్లలకు ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచీ విశ్వవిద్యాలయాల స్థాయి వరకూ పాఠ్యాంశాలుగా చేర్చినట్లయితే మన భాషను, సాహిత్యాన్ని, సంస్కృతిని కాపాడుకున్న వాళ్ళమవుతాం.

ప్రస్తుతం ఢిల్లీ విశ్వవిద్యాలయంలో తెలుగు శతక సాహిత్యాన్ని పాఠ్య ప్రణాళికలో చేర్చడం జరిగింది. మరల ఇదొక మంచి పరిణామదశకు నాందిగా భావించవచ్చు.

**సంప్రదించిన గ్రంథాలు :**

**తెలుగు**

1. అరుణాచలం, పి.వి (సం). 2000. వేమన కవితాతత్త్వం. కుప్పం : ద్రావిడ విశ్వవిద్యాలయం.
2. నారాయణప్ప, వి. 2016. వేమన – సర్వజ్ఞ – తిరువళ్ళువర్‌ల రచనల్లో స్త్రీ పాత్ర విన్యాసం : ఒక తులనాత్మక అధ్యయనం. ఢిల్లీ : శ్రీవినాయక ప్రచురణలు.
3. ప్రసాద్, మొండెపు. 2013. శతకాలలో స్త్రీల పట్ల వివక్ష. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. బద్దెన (ప్రణీతం). 1930. సుమతీ శతకము. రాజమండ్రి : శ్రీసత్యనారాయణ బుక్కుడిపో.
5. వేంకట రమణయ్య, బులుసు. (సం). 1989. వేమన పద్యరత్నాకరము (4వ ముద్రణం). మద్రాసు : బాలసరస్వతీ బుక్ డిపో.
6. చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం. (సం). 2017. వేమన కవిత్వం – స్త్రీ. విజయవాడ : ప్రజాశక్తి బుక్‌హౌస్.

**కన్నడం**

7. గురురాయరు, కలమదాని. (సం). 1989. సర్వజ్ఞ వచనగళు. హుబ్బళ్ళి : లలిత ప్రకాశన.

❖❖❖

# తెలుగు పూలు - సామాజిక విలువలు

**డా.డి.నల్లన్న**
తెలుగు విభాగం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 507,
సెల్ : 9492434953, Email: dnallannarsu@gmail.com

ఆంధ్ర వాఙ్మయ ప్రక్రియల్లో శతకానికి విశిష్ట స్థానముంది. 'శతకం' పదం ఆదికవి నన్నయ ఆంధ్ర మహాభారతంలోని శకుంతలోపాఖ్యానంలోనే చోటుచేసుకుంది. అయితే ఈ ప్రక్రియకు నారు నీరు పోసిన కవులు 'శివకవులు'. వీరి కాలంలోనే ఈ ప్రక్రియను బాగా ప్రాచుర్యం లభించిందనడం అతిశయోక్తి కాదు.

పన్నెండవ శతాబ్దిలో పురుడు పోసుకున్న శతక ప్రక్రియ తరువాతి కాలంలో శక్తివంతమైన ప్రక్రియగా విరాజిల్లడానికి విశేషంగా కృషి చేసినవారు బద్దెన, యథావాక్కుల అన్నమయ్య, వేమనలు.

ఆధునిక కాలంలో ఈ ప్రక్రియ మరింత పేరు గడించడానికి కారణం కలం పట్టే ప్రతి కవి మొదట శతక ప్రక్రియతో శ్రీకారం చుట్టడమే. పద్యం పట్ల మక్కువున్న ప్రతి ఒక్కరు శతకంతోనే మొదలుపెట్టి కవిగా లోకానికి పరిచయమవుతున్న విషయం మనకందరికీ తెలిసిందే. పైగా శతకంలో విషయాలను, సంఘటనలు ముక్తకాలుగా చెప్పే అవకాశం ఉండడమే.

మానవ జీవితంలోని అనేక సంఘటనలను, సమస్యలను స్పష్టంగా, బలంగా చెప్పడానికి వీలుగల ప్రక్రియ శతకం. ఉదాహరణకు పాలపర్తి హవీలా 'మాట మన్నించలేర' అనే సామాజిక శతకంలో -

"పలు విధంబుల నొరుల తప్పులను జూపి
కఠినముగ విమర్శన సేయగాదుకాని
నరుల మానస చిత్రణమ్మెరుక పరచ
నిజము లాడితి - మాట మన్నించలేర? అంటూ

మానవ జీవితానికి శతకం ఎంత చేరువలో ఉందో స్పష్టంగా చెప్పింది. కాబట్టి మానవ జీవన చిత్రణలో శతకానిదే పెద్ద పీటే.

నేటి బాలలే రేపటి పౌరులు. అందుకే నార్ల చిరంజీవి చిన్నారులకు సాంఘిక విలువలను బోధించే దిశలో పిల్లలకు చిరంజీవి "తెలుగు పూలు" (1958) రచించి ప్రచురించారు. ఈ శతకంలోని సామాజిక విలువలను ఆవిష్కరించడమే ఈ పత్రం పరమావధి.

ఆధునిక మహిళలు చరిత్రను తిరిగి రచిస్తారు అంటారు గురజాడ అప్పారావు. అయితే కలేకూరి ప్రసాద్ -

ఆడది కన్నా అడవి మానుకె
విలువిచ్చేటి దేశంలోన
ఆరడి పెట్టిన ఆడపడచుకూ

అత్తారింట తప్పని స్థితి యిది అని స్త్రీల స్థితిగతులను గుర్తుచేశాడు. కాబట్టి స్త్రీల పట్ల ఎలా మెలగాలో నార్ల చిరంజీవి ప్రస్తావించాడు.

"చిన్నతనము నుండి స్త్రీల పట్ల మధుర

గౌరవ గుణముండి తీరవలయు అని" సెలవిచ్చాడు. సమాజంలో స్త్రీకి గౌరవమేర్పడినప్పుడే సామాజిక వికాసం కలుగుతుందన్నాడు. రాతియుగం నుండి రాకెట్ యుగం దాకా ఎదిగిన మనిషి సాటి స్త్రీల పట్ల గౌరవ భావాన్ని పెంపొందించుకోవాలన్నాడు.

మన పూర్వులు స్త్రీకి మహోన్నత స్థితిని కల్పించారు. ఔన్నత్యదృష్టితో చూచినట్లు తెలుస్తుంది. అందుకే 'మాతృదేవోభవ' అని పూజనీయస్థానం కల్పించారు. ఏ ఋణం తీరకున్న తల్లి ఋణం తీర్చుకోవడం కష్టమన్నారు. అందుకే నార్ల చిరంజీవి మాతృమూర్తిని గొప్పగా శ్లాఘించాడు.

"ఎట్టి ఋణమునైన ఎటులా తీర్తువు కాని
తల్లి ఋణము తీర్ప తరము కాదు
ఆమె ప్రేమ సతము రామరక్షయె నీకు
కలిమి కూర్చుచుండు తెలుగుబిడ్డ" అని అనడంతో ఆగిపోకుండా
"కన్నతల్లి ఘనత కలనైన మరువకు
కలుగుమేలు నీకు తెలుగుబిడ్డ" అని అన్నాడు.

మనిషి ఉన్న స్థితి నుంచి ఉన్నతస్థితికి ఎదడాలంటే 'చదువు' అవసరం అనే విషయం అందరూ అంగీకరించవలసిందే. మనిషిని తక్కిన జీవజాలం కన్న ప్రకృతి నుండి వేరు చేసి చూపించేది చదువే. అందుకే విద్యావిహీనః పశుభిః సమానః అని పెద్దల మాట. అంతేకాదు విద్య లేనివాడు వింత పశువు అనే నానుడి కూడా లోకంలో ప్రచారంలో ఉంది.

చదువు ఆవశ్యకత గురించి ఆంధ్రమహాభాగవతంలో
చదువని వాడజ్ఞుండగు
చదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువగ వలయును జనులకు
జదవించెద నార్యులొద్ద చదువుము తండ్రీ!
అంటూ హిరణ్యకశిపుడు తన కుమారుడయిన ప్రహ్లాదుడితో ప్రస్తావించాడు. ఇదే విషయాన్ని ఆధునిక కవి నార్ల చిరంజీవి.

'చదువు రాని వాని జనులు మెచ్చరు సుమ్ము
చదువు నేర్చువాని జగము మెచ్చు
దేశ కాలగతులు తెలియగా వచ్చును
తెలియు మంచి చెడ్డ తెలుగుబిడ్డ" అంటూ చదువు ఆవశ్యకతను ఆవిష్కరించాడు.

మనిషి మనుగడను క్రమబద్ధం చేసి దైవాన్ముఖం చేసేందుకే మతాలు ఏర్పడ్డాయి. అయితే దురదృష్టవశాత్తు మతం పరమార్థం మరుగున పడిపోయింది. భారతదేశంలో భిన్న మతాలు విరాజిల్లుతున్నప్పటికి హిందూ మహమ్మదీయ మతాలదే పై చేయి. వీరి మధ్య అభిప్రాయ భేదాలు, ఆధిపత్య పోరు పెరుగుతున్నది. ఈ స్థితిని గమనించిన చిరంజీవి –

హిందూవితడు ముస్లిమితడంచు భేదాలు
మోసగాండ్రు సృష్టి చేసినారు
రెక్కలమ్ము వారి దొక్కటే బ్రతుకురా
కులమతాలు లేవు తెలుగుబిడ్డ అని చిన్నారులకు సామాజిక బాధ్యతను బోధించాడు.

వర్తమాన సమాజంలో మనిషి సెల్ ఫోన్ లో కార్యక్రమాలు వీక్షిస్తూనో, పిచ్చాపాటి మాట్లాడుకుంటూనో, తీరుబడిగా నిద్రపోతూనో నిర్మాణాత్మక పనులను వాయిదా వేసేవారు కొందరయితే, ఆ కార్యక్రమాల వైపు మొగ్గు చూపనివారు కొందరుంటారు. వీరిని మనం గమనిస్తూనే ఉంటాం. ఇలా ఉండేవారు జీవితంలో దేన్ని సాధించలేరు. ఇలాంటి వారికి కాలం విలువ తెలియజేయడానికి చాలామంది ప్రయత్నించారు. ప్రయత్నిస్తున్నారు. ప్రసిద్ధ తమిళ కవి తిరువళ్ళువర్ తిరుక్కురళ్‌లో –

“పరువతోడు  ఒట్ట ఒళుగల్ తిరువినై

త్తీరామై ఆర్కుంకయిఱు” అని సెలవిచ్చాడు.

కాలం విలువను తెలుసుకుని దానికి తగినట్లు పనిచేస్తే ఆ మంచి పని గెలుపును జారనీపోకుండా చేసే తాడు అవుతుందంటాడు. కాలం విషయంలో నార్ల చిరంజీవి తెలుగు పూలులో

“కడచిపోయి నట్టి క్షణము తిరిగి రాదు

కాలమూరకెపుడు గడుపబోకు

దీపమున్న యపుడే దిద్దుకోవెల నిల్లు

విలువ తెలిసి మసలు తెలుగుబిడ్డ అని అంటే మరొక కవి

కాలమె పరమావధి, నిధి

కాలమె జీవన విధియని గమనించునదే

కాలము పెంచును చంపును

కాలమున కతీతులు యనగా లేరు నిలన్” అని అన్నాడు.

మాతృభక్తి, పితృభక్తి, గురుభక్తి, దైవభక్తి వీటితోపాటు దేశభక్తిని కూడా మనిషి అలవరచుకోవాలి. మనం పుట్టిన గడ్డను జీవితానికి కావలసిన వనరులను సమకూర్చిన నేలను ఎప్పుడూ మరవరాదు. అందుకే రామాయణంలో జననీ, జన్మభూమి స్వర్గానికన్నా గూడా గరీయమైనవని భావించడం జరిగింది. స్వాతంత్ర్యోద్యమ యోధుల నరనరాల్లోనూ జీర్ణించుకుపోయిన దేశభక్తి స్వాతంత్ర్యోద్యమ విజయానికి కారణమైంది. దేశభక్తి వల్లనే ప్రపంచంలోని ప్రతి దేశం తమ తమ ప్రత్యేకతను నిలబెట్టుకుంటూ పురోగమించడంలో పోటీపడుతున్నాయి. అయితే దురదృష్టవశాత్తు మన దేశంలో ఇటీవల స్వార్థం వెర్రితలలు వేస్తుంది. జాతి, కుల, మత, ప్రాంతీయ దురభిమానాలు వికటాట్టహాసంతో విలయతాండవం చేస్తున్నాయి. ఇలాంటి దుస్థితిని దృష్టిలో పెట్టుకొని కాబోలు మన వారు ఎప్పటికప్పుడు దేశభక్తిని ప్రబోధిస్తూ వచ్చారు. దేశం పట్ల అభిమానం పెంపొందించుకోవలసిన అవసరాన్ని గుర్తుచేశారు.

ఏ దేశమేగినా ఎందుకాలిడినా

పొగడరా నీ తల్లి భూమి భారతిని

నిలుపరా నీ జాతి నిండు గౌరవము అని రాయప్రోలు సుబ్బారావుగారు అంటే

దేశమును ప్రేమించుమన్నా

మంచియన్నది పెంచుమన్నా అంటూ

గురజాడ అప్పారావుగారు సెలవిచ్చారు. ఇదే మార్గంలోనే నార్ల చిరంజీవి

మొదట నేను భరత పుత్రుడనను కొమ్ము

పిదప తెలుగుదనము బెంచుకొమ్ము

భరత పద్మమందు పసిడి రేకవు నీవు

తేనె బొడ్డు నీది తెలుగు బిడ్డ" – అంటూ దేశభక్తిని పెంపొందించుకోవాలనే సామాజిక బాధ్యతను ప్రతి పౌరుడు కలిగి ఉన్నప్పుడే దేశం బాగుపడుతుందని తెలిపాడు. అందుకే గురజాడ దేశభక్తి గేయంలో దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయి అని అన్నాడు. మనుషులందరిలోనూ సామాజిక విలువలు పెంపొందింపబడితేనే దేశం పురోగతిలో ఉంటుంది.

**ఆధార గ్రంథాలు:**

1. ఆధునికాంధ్ర కవిత్వం: సంప్రదాయములు – ప్రయోగములు – సి. నారాయణరెడ్డి, శివాజీ ప్రెస్, గంజి బజార్, 1977.
2. నార్ల చిరంజీవి జీవితము – రచనలు :: డా. డి. నల్లన్న, జాతీయ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి
3. శ్రీమదాంధ్ర భాగవతం – పోతన బమ్మెర :: తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 1989
4. Tirukkural in Telugu - S. Jayaprakash, Translater, Central Institute of Classical Tamil, Chennai.

❖❖❖

# కూచిమంచి జగ్గకవి - భక్తమందార శతకము సామాజిక దృక్పథం

**శతావధాని ఆముదాల మురళి**

సహాయ పరిశోధకులు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు, తిరుపతి.

సెల్ నెం. 94404 32683, Email: amudalamurali1975@gmail.com

అధిక్షేప ప్రబంధమున కాద్యుడై, వాదవివాద ప్రౌఢిమతో, నిరర్గళ చాటు కవితాశక్తిచే కొనియాడబడిన విద్వత్కవి శేఖరమూర్తి కూచిమంచి జగ్గకవి. ఈయన కూచిమంచి తిమ్మకవి సోదరులు. తిమ్మభూపాలునిచే 'బేబదల్' బిరుదును పొందాడు. శతక వాఙ్మయ చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం జగ్గకవి క్రీ.శ. 1700-1765 మధ్యకాలంలోని వారు.

జానకీ పరిణయము, రాధాకృష్ణ చరిత్ర (ద్విపద), సుభద్రావివాహం, చంద్రరేఖా విలాపమను కావ్యముతోపాటు అనేక చాటువులు, శతకములు రచించారు. వారు రచించిన శతకములలో లభ్యమైనది భక్తమందార శతకము. ఇందులో అధిక్షేపాత్మక ధోరణిలో భక్తి, నీతి, సామాజిక స్థితి గతులు స్పృశింపబడ్డవి.

ఈ శతకం భక్తి, ఉపదేశాలతో ఉన్నా, అధిక్షేప వ్యంగ్య చమత్కృతులతో నిండి వున్నది. సంస్కృతంలోని సుప్రసిద్ధ నీతి శ్లోకాలను అనుసరించే పద్యాలు కూడా ఉందులో వున్నవి. అది శతకానికి మరింత శోభను కూర్చుటే కాక సంస్కృత సాహిత్యంతో పరిచయం లేని వారికి ఎంతో ఉపయుక్తంగా ఉన్నది. జగ్గకవి సామాజిక దృక్పథం మానవతావాదం. జగ్గకవి అభిప్రాయం ప్రకారం మానవునికంటే దేవుడు వేరు కాదు. భక్తి, సేవ, గర్వరాహిత్యం, సుశీలత మొదలగు జనామోదలక్షణాలు గల మానవుడు భగవంతునికంటే భిన్నమైనవాడు కాదు.

**దానంబాభరణంబు హస్తమునకున్ దత్‌జ్ఞాని కిన్నీ పద**
**ధ్యానంబాభరణంబు, భూసురునకత్యంతంబగు గంగానదీ**
**స్నానం బాభరణంబు, భూతలమునన్ నాడెంపుటిల్లాలికిన్**
**మానంబాభరణంబు తథ్యమితి రామా! భక్తమందారమా!**

కవి తన ఊహాజగత్తులో నిర్మించుకొనే సమాజం ఆదర్శప్రాయంగా ఉంటుంది. కవి ఊహకు, వాస్తవ స్థితికి సామ్యం లేనప్పుడు కవిలో అధిక్షేపం, ఆగ్రహం, వ్యంగ్యం పెల్లుబికి కవిత్వం నిండా ప్రవహిస్తాయి. 'దానేన పాణిరత్నతు కంకేన' ఇత్యాది భావంతో మొదలైన ఈ పద్యంలో వితరణ, భక్తి, నిష్ఠ, శీలముల ప్రాధాన్యతను గూర్చి చెప్పారు. సామాజిక సమతుల్యతకు వ్యక్తి సంస్కారం ఆవశ్యకం కనుక వాటిని నొక్కి చెప్పుటయేకాక పౌరులకు సామాజిక బాధ్యత ఉండాలని 'ఉదానాదిక సప్తసంతతుల బాగొప్పార నిల్పన్ వలెన్' మొదలగు పద్యంలో చెప్పారు.

అదేవిధంగా

**నిను భక్తిన్ భజియించినన్, గురువులన్నిత్యంబు సేవించినన్**
**ధనవంతుండయి గర్వరూరుడగుచున్ ధర్మంబు గావించినన్**
**జనతామోదక పద్ధతిన్మెలగినన్ జారుండు గాకుండినన్**
**మనుజుండారయ దేవుడిమ్మహిని రామా! భక్తమందారమా!**

మానవుడు దేవుడు కావాలన్నది కవి దృక్పథం. గ్రుడ్డిగా ఆరాధిస్తూ గుడిగట్టి పూజిస్తూ మామూలు

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025**

మనిషిని దేవుడు చేయడం కవి ఉద్దేశ్యం కాదు. ఫలానా వర్గం వాడు దైవంతో సమానమన్న అంధపరపర న్యాయానుసారి జగ్గకవి కాదు. భక్తి ఉండాలి, తనకంటే పెద్దవారైన తల్లిదండ్రులను, గురువులను సేవించాలి. ధనవంతుడైనా గర్వం ఉండరాదు. ధర్మాన్ని అతిక్రమించరాదు. ప్రజలు ఆమోదించిన పద్ధతిలో నడుచుకోవాలి. జార, చోరాది దుర్వృత్తులకు దూరంగా ఉండాలి. ఈ సాధనలు ఫలింపచేసుకొన్నవాడే భగవత్స్వరూపుడని జగ్గకవి అభిప్రాయపడ్డారు.

నేల నేలువాడు 'అన్యాయంలో దొఱంగి యెల్లరకు నిత్యానంద మింపొంద' జేయాలని ఆకాంక్షించాడు. అదేవిధంగా సుకవికి కాసు ఇవ్వనివాడు, దయాగుణం లేనివాడు, ఇతరులపై చాడీల చెప్పువాడు, భార్యను కాదని దాసిని పొందాలనుకొనేవాడు, ఇతరుల ధనాన్ని హరించేవాడు నరాధముడని జగ్గకవి అన్నారు. అట్లాగే వేటగాడు, గణిక, జూదరి మొదలగు వారిని విశ్వసించరాదని అన్నారు. నీచులు ఎంతటి స్థితిమంతులైనా వారి తొంటి నీచగతి మార్చుచోకారని అన్నారు.

**ఎన్నంగార్దభ ముత్తమాశ్వమగునే? హీనుండు దాతృత్వ సం**
**పన్నుండౌనె! ఖలుండు పుణ్యడగునే? పల్గాకి సాధనె, క**
**ల్జున్నైనే, మహిషంబు హస్తియగునే, జోరీగడేఁటౌనెటుల్**
**మన్నుంబిల్లి మృగేంద్రమౌనే భువి రామా! భక్తమందారమా!**

గాడిద గుఱ్ఱంకాదు, హీనుడు దాత గాడు, దుర్మార్గుడు పుణ్యాత్ముడు కాడు, మూర్ఖుడు సాధువు కాడు, కల్లు తేనె కాదు, దున్న ఏనుగు కాదు, జోరీగ తేనెటీగ కాదు, పిల్లి సింహం కాదు ఇన్ని ఉదాహరణలు చెప్పడానికి కారణం స్వాభావికమైన లక్షణాలు పోవని పేర్కొనడమే.

'మద్యంబానెడు వానికేల సుధ' అంటూ మధుపానం చేసేవాళ్ళను జగ్గకవి ఈసడించు కొన్నారు. లోభికి మీసమెందుకు గ్రుడ్డివానికి అర్థమెందుకని లోభత్వాన్ని ఎద్దేవా చేశారు. అంతేకాక ధనంకోసం కొందరు కవులు అనర్హులను పొగిడి భంగపడుతున్నారని అంటూ

**కుజమన్ ధర్మతనూజుడంచు నతిమూర్ఖున్ భోజరాజంచు ఘో**
**రజరాభార కురూపకారిని రమారామాకుమారుండ టం**
**చుజడత్వంబున వేడి కాకవులు కాసుంగాన రెన్నంగ సా**
**మజ రాజోగ్ర విపద్దశాపహర రామా! భక్తమందారమా!**- ఈ పద్యంలో పేర్కొన్నారు.

మానవునికి శమదమాది గుణాలుండాలి, జ్ఞానవంతుడు కావాలి. తాను తెలుసుకొన్నదానిని ఆచరించి, ప్రచారం చేయాలి. ఒడలు మర్చిపోయేంత ధనాకాంక్షతో ధర్మాన్ని విస్మరించరాదు. ఈ సంస్కారాలను సమాజం నిండా ఆకాంక్షించిన మేటి కూచిమంచి జగ్గకవి. అంతేకాక లోభులు కూడ బెట్టిన ధనాన్ని బందిపోటులో, దారలో, దాసదాసీజనులో, కూటెనకత్తెలో తీసుకొంటారని అందుకే 'విత్తం బొత్తుగ గూర్చి మానవుడు దుర్వృత్తింబ్రవర్తించకుండా' ఉండాలన్నారు. ఎందుకంటే ధనం శాశ్వతం కాదు,

**సిరులెంతేనియు నిక్కువంబనుచు దుశ్శీలన్ మదిన్ నమ్మి ని**
**ర్భర గర్వంబున మీదు చూతురహహా! భావమ్ముతో నెంచినం**
**గరి కర్ణాంతములంబుబుద్బుదతతుల్ ఖద్యోతకీటప్రభల్**
**మరుదగ్రార్పిత దీపమాలికలు రామా! భక్త మందారమా!**

– సంపదలు ఏనుగు చెవులవలే ఆడుతుంటాయి. నీటిలో బుడగలవంటివి, మిణుగురుల కాంతి వంటివి. కావున ధనప్రాధాన్యతతాకాక గుణప్రాధాన్యతతో వ్యవహరించాలి.

కావులు ఆత్మవిశ్వాసంతో ప్రవర్తించాలని జగ్గకవి ఉపదేశం. రాజు గౌరవంగా పిలిచి హేమాంబరాందోళికాకటకప్రాకట భూషణాదులిడి ప్రార్థిస్తే కావ్య కన్యను అంకితం ఇవ్వాలనికాని బలవంతంగా అంటగట్టరాదన్నారు. అదే సమయంలో రాజులు కూడా 'తనకుం పద్యములల్ల సత్కవులు నిత్యంబుంబ్రసంగింపగా విని యెత్తుల్ దిను దాసరింబలె బయల్వీక్షించుచుం గానియైన నొసంగన్ మదిలో దలంపని మదాంధక్షోణి పాలుండిలన్ మను మార్గంబు గ్రహింపలేదని' అన్నారు. అంతేకాదు ఇస్తానన్న తర్వాత

**గడియల్ రెండికసైచిరా, వెనుకరా, కాసంత సేపుండిరా**
**విడిదింటం గడె సేదదీర్చుకొనిరా, వేగంబె భోంచేసిరా**
**యెడపొద్దప్పుడు రమ్మటంచు సుకవిన్ హీనప్రభుండీగతిన్**
**మడతల్వాల్కుచుద్రిప్పుగాసిడక రామా! భక్తమందారమా!**

– ఇలా వాయిదాలు వేయరాదని, అలా చేయువాడు హీన ప్రభువని తెల్చి చెప్పారు.

రాజులు ధర్మాత్ములై ఉండాలి. ప్రజలను పీడించరాదు. వారి సంపదలను దోచుకొనరాదు. ప్రజల కష్టాన్ని గుర్తించి న్యాయమైన పన్ను తీసుకోవాలి కాని

**అతికష్టం బొనరించి భూమి జుడత్యాసక్తి విత్తంబు వి**
**స్తృత భంగింగడియింపగా నెతిగి ధాత్రీకాంతులుద్దండ ప**
**ద్ధతి వానింగొనపోయి కొట్టి మిగులందండించి యాసొమ్ము స**
**మ్మతి గైకొంద్రు మరెంత నిర్ణయులౌన రామా! భక్తమందారమా!**

నిర్దయులై దండించి తీసుకొనరాదని అన్నారు.

రాజులు ఉద్ధరింపబడగాలంటే వారికి ఉండాల్సిన లక్షణాలను గురించి జగ్గకవి ఒక పద్యంలో ఇలా అంటున్నారు.

**దానం బిల్ల, దయారసంబునహి, సద్ధర్మంబు తీర్, మీ పద**
**ధ్యానంబున్ గదులొచ్చు, సత్యవచన వ్యాపారముల్ సున్న, సు**
**జ్ఞానం బెంతయు నాస్తి, సాధుజన సన్మానేచ్ఛ లేదెన్న నీ**
**క్ష్మా నాథాధమకోటికేదిగతి** – అన్నారు.

దాన, దయా, ధర్మ, భగవద్ధ్యాన, సత్య, సుజ్ఞాన, సాధుజన సన్మానేచ్ఛ రాజులకుండవలసిన గుణాలుగా పేర్కొన్నారు.

**శరీరం శాశ్వతంకాదు. కావున దుర్మార్గప్రవర్తన వీడాలంటూ**
**తనువుల్ నిక్కములంచు నెంచుకొని యత్యంత దుర్మార్గ వ**
**ర్తనులై నిర్దయమీర భూమి ప్రజలం దండించి విత్తంబులా**
**ర్జనముల్సేయుచు గొందులందొదిగి నిచ్చల్గానరాకుంద్రు ఛీ**

**మనుజాధీశులకేటి ధర్మములు రామా? భక్తమందారమా!**

అన్న పద్యం ద్వారా తెలియజేశారు.

రాజులు, ప్రజలు అధికారపరంగా వేర్వేరు కావచ్చు, కాని సత్ప్రవర్తన, సామాజిక బాధ్యత ఇద్దరికీ సమానమే. జగ్గకవి ప్రజలకు మార్గనిర్దేశనం చేసి ఆగిపోకుండా, పాలకుల ఆలోచనలకనుగుణంగా ప్రజలు నడుచుకుంటారు కనుక పాలకుల ఆలోచనా విధానంలో రావాల్సిన మార్పును గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. సార్వకాలికమైన సామాజిక దృక్పథం కలిగిన జగ్గకవి సూచనలు నేటికీ ఆరాధనీయమైనవి. శతక కవులందరికీ జాతి ఋణపడి ఉంటుంది.

ఆధార గ్రంథాలు:

1నారాయణరెడ్డి, సి. 1977. ఆధునికాంధ్ర కవిత్వం: సంప్రదాయములు –ప్రయోగములు. గంజి బజార్: శివాజీ ప్రెస్.

2.భర్తృహరి, 1990. సుభాషిత త్రిశతి. విజయవాడ: జి. వి. హెచ్. పబ్లికేషన్స్.

3.గోపాలకృష్ణారావు, కె. 1976. ఆంధ్ర శతక సాహిత్య వికాసము. హైదరాబాద్: ప్రతిభా ఆర్ట్స్ ప్రింటర్స్.

4.వీరస్వామి, పల్లేరు. 2005. తెలంగాణా శతక సాహిత్యం. వరంగల్లు: అశోక్ కృష్ణ ఆఫ్ సెట్ ప్రింటర్స్.

5.వేంకటకృష్ణశర్మ, వేదము. 1954. శతకవాఙ్మయ సర్వస్వము. మద్రాసు: వేదము వేంకటరాయశాస్త్రి బ్రదర్స్.

❖❖❖

# వేమన ప్రజాస్వామిక దృక్పథం

**డా.ఎన్.రజని**

అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం,

చరవాణి: 9010501030, Email: rajnellutla@gmail.com

వేమన 15వ శతాబ్దికి చెందినా, 17వ శతాబ్దికి చెందినా, వేమన కాలం గురించి భిన్నాభిప్రాయాలున్నా ఒక రకంగా వేమన తన జీవితకాలంలోని సమాజాన్ని తన శతకాల ద్వారా మనకు పరిచయం చేసారు. దానిలో భిన్నాభిప్రాయాల సంగతి అటుంచితే 15వ శతాబ్ది ప్రథమ భాగంలో జీవించాడని కొండవీటి రెడ్డిరాజుల కాలమని, 17వ శతాబ్దికి చెందిన వాడని అభిప్రాయాలలో తేడాలున్నా అది వేమన శతకాల విశ్లేషణకు ఆటంకం కాక పోవచ్చు. పైగా వేమన రచనల్లోని భావనలు ఎక్కువగా ప్రజాస్వామికమైనవే ఉండడం వల్ల ప్రజాస్వామిక వాదిగా వేమన ఎట్లా తన శతకాల ద్వారా మనకు నిరూపించాడో కొంత విశ్లేషణ చేద్దాం.

అయితే ఏ కవినైనా, సాహిత్యకారునైనా గుర్తించడానికి వారు జీవించిన కాలం, ఆనాటి సాంఘిక పరిస్థితులు ముఖ్యపాత్ర వహిస్తాయి. వేమన కాలంగా మనం అనుకుంటున్న 17వ శతాబ్దపు కాలపు చారిత్రక ఆధారాలను ఆకరం చేసుకుని ఆనాటి సంఘాన్ని, సంఘజీవితాన్ని అంచనా కట్టే ప్రయత్నం చేద్దాం.

వేమన కాలంలో వ్యవహారంలో ఉన్న కులాలు, జాతుల ప్రస్తావన వారి శతకాలలో బలంగా కనిపిస్తుంది. అయితే అంతగా కులవ్యవస్థ, వర్ణవ్యవస్థ మధ్య జీవిస్తూ కూడా తన కాలానికి ముందుగా నడిచిన వేమనను గుర్తించాలి. వేమన తన గేయాల్లో కులవ్యవస్థ నిరర్థకమైనదని, దాన్ని సమర్థించడం నిష్ప్రయోజనమని కూడా చెప్పడం ఒక ముందు కాలపు చూపుకు, అభ్యుదయానికి నాందిగా మనం భావించాలి.

"కులము కన్న మిగుల కలిమి ప్రధానంబు" అంటాడు వేమన అంతేకాదు ఇంకా ముందు చూపుతో అస్పృశ్యతా జాడ్యాన్ని ఇట్లా విమర్శిస్తారు.

"ముట్టు ముట్టనుచును ముట్ట రాదందురు
ముట్టుకు దరి యేమి! మూలమేమి?
నవబిలముల మురికి నరుల కందరకును"

అంటూ ఒక మనిషి, ఒక జాతి అంటరానిది ఎట్లా అవుతుంది, ప్రతి మనిషి ముందు తనలో ఉన్న మురికిని తొలగించుకోవాలి కాని ఒక జాతిని మురికి అని ఎట్లా అంటారు? అంటూ ప్రశ్నిస్తాడు. ప్రజలంతా ఒకటే అన్న విషయాన్ని చాలా సందర్భాల్లో చెప్తారు వేమన.

"టీక రాసినట్లేను కుల పెద్దలు
లోకమందు చెప్పి రేకమంచు
కాకులట్టి జనులు కానరీ మర్మంబు" అంటాడు.

ముఖ్యంగా వేమనలోని ప్రజాస్వామిక దృక్పథం అని చెప్పుకునేప్పుడు అతని సమదృష్టిని హేతువాదాన్ని ప్రజలందరూ సమానమే అని, కష్టపడే వాడికి, శ్రమకు విలువ ఇవ్వాలని శతకాలలో చాలా స్పష్టంగా చెప్పారు వేమన. వాటిల్లో కొన్నింటిని మనం ఇక్కడ ప్రస్తావించుకుందాం. ఎన్.గోపి గారి పరిశీలన ప్రకారం వీరి శతకాల్లో ఉన్న అంశాలు కులవర్ణ విభేద నిర్మూలన, మూఢనమ్మకాల, మిథ్యాడంబరాల ప్రతిఘటన, విగ్రహారాధనా వ్యతిరేకత, భౌతికతా ప్రాధాన్యత, రాజుల పట్ల నిరసన.

**కుల విభేద నిర్మూలన:**

“మాల మాలగాడు
మహిమీద నే ప్రొద్దు నెచ్చోట
మాట తిరుగువాడు మాలగాక
వాని మాల యన్నవాడె పో పెనుమాల” అంటూ కులం వల్ల అంటరానితనం రాదు. మాట మీద నిలబడనివాడు మాల అంటూ ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తాడు.

“జాతులను మిగుల జాతి
యెరుక లేక తిరుగనేమి ఫలమో?
యెరుక కలుగు వాడె హెచ్చైన కులజుండు”

అంటూ జ్ఞానమున్నవాడే అందరికన్నా ఎక్కువ కులం వాడు అంటూ జ్ఞానానికి ప్రాధాన్యతను ఇస్తాడు.

పేదవాళ్ళ పట్ల ఉన్న సానుభూతి, సహానుభూతి ఈ శ్లోకంలో కనిపిస్తుంది. “పేదవాని బాధ పెనుభూతమై యుండు చూడనట్టి బాధ చూడరాదు” అంటూ ఆవేదన చెందుతాడు.

“ఆకలన్న వారి కన్నంబు పెట్టితే
హరున కర్పితముగ నారగింపు
ధన హీనున కిదు దానము లిటువలె
విశ్వదాభిరామ వినురవేమ”

ఆకలితో ఉన్నవారి పట్ల ప్రేమ, దయ కలిగి ఉండడం అవసరమనే భావనను చాలా “స్పష్టంగా చెప్పాడు.

ధర్మమివ్వగానని వారును
కలిగి తినక చాల గ్రాగువారు

కలిమి నెచట జూడ గానక చెడుదురు” అంటూ పరులకు సహాయం చేయని మనుషులను నిందిస్తాడు.

ఇక మతాల గురించి కూడా

“చదువు చదువనేల?
సన్యాసి గానేల?
షణ్మతముల చిక్కి చావనేల”

వేద వేదాంగాలన్నిటినీ చదివి వైష్ణవ, శైవ మత గందరగోళాల్లో చిక్కుకునే కంటే మనసులో ధ్యానిస్తే అంతకుమించినదేముంది? అంటూ సర్వ మత సారాన్ని బోధిస్తాడు.

“నొసలు బత్తుడయ్యె నోరు తోడేలయ్యె
మనసు భూతము వలె మలయగాను
శివుని గనియెనన్న సిగ్గెట్ల లేదొకో?”

అంటూ దొంగ శివభక్తులను నిరసిస్తాడు. నుదుటి మీది విభూతితోనే సరిపోదు. నిజమైన భక్తుడు ఎట్లా చిత్తశుద్ధితో ఉండాలో స్పష్టం చేస్తాడు. శైవాన్నే కాదు, వైష్ణవాన్ని విమర్శించడానికి కూడా వెనుకాడడు. ఏ భక్తైనా చిత్తశుద్ధి లేని భక్తి ఎందుకనే మౌలికమైన ప్రశ్నను సంధిస్తాడు వేమన.

“పట్టుచీరగట్టి పట్టె తిరుమణి పెట్టి
సృష్టి వైష్ణవంబు శిఖలు మించె
చెన్నులెన్నో చేసి చెరచె వైష్ణవమిట్లు”

అంటూ పైకి ఆడంబరమైన వేషధారణతో భక్తిని చాటడం కాదు. మనసులోని భక్తి ముఖ్యం అంటాడు.

"ఎన్నిమతములైన నే మంత్రమైనను

సత్యమింత లేక జాడ విడదు

సత్యము గలిగున్న జగతిలో ద్విజుడయ్యె"

అన్ని మతాల్లోకి నిజమనే మతమే గొప్పది నిజం మాట్లాడడం అనేది ప్రతి మనిషి చేయవలసినది అని చాలా స్పష్టంగా ప్రకటిస్తాడు.

"శైవ వైష్ణవాది షణ్మతంబుల కెల్ల

దేవుడొక్కడనుచు తెలియలేరు

తమకు భేదమయిన తత్వంబు భేదమా" అంటూ అన్ని మతాలు, అన్ని మతాల సారాలు, దేవుడు ఒక్కడే అనే సార్వజనీన భావాన్ని ప్రతిపాదిస్తాడు.

సర్వమత సమైక్యతను బోధిస్తూ :

"చూపు వెలుగజేసి సూక్ష్మంబు లోపల

చిత్తమందు మోద మతము విడక

తుదను నెవ్వరి మతము దూషింపక పదిలుడై

మనము జయించువాడు ముఖ్యుడు వేమా"

అంటూ ఒక కొత్త వెలుగును అందిస్తూ అందరి మతాలను తనలో కలుపుకుంటూ ఇతరులను, ఇతరుల మతాలను దూషించని వాడె తన మనసును తాను గెలుచుకుంటాడు అంటూ సర్వమత సమైక్యతను చాటుతాడు.

"భూమిలోను పట్టు భూసారమెల్లను

తనువులోను పట్టు తత్వమెల్ల

శ్రమములోన బట్టు సర్వంబు తానౌను"

శ్రమనుంచే సమస్త సంపదలు పుడతాయనే సత్యాన్ని గ్రహించిన వేమన రైతులను, వ్యవసాయాన్ని చాలా గౌరవించారు. శ్రమించిన వాడికై సరైన ఫలితం రావాలని కూడా కోరుకున్నారు.

"అన్నమధికమైన నదియు దా జంపు

నాయన్న మంటకున్న నాత్మ నొచ్చు"

అంటూ ప్రాణాధారమైన అన్నం అందరికీ దక్కాలనే సత్యాన్ని నొక్కి చెప్పాడు.

"కుండ కుంభమండ్రు కొండ పర్వతమండ్రు

ఉప్పు లవణమండ్రు యొకటి గాదె

భాషలింతె వేరు పరతత్వ మొక్కటే"

అంటూ అన్ని భాషా భేదాలున్నా మానవులంతా ఒక్కటే అన్ని సర్వమానవ సమానత్వాన్ని నొక్కి చెప్తాడు. అంతే కాదు ఆయన తన జీవితంలో కూడా కులమత భేదాల కతీతంగా స్నేహం చేసాడని పరిశోధకులు పేర్కొన్నారు.

"భూమి నాది యన్న భూమి పక్కున నవ్వు

దానహీను చూచి ధనము నవ్వు

కదనభీతు చూచి కాలుండు నవ్వును"

అంటూ భూమి నాది అని విర్రవీగే భూస్వాములకి సంపదను దోచుకునే వారిని అహంకారంతో విర్రవీగే ధనవంతులను ఎందుకూ పనికి రాని పోరాడే శక్తి లేని పిరికి వారని విమర్శిస్తాడు.

"వెలయ భూమి తల్లి విత్తనమటు తండ్రి
పంటలరయ సుతులు పాడి పరము
ధర్మము తన పాలి దైవము సిద్ధము"

తల్లీతండ్రి సుతులతో భూమిని, పంటను పోలుస్తాడు. భూమి తల్లిగా, విత్తనం తండ్రిగా వచ్చిన పంటను కుమారులుగా పోలుస్తూ ఆ ధర్మాన్ని పాటించమంటాడు. అంటే భూమిని చాలా గొప్పదిగా తల్లిగా భావిస్తాడు. భావించడమే కాదు అట్లాంటి నేలమీద పుట్టి పెరిగి ఈ భూమిని నమ్ముకొని జీవించే రైతు ఆ భూమిని ఇతరులకు ఇవ్వలేదు అంటూ రైతుల పట్ల ఆవేదన చెందుతాడు.

నైతిక విలువలు చాలా మనకు వేమన శతకాల్లో కనిపిస్తాయి. రాజులపై, దొరలపై విమర్శ కూడా గట్టిగానే ఉంటుంది.

"ఎరుకలేని దొరల ఎన్నాళ్ళు గొలిచిన
బతుకు లేదు వొట్టి భ్రాంతి గాని
గొడ్డుటావు పాలు గోరితే చేపునా"

అంటూ ఎంత కష్టపడ్డా గుర్తించని యజమాని దగ్గర పని చేయడం దండగ నిష్ప్రయోజనం అంటాడు. యజమానికి కూలీకి ఉన్న తారతమ్యాన్ని సామ్యవాద దృష్టితో చూస్తాడు. ఎప్పుడూ తాను పేదల పక్షం వహించే మాట్లాడుతాడు వేమన. తాము గొప్పవాళ్ళం తమ జాతి గొప్పది తమ మతం గొప్పది తమ కులం గొప్పది అని అహంకారంతో మాట్లాడే మనుషులను మానవ స్వభావాలను ఉన్నదున్నట్టుగా విమర్శిస్తాడు.

గ్రామ వ్యవస్థలో దొరలను, దొరల పెత్తందారీతనాన్నీ విమర్శిస్తాడు. అంతేకాదు కొన్ని సందర్భాల్లో బ్రాహ్మణత్వంలో ఉన్న మూఢత్వాన్ని కూడా నిరసిస్తాడు.

"విప్రులెల్ల కూడి వెర్రికథలు కూసి
సతిని పతిని గూర్చ సమ్మతముగా
మును ముహూర్తముంచ ముండెట్లు మోసెరా"

అంటూ అంతగా ముహూర్తం చూసి చేసే పెండ్లిండ్లలో మరి భర్తలు చనిపోయి వితంతువులు ఎందుకు అవుతున్నారు అని ప్రశ్నిస్తాడు. అంటే మూఢత్వంలో నిండిన ఆచారాలను కూడా ప్రశ్నించడానికి వెనుకాడడు.

"శిలను ప్రతిమ చేసి చీకటింటను బెట్టి
మ్రొక్కవద్దు వెర్రి మూఢులార
జీవులందె గాని శిలలందు లేడయా"

అంటూ విగ్రహాలను ఆరాధించడాన్ని కూడా వ్యతిరేకిస్తాడు. రాళ్ళు తెచ్చి నరులు రమ్యమౌ గుడికట్టి రాతి ప్రతిమ జేసి ఖ్యాతిగాను రాతి ప్రతిమలను చేసి అందులో దేవుడున్నాడను కోవడం మూర్ఖత్వం అంటాడు. హిందువులు కాశికి వెళ్ళడాన్ని, ముస్లింలు మక్కాకు వెళ్ళడాన్ని కూడా తన శతకాల్లో విమర్శిస్తాడు. ఇట్లా వేమన శతకాల్లో ప్రజాస్వామిక భావాలను ఇంకెంతగానైనా వెతికి పట్టవచ్చు. అందుకే వేమనను మళ్ళీ మళ్ళీ చదవాలి. వేమనలోని తత్వాన్ని సారాన్ని మరింతగా శోధించాలి.

"తప్పులెన్నువారు తండోపతండముల్
ఊరి నరులకెల్ల నుండు తప్పు
తప్పులెంచువారు తమ తప్పులెంచరో"

అని ప్రతి ఒక్కరు విమర్శ చేయడమే కాదు తనను తాను ఆత్మవిమర్శ చేసుకోవాలని, ఆత్మ విమర్శ చేసుకున్న మనిషే నిజమైన మానవుడనే సందేశాన్ని వేమన మనకు అందిస్తాడు.

వేమనను చదువుతుంటే దాదాపుగా మతం గురించి, విగ్రహారాధన గురించి చెప్పిన సందర్భమల్లా గురజాడ అప్పారావు గారు స్ఫురిస్తారు.

"మతములన్నియు మాసినపోవును
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును"

అని చెప్పిన గురజాడ మాటలను అంతకంటే 3 శతాబ్దాలకు ముందే అంతటి ముందు చూపుతో జ్ఞానాన్ని, మతాన్ని గురించిన వేమన చెప్పిన అభిప్రాయాలతో సమన్వయం చేసి చూడాలి అంటే ప్రతి కాలంలో, ప్రతి శతాబ్దంలో ఒక్కొక్క యుగకర్త లాగా, ఒక్కొక్క ప్రజాస్వామ్య వాదిలాగా పుట్టుకొచ్చే కవులుంటారని వేమన వారుసుడిగానే గురజాడను అట్లాగే తర్వాతి ప్రజాస్వామిక కవులందరిని గుర్తించాలి. అందుకే అంత ముందుచూపు కలిగిన భావనలు, ప్రతిపాదనలు వేమన శతకాల్లో ఉన్నాయి. కనుకనే వేమనను ప్రజాస్వామిక వాదిగా, ప్రజాస్వామిక కవిగా గుర్తించాలి. మళ్ళీ మళ్ళీ వేమన శతకాల్ని, ఈ కాలపు యువతరం పరిశీలించి, పరిశోధించాల్సిన అవసరం ఉందని గుర్తిస్తూ, మళ్ళీ వేమనను పునర్మూల్యాంకనం చేయాలని విద్యార్థులకు సూచిస్తున్నాను. కొత్తగా వేమనను మళ్ళీ మీ ముందు పరిచయం చేసే అవకాశం కలిగించిన ఈ సదస్సు నిర్వాహకులకు కృతజ్ఞతలు చెప్తూ ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

**ఆధార గ్రంథాలు:**

1. నారాయణరెడ్డి, సి. 1977. ఆధునికాంధ్ర కవిత్వం: సంప్రదాయములు
2. ప్రయోగములు. గంజి బజార్: శివాజీ ప్రెస్.
3. భర్తృహరి, 1990. సుభాషిత త్రిశతి. విజయవాడ: జి. వి. హెచ్. పబ్లికేషన్స్.
4. గోపాలకృష్ణారావు, కె. 1976. ఆంధ్ర శతక సాహిత్య వికాసము. హైదరాబాద్: ప్రతిభా ఆర్ట్స్ ప్రింటర్స్.
5. వీరస్వామి, పల్లేరు. 2005. తెలంగాణా శతక సాహిత్యం. వరంగల్లు: అశోక్ కృష్ణ ఆఫ్ సెట్ ప్రింటర్స్.
6. వేంకటకృష్ణశర్మ, వేదము. 1954. శతకవ్మాయ సర్వస్వము. మద్రాసు: వేదము వేంకటరాయశాస్త్రి బ్రదర్స్.

❖❖❖

# యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకం - తాత్విక వివేచన

**డా॥పి.విజయకుమార్**
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్.
ఫోన్ నెం: 9063702546, Email: vijayakumar@uohyd.ac.in

"ఆంధ్రవాఙ్మయమున శాఖోపశాఖలుగా వికాసమొందిన కావ్య ప్రక్రియలలో శతకమొకటి. ప్రాకృత సంస్కృత ప్రక్రియలననుసరించియే తెలుగుక్రమమున విశిష్ట సాహితీ ప్రక్రియగా రూపొందినది. తెలుగులో పన్నెండో శతాబ్దంలో శతకము ఆవిర్భవించినది. ఈ ఎనిమిది వందల యేండ్లలో తెలుగు శతకం శాఖోపశాఖలుగా విస్తరిల్లి స్వరూపంలోనూ స్వభావంలో ఎంతో మార్పునొందినది. భారతీయభాషలలో ఎందులోనూ శతక ప్రక్రియ తెలుగులో వలె బహుముఖ వికాసముపొంది వైశిష్ట్యమునొందలేదు. నేటికీ ఏ మూలనో ఒకచోట శతకం వెలువడుతూనే ఉన్నది. సజీవప్రవంతివలె అవిచ్ఛిన్నంగా సాగుతూ వస్తున్నది శతకమే" అని కె. గోపాల కృష్ణారావు గారు పేర్కొన్నారు.

శతకసాహిత్యంలో యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకానికి ఎంతో ప్రాచుర్యం ఉంది. యథావాక్కుల అన్నమయ్య శివభక్తుడైన కవి. శివభక్తిపారమ్యాన్ని ప్రబోధించిన శతకం సర్వేశ్వర శతకం. భక్తియోగమే ముక్తికి సోపానమన్న సత్యాన్ని ఆవిష్కరించింది సర్వేశ్వర శతకం. ధార్మికజీవనం కొనసాగించటం ఉత్తమమైన జీవనవిధానం. యథావాక్కుల అన్నమయ్య ఈ రచనను ఒకచోట 'స్తుతి' అని మరొకచోట 'స్తవం' అని పేర్కొన్నాడు. కానీ ఎక్కడా 'శతకం' అని పేర్కొనలేదు. ఈ రచనలో ఉన్న మొత్తం పద్యాల సంఖ్య 142. అయినా ఈ రచన మొదటి నుండి శతకంగానే పేరు పొందింది. సహజంగా శతకాలలో ఒక క్షేత్రంలో ఉన్న దేవున్ని గురించిన స్తుతి కనిపిస్తుంది. కాని ఈ శతకంలో ఒక క్షేత్రంలోని దేవుడని ఇదమిత్థంగా కన్పించదు. కొందరు సర్వేశ్వరుడంటే శ్రీశైల మల్లికార్జునుడు అని పేర్కొంటారు. అయితే ఒక్క 28వ పద్యంలోనే శ్రీగిరి ప్రస్తావన కన్పిస్తుంది.

**ధరణిం బ్రాక్తన భక్త నిర్మిత మహాస్థానంబులై యొప్పు శ్రీ**
**గిరి ముఖ్యంబగు దివ్య తీర్థములు భక్తిం జూచిరే వారిదు**
**స్తర దోషంబులు వాయునన్న మతి సాక్షాద్భక్తులం జూచి నం**
**బర మార్థంబగ బాయదే నరుల పాపంబెల్ల సర్వేశ్వరా !**

ఈ పద్యంలో శ్రీ'గిరి' అంటే శ్రీశైలం. శ్రీశైలాది దివ్యక్షేత్రాలలో దేవాలయాలన్నీ భక్తులచే నిర్మితమైనవే కదా అనే కోణంలో ప్రస్తావించడం జరిగింది. భక్తులు నిర్మించిన దేవాలయాలను, తీర్థాలను భక్తితో చూస్తే పాపాలన్నీ తొలగిపోతాయన్నప్పుడు ఆ భక్తులని భక్తితో చూస్తే పోవా! అని ప్రశ్నిస్తాడు. పోతాయనే భావనతోనే ఈ పద్యసుమాన్ని అర్పించడం జరిగింది. కాబట్టి ఈ శతకం మొత్తం శ్రీశైల మల్లికార్జున స్తుతి అని చెప్పలేము.

కాబట్టి ఈ శతకనామం 'సర్వేశరా' అంటే ఏదో ఒక క్షేత్రంలోని ఈశ్వరుడికి పరిమితమైనది అనే అర్థంలో వాడబడలేదు. సమస్తానికి ఈశ్వరుడు అనే కోణంలోనే విస్తృతార్థంలోనే ఈశ్వరతత్త్వాన్ని, శివభక్తిని ఉద్బోధించారు. మొత్తం 142 పద్యాలలో 138 పద్యాలు శివభక్తి తత్పరతను తెలియచేసి కేవలం నాలుగు పద్యాలలో తన ఊరు, కాలం, గురువు, తన రచనలోని లక్షణాలను తెలియచేశారు. ఈశ్వరుని మీద అసదృశ ప్రేమ ఈ శతకంలోని పద్యాలలో స్పష్టమవుతుంది. భాగవతంలో నవవిధ భక్తిమార్గాలు చెప్పబడ్డాయి. 1. శ్రవణం 2. కీర్తనం 3. స్మరణం 4. పాదసేవనం 5. అర్చనం 6. వందనం 7. దాస్యం 8. సఖ్యం 9. ఆత్మనివేదనం. ఈ నవవిధ భక్తి మార్గాలను శ్రౌతశైవ ఆచారవ్యవహార పద్ధతుల దన్నుగా అనేక పద్యాలలో స్పష్టం చేశారు. నారద భక్తి సూత్రాలు.

'తస్మిన్ తజ్జనే భేదాభావాత్" అని భగవంతునికి, భక్తునికి అభేదం చెప్పబడితే యధావాక్కుల అన్నమయ్య ఈశ్వరుని కంటె ఈశ్వరుని భక్తుని ఉన్నతస్థానంలో నిలపడం జరిగింది.

**"శ్రీ కంఠుంబరమేశు నవ్యయు నిజ శ్రీపాద దివ్యప్రభా**
**నీకోత్సారిత దేవతానిటల దుర్నీత్యక్షర ధ్వాంతు జి**
**త్ప్రాకామ్యాంగు నపాంగ మాత్ర రచిత బ్రహ్మాండ సంఘా తుఁజం**
**ద్రాకల్పుం బ్రణుతింతు నిన్ను మది నాహ్లాదింతు సర్వేశ్వరా !**

సర్వేశ్వర శతకం శార్ధూలవృత్తంతో పై పద్యంతో ప్రారంభమయ్యింది. శ్రీకారంతో ప్రారంభించడం శుభప్రదం. లోకోపకారం కోసం విషాన్ని కంఠంలో దాచుకున్న నిన్ను, ఏ కాలంలోనైనా ఎటువంటి నాశనం లేని ఈశ్వరుణ్ణి, దేవతాసమూహాల దుష్టమైన నీతి అనే అంధకారాన్ని తొలగించిన ఈశ్వరుణ్ణి, చిత్ శక్తి అనే అష్టైశ్వర్యాలలో ఒకదాన్ని శరీరంగా గల ఈశ్వరుణ్ణి, కడకంటి చూపు మాత్రం చేతనే బ్రహ్మాండ సమూహాన్ని సృష్టించిన ఈశ్వరుణ్ణి, చంద్రశేఖరుడైన ఈశ్వరుణికి నమస్కరిస్తున్నానని తొలి పద్యంలో సర్వేశ్వరస్తుతి ప్రారంభించాడు అన్నమయ్య. సమస్త ప్రాణులకు ఈశ్వరుడు శివుడు. అంటే సమస్తానికి ఈశ్వరుడు ఆయనేగాని అతనికి వేరే ఈశ్వరుడు లేడని అర్థం. మూర్తిత్రయానికి ఈశ్వరుడే కారణం. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కదా సర్వానికి కారణం. వారికి కూడా కారణం ఈశ్వరుడు అన్నప్పుడు సర్వేశ్వర నామం అన్వర్థనామం అవుతుంది.

మహాభారతంలోని అనుశాసనిక పర్వంలో పైభావాన్ని సమర్థిస్తూ

**"స ఏష భగవానీశః – సర్వతత్త్వాది రవ్యయః**
**సర్వతత్త్వ విధానజ్ఞః – ప్రధాన పురుషేశ్వరః"**

సర్వతత్త్వాలకు మొదటివాడు ఈశ్వరుడిగా కీర్తించడం జరిగింది.

**"సోసృజ ద్దక్షిణాదంగాత్ – బ్రహ్మాణంలోక సంభవం**
**వామ పార్శ్వాత్తతో విష్ణుం – లోకరక్షార్థమీశ్వర**
**యుగాంతే చైవ సంప్రాప్తే – రుద్రం ప్రభురథాసృజత్ "**

సర్వేశ్వరుని కుడి అంగం నుండి లోకోత్పత్తి కారకుడైన బ్రహ్మను, ఎడమవైపు నుండి లోకరక్షణార్థం విష్ణువును లోకసంహారార్థం తన నుంచి రుద్రుని సృజించాడు. త్రిమూర్తులు ఈశ్వరుణ్ణించే పుట్టి జగత్కార్యాన్ని చేస్తుండటం, ఈశ్వరాధీనులు కావడం, పరమేశ్వరునికి సర్వేశ్వరతత్త్వాన్ని బోధిస్తున్నాయి. వేదాలు ఒకసారి ఈ సమస్త జగత్తంతా నీవే అంటాయి. ఇంకొకసారి నీవు కావంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నీ నిజమైన రూపాన్ని ఎవరు నిర్దిష్టంగా చెప్పగలుగుతారు అని యధావాక్కుల అన్నమయ్య ప్రశ్నిస్తున్నాడు. సర్వేశ్వరా నీ మహిమను విజ్ఞానంతో వివేచించి తెలుసుకోవడం. అసాధ్యమే అయినా, తమ శక్తికొలది నిన్ను స్తుతించి దివ్యానందాన్ని పొందుతూ ఉన్నారంటారు.

**ఇన విఘ్నేశ్వర మాతృకా ద్రుహిణబ్రాహ్మీ స్కందదుర్గా రమా**
**వనితాధీశ్వర భైరవుల్ బలసి భాస్వద్భక్తి సంయుక్తిసీ**
**కనిశంబుం బరివార భృత్య నికరంబై రన్న నిన్నింకఁ గొ**
**ల్వని వారెవ్వరజాండ భాండములలో వర్ణింప సర్వేశ్వరా !**

సూర్యుడు, వినాయకుడు, సప్తమాతృకలు, బ్రహ్మ, సరస్వతి, కుమారస్వామి, దుర్గ, విష్ణు, భైరవులు. వీళ్లందరూ భక్తిపారవశ్యంతో నీకు సేవకులయ్యారంటే ఈ బ్రహ్మాండాలలో నిన్ను సేవించని వాళ్ళెవరుంటారు" అని ఈ జగమంతా సర్వేశ్వరమయం అంటారు యథావాక్కుల అన్నమయ్య. ఈశ్వరునిది మహత్త్వం అని తక్కిన దేవతలది అణుత్వం అని అణుత్వానికి నీ మహత్త్వం ఎలా తెలుస్తుందని ప్రశ్నిస్తాడు అన్నమయ్య.

**భవదున్మేష విజృంభణంబు పరికింపగా సరోజాత సం**
**భవు జన్మంబు, భవన్నిమేష మమిత బ్రహ్మాండకల్పాంత భై**
**రవ సంక్షోభిత మన్నఁ దక్కిన భవత్ప్రారంభ భూరి క్రియా**
**నివహం బెవ్వరు నేర్తురిట్టిదని వర్ణింపంగ సర్వేశ్వరా !**

నీ ఉన్మేష వికాసంలో బ్రహ్మకు జన్మ అంటే లోకోత్పత్తికి హేతువు. అదే నీవు ఱెప్పవేస్తే (ఆ బ్రహ్మసృష్టికి) ప్రళయం అని అంటే ఇంక నీ క్రియా నివహాన్ని ఇలాంటిది అలాంటిదని ఎవ్వరు వర్ణింపగలరని ప్రశ్నిస్తారు? పృథివి, ఆపః, తేజ, వాయువు, ఆకాశం, సూర్యుడు, చంద్రుడు, పురుషుడు ఈ ఎనిమిది మంది శివునికి అష్టమూర్తులు. ఆ శివుడు ఈశ్వరుని ఆజ్ఞాశక్తివల్లనే ఈ ఎనిమిదింటితో బ్రహ్మాండాలు రక్షణాంగాలుగా పుట్టిస్తాడు అని పేర్కొంటాడు.

**"ఇట్లు మూర్త్యష్టకంబున నీ జగములు**
**సర్వములు నిండి వెలసెదు శంకరుండు**
**ఆ శివుని గొల్వ జగముల కమరు వృద్ధి**
**శాఖిమూల సేకంబున శిఖలెసగు"**

శివపురాణంలో పై పద్యం కన్పిస్తుంది. చెట్టువేళ్లకి నీళ్లు పోస్తే చెట్టుకొమ్మలకి ఏ విధంగా అందుతుందో శివారాధన చేస్తే ఈ సమస్త జగాలన్నింటికి వృద్ధి లభిస్తుంది. శంకరుడు అష్టమూర్తులుగా ఉన్న కారణాన సర్వజగత్తూ నిండినవాడే అని శివపురాణం చెబుతుంది.

**జలజాతప్రభవాండ భాండములు దుశ్చారిత్రులం బాత్రులం**
**జెలువై యుండ యథా ప్రమాణములుగా శిక్షింపరక్షింప ని**
**శ్చల లీలం బ్రభవించు రాజు భవదాజ్ఞా శక్తిగా కింత వ**
**ట్టైలమింజేకొని నిర్వహింప మఱి రాజెవ్వండు? సర్వేశ్వరా !**

ఈ బ్రహ్మాండం మొత్తం మంచివాళ్ళు, దుష్టులతో నిండి ఉంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసే అధికారం ఒక్క రాజుకే ఉంది. ఇదంతా ఈశ్వరాజ్ఞా శక్తియే అని సర్వేశ్వర తత్త్వాన్ని ప్రబోధిస్తున్నారు యథావాక్కుల అన్నమయ్య. సమస్త రంగాలలోను, కళలు, జ్ఞానంలోనూ కూడా ప్రౌఢులను చేయడం వల్ల వేదాలు నిన్ను 'సర్వజ్ఞ' పేరుతో సంబోధిస్తున్నాయంటారు అన్నమయ్య.

**సురలన్ మర్త్య సమూహిగా, మనుజులన్ శోభిల్లు బృందారకో**
**త్కరముంగా, ఘను నల్పు, నల్పుని ఘనుంగాఁ బుణ్యపాపాళి చేఁ**
**దిరుగన్ వైచుచు నీ మహామహిమ ప్రీతిం బద్మ జాండంబులం**
**దరయన్ జీవుల నింద్రజాలములుగా నాసించు సర్వేశ్వరా !**

నీ మహామహిమ వల్ల, వారి వారి పాపపుణ్యాల వల్ల దేవతల్ని మనుషులుగా, మనుషుల్ని దేవతలుగా, గొప్పవాణ్ణి అల్పులుగా, అల్పుణ్ణి గొప్పవాళ్ళుగా తిరగవేసి జీవులందర్నీ ఇంద్రజాలంలో లాగా ఆడిస్తున్నావు సర్వేశ్వరా అని శివపారమ్యతనే ప్రబోధించారు.

**ధరణిం దీర్థములాడుకంటె, నతిమోదం బొప్ప యజ్ఞంబులం**
**బరcగం జేయుట కంటె సువ్రతములొప్పన్ వేదశాస్త్రార్థత**
**త్పరుడై యాదటc జల్పుకంటె, మదినుత్సాహించి నీ భక్తి మ**
**త్పురుష శ్రేష్ఠులc బూజ సేయుట మహాపుణ్యంబు సర్వేశ్వరా !**

తీర్థస్నానాలు చేయడం కన్నా, యజ్ఞాలు చేయడం కన్నా, సువ్రతాలు చేయడం కన్నా, నీయొక్క శ్రేష్ఠులైన మహాభక్తుల్ని పూజించడం మహాపుణ్యం అంటారు అన్నమయ్య.

**"సత్యం బెప్పుడు తప్పడేనియు దురాచారుండు గాడేని యౌ**
**చిత్యం బేమఱడేని దుర్జనుల గోష్ఠిం బొందడే భక్త సాం**
**గత్యం బాదట బాయడేని మదనగ్రస్తుండు గాడేని నీ**
**భృత్యుండాతడు మూడు లోకములలో బూజ్యుండు సర్వేశ్వరా!"**

ఎన్నడూ సత్యం తప్పనివాడు, దురాచారుడు కానివాడు, ఔచిత్యాన్ని ఏమారనివాడు, దుర్జనులతో స్నేహం చేయనివాడు, భక్తుల సాంగత్యాన్ని కోరేవాడు, కాముకత్వ దృష్టిలేనివాడు నీ సేవకుడౌతాడు. అలాంటివాడే ముల్లోకాలలో పూజనీయుడౌతాడు అని సద్భక్తుల లక్షణాలను స్పష్టంగా వ్యక్తం చేశారు.

**"ఉరు పక్షంబులు వచ్చునంతకు నిరుద్యోగంబునన్ వృక్ష కో**
**టర మధ్యంబున నుండు పక్షిగతి నిష్ఠం గూడి నీ భక్తి వి**
**స్మర మాత్మం బ్రభవించు నంతకును నీ సంసార కారాగృహాం**
**తర గేహంబున నుండి జీవుడతిచింతం బొందు సర్వేశ్వరా !"**

పక్షి తనకు పెద్ద ఱెక్కలు వచ్చేటంత దాకా ఏమీ చేయకుండా చెట్టు తొఱ్ఱలో ఉన్నట్లుగా, జీవుడు కూడా పరమనిష్ఠతో నీ మీద భక్తి పుట్టే అంత వరకూ సంసారమనే చెరసాలలోనే ఉండి ఎంతో దుఃఖాన్ని పొందుతాడని అర్థాంతర న్యాసాలంకారంలో స్పష్టం చేశారు.

**"ధరణిం గర్మవిధాన భక్తి విభవధ్యానోత్తమ జ్ఞానముల్**
**వరుసం బేర్కొన నాల్గు యోగములు; తత్త్వం బెందు నీ భక్తి; వి**
**స్తర బాహ్యక్రియ లెల్లc బొల్లులగుటం, దద్భక్తి యోగంబు తా**
**బరcగం దక్కిన మూడు యోగములకుం బ్రాణంబు సర్వేశ్వరా!"**

సమస్త భూమండలంలో నాలుగు యోగాలున్నాయి. 1. కర్మ 2. భక్తి 3. ధ్యానం 4. జ్ఞానం. ఈ నాలుగు యోగాలకు మూలం భక్తి. బాహ్యక్రియలన్నీ, ప్రాణరహితాలు కావడం వల్ల, భక్తియోగమే మిగతా యోగాలన్నిటికి ప్రాణం అంటారు అన్నమయ్య. బంగారంలో గడ్డకట్టి ఉన్న మాలిన్యం అగ్నివల్ల ఏవిధంగా కరిగిపోతుందో అలాగే జీవాత్మలోకి ప్రవేశించిన మలినత్రయం కేవలం శివభక్తి చేతనే పోతుంది కాని వేరే దానిచేత కాదంటారు అన్నమయ్య.

**భవదీయార్చన సేయుచో బ్రథమ పుష్పంబెన్న సత్యంబు, రెం**
**డవ పుష్పంబు దయాగుణం, బతివిశిష్టంబే కనిష్ఠా సమో**
**త్సవ సంపత్తి తృతీయ పుష్పమది భాస్వద్భక్తి యో**
**గ విధానంబవి లేని పూజల మదింగైకోవు సర్వేశ్వరా !**

భక్తయోగ విధానంలో నీ పూజ చేసేటప్పుడు ఉపయోగించే ప్రధానమైన పుష్పాలు మూడు. మొదటిది సత్యం, రెండవి దయ, మూడవది ఏకాగ్రత. ఈ మూడు పుష్పాలు లేని పూజలు నీవు అంగీకరించవు సర్వేశ్వరా అంటారు అన్నమయ్య.

**"జయశక్తిన్ రవిచంద్ర తారకముగాఁ జల్పెన్ యథావాక్కులా**
**న్వయదుగ్ధాబ్ధిజుడున్న మార్యుడవని వర్ణించి నీ సత్కథన్**
**బ్రియ సంబోధన నీదు భక్తిని మహానిర్ణీత విశ్రాంతిగా**
**భయవిభ్రాంతులు లేక యీ శతకముం బ్రఖ్యాతి సర్వేశ్వరా !"**

అనే పద్యంతో సర్వేశ్వర శతకం ముగుస్తుంది. జయశక్తితో ఆచంద్ర తారార్కంగా యధావాక్కుల వంశమనే పాలసముద్రంలో పుట్టిన అన్నమయ్య నీ సత్కథను వర్ణించి, నీపై భక్తిని ప్రకటించి, ప్రేమపూరితమైన సంబోధనతో సర్వేశ్వర శతకానికి కీర్తి కల్గించారు. శివభక్తి పారమ్యతను ప్రతి పద్యసుమంలో ప్రబోధించిన శివభక్తుడు యధావాక్కుల అన్నమయ్య.

**ఉపయుక్త గ్రంథసూచి:**

1. యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకవ్యాఖ్య – ముదిగొండ వీరభద్రయ్య.
2. శతక సాహిత్య వికాసం – కోగంటి గోపాలకృష్ణారావు.

❖❖❖

ISSN 2457-0796
**మూసీ** మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# పాపసాబు మాటపైడిమూట - సామాజిక సమీక్ష

**డా.పఠాన్ ఖాసింఖాన్**

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆధునిక భారతీయభాషల విభాగం, అలీఘర ముస్లిం విశ్వవిద్యాలయం

ఫోన్ నెం: 9494998492, Email: pathankhasimkham@gmail.com

తక్కల్లపల్లి పాపాసాహెబ్‌గారు పది పద్యకావ్యాలను రచించి చివరిగా **'పాపసాబుమాట పైడిమూట'** అనే శతకాన్ని విరచించారు. 1928లో అనంతపురం జిల్లా రాయల చెరువు మండలం కేశవరాయనిపేటలో ఫకూర్ బి.ఫకృద్దీన్‌సాహెబ్ దంపతులకు జన్మించారు. వీరు 1960 నుండి అత్తగారి ఊరు అప్పేచర్లలో నివసించారు. 1982 డిసెంబరు 2వ తేదీన గుండెపోటుతో వీరు పరలోకానికి పయనమయ్యారు. ఈ శతకాన్ని బ్రహ్మానందరెడ్డి గారికి అంకితమిచ్చారు. ఇందు 105 పద్యాలున్నవి. దీనిలోని సామాజిక విషయాలను సమీక్షించటం ఈ వ్యాసముఖ్యోద్దేశ్యం.

శతకం ప్రారంభించటానికి ముందుగా వీరు -

**మానవతాగ్రధర్మమిల - మానవజాతిని చనిపోయి హిం**
**సానిరతోగ్రదానవత - స్వైర విహార మొనర్ప జొచ్చె, పా**
**షాణము గుండెలోనయిన సౌహృద సౌరభములోగు బుల్కొనుం**
**గాని అవేమి కన్పడవు, క్రౌర్యము దప్పగ మానవాత్మలన్. (ప్రథమపుట)** అని బాధపడతారు.

ఇలాంటి భీకర సంఘంలో నుంచి ఉద్భవించిందీ శతకం.

**ఉన్నవాడు పెట్టు ఉన్నవానికె కొని**
**పోయి, పేదకిడదు ముద్దబువ్వ**
**నిండు కడలి నీరు నింపవా నదులెల్ల**
**పాపసాబు మాట పైడిమూట. - 4 పద్యం**

**కనులు లొట్టపోయి కడుపంటూ కొనిపోయి**
**బిచ్చగాడు ఆర్తిభిక్షమడుగ**
**వ్రేల్విదుల్చుకున్న వేలు చందాలిచ్చె**
**దరధికారులడుగ ధనుల సాబు - 100 ప.**

ఈ పద్యాలు నాటి సమాజంలోని పేదరికాన్ని, బిచ్చగాళ్ళను, భాగ్యవంతుల ప్రవర్తనను పట్టి చూపుతున్నాయి.

**పరుని కాయకష్టఫలముపై యాధార**
**పడుటకన్న మేలు పుడమి భార్య**
**బసివిరాలిఁ జేసి బ్రతుకుట భావింప - 6ప.**

**మృగచయమ్ము మెక్కు మృగపతిత్వము కంటె**
**చీమ బ్రతుకుమేలు, స్వీయజనుల**

**పేదనోర్లు గొట్టి విభవమ్ము సంగ్రాలు**
**సార్వభౌము కంటె సాధుమేలు - 71 ప.**

అని పరుల కాయకష్టంపై ఆధారపడి బ్రతకటం నీచాతి నీచమైందని, పేదల నోర్లు గొట్టి విత్తంతో విలసిల్లే సార్వభౌముని కంటె సాధువు మేలని తెలిపారు. దీని ద్వారా పరుల కాయకష్టంపై ఆధారపడే నీచజనం, పేదల నోర్లు కొట్టి సంపాదించే సార్వభౌమలు సమాజంలో ఉన్నట్లు విదితం.

**గడనకత్తె బిగ్గ కౌగిళ్ళ జిక్కిన**
**వాడు తెలివగనుట బద్ధు .... - 63ప.**

**కామముద్ధరాగ్నిఁగాల్చివేయు మహాత్మ**
**జీవితము నదెంత చేవకలది**
**కాని ..... -91 ప.**

**మంచి గోరు భార్య వంచించి తలఁబిడి**
**సానబట్టి కలచుసానిఁ గొలుచు - 3ప.**

ఇత్యాది పద్యాల మూలాన కామ ప్రవృత్తి కలవారు సానులను కొలుస్తూ ఎలా నాశనం అవుతున్నారో తెలుస్తుంది.

**వాజిబక్కదైన ఆజిఁబనికి వచ్చు**
**గండుదైన నేమి గార్దభమ్ము**
**పేదయైనఁ జదువు విప్రుడు శ్రుతిమాల -64 ప.**

**పెద్ద గద్దె నెక్కి విఱ్ఱవీగిన గూళ**
**పేదపండితునకు లేదు లోటు**
**చెట్టు క్రింద కరియు చెట్టుపై కపియుండు - 102 ప.**

మొదలైన పద్యాలు పేదవిప్రులు, పేద విద్వాంసులు సంఘంలో గౌరవంగా బ్రతుకుతున్నట్లు తెలుపుతాయి.

**పంటవలనమ్మి పాటు పరెడు రైతు**
**దయ శ్రితులకు బెట్టు తాను తినును**
**కోటి విద్యలైన కోంద్రకుద్దియా -72 ప.**

**క్రోలి గంజిరైతు కూర్చు దివ్యాన్న మ**
**న్యులకు నబ్దమబ్ధి యుప్పు నీరు**
**త్రావి త్రేపి యిచ్చు ప్రజకు కమ్మని నీరు - 99 ప**

అని రైతును అబ్దంతో పోల్చి అతని కష్టం, త్యాగం, పరోపకారం, అవసరం, మాహాత్మ్యం, కవి ప్రస్ఫుటం చేసారు.

**దుక్కిటెద్దు కిడదు తొక్కురయితు; పుష్టి**
**మేత, దూలపెద్దు వాతవేయు**
**పస్తు కష్టజీవి మస్తు దాంబికునకు - 87 ప.**

**బువ్వ ముద్దగాక బోధ, క్షుదార్తుల**
**బాధ తీరునట్టె వానఁగాక**

**ఎండిపోవు పైరులెదుగునా ఉఋముల -93 ప**

**కల్లమున్నయటకె కంకి యేగు - 96 ప.**

**ససియు ఫలము విత్తు పసనెదుగు విధాన - 1ప.**

**ఇచ్చు గేదెనమ్మి ఎనుబోతు గొన్నట్లు - 3 ప.**

**లేమి యేచ; లేకి దిట్టిన నాతడేమి సేయు ... - 68 ప.**

ప్రభృతి పద్యాలు, నానుడులు, సామెతలు కర్షకుల, కష్టజీవుల నిరుపేదల స్థితిగతులను, రాయలసీమలోని రైతులు వానల కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూడటాన్ని మన కళ్ళకు కట్టినట్టు చూపుతున్నాయి. రాలిన గింజలను పొలాలలో ఏరుకొని బ్రతికే లేకి జీవి దుస్థితి అతని కోసం పంటను విడువలేని రైతు మనస్సంఘర్షణ మనమనస్సులను తొలిచివేస్తుంది.

**వజ్రశక్తిఁబోసి ప్రజకిచ్చె గాంధిజీ**
**'ఓటు' వారి చేత నొప్పెనదియు**
**పిచ్చివాని చేత పెద్ద గుండ్రాయియై - 56ప.**
**లోకమందొక యతిలోక తేజము నించె**
**గాంధి: అతని నరుదు గానగలడె**
**నక్క యేద చూడనాకలోకంబేడ - 57.ప.**

**మందిసొమ్ము గుడుచు పందిదగ్గర డబ్బు**
**లున్న నాయకత్వమొదవు నెపుడొ!**
**డబ్బులేని మొగము గబ్బుమొగమ్మురా - 9.ప.**
**ప్రజలస్వేదఫలముఁ ప్రభువు భోగాలకు**
**పాడుసేయ నడుగువాడెవండు?**
**కంచె, చేనుమేయ కాపేమి సేయునో -4వ**

మున్నగు పద్యాలు, సామెతలు, నానుడులు – అహింసా సిద్ధాంతం ద్వారా గాంధీజి స్వాతంత్ర్యాన్ని సముపార్జించి, 'ఓటు' అనే వజ్రాయుధాన్ని ప్రజలచేతికి అందిస్తే వారు దానిని దుర్వినియోగం చేస్తున్నారని, డబ్బులున్నవాళ్ళు ప్రభువులవుతున్నారని, ప్రజల స్వేదఫలాన్ని రక్షించి వారి పోషణకే వెచ్చించాల్సిన ప్రభువు తమ భోగాలకు పాడుచేస్తున్నారని, రాజకీయ దుస్థితిని చాటుతున్నాయి.

**చెల్లువాడు ఏమి చెప్పిననది బల**
**కొట్టుచుండ్రు జనులు గూనివాడు**
**చెఋవనంగ చీకు చేపలన్నట్టుల -10.ప.**

**అనఘుఁతీరు దాక స్వార్థము ఉపయోగ**
**బెట్టుకొని తదుపరి విడుచు కూళ**
**తెల్లవారినాక మల్లెపూగతేమి? - 11.ప**

**కఱకువెన్నుపోటు, అరిది తిరుగుబాటు**

**బకము జపము, త్రాచుపాము తపము**
**నేటిఘనులు మెచ్చు మేటి అర్హతలయ్యె - 25.ప**

**కోడిపౌరుషము కుక్క విశ్వాసము**
**ఫలభరాగ్ర్మ నమ్రభావగరిమ**
**ఆవుప్రేమ, పేదత్యాగముఁజేదయ్యె**
**మన స్వతంత్ర భరతమహినిసాబు - 28.ప**

ఇత్యాది పద్యాలు, పలుకుబడులు, సామెతలు - మన స్వతంత్ర భారతదేశంలోని ప్రజలు భయంతోనో లేక స్వార్థంతోనో, చెల్లుబుటున్నవాడు ఏమి చెప్పినా అవునంటున్నారని, దుష్టులు తమ స్వార్థానికి పుణ్యాత్ములను ఉపయోగించుకొని తర్వాత విడిచిపెడుతున్నారని, అన్యాయాలు న్యాయాలుగా, ధర్మాలు అధర్మాలుగా, ప్రియములు అప్రియములుగా పరిణమించాయని వెలిబుచ్చుతున్నాయి.

**తురకకేమి తెలియుఁబరమ వేదార్థమ**
**టంచు నెత్తిపొడుతురవని సురులు**
**కనఁగబీరు తురకగాకేమిగరకయా**
**పాపసాబు మాట పైడిమూట -70.ప**

ఈ పద్యం మతవైషమ్యానికి మచ్చుతునక. విద్యకు మతంతో ముడిపెట్టడం వివేకరాహిత్యం. తురకలైనా మరెవరైనా స్రష్ట సృష్టియేకదా! మానవులందరు మనువు సంతానమేకదా! సర్వేశ్వరుడు తన గ్రంథాలను సర్వమానవులకు ఒసంగాడు. కాబట్టి ఏ మానవుడైనా అధ్యయనంతో విద్యావంతుడు, వేదపండితుడు, బైబిలు విద్వాంసుడు, ఖురాను విదుడు కావచ్చు అనే పచ్చినిజాన్ని పాపాసాహెబు బట్టబయలుచేసారు.

**బయటపడును గొంటు పండితు డాబెల్ల**
**నొక్కమాట లోన నొరపిడినిద**
**స్పష్టమగును ముచ్చెబంగారు జిగి దౌలు -79.ప.**

**ఇంటిలోని రచ్చలెక్కించి వీధికి**
**రచ్చఁదీర్ప జనుగరాసు; ఉట్టి**
**కెక్కలేనిదు ఎక్కునా! స్వర్గము -85.ప.**

**శాసనాధికార భాసురదయ్యు వం**
**చింపఁబ్రజలసాహసించు తేదు -13.ప**

**తనకువచ్చు ముప్పుఁగనక పరులనేచఁ**
**గడగుఁజెడుగు పాము పడగ నీడఁ**
**గ్రుంగు కప్ప యీగ మ్రింగబూనెడు భాతి 094.ప.**

వంటి పద్యాలు, సామెతలు సమాజంలోని పండితప్రభువులను, తమ ఇంటిని సరిదిద్దుకోకుండా పరుల గొడవలను తీర్చటానికి వెళ్ళే దుష్టులను, ప్రజలను వంచించే రాజులను, పరులను వంచించే క్రూరులను పట్టి చూపుతున్నాయి.

**కృతమెరుంగనట్టి తేని గొల్చెడు బంటు**
**కుందు నొక్కనాదు గండమవని**

**అగ్ని నెన్ని యేదులర్చసల్పినను పూ**
**జారి యందు బడిన చావదట్టె - 60**

కార్యజ్ఞుడు గాని రాజును సేవించే సేవకునకు ఏదో ఒకనాడు గండముంటుందని కవి హెచ్చరిస్తున్నాడు. సేవకులు తమ జీవనోపాధి కోసం ఎలాంటి రాజులనైన సేవిస్తుంటారని అవగతమవుతుంది. ఈ పద్యం –

**నకశ్చిత్ చండకోపానామాత్మీయోనామ భూభుజామ్ ।**
**హెూతారమపి జుహ్వానం స్పృష్టోదహతిపావకః ॥** అనే దుర్జనపద్ధతిలోని భర్తృహరి శ్లోకాన్ని గుర్తు చేస్తుంది.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, రాజకీయ, వ్యవసాయ, విద్యా ప్రభృతి విషయాలను ప్రస్తుత శతకంలో సమీక్షించటం జరిగింది. 'పాపసాబు మాట పైడిమూట' శతకం పై విధంగా సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. పాపాసాహెబు ఈ శతకం ద్వారా శివేతర క్షతిజరగాలని వక్కాణిస్తూ హితాన్ని కాంక్షిస్తున్నారు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. పాపాసాహెబ్ తక్కల్లపల్లి – పాపసాబుమాట పైడిమూట 1981, విశ్వనాథ ప్రెస్, అనంతపురం

2. భర్తృహరి, సుభాషిత త్రిశక్తి – 1990 జి.వి.హెచ్.పబ్లికేషన్స్, విజయవాడ (భర్తృహరి సుభాషితములు)

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025**

# నరసింహ శతకం -వర్తమానసామాజిక అన్వయము

**డా.ఎన్.సంధ్యారాణి**

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, పాలమూరు విశ్వవిద్యాలయం,

మహబూబ్ నగర్- 509001

తెలుగు నాట బహుళ ప్రాచుర్యం పొందిన భక్తి శతకాలలో శేషప్ప కవి రచించిన నరసింహ శతకం ఒకటి. ఇది సీసపద్య శతకం. భక్తి శతకాలలో కన్పించే ఆర్తి , ఆత్మనివేదనం, అలగడం, మధ్యమధ్యలో స్వామివారి మీద అభిమానం పెరిగిపోయి నిందా స్తుతికి పాల్పడటం, మళ్లీ క్షమించమని ప్రాధేయపడటం వంటి వన్నీ ఈ శతకం లో కూడ కనపడతాయి. ఈ శతకం చదువుతుంటే భక్త కవి పోతన భాగవతం, ధూర్జటి కాళహస్తీశ్వర శతకము, కంచెర్లగోపన్న దాశరథీ శతకము మనకు మాటిమాటి కీ గుర్తుకొచ్చి పలకరిస్తాయి.

భూషణవికాస! శ్రీధర్మపుర నివాస!

దుష్టసంహార! నరసింహ! దురితదూర!

అనేది ఈ శతక మకుటం. తనకు గణయతి ప్రాస లక్షణాలు తెలియవు. పంచకావ్యాలను పఠించలేదు. అమరమనే సంస్కృత నిఘంటువును చూడనేలేదు. శాస్త్రీయ గ్రంథాలను చదువనే లేదు. కాని నీ అనుగ్రహం వలన నేను ఈ శతకాన్ని రచిస్తున్నాను అనిచెపుతూనేతప్పులున్నంత మాత్రాన భక్తికి లోటు ఏర్పడదు గదా. వంకరగా ఉన్నంత మాత్రానచెఱుకుగడలో మాధుర్యం తగ్గుతుందాఅంటూ ఎదురు ప్రశ్న వేస్తాడు కవి (2వ. ప).భక్తికి ఛందోబంధాలెందుకు అనేది కవి వాదన. ఈ శతకం లోని కవిత్వం కూడ అదే రీతి లో కొనసాగినట్టు గుర్తించవచ్చు.

శ్రీ శేషప్ప కవి 1730 %-% 1820మధ్య కాలంలో జీవించి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కవి నైజాం ప్రాంతం వాడయి ఉంటాడని విమర్శకులు భావిస్తున్నారు. నరసింహుని సేవలోనే తన జీవితాన్ని కడదేర్చుకున్నకర్మయోగిగాఈ కవికనిపిస్తున్నాడు. కేవలం భగవద్భక్తి మాత్రమే ఈ కవి చేత ఈ శతకాన్ని వ్రాయించింది. ఇతడు నిరుపేదయై, యాయవారవృత్తితో, భగవదారాధనలోనే జీవితాన్ని గడిపాడని భావించవచ్చు.కరీంనగర్ జిల్లాలోని ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముందు రెండు ప్రధాన ప్రవేశ ద్వారాలకు నడుమ ఈ భక్త కవి విగ్రహం ఒకటి నెలకొల్పబడింది. మెడలో వ్రేలాడుతున్నతంబుర, చేతిలో చిడతలు, నెత్తినఅక్షయపాత్ర (భిక్షాపాత్ర)తో ఆ విగ్రహం కన్పిస్తోంది.1976. సం.పుపదవ తరగతి మిత్రబృందం ఈ సామాజిక సేవాకార్యాన్ని నిర్వహించారు . వారికి అభినందనలు తెలపాలి మనమందరం.

## నరసింహ శతకం -వర్తమానసామాజిక అన్వయము

ప్రతి శతక కర్త తన నాటి సమాజాన్ని తాను రచించిన శతకంలో ప్రస్తావించాడు. ఆ సమాజంలోని ఎగుడుదిగుళ్లనుఎత్తి చూపించాడు. అప్పటి పాలకుల దుర్నీతినీ, దుశ్శాసనాల్నీ ఖండించాడు. ప్రజల బాధలను, వేదనలనూ ఎలుగెత్తి చాటాడు. అది నీతి శతకం కావచ్చు, భక్తి శతకం కావచ్చు.

ఆ కాలం నాటి సమాజం పద్యాలలో కనిపిస్తుంది. నరసింహ శతకంలో శేషప్ప నాటి సమాజాన్ని, ప్రజా జీవనాన్నీ కొన్ని పద్యాలలో ప్రస్తావించాడు. శేషప్ప కవి సమాజావలోకనాన్ని ఎత్తి చూపించడానికి అతని పద్యాలే నిత్య సత్యాలు.

సీ. అధిక విద్యావంతులప్రయోజకులైరి
పూర్ణశుంఠలు సభాపూజ్యులైరి
సత్యవంతులమాట జనవిరోధంబాయె
వదరుఁబోతులమాటవాసికెక్కె

ధర్మవాదనపరుల్ దారిద్ర్య మొందిరి
పరమలోభులు ధనప్రాప్తులైరి
పుణ్యవంతులు రోగభూత పీడితులైరి
దుష్టమానవులువర్ధిష్ణులైరిజి

తే. పక్షివాహన! మావంటిభిక్షుకులకు
శక్తిలేదాయెనింకనీవెచాటుమాకు
భూషణవికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ దురితదూర! 26

కరీంనగరం జిల్లాలోని ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహస్వామివారిని సంబోధిస్తూ చెప్పిన శతకమిది. శేషప్ప తన కాలం నాటి వికృతులను, వైపరీత్యాలను పై పద్యంలో వివరించాడు. వ్యాఖ్యానం అవసరం లేనంతగాసరళ భాషను ఉపయోగించాడు శేషప్ప కవి.

ప్రతి పాఠకుని మదిని కదిలించే పద్యం. విద్యావంతులు, సత్య వంతులు, ధార్మికులు, పుణ్య వంతులు బాధలు పడడం, పూర్ణ శుంఠలు, వదరుబోతులుపరమ లోభులు, దుష్ట మానవులువెలిగిపోవడం కాలవైపరీత్యమంటూ బలహీనులైన వారికి నీవే రక్ష అని దైవాన్ని ప్రార్థించాడు కవి.

సీ . 'జందెమింపుగవేసిసంధ్యవార్చిననేమి?
బ్రహ్మమందకకాడు బ్రాహ్మణుడు
తిరుమణి శ్రీచూర్ణగురురేఫలిడినను
విష్ణునొందకకాడువైష్ణవుండు
బూదిని నుదుటను బూసికొనిననేమి?
శంభునొందక కాడు శైవజనుడు
కాషాయ వస్త్రాలు గట్టి కప్పిననేమి?
యాశపోవకకాడుయతివరుండు

తే. ఇట్టి లౌకిక వేషాలు గట్టుకొనిన
గురుని చెందక సన్ముక్తి దొరకబోదు
భూషణవికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ దురితదూర! 38

అంటూ లౌకిక వేషాలు వేసే పరమాధముల బండారాన్ని బయటపెట్టాడు. పరుల ద్రవ్యంమీద బ్రీతినొందిన వారిని, పరకాంతలనుఆపేక్షపడే వారిని, సభలోపల నిల్చి చాటి చెప్పేవాళ్ళను. పక్షపాత సాక్ష్యం పలికే వాళ్ళను, విష్ణుదాసులనువెక్కిరించేవాళ్ళను, ధర్మసాధువులనుతిట్టేవాళ్ళను, ప్రజలను, జంతువులను హింసించే పాతకులను కవి నిందించిన తీరు (54వ పద్యం) అప్పటి సమాజంలో ఉన్న దుర్మార్గాన్ని తేటతెల్లం చేస్తుంది.

వ్యాసుడు, విదురుడు, కర్ణుడు, వసిష్టుడు, వాల్మీకి, గుహుడు, శ్రీశుకుడు, శబరి వంటి మహాత్ములకు కులమేదని ప్రశ్నిస్తూ భగవంతుని కృపా పాత్రులకు కులం లేదని (74వ పద్యం) చెప్పాడు. ఆనాటి వ్యవస్థలోని కుల భేదాలనుశేషప్ప ఖండించాడు.

సీ . మాన్యంబులీయ సమర్థుడొక్కడుం లేడు
మాన్యముల్ చెరుప సమర్థులంత
యెండిన యూళ్ళగోడెరిగింపడెప్పుడు
పండిన యూళ్ళకు ప్రభువులంత
యితడు పేదయటంచు నెరిగింపడెవ్వడు
కలవారి సిరులెన్నగలరు చాల
దనయాలి చేష్టల తప్పెన్నడెవ్వడు
బెరకాంత తప్పెన్న పెద్దలంతా

తే . యిట్టి దుష్టుల కధికారమిచ్చినట్టి
ప్రభువు తప్పులటంచునుపలుకవలెను
భూషణవికాస! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ దురితదూర! 14

అంటూ నాటి సంఘంలోని అసమానతలను, అన్యాయాలను, అక్రమ పద్ధతులను తూర్పారపట్టాడు శేషప్పకవి.

నరసింహ శతకంలోని పద్యాలను నిశితంగా పరిశీలిస్తే, శేషప్పకవితననాటి సమాజాన్ని ఎంతగా చూచాడో, అధ్యయనం చేశాడో గ్రహించవచ్చు. కొన్ని పద్యాలను మాత్రమే ఉదహరించాను. శతకాన్ని సొంతం చదివి ఆకళింపు చేసుకోవాల్సినవారు సహృదయులైన పాఠకులు.

'నరసింహ శతకము ఇంత జనరంజకమగుటకు కారణములు కలవు. ఈతడు సామాన్య జనుడగుటచేజనసామాన్యమునకుగలకష్టనిష్ఠురములను గ్రహించినవాడు. వినయము వలన వివేకియగుటచే అపూర్వ విషయములనందుకొనక సామాన్య భావములనే సరసముగా, హృదయంగమముగా నొదుగునట్లు మనోజ్ఞ సీసపద్యములు చెప్పినాడు' అన్నారు.

**ఆధార గ్రంథాలు :**

1. శేషప్పకవి, కాకుత్థ్సం. 'నరసింహ శతకము'. 1954. రాజమండ్రి: కొండపల్లి వీర వెంకటయ్య ప్రచురణ.
2. సుబ్బారావు, వంగూరి. 'శతక కవుల చరిత్రము'. 1957. నరసాపురము : కమల కుటీర ప్రెస్ అండ్ పబ్లికేషన్స్.
3. గోపాలకృష్ణారావు, కె. 'ఆంధ్ర శతక సాహిత్య వికాసము' 1976. హైదరాబాద్: ప్రతిభా ఆర్ట్స్ ప్రింటర్స్.
4. వీరస్వామి, పల్లేరు. 'తెలంగాణా శతక సాహిత్యం' 2005. వరంగల్లు : అశోక కృష్ణ ఆఫ్ సెట్ ప్రింటర్స్.
5. వేంకటకృష్ణశర్మ, వేదము. 'శతకవ్మాయ సర్వస్వము'1954.మద్రాసు: వేదము వేంకటరాయశాస్త్రి బ్రదర్స్.

❖❖❖

# గురజాడ వారి 'ఋత శతకం' - సత్యవైశిష్ట్యం

**డా.ఎం.మంజుశ్రీ**

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ,

డా.ఏపిజె అబ్దుల్ కలామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్ చెరువు, సంగారెడ్డి జిల్లా

ఫోన్: 99596 26733, Email: darlamanjusree@gmail.com

అనంతమైన తెలుగు సాహిత్యం కాలక్రమేణ అనేక ప్రక్రియా రూపాలను సంతరించుకున్నది. వాటిలో ఒకటి శతక ప్రక్రియ. మయూరుడు సూర్యశతకం, భర్తృహరి సుభాషిత పాల్కురికి సోమన రాసిన వృషాధిప శతకం, త్రిశతి బద్దెన సుమతీ శతకం, పోతన కృష్ణ శతకం, ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకం, ఏనుగు లక్ష్మణ కవి సుభాషితాలు, కాసుల పురుషోత్తమ కవి ఆంధ్ర నాయక శతకం, రామదాసుగా ప్రసిద్ధి పొందిన కంచర్ల గోపన్న రాసిన దాశరథి శతకం, గోగులపాటి కూర్మనాథకవి సింహాద్రి నారసింహ శతకం, ధర్మపురి శేషప్ప నారసింహ శతకం%౯% ఇలా అనేకమంది కవులు తమ శతక రచనతో ఈ ప్రక్రియను సుసంపన్నం చేశారు. ఇందులో భక్తి, నీతి, ఆధ్యాత్మిక, వ్యాజ స్తుతి శతకాలు ప్రధానమైనవి. శతకం ప్రధాన లక్షణాలు సంఖ్యానియమం, మకుట నియమం, ముక్తకం, కొన్నింటిలో ఛందో నియమం కూడా కనిపిస్తుంది. ప్రాచీన కవులే కాకుండా ఆధునిక కవులు కూడా ఈ శతక ప్రక్రియను చేపట్టి సమర్థవంతంగా నిర్వహించారు. గురజాడ, శ్రీ శ్రీ, బోయి భీమన్నవంటి మహాకవులు కూడా శతకాలను రచించారు.

గురజాడ రచించిన శతకం పేరు ఋతశతకం. ఋతము అనగా సత్యము అని అర్థం. కవి తన శతకంలో సత్యం,ధర్మం నీతి మొదలైన వాటి యొక్క గొప్పతనాన్ని వివరించారు.

సత్యవాక్యం యొక్క విశిష్టత మనకు ప్రాచీన సాహిత్యంలోనే కాకుండా ఆధునిక సాహిత్యంలో కూడా చాలా చోట్ల కనిపిస్తుంది రామాయణ మహాభారతంలో కూడా దీని యొక్క ప్రశస్తి కనిపిస్తుంది. ఆంధ్ర మహాభారతంలోని ఆదిపర్వం లో ఉన్న శకుంతలపాఖ్యానం లో సూనృతవాక్యము అన్నమాట కనిపిస్తుంది.శకుంతల సత్యం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ%౯

''వెలయంగ నశ్వమేధం,
బులు వేయును నొక్కసత్యమును నిరుగడలం
దుల నిడి తూ౦ప౦గ సత్యము
వలనన ములుసూపు గౌరవంబున పేర్మిన్." అనే పద్యంలో ఒక త్రాసులో వేయి అశ్వమేధ యాగములు చేసిన ఫలం ఒకవైపు, మరొకవైపు సత్యవాక్యం యొక్క గొప్పతనం ఒకవైపు పెట్టి తూచినట్లయితే, సత్యము వైపే ముల్లు చూపుతోందని, కాబట్టి, సత్యమే గొప్పదని శకుంతల అంటుంది.అలాగే ఉపనిషత్తులలోని కథగా చెప్పబడుతున్నటువంటి కథ. సత్యవ్రతుడనే రాజు ఒకనాటి రాత్రి కోట పైభాగాన విహరిస్తూ ఉన్నప్పుడు కోటలోపల నుండి ఒక దేవతా మూర్తి బయటకు వెళ్లడం చూసి ఆమె దగ్గరికి వెళ్లి నువ్వు ఎవరమ్మా ఎక్కడికి వెళుతున్నావు అని అడుగుతాడు. అప్పుడు ఆమె నేను లక్ష్మీదేవిని నేను చంచలమైన దానిని ఎక్కడ ఒకచోట ఉండలేను, అందుకే వెళ్ళిపోతున్నాను అంటుంది.అప్పుడు సత్యవ్రతుడు సరే నీ ఇష్టం అమ్మ అని గౌరవంగా తప్పుకుంటాడు. ఆ తరువాత ఒకరి వెంట ఒకరు కొందరు దేవత మూర్తులు వెళ్ళిపోతూ ఉండడం గమనిస్తాడు. వారిని అడుగుతాడు.వారు తాము దానం, శుభము అని అంటారు రాజు వారిని కూడా ఆపలేదు. చివరగా మరొక దేవత మూర్తి బయటకు వెళ్ళిపోతుంటే ఆమెని మీరు ఎవరు అని అడగగా తాను సత్యలక్ష్మిని అని చెప్తుంది. వెంటనే రాజు ఆమె పాదాలపై పడి అమ్మా నేను

నీ పూజారిని నీ అర్చకుడిని నీవు నన్ను విడిచి వెళ్ళవద్దు. నీ ఒక్కదానివే ఉంటే చాలు నాకు అన్నీ ఉన్నట్టే అని రాజు వేడుకుంటాడు. అందుకు సత్యలక్ష్మి సమతించి కోటి లోపలికి వెళుతుంది ఆ తర్వాత బయటకు వెళ్లిన ధనలక్ష్మి, దానము, శుభము ఇవన్నీ కూడా తిరిగి కోటలోకి ప్రవేశిస్తారు. కాబట్టి సత్యాన్ని ఆశ్రయించి ఉన్నవారికి అన్ని సమకూరుతాయి అన్నది ఈ కథలోని నీతి.

బహుశా ఇలాంటి అనేక కారణాల చేతనే కావచ్చు గురజాడ తన శతకానికి ఋత శతకం అని పేరు పెట్టి అందులో సత్యము యొక్క గొప్పతనాన్ని వివరించే ప్రయత్నం చేశాడు. గురజాడ తాను రాసిన ఋతశతకంలోని అన్ని పద్యాలలో ఆయా అంశాలను వివరించినప్పటికీ ప్రధానంగా సత్యము యొక్క వైశిష్ట్యాన్నే వివరించారు.

ఋతశతకం పేరుతో కొన్ని పద్యాలు (25) గురజాడ అప్పారావు రచించినట్లుగా కనిపిస్తున్నాయి. బహుశా మిగతా పద్యాలు వర్ణించారో, లేదో. ఒకవేళ అవి దొరకలేదో పరిశోధకులే తేల్చాలి. దీన్ని మహారాజా ఆనందగజపతి గారికి అంకితమని స్పష్టంగా చెప్పలేకపోయినా, దీన్ని కూడా ఆయనకే అంకితం ఇచ్చినట్లు భావించవచ్చు. కన్యాశుల్కం తొలి కూర్పును (1897) మహారాజా ఆనందగజపతికి అంకితమిచ్చారు కవి. ఆయన పట్ల గురజాడ వారికి తన రచనల్లో ఎంతో గౌరవభావం వ్యక్తమవుతూ ఉంటుంది. ఇరవై ఐదు కంద పద్యాల ఈ అసంపూర్ణ శతకానికి "సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్" అనేది మకుటం.

కన్యాశుల్కంలో వ్యావహారిక భాషలో ఎంత స్వేచ్ఛగా రచించారో, ఋత శతకాన్ని అంతే లక్షణబద్ధంగా రాయాలనుకున్నారు. శతక సంప్రదాయంలో మొట్టమొదటి పద్యం మంగళంతో ప్రారంభించాలనీ దాన్ని 'శ్రీ' అనే అక్షరంతో ప్రారంభించడం వంటి నియమాలేమీ కవి ఈ రచనలో పాటించలేదు. ఆనందగజపతి వ్యక్తిత్వ వర్ణన చేయడంతోనే శతకపద్యం ప్రారంభమవుతుంది. సంప్రదాయ ఛందోబద్ధమైన పద్యకవిత్వాన్నీ సుభద్ర కావ్యంతో పాటు మరికొన్ని ఖండికల్లో ఎంతో లక్షణబద్ధంగా రచించారు. అలాంటి రచనల్లో ఋతశతకం ఒకటి. 'ఋతము' అంటే 'సత్యము' అని అర్థం. దీనిలో ఈ సత్యనిష్ఠ యొక్క గొప్పతనం అనేక చోట్ల కనిపిస్తుంది. ఈ శతకంలోని పద్యాలలో సందర్భానుసారంగా అనేక అంశాలను వివరించినప్పటికీ, దాదాపు చాలా పద్యాలలో సత్యం యొక్క గొప్పతనాన్ని చెప్పడమే ప్రధాన సూత్రం.

స్మితమతి సూచీ భేదిత
ఋత మౌక్తిక పదక శతక మిభపతి భాషా
సతి కతి కుతుకత గూర్చగ
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్.

మొదటి పద్యంలోనే వాగ్దేవి అయిన సరస్వతీదేవికి ఆనంద గజపతిగారికి ఆనందం కలిగేలా సత్య వాక్యాలను ముత్యాలహారముగా కూరుస్తానని అంటాడు. ముత్యము స్వచ్ఛతకీ, మన ఆరోగ్యానికి కూడా మంచిదని ప్రతీతి ఉన్నది. అలాగే, సత్య నిష్ట కూడా మనల్ని నిరంతరం రక్షిస్తుంది అన్నది వాస్తవం.

సతి ప్రేమ వృత్తులను గని
పతి నమ్మిక నెగడు రీతి ప్రకృతి సతి యెడన్
మతియుతుడు ఋతము గనుటను
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్

ఆ తర్వాత పద్యంలో అనుకూలవతి అయిన భార్య కలిగిన భర్త క్రియా వంతుడు,శాంతులు, దాంతుడు సమర్థవంతుడు అవుతాడు. తాను ఏ పనినైనా చేయగలననే విశ్వాసం అతనిలో కలుగుతుంది.

మానవ జీవితం నిరంతరం ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అలాంటి ప్రకృతి పట్ల అనాలోచితంగా ప్రవర్తించటం వలన మానవుడు జల, వాయు, పర్యావరణ కాలుష్యాలు ఇలా ఎన్నో ప్రకృతి వైపరీత్యాలను

ఎదుర్కొంటున్నాడు. ఈ సత్యాన్ని గుర్తించి ప్రకృతి పట్ల మనం సానుకూలంగా వ్యవహరించినట్లయితే అది మనకి ఎప్పటికీ రక్షణగా ఉంటుందని కవి భావన.

ఋతము లతియత్న మృగ్యము
అతిగుప్తము లౌట పండ్ల నాకులలోనన్
వెతుకు గతి వెతుక దగునని
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్ ... అన్న పద్యంలో నేటి సమాజంలో నీతి న్యాయం కూడా వంటివన్నీ కూడా అంతరించిపోతున్నాయి. ఆకులలో పండ్ల కోసం ఎలాగైతే శోధిస్తామో, అలాగే సత్యం కోసం కూడా అంటారు శోధన జరగాలి అంటాడు కవి.

అతి సుకుమారము ఫలద
మ్మృత వృక్షం బనృతకక్ష మేచిన దానిన్
హతిజేసి తరువు గనుమని
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్ . అనే పద్యంలో మిక్కిలి సున్నితమైన సత్య, దయ, ధర్మాలను అధర్మం అణిచివేస్తూ వస్తుంది. కనుక, సత్యమూ, ధర్మమూ నశించిపోకుండా వాటిని జాగ్రత్తగా రక్షించుకోవాలని వివరిస్తాడు కవి.

వితథముల బల్కి యొరులకు
వెత జేయు నతఁడు వన్నెలు పెట్టి యనృత పా
తతి కీలల తనె పడునని
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్ ..అనే పద్యాన్ని గమనించినట్లయితే, అబద్దాలతో, వంచనతో ఇతరులను మోసం చేసేవాడు ఏదో ఒకనాడు తానే ఆ మోసానికి బలవక తప్పదని కాని గురజాడ వారి భావన.

ఈ పద్యానికి రామాయణంలోని కథను ఉదాహరణగా స్వీకరించవచ్చు. సీతాన్వేషణ కోసం బయలుదేరిన హనుమ, లంకలో ప్రవేశించి సీతమ్మను చూసి, అశోక వనాన్ని విధ్వంసం చేస్తూ ఉండగా ఇంద్రజిత్తు వచ్చి బ్రహ్మాస్త్రం వేసి హనుమను బంధిస్తాడు. తీసుకెళ్ళి  రావణుడి ముందు నిలబెట్టగా ఆంజనేయుని చంపటానికి సిద్ధపడతాడు రావణుడు. కానీ, విభీషణుడి యొక్క మాట విని ఆంజనేయుడిని చంపకుండా అతని తోక కు నిప్పంటిస్తాడు. ఆంజనేయుడు ఆ నిప్పుతోనే లంకనంతా కాల్చేస్తాడు. కాబట్టి ఎవరివంచన వారినే బలితీసుకుంటుంది అన్నది ఇక్కడఅక్షరసత్యం. గురజాడ వారి పద్యానికి ఇది సరిగ్గా సరిపోతుంది.

కతలను రక్కసు నెత్తురు
క్షితి బడి రక్కసులగు గతి నృతమతి జంపన్
ఋతములు మితి లేకగునని
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్

పురాణాలలో రాక్షసుని యొక్క రక్తము నేలమీద పడి మరికొంతమంది రాక్షసులు ఉద్భవిస్తారని చెప్పబడింది. సత్యవంతుడైన వాడిని నిరోధించటానికిగానీ, అంతం చేయటానికి గానీ ప్రయత్నిస్తే  ఆ సత్యవంతులు దృఢమైన సత్య సంకల్పం కలిగినవారవుతారని వివరిస్తాడు కవి. అరచేయిని అడ్డుపెట్టి సూర్యుడు కాంతిని ఎలా నిరోదించలేమో, అలాగే సత్యాన్ని కూడా బహిర్గతం కాకుండా ఆపలేమని కవి భావన.

చతురత నశ్వంబును వలె
మతి నొంచు విచిత్ర గతుల మానవుడీ వై

నృత సత్యవర్ణులం జన
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్

అనే పద్యంలో ఎంతటి మొండి గుర్రాన్ని అయినా రౌతు తన నైపుణ్యంతో స్వాధీనం చేసుకున్నట్లుగానే, సత్యనిష్ఠ కలిగిన వారు చంచలమైన మనస్సును తమ స్వాధీనంలో ఉంచుకొని మనోనిగ్రహాన్ని కలిగి ఉంటారు.

మతి వీణా నిక్వణమున
ధృత తంతువు మీటకున్న నెట్టావృతమై
శ్రుతి చెడు, శ్రావ్యత యెట్లని ?
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్.... అనేపద్యంలో

మనోవిపంచిని తాకినంతటనే దానిలోని సత్యమనే తంత్రులు కదలాడి హృద్యమైన సుస్వరాలను వినిపిస్తాయని మరొక చోట చెప్తాడు కవి

మతి వీణ మీటు నంతనె
ఋత తంత్రీ శ్రుతిని జేరి యింపుగ స్వరముల్
ప్రతి సంవాద మ్మిడునని
సతతము సంతస మొసంగు సత్యవ్రతికిన్

లోకంలో సమస్త సమస్యలకు కారణమైంది సత్యాన్ని పాటించకపోవడమేననేది కవి ఈ పద్యాల ద్వారా ప్రబోధించాలనుకున్నారు. నిత్యజీవితంలో మనుషుల ప్రతిస్పందనను, ప్రకృతి వస్తువులను ఆలంబనంగా చేసుకొని ఈ విషయాలను చెప్పడం కవి పాటించిన ప్రత్యేక పద్ధతి.

శతక పద్యాల ప్రధాన లక్షణం ముక్తకం. దాన్ని ఇక్కడ కూడా కవి పాటించి అన్ని పద్యాలలోనూ ఒక సూత్రీకరణ సత్యాన్ని వివరించారు. అలా వివరించటం ఈ పద్యాల్లో కనిపించే ఒక విశేషం. ఒక కథను ఆకర్షణీయంగా చెప్పగలిగినంత సులభంగా నీతిని కేవలం విషయపరంగానే బోధించడం సాధ్యం కాదు. బహుశా ఈ కారణం వల్లనే ఈ పద్యాలు అంత ప్రాచర్యంలోకి రాలేదేమో! కానీ, నేటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా అటువంటి నీతివంతమైన పద్యాలు విద్యార్థులకు పాఠ్యాంశాలు కావలసిన అవసరం ఎంతైనా ఉంది.

(తెలుగుశాఖ - ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం, ఆం.ప్ర.ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు వారు 25 26 నవంబరు 2024 తేదీలలో 'తెలుగు శతక సాహిత్యం - సామాజిక దృక్పథం' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ అంతర్జాల సదస్సులో సమర్పించిన పరిశోధన పత్రం).

**ఆధార గ్రంథాలు:**

1.నాగయ్య. జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటం-2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.
2.భర్తృహరి, 2012. భర్తృహరి. సుభాషితములు. విజయవాడ: లిఖిత ప్రచురణలు.
3.ఆరుద్ర. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. (సంపుటం-4). హైదరాబాదు: తెలుగు అకాడమి.
4.సుబ్బారావు, వంగూరి. 1957. శతక కవుల చరిత్రము. నరసాపురము: కమల కుటీర్ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్.
5.ప్రసాద్, మొండెపు. 2013. శతకాలలో స్త్రీల పట్ల వివక్ష. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
6.నారాయణరెడ్డి, సి. 1977. ఆధునికాంధ్ర కవిత్వం: సంప్రదాయములు-ప్రయోగములు. గంజి బజార్: శివాజీ ప్రెస్.
7.భర్తృహరి, 1990. సుభాషిత త్రిశతి. విజయవాడ: జి. వి. హెచ్. పబ్లికేషన్స్.

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక** సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# నరసింహ శతకం - విభిన్న దృక్పథాలు

**డా.ఎం.మునిరత్నం**

అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై

ఫోన్: 8248723570, Email: munimanama@gmail.com

నరసింహ శతకాన్ని గురించి తెలుసుకునే మునుపు శతక వాఙ్మయాన్ని పరిశీలించవలసిన అవసరం ఎంతైన ఉంది. భాషలో అసలీ “శత” శబ్ద వైశిష్ట్యమే చిత్రమైంది. నూరు లేక వంద అనేది శత పదానికి వాచ్యార్థమైతే అనేకమనే అర్థంలో లౌకికంగా ఈ శబ్దాన్ని ప్రయోగిస్తుంటారు. అబద్ధాలాడవద్దని వంద సార్లు చెప్పేను వంటి ప్రయోగాలు అందరికి తెలిసినవే లౌకికంగానే కాక దైవీకంగా కూడా ఇంద్రాది దేవతలకు పర్యాయ వాచకంగా ‘శత’ ‘శబ్ధం’ వ్రాయుక్తమైనట్లు ‘శతక్రతు’, ‘శతధృతి’, ‘శతమన్యు’, శతానందా, శతావర్తి, శతబంధు వంటివి శతాధికంగా చెప్పవచ్చు. తెలుగు వాణి పుట: 88. “శతేన శతకం ప్రోక్తం” అని సంస్కృతంలో నియమం కలదు. తెలుగులో నూరు, నూట ఎనిమిది, నూట పదహారు శ్లోకాలు, పద్యాలతో కూడినవి కూడా శతకాలే శతకం సర్వజన రంజకమైన, శక్తివంతమైన ప్రక్రియ ఇది సంస్కృత, ప్రాకృత భాషలలోని కొన్ని విశిష్ట లక్షణాలతో తెలుగులో అవతరించిచంది. సంస్కృత శతక సాహిత్యంలో మిక్కిలి ప్రసిద్ధికెక్కిన వారు భర్తృహరి. తెలుగు నాట 12వ శతాబ్దంలో శతక ప్రక్రియ జనించింది. తెలుగులో శతక ప్రక్రియకు ఆద్యుడు మల్లికార్జున పండితుడు. 489 కంద పద్యాలతో ‘శివతత్త్వసారం’ రచించాడు. ఈ శివతత్త్వసారంలో శతక లక్షణాలలో ఒక ఛందో నియమం తప్ప తక్కినవి కనబడవు. శతక లక్షణాల్లో సంఖ్యానియమం, మకుటనియమం, ఛందోనియమం, రసనియమం, ఆత్మాశ్రయ కవితాధర్మము, ముక్తక లక్షణం మొదలైనవి ఉంటాయి. అయితే సమగ్రశతక వాఙ్మయానికి శ్రీకారం చుట్టినవాడు మాత్రం పాల్కురికి సోమనాథుడు. ఎక్కువ మంది పరిశోధకులు తెలుగులో, సంఖ్యానియమం, మకుట నియమాలతో వెలసిన మొట్టమొదటి శతకం వృషాధిపశతకం ప్రసిద్ధికెక్కింది. తెలుగులో శతక వాఙ్మయంపై పరిశోధన చేసిన తొలిపరిశోధకుడు వంగూరి సుబ్బారావు **‘శతక కవుల చరిత్ర’** సిద్ధాంత గ్రంథాన్ని రచించాడు.

తెలుగులో వెలసిన శతకాలను కాలక్రమముననుసరించే కాక వస్తువును అనుసరించి సాహిత్య పరిశోధకులు కింది విధంగా వర్గీకరించారు. అవి 1. భక్తి శతకాలు 2. వ్యాజస్తుతి శతకాలు 3. వేదాంత శతకాలు 4. నీతి శతకాలు 5. అధిక్షేప శతకాలు 6. శృంగార శతకాలు 7. హాస్యశతకాలు 8. ప్రకీర్ణ శతకాలు 9. కథాత్మక శతకాలు. తెలుగులో శతక సాహిత్యం భక్తి శతకంతోనే ప్రారంభమైంది. భక్తిని బోధించే విధంగా రాసిన శతకాలను భక్తి శతకం అనవచ్చు. లోకంలో మోక్షం పొందడానికి ప్రతి మనిషికి సులభతరమైన మార్గం భక్తి మార్గం. తెలుగు భక్తిశతకాలలో శైవ, వైష్ణవ, దేవీభక్తి, వెంకటేశ్వర, సాయి, క్రీస్తు, రఘురామ మొదలగు భక్తి శతకాలు ఎక్కువుగా కనిపిస్తాయి.

ఈ శతక రచనా విధానం తెలుగులో తేటగీతి, ఆటవెలది, కందం, సీసం వంటి ఛందస్సులలో తెలుగు భాషకు మాత్రమే పరిమితమైన ప్రాసనియమం వంటి లక్షణాలను ప్రోగు చేసుకొని మరింత ప్రసాధ గుణోపేతమైంది. శతకాలు ముక్తక ప్రాయాలు మత ప్రభోదానికి, జ్ఞాన తత్త్వ ప్రచారానికి, నీతిబోధకు, ఆత్మాశ్రయ కవిత్వానికి అనుకూలంగా ఈ ప్రక్రియను ఎన్నుకొన్నారు. ధర్మపురి శేషప్ప **“నరసింహ శతకాన్ని’** తెలుసుకునే మునుపు రెండు మాటలు. ఎర్రన నృసింహ శతకం అలభ్యం. నృసింహ శతకం మట్టుపల్లి కవి రచించిన శతకం కూడా ఉంది. ఈయన కాలం క్రీ.శ 18 పూర్వార్థం. తెలుగు సాహిత్య దర్శిని పుట: 248.

తరిగొండ వెంగమాంబగారు మంత్ర ప్రసిద్ధి పొందిన తరువాత రచించిన మొట్టమొదటి శతకం తరిగొండ నృసింహ శతకం. ఈ శతకంలో నృసింహస్వామి అవతార ఘట్టాన్ని వర్ణించారు. **'నరసింహ శతకాన్ని ధర్మపురి శేషప్ప'** రచించాడు. కాలం 18వ శతాబ్దం. ఈ శతకంలో మొత్తం సీసపద్యాలే ఉన్నాయి. సీసపద్యం ముగింపు కావాలంటే ఒక ఆటవెలది పద్యమో లేక తేటగీతి పద్యమో తప్పనిసరిగా ఉండాలి. అయితే ఇందులో శతకం మొత్తం తేటగీతి పద్యంతోనే శేషప్ప ముగించారు. పద్యాలు మూడు రకాలు. వృత్తజాతి, ఉపజాతి, జాతి పద్యాలు. సీసపద్యం ఉపజాతిపద్యాలలో చాలా పెద్దది. చెప్పదలుచుకున్న విషయాన్ని చాలా చక్కగా చెప్పవచ్చు.

**భూషణ వికాస! శ్రీధర్మపుర నివాస!**

**దుష్టసంహార! నరసింహ! దురిత దూర!** అనేది మకుతం ఉంది. మొదటి పద్యమే భగవంతుని దివ్యరూపాన్ని తలుచుకొని కవి రచించాడు. ప్రతి పద్యం పండితులకే కాదు పామరులకు కూడా చాలా చక్కగా అర్థమవుతుందంటే అతిశయోక్తి కాదు. భాషలోను, భావంలోను శేషశైలి పామరులను ఉత్సాహపరిచింది. శేషశైలిలో రచించిన వీధినాటకాలు ప్రజాధారణ పొందాయి. నిత్యం శేషశైలి ధరువులు ప్రజల నాల్కులపై నాట్యమాడాయి. ఈ శతకంలో మనిషి పడే కష్టాలు, సుఖాలే కాకుండ భగవంతుడు తమ భక్తులను కాపాడిన విధం రామాయణం, భారతం, భాగవతం ఘట్టాలు దశావతార వర్ణన, సమాజంలో నేడు జరిగే పరిస్థితులు ఈ శతకంలో కనిపిస్తాయి.

ఈ శతకంలో ఉన్న ప్రతి పద్యం సమకాలీన సమాజాన్ని నేటి పరిస్థితిని ఎలా వివరిస్తుందో పరిశీలిద్దాం.

సీ॥ **తల్లి గర్భమునుండి ధనము తే దెవ్వడు**
**వెళ్ళిపోయేడినాడు వెంటరాదు**
**లక్షధికారైన లవణమన్నమె కాని**
**మెఱుగు బంగారంబు మ్రింగబోడు**
**విత్తమార్జన జేసి విఱ్ఱవీగుటె కాని**
**కూడ బెట్టిన సొమ్ము కుడవబోడు**
**పొందుగా మఱుగైన భూమిలోపలబెట్టి**
**దాన ధర్మము లేక దాచి దాచి** పద్యం: 15

పై పద్యంలో కవి చెప్పిన విషయాలన్ని అక్షర సత్యాలు పుట్టినప్పుడు ధనము తేలేదు ఎవ్వరు. మరణించినప్పుడు కూడా ఆ ధనము వెంట రాదు. లక్షాధికారైన తినేది ఉప్పు అన్నమే గాని బంగారాన్ని తినడు. డబ్బు సంపాదించి పొగరు పెంచుకొనుటయే గాని దాచిన సొమ్మును అనుభవించడు. దాచి దాచి దొంగలకే ఇస్తాడో, దొరల పాలే చేస్తాడో ఏమో? కష్టించి సంపాదించి దాచిన తేనెను తేనేటీగలు బాటసారులకు ఇస్తుందవా!

**మాన్యంబు లీయ సమర్థు డొక్కడు లేడు**
**మాన్యముల్ చెఱుప సమర్థులంత** పద్యం: 14

నిజమే భూములు ఇవ్వగలవారు లేరుగాని వాటిని పోగొట్టడానికి అందరూ సమర్థులే. పండిన పంటలకు అందరూ పెద్దలే అని వెక్కిరించాడు. ఆనాటికే కాదు ఈనాటి సమాజానికి కూడా ఈ పద్యం వర్తిస్తుంది.

**పసరంబు పంజైన బసుల గాపరితప్పు**
**ప్రజలు దుర్జనులైన ప్రభుని తప్పు** పద్యం: 12

ఈ పద్యంలో తప్పుకు కారకులెవ్వరు చూపించారు. పశువు చెడ్డదైతే పశువుల కాపరిది తప్పు. జనులు దుర్మార్గులైతే రాజుది తప్పు. భార్య గయ్యాలిది అయితే భర్తది తప్పు. పుత్రుడు చెడితే తండ్రిది తప్పు. సైన్యం

పారిపోతే సేనాధిపతిది తప్పు. కూతరు చెడినా తల్లిది తప్పు. గుర్రం చెడ్డదైతే రౌతుది తప్పు. ఏనుగు చెడ్డదైనా మావటిది తప్పు. అని ఈ విధమైన తప్పులు తెలియక ప్రపంచమందలి ప్రజలు తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తారంటారు.

**సీ॥ లోకమం దెవడైన లోభిమానవు డున్న**
**భిక్షమర్థికి జేత బెట్టలేడు**
**తాను బెట్టకయున్న దగవు పుట్టదు గాని**
**యొరులు పెట్టగ జూచి యోర్వలేడు**
**దాతదగ్గఱ జేరి తన ముల్లె చెడునట్లు**
**జిహ్వతో జాడీలు చెప్పు చుండు**
**ఫలము విఘ్నంబైన బలు సంతసమునందు**
**మేలు కలిగ్గన జాల మిడుకుచుండు** పద్యం: 16

ఈ పద్యంలో పిసినారి స్వభావాన్ని చాలా చక్కగా వ్యక్తపర్చాడు. నాటి సమాజానికే కాదు నేటి సమాజానికి ఈ పద్యం నిలువుటద్దం. లోకంలో పిసినారి అడిగినవాడికి ఏమీ ఇవ్వలేడు. అయిన తగువలేదు. ఇచ్చేవాడిని చూసి సహించలేడు. వారి దగ్గరకు చేరి తన సొమ్మంతా పోతున్నట్లు నేరాలు చెబుతాడు. అప్పుడు ఆదాత దానం చెయ్యడం మానేస్తే లోభి ఆనందిస్తాడు. మానకపోతే దు:ఖ పడుతాడు. నేటి సమాజంలో కూడా ఇలాంటి వారికి బుద్ధి చెప్పవలసిన అవసరం వుంది. ఇటువంటి వారు ఉన్నట్లైతే దేశాభివృద్ధి చెందదు. ప్రజలు సుఖంగా జీవించలేరు. ఇలాంటి చీడపురుగులను అంతంచేయాలన్నదే కవి ఆకాంక్ష.

**సీ॥ పాంచభౌతికముదు ర్భరమైన కాయం బి**
**దెప్పుడో విడచుట యెఱక లేదు**
**శత వర్షముల దాక మితము జెప్పిరి గాని**
**నమ్మరాదా మాట నెమ్మనమున**
**బాల్యమందో, మంచి ప్రాయమందో లేక**
**ముదిమియందో లేక ముసలియందొ**
**యూరనో, యడవినో యుదక మధ్యముననో**
**యెప్పుడో విడుచుట యే క్షణంబొ** పద్యం: 20

పంచభూతములో కూడుకున్న ఈ శరీరం విడిచి పెట్టేది ఎప్పుడో తెలియదు. నూరేళ్ళ ఉండునందురేగాని నమ్మలేము. బాల్య, యౌవన, కౌమార దశలలో ఎప్పుడో ఒకప్పుడు ఊరియందో, అడవియందో నీటి మధ్యలోను ఈ శరీరాన్ని ఏ క్షణంలోనైన విడుచుట నిశ్చయం అన్న యదార్థాన్ని ఈ పద్యంలో కవి పొందుపర్చారు.

**సీ॥ తల్లిదండ్రులు భార్య తను లాప్తులు బావ**
**మరధులన్నలు మేన మామగారు**
**ఘనముగా బంధువుల్ గల్గినప్పటికైన**
**దాను దర్లగ వెంట దగిలి రారు** పద్యం: 21

బంధు ప్రీతిని విడిచి ముక్తి పొందాలన్నదే ఈ పద్య సారం. నిజమే తండ్రి, భార్య, పుత్రులు, ఆప్తులు, భావ మరుదులు, అన్నలు, మేనమామలు మొదలగు చుట్టాలు ఎంతమంది ఉన్నప్పటికి చనిపోవునప్పుడు ఏ ఒక్కరును వెంటరారన్నదే అక్షర సత్యం.

**సీ॥ అతిశయంబుగ కల్ల లాడ నేర్చితి గాని**

**పాటిగా సత్యముల్ పలికి యెరుగ**
**సత్కార్య విఘ్నముల్ సలుప నేర్చితి గాని**
**యిష్ట మొందగ నిర్వహింప నేర**
**ఒకరి సొమ్ముకు దోసి లొగ్గ నేర్చితి గాని**
**చెలువుగా ధర్మంబు సేయనేర**
**ధనము లియ్యంగ వద్దనగ నేర్చితి గాని**
**శీఘ్ర మిచ్చెదునట్లు చెప్పనేర** పద్యం: 24

భగవంతుని దగ్గర ఎలా తప్పును ఒప్పుకొని ప్రార్థిస్థామో మన మనసాక్షి ఎలాంటిదో మనిషి బుద్ధి ఎలాంటిదో ఈ పద్యంలో గమనించవచ్చు. గొప్పగా అబద్ధాలు ఆడుతా, మంచి పనులు చేయలేను, మంచి పలుకులు పలకలేను , ప్రీతిగా మాట్లాడలేను, మంచి పనులను పాడుచేస్తాను , ఒకరి డబ్బుకు ఆశిస్తాను, ధానం ధర్మం తెలియదు, ధర్మం చేసే వాడిని చూసి సహించలేను నా గుణాలు అన్నీ ఇవే నేను దుర్మార్గుడను నాకు నీవే దిక్కు నన్ను కాపాడు తండ్రీ.

**సీ॥ అధిక విద్యావంతు లప్రయోజకులైరి**
**పూర్ణశంఠలు సభా పూజ్యులైరి**
**సత్యవంతులమాట జన విరోధంబాయె**
**వదఱుబోతులమాట వాసికెక్కి**
**ధర్మ వాదనపరుల్ దారిద్ర్యమొందిరి**
**పరమ లోభులు ధన ప్రాప్తులైరి**
**పుణ్యవంతులు రోగ పీడితులైరి**
**దుష్టమానవులు వర్ధిష్ణులైరి** పద్యం: 26

సమాజంలో జరిగే దౌర్భాగ్యాన్ని తలుచుకొని కవి ఆవేదన చెందాడు. నిజమే విద్యాధికులు అప్రజయోజకులుకాగా మూడులు గౌరవాన్ని పొందుతున్నారు. నిజం మాట్లాడడం నిష్టూరంగా ఉంది. కారుకూతలు ఆడేవారు రానిస్తున్నారు. ధర్మవాదులు దరిద్రులౌతున్నారు. లోభులు సంపన్నులౌతున్నారు. పుణ్యాత్ములు రోగముల చేత పీడింపబడుతున్నారు. దుర్మార్గులు గొప్పవారు అవుతున్నారు. మాలాంటి వాల్లకు శక్తిలేదు. మాకు నీవే దిక్కు.

**గౌతమ స్నానాన గడతేరుదామంటె**
**మొనసి చన్నీళ్లలో మునగలేను** పద్యం: 9

భగవంతునికి హంగులు అర్భాటాలు చేయనవసరం లేదని శక్తి కొద్ది భగవంతుని తన మనస్సులో తలుచుకుంటే చాలని ఈ పద్య భావం. కొంతమంది చన్నీళ్లలో మునగాలంటే చలి, తీర్థయాత్రలకు నడవడానికి శక్తిలేదు. దానధర్మాలు చేయాలంటే ధనము లేదు. తపం ఆచరిద్దాం అంటే నిమిషమైనను మనస్సు నిలవదు. కష్టమునకు ఓర్చుకోలేను నిన్ను తలుచుకుంటాను స్వామి నా శక్తి కొద్ది. నన్ను కాపాడి రక్షించు.

ఆడవాళ్ల ఆస్తులను అపహరించకూడదని పరేస్త్రీలను బలత్కరించకూడదని దొంగతనం చేయకూడదని 10వ పద్యంలో చెప్పుటమే కాకుండా అలా చేస్తే ఎలాంటి గతులు వస్తాయో చాలా వివరంగా చెప్పియున్నారు. అలాగే 11వ పద్యంలో గాడిదకు కస్తూరి బొట్టు, కోతికి సుగంధం, పులికి తీపిరొట్టే, పందికి మామిడిపండు, దున్నపోతుకు మంచి బట్ట, పిల్లికి మల్లిపూలచెండు, గుడ్లగూబకు కండ్ల ఆభరణములు, కొంగపిల్లకు పంజరం, దుర్మార్గులకు మధురమైన నీ నామ జపం ఎందులకు? ఇవన్నీ వ్యర్థం అన్నదే కవి సందేశం. విధవరాలకు పూలచెండు, గ్రుడ్డికి అద్దము, సొగసులేని దానికి ముత్యాల హారము, చప్పిడిముక్కికి నత్తు, దుర్మార్గునికి మంచి మాటలు, వ్యభిచారికి నియమాలు,చెడు నడత కలవానికి వావివరసలు, జూదరికం ఆటపట్టింపు, చెవిటివానికి మంచి కథలు వ్యర్థమన్నదే

13వ పద్యంలో సారాంశం. 27వ పద్యంలో భూమిలో యాత్రలు చెయ్యవచ్చు. ముఖ్యమైన నదుల్లో మునగవచ్చు. వేదాలకు అర్థం చెప్పవచ్చు. ధనము లక్షల కోట్లు ధానం చేయవచ్చు. అయితే వీటన్నిటికంటే భగవంతుని మీద మనస్సు నిలపడమే కష్టం అంటాడు. 28 వ పద్యంలో భుజబలంతో పులులను, చేత్తో పామును, ఎంతోమంది బ్రహ్మరాక్షసులను, మనుషుల రోగములను నాలుకకు ఇష్టంలేని చేదును జయింపవచ్చు. అయితే దుష్టులకు జ్ఞానాన్ని ఇవ్వడం కష్టం అంటాడు కవి.

**సీ॥ నరసింహ నాకు దుర్ణయములే మెండాయె**
**సుగుణ మొక్కటిలేదు జూడ జనిన**
**అన్య కాంతలమీద యాశ మానగ లేను**
**బరుల క్షేమము జూచి యోర్వలేను**
**ఇటువంటి దుర్బుద్ధు లిన్ని నాకున్నవి**
**రురె జేసెడి వన్ని నీచకృతులు**
**రావంటి పాపిష్టి నరుని భూలోకాన**
**బుట్ట జేసితి వేమి భోగిశయన** పద్యం: 33

నరసింహ స్వామి ఇన్నీ అని చెప్పలేని చెడ్డ ఆలోచనలు ఉన్న నేను చేసే పనులన్నీ పాపపు పనులే భూలోకంలో నావంటి దుర్మార్గున్ని ఎందుకు పుట్టించావు అని భగవంతున్ని నిందించి శరణు వేడేవాళ్ళు లేకుండా పోలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో పద్యాలను వివరించుకోవచ్చు.

నిత్యం గానం చేయడానికి నారదుడుగాను, సేవ చేసి మెప్పించడానికి శబరిగాను, బాల్యం నుంచి నీయందు భక్తి ఉంచడానికి ప్రహ్లాదుడుగాను, గణముగా గ్రంథము రచించడానికి వ్యాసుడుగాను, ఉండటానికి నాకు శక్తి లేదు. వారిలాగ భక్తి లేదంటాడు 23 పద్యంలో. అలాగనే 71, 72 వ పద్యాల్లో ప్రహ్లాదుడు మదగజం, నారదుడు, అహల్య ఉడుతా విభీషణుడు, పంచపాండవులు, ద్రౌపది, వీరందరు నీకు ఏమి ఇచ్చారు. వారిని కాపాడినట్లే నన్ను కాపాడమని ప్రార్థిస్థాం. ఇంతే కాకుండా బలిచక్రవర్తి దగ్గర బిడియపడకుండా బిక్షమెత్తావు శబరిదగ్గర సిగ్గులేకుండా చేతులు చాచావు. పిలవని పేరింటానికి విందుకోసం వేగ వేగంగా విదురుని ఇంటికి వెళ్ళావు. కుచేలుని దగ్గర అటుకులుకోసం ఆతృత చెందావు. స్వామి నీకు పెట్టడానికి మేమెంతవాళ్ళం. నీవే సాక్షాత్తు లక్ష్మీదేవికి భర్తవు, శమంతకమణి ఉంది నీకు ఇవ్వడానికి మాకు శక్తిలేదు. మమ్ములను సోధించవద్దుద. నీ దగ్గరకు కంటికి కనిపించవు. సముద్రంలో దాగి వుంటావు. పాము పడకలో పడుండావు. గరుడవాహనం ఎక్కి ఎగిరిపోతావు. నీలాగ సాధాసీదాగ బతకడం నాకు చేతకాదు. మమ్ములను కాపాడు, మమ్ములను ఉద్ధరించు ఈ జగన్నాటకాన్ని ఆడించే జగన్నాథుడువి నీవే కదా అన్న బావాలన్నీ ఈ శతకంలో ఉన్నాయి. మాట మాటకి ప్రతి పద్యంలో నరసింహ స్వామి నరసింహ స్వామి అనే పలుకు వినబడుతుంది.

73, 74, 75, 68, 28, 45, 96, 97, 57, 58 ఈ పద్యాల్లో భగవంతుడు భక్తులకు చేసిన మేలు, భక్తుల మొరలు, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ, భగవంతుని చేరుకోవాలనే తాపత్రయం, దశవతార వర్ణన, భక్తులు భగవంతుని తలచి తలచి పొందే ఆవేదన మెండుగా కనిపిస్తాయి.

10, 20, 32, 37, 52, 81 ఈ పద్యాలలో మనిషి శరీర వర్ణనే ఈ పద్యాలలో మెండు.

**సీ॥ పచ్చి చర్మపుతిత్తి పసలేదు దేహంబు**
**లోపల నంతట రోయ రోత**
**నరములు శల్యముల్ నవరంధ్రముల రక్త**

మాంసపు కండల మైలతిత్తి
బలువైన యెండ వానల కోర్వ దింతైన
తాళలే దాకలి దాహములకు
సకల రోగములకు సంస్థానమై యుండు
నిలువ దస్థిరమైన నీటిబుగ్గ
తే॥ బొందిలోనుండు ప్రాణముల్ పోయినంత
గాటికే గాని కొఱగాదు గవ్వకైన పద్యం: 52

నరసింహస్వామి పచ్చి చర్మముతో ఈ సారములేని దేహము లోపలకు చూడగా ఒకటే కంపు. నరములు, ఎముకలు, తొమ్మిది రంధ్రములు, మాంసము, కండలుగల మురికి సంచి, ఇవి ఎండ వానలకు ఓర్చుకోలేవు. ఆకలి దాహాలకు ఆగలేదు. సమస్త వ్యాధులకు ఇది రాజ్యము. నీటి బుడగవలె అస్థిరమైనది. ఈ శరీరంలోని ప్రాణాలు పోవడంతోటే, ఇది కాటిలోకే గాని గవ్వపాటి కూడా విలువ చెయ్యదన్నది యదార్థం. 3వ పద్యంలో నరసింహ మంత్రానికి ఉన్న శక్తి, 4వ పద్యంలో భగవంతునికే కాదు భక్తున్ని కూడా తలంచి నమస్కరించాలంటాడు. 2వ పద్యంలో భగవంతుని మీద బారం మోపి కవి రచన ప్రారంభించాడు. అదేవిధంగా 85వ పద్యంలో కవి ఏ ప్రాంతానికి చెందినవాడని తెలుస్తుంది. 100వ పద్యంలో కవి పేరు తెలుస్తుంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కొక్క పద్యం నేటి సమాజానికి ప్రతిబింబం.

సీ॥ అతివిద్య నేర్చుట యన్న వస్త్రములకే/ పశుల నార్జించుట పాలకొఱకే
సతిని బెండ్లాడుట సంసార సుఖమునకే/సుతుల బోషించుట గతులకొఱకె
సైన్యముల్ గూర్చుట శత్రుభయంబుబకే/సామునేర్చుటెల్ల చావు కొఱకె
దానమిచ్చుట ముందటి సంచితమునకె/ఘనముగా జదువుటల్ కడుపు కొఱకె
తే॥ యితర కామంబుగోరక సతతముగను
భక్తి నీయందు నిలుపుట ముక్తికొఱకె
భూషణవికాస! శ్రీధర్మ పురనివాస
దుష్టసంహార! నరసింహ! దురితదూర! పద్యం: 31

కోటి విద్యలు కూటి కొఱకె. పశువులు పాల కొఱకె. సతిని పెండ్లాడడం సంసార సుఖానికే . సుతులు గతులు కోసమే, సైన్యము శత్రువు భయం కోసమే, ధానం ఇవ్వడం ముందు జన్మలాసుఖము కోసం, సాము నేర్వడము చావు కొఱకె, ఓ నరసింహ స్వామి గొప్పగా నీయందు భక్తి నిలపడడం మోక్షం కోసమే. మనిషి ఏదో ఒక ముందు ఆలోచనతోనే నడుచుకుంటాడన్న విషయాన్ని వివరించాడు. ప్రది పద్యంలో భగవంతుని నామస్మరణ లేకుండా పద్యమే సాగదు. అన్ని పద్యాలు వీనులకు విందుగా ఉంటాయి. వైకుంఠమందుండు ఓ స్వామి నీకు నమస్కారం.

ఆధార గ్రంథాలు:

1.వేంకటకృష్ణశర్మ, వేదము. 1954. శతకవాఙ్మయ సర్వస్వము. మద్రాసు: వేదము వేంకటరాయశాస్త్రి బ్రదర్స్.
2.వెంకటప్పయ్య, వెలగా (సం) 2013, తెలుగు శతక మంజరి. విజయవాడ: నవరత్నబుక్ హౌస్.
3.వెంకటావధాని, దివాకర్ల. 1961. ఆంధ్రవ్మాయ చరిత్రము. హైదరాబాదు: తెలుగు అకాడమి.
4.గోపాలకృష్ణారావు, కె. 1975. ఆంధ్ర శతక వాఙ్మయం. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

❖❖❖

# నీతి సీస శతకం - వస్తు పరిశీలన

**డా.వి.వింధ్యవాసినీ దేవి**

తెలుగు అధ్యాపకురాలు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల,కర్నూలు

ఫోన్: 9705383422, Email: vidyavasini@gmail.com

శతకం వంద పద్యాల రచనే కాదు వేవేల భావాల వేదిక కూడా. శతకపద్యాలలో ఇమడని వస్తువంటూ లేదు. ఆధ్యాత్మిక, నీతి, వైరాగ్య, వేదాంత,సామాజిక, భక్తి, తాత్విక శతకాలే కాకుండా నవరసభావాలైన శృంగార, హాస్య, కరుణ శతకాలు సైతం కోకొల్లలుగా రాయబడి ప్రత్యేకించి పద్య ప్రేమికులకు,సాహిత్యప్రియులకు,సామాన్య పాఠకులకు సైతం ఆహ్లాదాన్ని,ఉపదేశాన్ని అందిస్తున్నాయి.ఎప్పటికీ పాతబడని ప్రక్రియ శతకం.ప్రాచీన, అర్వాచీన సాహిత్యాలు రెండింటిలోనూ ప్రత్యేక ఉనికిని నిలుపుకున్న ప్రక్రియ శతకం. పన్నెండవ శతాబ్ది మొదలుకొని నేటివరకు కొన్ని వందలు, వేల సంఖ్యలో శతకాలు రాయబడ్డాయి.వీటిలో భక్త,నీతి శతకాలే ఎక్కువ. మహాకవులు మొదలుకొని కొంగ్రొత్తగా కలం పట్టిన ఔత్సాహిక కవులు సైతం శతకరచనాప్రియులుగానే కనిపిస్తారు.

తెలుగు సాహిత్యానికి తాళ్ళపాకకవులు చేసిన సాహిత్యసేవ వెలకట్టలేనికి. శ్రీ వేంకటేశ్వరుని పాదపద్మాలను ఆశ్రయించి జీవితాలను ధన్యతగావించుకోవడమే కాకుండా తెలుగుసాహితీకళామతల్లిని తమ రచనల ద్వారా అక్షరాభిషేకం చేసిన విద్వత్కవులు. ప్రథమ సంకీర్తనాచార్యుడుగా పేర్గాంచిన అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుడు రచించిన నీతిసీస శతక పరిచయం చేస్తూ, శతకంలో వస్తు పరిశీలన చేయడమే ఈ వ్యాస రచన ఉద్దేశ్యం. **ఆంధ్ర శతక సాహిత్య వికాసము -** సిద్ధాంతవ్యాసంలో డా.కే గోపాలకృష్ణారావుగారు పెద తిరుమలాచార్యుని రచననలను ఇలా ప్రస్తావించారు.

“తాళ్ళపాక తిరుమలాచార్యులు నీతి సీస శతకము, శృంగార వృత్తాల పద్యశతకము, రేఫ రకార శతకములు రచించెను. ఈ మూడు శతకములు అత్యంత విశిష్టములైనవి.అలిమేలుమంగా వేంకటేశ్వరులనాలంబముగా దివ్య దాంపత్య శృంగారము చిత్రించిన శతకము ఈనాటిదే. భాషా వ్యాకరణాంశములను శతకవస్తువుగా గ్రహించి రేఫ రకార శతకమును రచించి శాస్త్ర శతకశాఖకు మార్గదర్శకుడైన కీర్తి తాళ్ళపాక కవికి లభించింది (పుట 30)” అని పేర్కొన్నారు.

ఎన్నో అమూల్య నైతికాంశాలను సరళ భాషలో, సుబోధకమైన శైలిలో రచించాడు పెద తిరుమలాచార్యుడు. సీసపద్యాలలో రాసిన శతకం కాబట్టి గ్రంథ శీర్షికలోనే సీస శబ్దాన్ని చేర్చాడు కవి. నీతి సీస శతకానికి సమగ్ర వ్యాఖ్యానం రచించిన ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు గారు శతక పీఠికలో తిరుమలాచార్యుని కాలం 1458 -60 ప్రాంతంగా తెలిపారు. 14 రచనలు వెలయించిన విద్వత్కవి పెదతిరుమలాచార్యుడని, నీతిశతకాలన్నింటిలో నీతి సీస శతకం పరిగణింపదగినదిగా వారు తెలిపారు.అయితే వేమన, సుమతి,భాస్కర మొదలైన ఇతర నీతి శతకాలు బహుళ ప్రాచుర్యం పొందినట్లు ఈ శతకం ఎందువల్లో అంతగా ప్రచారం పొందలేదు.ప్రజాబాహుళ్యంలో ప్రాచుర్యం పొందనప్పటికీ విలువైనరత్నాలను తనలో పొదుముకొని నిశ్చలగాంభీర్యంతో దర్శనమిచ్చే సముద్రుడిలా ఈ శతకం విలసిల్లుతుంది అని చెప్పడం అత్యుక్తి కాదు.

“నీతి సీసశతకం” ప్రధానంగా నీతిని బోధిస్తుంది.ఇందులో ధర్మనీతి, అర్థనీతి, ఆమోదయోగ్యమైన కామనీతి,ఒద్దుకు చేర్చే మోక్షనీతి వంటి అంశాలున్నాయని ఆచార్య బూదాటివారు వివరించారు. అయితే నీతిబోధ శతకమే అయినప్పటికీ ఆనాటి సమాజ జీవనాన్ని కుడా ఈ శతకం ద్వారా కొంతవరకు గ్రహించవచ్చు.సమాజం అంటేనే మానవ సమూహం. సంఘ జీవితంలో మానవులు ఒకరితో ఒకరు ఎలా మెలగాలి, ఎటువంటి లక్షణాలు కలిగిఉండాలి, ఏ ధర్మాలను

పాటించాలి, వివిధ వర్గాల వారైన రాజులు, మంత్రులు, యోగులు, గృహస్తులు, మహిళలు, యజమానులు, సేవకులు, గురువులు, స్నేహితులు, ఇలా సమాజంలోని మానవులందరూ పాటింపతగిన నియమాలను ఈ శతకంలో తెలియపర్చారు పెద తిరుమలాచార్యుడు. సుమారు ఆరు దశాబ్దాలక్రితం రాసిన ఈ శతకంలో కవి వ్యక్తపరిచినభావాలు నేటికీ ప్రాసంగికతను కోల్పోకుండా మానవులకు మార్గదర్శనం చేస్తున్నాయి.నాడైనా,నేడైనా కాలాలు మారుతున్నా మనిషిని మనీషిగా తీర్చిదిద్దేందుకు ఉపకరించే ధర్మసూత్రాలకు నిలయంగా భాసిల్లుతుంది ఈ శతకం. వస్తురీత్యా ఆధ్యాత్మిక,తాత్విక, సామాజికాంశాలతో త్రివేణీసంగమమై దర్శనమిస్తుందీ శతకం.

శ్రీ వేంకటేశ్వరున్ని సంబోధిస్తూ సమాజానికి ఉద్బోధ చేస్తూ ఈ శతక రచన చేశారు కవి. శతక మకుటం –

కలిత లక్ష్మీశ ! సర్వజగన్నివేశ !
విమల రవికోటి సంకాశ ! వేంకటేశ !

లక్ష్మీనాథుడవై, సర్వజగత్తుకు ఆధారభూతుడవై,కోటి సూర్యులతో సమానమైన తేజస్సు కలిగి ప్రకాశించే శ్రీ వేంకటేశ్వరా అంటూ సంబోధిస్తూ సమాజంలోని అనేకాంశాలను వేంకటేశ్వరస్వామికి విన్నవిస్తాడు కవి.

మానవపతనానికి కారణమయ్యేది అతనిలోని అంతర్గత శత్రువులైన అరిషడ్వార్గాలు. బాహ్య శత్రువును జయించడం సులభసాధ్యమేకానీ తనలోనే దాగిఉన్న అంతర్గత శత్రువును జయించడమే కష్టసాధ్యం. కాబట్టి అరిషడ్వార్గాలను అదుపులో పెట్టుకొని వ్యక్తి, లోకహితానికి పాటుపడే విధంగా జీవించడమే మనిషి సహజధర్మం. అందుకు వ్యతిరేకంగా వ్యక్తులు ప్రవర్తించకూడదన్న విషయాన్ని తెలియపర్చారు కవి. సమాజంలో కొందరిలో ఉన్న లోభత్వగుణాన్ని ఎత్తిచూపుతూ ఎంతటి గొప్పవారైనా సరే చివరికి రిక్తహస్తాలతోనే ప్రపంచాన్ని వదిలి వెళ్లిపోతారన్న నగ్నసత్యాన్ని చెబుతూ, చివరికి చేసిన ధర్మమే తన వెంట నిలుస్తుందంటారు. బతికినంతకాలం న్యాయబద్ధంగా, నీతి నిజాయితిలతో, ధర్మాన్ని అనుసరిస్తూ జీవించాలన్న విషయాన్ని ఎరుక పర్చారు. అశాశ్వతమైన సిరిసంపదల కోసం ఆరాటపడరాదని హితవు పలికాడు కవి.

సీ. మాంధాతగొనిపోడు మహి చేరెడైనను
గొనిపోడు రారాజు కొలుచు గొన్ని
....................................
దా నొనర్చిన ధర్మంబె దక్కుగాక ”

మాంధాత చారెడు భూమినైనా తన వెంటతీసుకుపోలేదు. రారాజైన ధర్యోధనుడు ధాన్యపు పొట్టునైనా వెంట తీసుకువెళ్ళలేదు. నలుడు నవరత్నాలలో ఒక్కదాన్నైనా వెంట పట్టుకుపోలేదు. శిబిచక్రవర్తి చిన్నమెత్తు బంగారమైనా తీసుకుపోలేదు. జీమూతవాహనుడు ఒక్క గోవునైనా తీసుకెళ్ళలేదు. యయాతి వస్త్రాన్నైనా పట్టుకుపోలెదు, అటువంటప్పుడు సిరిసంపదలు ఎవరికి శాశ్వతంగా వెన్నంటి ఉంటాయి, కాబట్టి మానవులు చేసిన ధర్మామే తనకు దక్కుతుందంటు లోభత్వాన్ని విడిచిపెట్టాలన్న సూచన చేస్తాడు కవి.

మరొక పద్యంలో అరిషడ్వార్గాలను జయించడమే అతిపెద్ద విజయమని బోధిస్తారు పెద తిరుమలాచార్యుడు.

సీ. “కోపంబు నడ చిన గురుతరాధ్వర ఫల
మింద్రియజయము మహేంద్రపదవి
చలము వారించుట సామ్రాజ్యవిభవంబు
చాంచల్య ముడు గుట సకలసిద్ధి
వెస నహంకారంబు విడుచుటే భాగ్యంబు........
తే.గీ . మింతకంటెను మేలు లేదెంచి చూడ
మహితనీతిజులైనట్టి మానవులకు”

కోపాన్ని జయించడమే గొప్ప యజ్ఞ ఫలమని, ఇంద్రియాల్ని జయించడమే మహేంద్రపదవి వంటిదని,

మాత్సర్యాన్ని వీడటమే సామ్రాజ్యవైభవమని, చంచలత్వాన్ని వీడటమే సకలసిద్ధికి మూలమని,అహంకారాన్ని విడిచిపెట్టడమే సౌభాగ్యమని,దైన్యాన్ని వదిలిపెట్టడమే ఉత్తమగుణమని, అపనిందలు లేని జీవితమే సాటిలేని లాభమని,ఋణవిముక్తుడు కావడమే హృదయానికి సౌఖ్యమని చెబుతూ నీతివేత్తలైన మానవులకు ఇంతకంటే మేలులేదని తెలియజేస్తాడు. అందుకే

" ఘనవివేకులు వీరల గతులు దెలిసి
వ్యసనములు మాని నడవంగవలయు నిలను"

అంటాడు కవి. పరస్త్రీని ఆశించిన కీచకుడు,రాజ్యలోభంతో దుర్యోధనుడు, దుర్భాషలతో శిశుపాలుడు, జూదవ్యసనంతో ధర్మరాజు, వేటమోహంలో పాండురాజు, మాత్సర్యంతో రావణాసురుడు, క్రూరత్వంతో వేనుడు,సురాపానంతో శుక్రుడు పతనమయ్యారని వీళ్ళు పొందిన ఇక్కట్లను తెలుసుకొని వివేకంతో నడచుకోవాలంటారు కవి.

మరొక పద్యంలో సంతానానికి ఆస్తులు సమకూర్చిపెట్టాలన్న తల్లిదండ్రుల తాపత్రయాన్ని కవి ఖండిస్తూ ఇలా అంటాడు.

సీ. ధరలోన నావులు తమ దూడలకునెల్ల
బెట్టెనా వాములు ప్రియముతోడ
బక్కలు ద్రవ్వించిపోయెనా నక్కలు
తమ పిల్లలకు నిరంతరము నుండ
దలచి దప్పికి నీళ్లు ద్రావ గూనలకును
గట్టెనా చెరువులు కప్పలెల్ల
బ్రియముతో రతిసల్పి బిడ్డలగనుమని
చెప్పెనా సింహంబు శిశువులకును

తే.గీ వట్టిభ్రమతలదమ పుత్ర వర్గమునకు
దల్లిదండ్రులు దలతురు ధనము గూర్ప
గలిత లక్ష్మీశ ! సర్వజగన్నివేశ !
విమల రవికోటి సంకాశ ! వేంకటేశ!

సమస్త ప్రకృతిలో ఏ ప్రాణి కూడా తన సంతానానికి అన్ని అమర్చిపెట్టదని ఒక్క మానవులలో మాత్రమే ఈ లక్షణమున్నట్టు వాపోతాడు కవి. ఆవులు తమ దూడల ఆహార నిమిత్తమై గడ్డివాములను సమకూర్చడం లేదని, తమ పిల్లలు నివసించడానికి నక్కలు కన్నాలు తవ్వి పెట్టడం లేదని,దాహానికి నీళ్ళు తాగడానికి తమ సంతానానికి కప్పలన్నీ చెరువులు కట్టించడం లేదని ,బిడ్డల్ని కనమని తన సంతానానికి సింహం చెప్పడం లేదని చెబుతూ మానవులు మాత్రమే తరాలు తిన్నా తరగని ఆస్తులను సంపాదించి ఇవ్వాలని పిచ్చిభ్రమతో తల్లిదండ్రులు భావిస్తున్నారని పేర్కొన్నాడు కవి. పిల్లలకు పంచాల్సింది ప్రేమను, ఇవ్వాల్సింది సంస్కారవంతమైన జీవితాన్ని , నేర్పాల్సింది ఉన్నతాదర్శాలను అన్న భావనను వ్యక్తం చేసారు కవి.

సమాజంలో సజ్జనుడు ఎలాంటి పనులు చేయకూడదో చెబుతూ దేవుని సంపదను ఆశించకూడదని,బ్రాహ్మణుడికి ద్రోహం తలపెట్టకూడదని, పతివ్రతా స్త్రీలను కామించకుండా ఉండాలని గర్వంతో విర్రవీగకూడదని,మోసపూరితమైన మనసుతో క్రూరాత్ముడుగా ప్రవర్తించకూడదంటాడు. పాపరహితమైన జీవనమే దైవకృపకు పాత్రమవుతుందంటారు.

సీ. ధర్మంబు గలచోట( దలకొను జయమెల్ల
దయగలచో సుకృతంబు నిలుచు
.................................

భక్తి చేసిన చోట ఫలమిచ్చు దైవంబు
మనసు నిల్పినచోట మలయు సుఖము

వ్యక్తులు తాము కోరుకున్న కార్యాలను సాధించడానికి ఎటువంటి లక్షణాలను అలవరచుకోవాలో చెబుతూ ధర్మమున్నచోటనే జయముంటుంది, దయ కలిగి ఉంటేనే పుణ్యం నిలుస్తుంది.సత్యవర్తనం వల్లనే శుభాలు సమకూరుతాయి, నియమబద్ధమైన జీవితం వల్లనే సంపదలు కలుగుతాయి.న్యాయబద్ధంగా మసలుకున్నపుడే ప్రతిజ్ఞలు నెరవేరుతాయి.భక్తితో ప్రార్థిస్తేనే దైవం అనుకూలిస్తుంది.మనసు పెట్టిన చోటనే సుఖం సంచరిస్తుందంటారు.నైతిక వర్తనమే వ్యక్తికి సకల శుభాలను చేకూర్చగలదని ఆ వర్తనమే మనిషికి నేడవసరమన్న విషయాన్ని తెలియజేశారు కవి ఈ పద్యంలో.

సృష్టిలో మధురమైనది స్నేహం.వ్యక్తుల నడవడికలో,జయాపజయాల్లో, స్నేహితుల పాత్ర ఇతోధికంగా ఉంటుంది.మంచివాళ్లతో చేసే స్నేహం చేయాలని సూచిస్తూ,ఎటువంటి వారితో స్నేహం చేయకూడదో తెలియజేశారు కవి. తప్పుదుదారిలో పయనించే వ్యక్తుల సహవాస ఫలితం వ్యక్తి పతనానికి దారితీస్తుంది.అటువంటి వారితో స్నేహానికి దూరంగా ఉండాలన్నది కవి ఉవాచ. "అసాధ్యుడైన వానితో, మోసగాడు,కష్టపెట్టే వాడు, సరదాపురుషుడు, కయ్యానికి కాలు దువ్వేవాడు, సుంకం తీసేవాడు,జూదరి, మోసగాడుఅనాచారి, చూస్తుండగానే దొంగతనం చేసే మునిముచ్చు,యిర్ష్యాళు వు,మూటముడివిప్పే దొంగ, కుత్సితుడు,అపకారి, పాపాత్ముడు, అవివేకి,జగడాలమారి, టక్కరి, కఠినాత్ముడు, వేటగాడు, దొంగ ఎత్తులు వేసేవాడు,వెర్రివాడు, అప్పులు చేయడమే పనిగా గలవాడు , మాయగాడు,తిరుగుబోతు,త్రాగుబోతుతో స్నేహం చేయకూడదని హితువు పలుకుతాడు కవి.

నాటి సమాజంలో అయినా నేటి సమాజంలో అయినా గురువుకున్న ప్రాధాన్యత ఎనలేనిది.గురువెప్పుడైనా ఉన్నత పీఠంలోనే నిలబడాలి. అంటే సన్మార్గంలో నడుస్తూ , తన శిష్యులకు మార్గదర్శకుడుగా నిలిచినప్పుడే గురువు గొప్ప స్థానాన్ని పొందుతాడు.పూజనీయమైన గురుస్థానంలో నిలబడే వ్యక్తులు ఎటువంటి లక్షణాలను కలిగిఉండాలో చెబుతూ రచించిన పద్యం సమాజంలో గురువు ప్రాధాన్యతను వెల్లడిస్తుంది.

" సత్సంప్రదాయుడై శాస్త్రపారీణుడై
యాగమగ్నుండైన యత(డు గురుడు…………"

సత్సంప్రదాయానికి చెందినవాడై, శాస్త్రపారంగతుడై,వేద విజ్ఞాన పారంగతుడైనవవారే గురువులు.పరమదయాళు వువై, పాపరహితుడై, ఆచారాన్ని పాటించేవాడే గురువు. గొప్ప జ్ఞానియై,ఇతరులకు బోధించే శక్తి సామర్థ్యాలు కలిగి అత్యంత శాంత చిత్తం గలవాడే గురుడు. తపోనిష్టగలవాడై గొప్ప మంత్రసిద్ధిగలవాడై,ఆధ్యాత్మవేత్త అయిన వాడే గురువు. ఆనాటి సమాజానికే కాదు ఈనాటి సమాజానికిసైతం వర్తించే పద్యమిది.

గురువు ఈ లక్షణాలను కలిగిఉంటే మరి శిష్యులెలా ఉండాలి, ఎటువంటి మార్గంలో పయనిస్తే శిష్యుడు ఉత్తమశిష్యుడుగా పేరుపొందుతాడు అనే విషయాన్ని మరొక పద్యంలో వివరించారు తిరుమలాచార్యుడు. శిష్యుడు ధనాన్ని,దేహాన్ని ఆచార్యుని సొమ్ము అని భావించి గురువుగారి అదుపు,ఆజ్ఞలను పాటించే కోరికను కలిగి, గురువుకు సేవ చేయడానికి శరీరాన్ని అలవాటు చేసి, మనస్సును దగ్గర పెట్టుకొని ఏ సమయంలోనూ మరుపన్నది లేకుండా, గురువు ఉపదేశాన్ని బట్టి భావన చేసి తిండికి,నిద్రకూ ఆశపడకుండా, అలసట చెందకుండా మదిలో విశ్వాసాన్ని వదలకుండా హరిభక్తి,గురుభక్తి రెంటిలోను గొప్పవాడవుతూ,వర్థిల్లేవాడే శిష్యుడు.అటువంటి వాడే శుభాల్ని పొందుతాడాని పెద తిరుమలాచార్యుడు స్పష్టం చేశారు.

రాజ్య సంరక్షకులైన రాజులు ఎలా ఉండాలో,ఎటువంటి రాజనీతిని అవలంభించాలో ఐదారు పద్యాలలో వెల్లడించారు కవి.అన్ని సందర్భాలలో యుద్ధమే సరైంది కాదని సామ,దాన,భేద,దండోపాయాలతో విచక్షణతో.యుక్తితో మసలుకోవడమే రాజనీతి.రాజనీతి తెలిసున్న రాజే ఈ భూమండలాన్ని పాలించగల సమర్థుడంటాడు.

సీ. "సముడైన శత్రుతో సంధిసేయుట గార్య

మెక్కుడైనను గప్పమిడగవలెయు

................................."

తనతో సమానమైన శత్రవుతో సంధి చేసుకోవడం సముచితం.శత్రువు తనకంటే అధికుడైతే కప్పమిచ్చి మంచి చేసుకోవాలి.శత్రుసైన్యం స్వల్పమైనదయితే దండెత్తాలి.యుద్ధం నుండి పారిపోయి దాక్కున్నప్పటికీ వదిలిపెట్టకూడదు.శత్రువులు ఇద్దరైతే వాళ్ళమధ్య తేడాలు పెంచి, భేదాలు కల్పించడం రాజనీతి.అలాకాకుండా కలతపడేలాగా అయినా అణగద్రొక్కాలి.అది వీలుకాకపోతే శత్రువుపై శత్రువును పురిగొల్పడం మంచిది.లేదా మరో విధంగానైనా ముట్టడిచేసి శత్రువును రూపుమాపాలి.ఇలా యుక్తితో నడచుకోవడమే రాజనీతని అలా నడచుకునే రాజే సమస్త భూమిని పాలించడానికి అర్హుడంటాడు కవి.

మరో పద్యంలో చెరపట్టడం,కొల్లగొట్టడం,లూటీ చేయడం వంటివి చేయకుండా శత్రువుల మీదకు దండెత్తాలి.గడ్డీ,నివాసం, నీరు ఉండే చోటు చూసుకొని దండును వదలాలి. ఆక్రమించిన ప్రాంతాలకు రక్షగా నాయకుల్ని ఉంచి, ఆపైన సామంతుల్ని చేసుకోవాలి.గజ,అశ్వ,కాల్బలాలు గాయాలతో ఇబ్బంది పడకుండా, పోరాడి శత్రువుల్ని గెలవాలి. బుద్ధి కలతపడి, చెదరకుండా రాజు నెమ్మదిగా భుజబలపరాక్రమాన్నిచూపటం తగిన పద్ధతి.

సీ. " తనకు గా మును జెడ్డ జనులను రక్షంచి
యిల మేలు గోరిన హితులను బ్రోచి
వడి దోడు నవసిన వారిని మన్నించి
బడి దిరిగినవారి బ్రభుల జేసి
..........................
ఎల్లవారలు జయపెట్టి నేలుచుండి
నినుతికెక్కినయధిపుడు ఘనుడు దలప"

తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరిని కాపాడాల్సిన బాధ్యత రాజుదే. చేసిన మేలు మరవని రాజే సకల జనుల మెప్పుపొందుతూ ప్రజారంజకంగా పాలన చేయగలడు.తనకోసం ముందుగా నష్టపోయిన వారిని రక్షించాలి. మేలుకోరే హితుల్ని కాపాడాలి,నలిగిపోయి,కృషించిన వారిని ఆదుకొని, వెన్నంటి తిరిగిన వాళ్ళను అధికారులుగా చేసి, తనకోసం మిక్కిలిగా దూషణపడ్డ మిత్రుల్ని పోషించి, ధనమిచ్చి ఆదుకున్న స్నేహితుల్ని ఆదరించి, సాయపడ్డవారికి బ్రతుకు తెరువు కల్పించి పాతమిత్రులకు హితులకు సంపదలిచ్చి,అందరూ జయజయధ్వనులు చేస్తుంటే పాలిస్తూ ఖ్యాతికెక్కిన రాజే గొప్పవాడు.

సుఖదుఖాలలో పొంగక,కుంగక నిశ్చలస్థితిలో ఉన్నవాడే అసలైన యోగి, ఇంద్రియనిగ్రహం కలిగి జితేంద్రియుడుగా మెలిగేవారే అసలైన యోగులని పేర్కొంటూ,యోగి లక్షణాలను ఇలా పేర్కొన్నాడు కవి.' యోగి ఆకాశంలా స్థిరంగా ఉండాలని,చీకట్లను పారద్రోలే సూర్యునిలా ప్రకాశించాలని వాయువులా బలంగా ఉండాలని,పరిపూర్ణత్వాన్ని పొంది సమచిత్తంతో అనేక రకాలుగా భగవంతుని పట్ల అచంచలమైన భక్తిని కలిగిఉండాలన్నాడు.

సీ. "సుఖదుఃఖముల నుబ్బుస్రుక్కుల బరయక
వనధికై వడి నుండువాడు యోగి
పంచేద్రియములపాల్పడి చలియింపక
గగనంబువలె నుండు ఘనుడు యోగి"

**ముగింపు:**

అనేకాంశాలను అతి సూక్ష్మదృష్టిలో, సమగ్ర దృక్పథంతో, సరళంగా,సుబోధకంగా నీతి సీసశతకం ద్వారా సమాజానికి అందించారు కవి. నైతిక వర్తనమే వ్యక్తిత్వవికాస ప్రథమసోపానం.నైతిక వర్తనం అలవరచుకోవడానికి తగిన సూత్రాలను ఈ శతకంలో తెలియజేశారు. సమాజంలో భిన్న వర్గాలవారి ప్రవర్తనను,లోకరీతిని,ఉచితానుచిత మార్గాలను,విలక్షణ సమజ స్థితిని, ఆనాటి సామాజిక జీవన విధానాలను ప్రతిబింబిస్తూ , సమకాలీన సమాజచిత్రపటంలా ఈ శతకం కనిపిస్తుంది.

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025**

# భర్తృహరి నీతి శతకం- వ్యక్తిత్వ వికాసం

## డా. రంగ సాయి కృష్ణ

తెలుగు శాఖాధ్యక్షులు, ఆగాఖాన్ అకాడెమీ, హైదరాబాద్

తెలుగులోవచ్చిన ఎన్నో ప్రక్రియలలో శతకం స్థానం ఎంతో ప్రత్యేకం. బాగా జోరుగా జనంలోకి చొచ్చుకుపోయిన తెలుగు ప్రక్రియలలో శతకం ఒకటి. దానికిప్రధానమైన కారణం శతకం అటు పండితులనూ, ఇటు పామరులనూ రంజింపజేసే లక్షణాన్ని కలిగి ఉండడం. అటువంటిశతక ప్రక్రియను సామాజిక దృష్టికోణంలో దర్శించడం ఈ సదస్సు లక్ష్యం. అసలు సామాజికం కానిది ఏది?వ్యక్తిత్వ వికాసం కూడా సామాజికామే.వ్యక్తుల కలయికే సమాజం. వ్యక్తిత్వ వికాసం సామాజిక వికాసానికి దోహదపడే కీలకాంశం.

వ్యక్తిత్వ వికాసం అంటే తాను ఒక్కడే వ్యక్తిగా ఎదగడం కాదు.వ్యక్తి స్థాయి నుండి విశ్వ స్థాయి వరకు ఎదగడం. సమాజాన్ని కలుపుకుంటూ పోవడం.

ప్రస్తుతం పదో తరగతి విద్యార్ధి నుండి పరిశోధకవిద్యార్థి వరకు, శాస్త్రవేత్తలనుండి స్వామీజీల వరకు,Teacher నుండి Tea కొట్టు నడిపేవాడివరకు, Policy Maker నుండి Politician వరకు

**అందరూ చర్చించే అంశం వ్యక్తిత్వ వికాసం.**

వ్యక్తిత్వ వికాసానికి ముఖ్యంగా నాలుగు అంశాలను మనము నాలుగు స్తంభాలుగా తీసుకుంటే అవి

- Physically fit
- Mentally alert
- Intellectually smart
- Emotionally well balanced

ఈ అంశాల ఆధారంగా భర్తృహరి రచించిన నీతి శతకంలోనిపద్యాలను అన్వయించడమే ఈ పత్ర ఉద్దేశ్యం.

ఎన్నోసంవత్సరాల క్రితం సంస్కృతంలో భర్త్రుహరి రచించిన సుభాషిత త్రిశతిపద్యాలు నేటికీ ఉపయోగపడతాయి.నీతి శతకం నా ప్రత్యేక పరిశీలన.

చ. వనజభవుండు కోపమున వాహనమైన మరాళభర్తకున్
వనజవనీవిహారకల నంబు దొలంగcగc జేయుcగాని గుం
భనమునదుగ్ధజీవన విభాగ విధాననిరూఢనైపుణీ
జనితమహాయశోవిభవసారము హంసకు మాన్పc జాలునే (భర్తృ.నీతి:15)

'బ్రహ్మ దేవుడు తన వాహనమైన హంస మీద కోపం వస్తే తామర వనంలో విహరించకుండా మాత్రమే చేయగలడు. అంతే కానీ నీటిని, పాలను వేరు చేయగల నైపుణ్యాన్ని, సహజ గుణాన్ని, అలా చేయడం వల్ల వచ్చే కీర్తిని మరియు పేరును మాత్రం పోగొట్టలేడు కదా!' అనేది భావం.

ఈపద్యం ఏ కాలానికైనా వర్తిస్తుంది. అధికారం లేదాధనంఉందనే దర్పంతో కొంత మంది తన కింద పని చేసే వారి పై అజమాయిషీ చేయగలరు. కానీ వారిలో ఉండే సహజ గుణాలను,నైపుణ్యాలనుమాత్రం దూరం చేయలేరు కదా!దీనిని సమాజంలో ఉన్న యువత గుర్తించినట్టయితే వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నీలబడేందుకు గట్టి ప్రయత్నం చేస్తారు. మనపై మనకు నమ్మకం ఉండడం చాలా ముఖ్యం. దీని వల్ల అధికార దర్పం లేదా ధన బలంతో ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినామనం అనుకున్నది సాధించగలం.

ఉ. గ్రాసము లేక స్రుక్కిన జరాకృశమైన విశీర్ణమైన సా
యాసము నైన నష్టరుచి యైనను బ్రాణభయార్తమైన ని
స్త్రాసమదేభకుంభపిశి తగ్రహలాలసశీలసాగ్రహా
గ్రేసరభాసమాన మగు కేసరి జీర్ణతృణంబు మేయునే (భర్తృ.నీతి:15)

అభిమానం గల జంతువులలో అగ్ర స్థానంలో నిలిచే సింహం, ఆకలితో కృశించినా, ముసలితనంతో చిక్కిపోయినా, కీళ్ళు సడలినా, కష్ట స్థితిని పొందినా, కాంతి విహీనమైనా, ప్రాణాపాయ స్థితిలో ఉన్నా మదించిన ఏనుగు కుంభస్థలాన్నే పగులగొట్టి తింటుందే తప్ప ఎండు గడ్డిని మాత్రం తినదు కదా!

అలాగే ప్రస్తుత సమాజంలో మనం చూసినట్లయితే వారు నమ్ముకున్న సిద్ధాంతం కోసం ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ,దుఃఖాలను తట్టుకుంటూ,వారు నడిచే దారిలో ఏం ఎదురైనాచివరి వరకు మూలాలకుకట్టుబడేవారు ఈ పద్యంలో చెప్పినట్టుగా సింహంలాంటి వారే. ఇదే పద్యాన్ని నీతి, నిజాయితీలకు కట్టుబడి పనిచేసే అధికారులకు, ఉద్యోగులకు, రకరకాల రంగాల్లోనివారికి అన్వయించుకోవచ్చు. సింహానికి గ్రామ సింహానికి మధ్య ఉన్న వ్యత్యాసం ఇక్కడే మనకు కనపడుతుంది.

ఉ. ఆపదలందు ధైర్యగుణ, మంచిసంపదలందుఁ దాల్మియు,
భూపసభాంతరాళమునఁ, బుష్కళవాక్చతురత్వ, మాజి బా
హాపటుశక్తియున్యశమునందనురక్తియు, విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, బ్రకృతి సిద్ధగుణంబులు సజ్జనాళికిన్. (భర్తృ.నీతి:22)

ఆపదలు వచ్చినప్పుడు ధైర్యంగా ఉండడం,ఐశ్వర్యము వచ్చినప్పుడు ఓర్పు, రాజ సభలలో వాక్పాటవం, యుద్ధం సందర్భంలోశౌర్యం, కీర్తి యందు ఆసక్తి, విద్యయందు మిక్కిలి కోరిక, సజ్జనులకు సహజ గుణాలు అని భావం.

నేటి కాలంలో ప్రతి చిన్న విషయానికీభయపడిపోయి,అంతటితోనే జీవితం అయిపోయిందనే భావంతో నేటి యువతరం కంగారుపడిపోతున్నారు.హనుమంతుడికి తన బలం తనకు తెలియానట్టు ప్రస్తుతం చాలా మందికి వారి పై వారికి నమ్మకం లేకపోవడం వల్ల ప్రతి చిన్న విషయానికీ ఆత్మహత్యలు చేసుకునేంత దూరం వెళ్తున్నారు.గెలిచినప్పుడు ఆ గెలుపును ఎలా తీసుకోవాలి? ఓటమి వచ్చినప్పుడు ఆ ఓటమి నుండి ఏమి నేర్చుకోవాలి? అనే విషయాలు మన పాఠ్య పుస్తకాలలో కొంత వరకు ఉన్నపటికీ అవి ఎంత వరకు మన మస్తకాలలోకి ఎక్కిస్తున్నారో అర్థం కానీ వ్యవస్థలో ఉన్నాం.

వివేకానందుడు చెప్పినట్టు If you WIN you lead, iif you LOOSE, you guide వంటి హితోక్తులను మన పాఠ్య పుస్తకాలలో చేర్చి విద్యార్థులు, యువతకు ఎలా చెప్పాలో మనం ఆలోచించాలి.

మ. యతి సంగంబున, బాలుఁడాదరముచే, జ్యాభర్త దుర్మంత్రిచే,
శ్రుతిహానిన్ ద్విజుఁ, దన్వయంబు ఖలుచేఁ, గ్రూరాప్తిచే శీల,ము
ద్ధతిచే మిత్రత, చూపులేమిఁ గృషి, మద్యప్రాప్తిచే సిగ్గు, దు
ర్మతిచే సంపదలు నశించుఁ, జెడు నర్థంబుల్ ప్రమాదంబునన్. (భర్తృ.నీతి:34)

'స్త్రీ సాంగత్యముచే యోగి, లాలన వల్ల కుమారుడు, చెడ్డ మంత్రి వల్ల రాజు, వేదాధ్యయనం లేకపోవడం వల్ల బ్రాహ్మణుడు, చెడ్డ పుత్రుని వల్ల వంశము, దుర్మార్గుల స్నేహము వల్ల శీలము, గర్వం వల్ల స్నేహం, తరుచుగా చూడకపోవడం వల్ల వ్యవసాయము, మద్యపానం వల్ల సిగ్గు, చెడు బుద్ధుల వల్ల సంపదలు, పరాకు వల్ల ధనము నశిస్తాయి' అనేది భావం.

చుట్టూ ఉన్నవారి వల్ల మనం కూడా ఎలా మారిపోతామో ఒక సారి ఈ పద్యం ద్వారా మనం తెలుసుకోవచ్చు. If you are surrounded by Idiots… you are considered as an Idiot అని ఆంగ్లంలో ఒక సూక్తి ఉంది.హంసల మధ్య కొంగ ఉన్నపటికీ ఆ కొంగ ఎప్పటికీ హంస అవ్వదు కానీ,కొంగల మధ్య హంస ఉంటే మాత్రం కచ్చితంగా ఆ హంస కొంగలా మారుతుందని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.పిల్లల సహవాసం అనేది ప్రస్తుతం చాలా ముఖ్యం.తల్లిదండ్రులుపిల్లలు,ఎవరితో ఉంటున్నారు?ఏం చేస్తున్నారు?అనేది తెలుసుకోవడం చాలా ముఖ్యం.

ప్రస్తుతం సమాజంలో ఇంట్లో పిల్లలపై గారాబం ఎక్కువ, ఈ విద్యావ్యవస్థలో విద్యార్థులపై ఆంక్షలు తక్కువ. ఈ సమయంలో పిల్లలు అనేక విధాలుగా తప్పు దారి పట్టడం మనం వింటున్నాం, చూస్తున్నాం. ఇంట్లో తల్లిదండ్రుల పాత్ర, బడిలో గురువుల పాత్ర ఈ క్రమంలో చాలా కీలకం. అలాగే మారుమూల గ్రామంలో ఏం జరుగుతుందనే విషయం రాజు వరకు తెలియాలంటే అది కేవలం మంత్రి ద్వారానే వెళ్తుంది, అలాంటప్పుడు మనం ఎన్నుకునే నాయకులు ఎంత బాధ్యతగా వారి కర్తవ్యాన్ని నిర్వర్తించాలో ఎంత పెద్ద బాధ్యత వారి మీద ఉందో మనం ఒక సారి ఆలోచించాలి.

ఉ. విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు, భోగకరి, విద్య గురుండు విదేశ బంధుడున్
విద్య విశిష్ట దైవతము, విద్యకు సాటి ధనంబు లేదిలన్,
విద్య నృపాల పూజితము, విద్య నెఱుంగని వాడు మర్త్యుడే..? (భర్తృ.నీతి:17)

విద్య అనేది మనతోనే చిరకాలం నిలిచిపోయే స్థిరాస్తి. చదువుకున్నవారైతే వారికున్న గుప్త ధనం చదువేనన్నమాట. మానవులకు చదువే అసలైన ఆభరణం.విద్య మనిషికి కీర్తిని, సుఖాన్ని ఇస్తుంది.విద్యయే గురువు.విదేశాలలో మనకు అండగా నిలిచే బంధువు.ఈ భూమిమీద విద్యకు సాటి అయిన ధనం ఏదీ లేదు. అందరి చేత పూజింపబడేది విద్య.

ఈ తరంలో ఎంతో మంది విదేశాలకు వెళ్ళి చదువుకోవాలని అనుకుంటున్నారు. కానీ ఏదో అలా వెళ్ళి చదవడం మాట అటుంచితే, ఒక స్థాయి నుండే సరైన పద్ధతిలో విద్యను నేర్చుకుంటే మనం ఎక్కడికి వెళ్ళినా ఆ విద్యే మనను కాపాడుతుందనే విషయాన్ని విస్మరిస్తున్నారు.కేవలం సర్టిఫికేట్ల కోసం కాకుండా ఒక ఉన్నతమైన జీవితం కోసం విద్యను అవలంబించాలనే ఆలోచన నేటి విద్యార్థులలో రావాలి. విద్య యొక్క ప్రాముఖ్యత,ఆవశ్యకతను పిల్లలకు తెలియజేయాల్సిన బాధ్యతతల్లిదండ్రులు, గురువులపైనే ఉంది.

**ముగింపు**

అన్వయించుకునే ఆసక్తి, ఓపిక ఉండాలే కాని, ప్రాచీన తెలుగు సాహిత్యం ఒక అద్భుతమైన జ్ఞాన భాండాగారం. అందునా శతక సాహిత్యం పండిత, పామర వర్గాలను సమంగా రంజింపజేయగలదు. సుభాషిత త్రిశతి వంటి శతకాలలోని పద్యాలను ఆధునిక తరానికి అందించగలిగితే అదే వారికి తరగని ఆస్తి.

**ఆధార గ్రంథాలు**

1. గురజాడ, గరికిపాటి. 2020.మనుచరిత్ర– వ్యక్తిత్వ వికాసం. విజయవాడ: శ్రీరాఘవేంద్ర ప్రచురణలు.
2. నాగయ్య. జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష. తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.
3. భర్తృహరి. 2012. భర్తృహరి సుభాషితములు. విజయవాడ: లిఖిత ప్రచురణలు.

❖❖❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# వజ్రగిరి నరసింహ శతకం- సామాజికత

**డా.కల్యాడపు రమేశ్**

సీనియర్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు

Email: rameshhcu87@gmail.com ఫోన్: 96404 50114

**పరిచయం:**

తెలుగు సాహిత్యంలో ప్రాచీనకాలం నుండి శతక సాహిత్యం విశిష్టమైన, విస్తృతమైన శాఖగా చెప్పబడింది. ఈ "వజ్ర గిరి నరసింహ శతకం" భక్తి శతకం అయినప్పటికీ ఇందులో సామాజిక, నీతిబోధక అంశాలెన్నో ఉన్నాయి. భక్తిశతకకర్తలు శివుని గూర్చి, విష్ణువును గూర్చి, దేవతారాధనంటి భక్తి భావాన్ని కవిత్వరూపంలో విభిన్న మార్గాలలో చెప్పినా, అంతర్గతంగా రచనలో ఆకాలం నాటి సామాజిక పరిస్థితులను తెలియజేస్తుంది.

శతకకర్తలు సాధారణంగా మకుటాన్ని పాటించి రచన చేయడం ప్రాచీనకాలం నుండి వస్తున్న సంప్రదాయంగా మనకు కనిపిస్తుంది. అందువల్లనే లాక్షణికులు శతకానికి గల ప్రధాన నియమాలలో "మకుట నియమం" ఒకటిగా పేర్కొన్నారు. భర్తృహరి నీతిశతకంలాంటి కొన్ని మకుట రహిత శతకాలు ఉన్నప్పటికీ అవి చాలా తక్కువ. శతక సాహిత్యాన్ని పరిశీలిస్తే భక్తి ప్రధానమైన శతకాలన్నీ మకుట సహితంగానే మనకు కనిపిస్తాయి. భక్తిరస ప్రధానమైన ఈ "వజ్రగిరి నరసింహ" శతకం కూడా 'సద్వర్ణితాహ్వా' అనే మకుటంతో రాయబడింది. 'సద్వర్ణితాహ్వా' అనగా సజ్జనులచేత కీర్తించబడిన పేరు గలవాడా అనే అర్థంతో మకుటం సార్థకమౌతుంది. ఈ శతకంలో మొత్తం 108 సీస పద్యాలున్నాయి.

**కవిపరిచయం:**

అసకనూరి రంగధామకవి గురించి శతకం చివరి పద్యంలో ఈ విధంగా చెప్పుకున్నాడు.

సీ. శ్రీలొంద వెలసిన చినరెడ్డి రంగక్ష
మాపాల వరసత్కుమార చంద్రుఁ
దగునట్టి చిన్న సుంకాధిపు ననుమతి
నసకనూరి సదన్వయాబ్ధి చంద్రుఁ
డై భువి వెలయు మోహనరంగశాయి నం
దనుఁడగు శ్రీరంగధామ సుకవి
రచియించి యష్టోత్తర శతకం బర్పణ
గావించె నీకుఁ బ్రఖ్యాతముగను

తే.గీ. సదయ హృదయుండ వగుచు బల్మిదము మీఱఁ
దగ నవధరించి సౌఖ్య సంధాయి వగుచు
రక్షణముసేయు జూటురి ప్రాంతవాస
వజ్రగిరి నరసింహ సద్వర్ణితాహ్వ. 108

పై పద్యం ఆధారంగా ఈ కవి అసకనూరి మోహనరంగశాయి కుమారుడైన రంగధామకవి యని తెలుస్తుంది. ఈయన చినరెడ్డి రంగక్ష్మాపాలుని కుమారుడైన చిన సుంకాధిపుని కోరికపై, జూటూరి ప్రాంతంలోని వజ్రగిరి నరసింహస్వామికి అంకితమిస్తూ ఈ శతకాన్ని రచించినట్లు తెలుస్తున్నది. ఈ జూటూరు అనంతపురం జిల్లాలోని యాడికి మండలం, తిమ్మాపురం గ్రామంలో పెన్నానదీ తీరంలో తాడిపత్రి, ఆలూరుకోనలకు దగ్గరగా ఉంది.

రంగధామకవి తన తండ్రిపేరు తప్ప వంశావళినికాని, కాలానికి సంబంధించిన విశేషాలేవి పేర్కొనలేదు. కవి కచ్చితమైన కాలం తెలియపోయిన ఈ రచనను బట్టి 18వ శతాబ్ది తరువాతి వాడని తెలుస్తుంది.

ఈ శతక తాళపత్రప్రతిని ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, పరిశోధనాలయం వారు శ్రీమతి బిరుదురాజు సూర్యాదేవి గారి దగ్గర 1973లో కొనుగోలు చేసినట్లు తెలుపబడింది. ఈ తాళపత్ర ప్రతిని కోదూరు విఠల్ రెడ్డి గారు పరిష్కరించి 1986లో ముద్రించారు. శతక సాహిత్యంలో నృసింహ, వైష్ణవ భక్తి పరమైన శతకాలు క్రీ.శ. 18వ శతాబ్దంలో ఎక్కువ వచ్చినట్లు తెలుస్తుంది. ఉదా. శేషప్ప రచించిన నరసింహ శతకం మొదలైనవి ఉన్నాయి.

**దశవతార వర్ణణ:**

వైష్ణవ భక్తి శతకాల్లో దశావతార వర్ణన సర్వత్రా కనిపిస్తుంది. అంతేగాక 'వైష్ణవభక్తి శతకాలలో గుణ మాహాత్మ్యాసక్తి, రూపాసక్తి, పూజాసక్తి, స్మరణాసక్తి, దాస్యాసక్తి, సఖ్యాసక్తి, వాత్సల్యాసక్తి, కాంతాసక్తి, ఆత్మనివేదనాసక్తి, తన్మయతాసక్తి, పరమ విరహాసక్తి అను పదకొండు విధాలైన భక్త్యాసక్తి పూర్వకమైన రచనా శిల్పం గోచరిస్తుంది'. (విఠల్ రెడ్డి, కోదూరు).

జూటూరిలో వెలసిన వజ్రగిరి నరసింహుని వర్ణిస్తూ కవి ఈ క్రింది. పద్యంలో వివిధ నారసింహ క్షేత్రాలలో వెలసిన నృసింహుని సంస్మరించాడు.

సీ. శ్రీలొంద సేవింతు జ్వాలాఖ్య నరసింహ
శర ణహోబలగిరిస్వామి నీకు
స్మరియింతు నీ కథల్ మాలోల నరసింహ
వేడుక మ్రొక్కెదఁ గ్రోడనృహరి
యంజలి సేతుఁ గారంజాహ్వయ నృసింహ
నతి నీకు భార్గవనారసింహ
సాష్టాంగ మిదిగో యోగానంద నరసింహ
వందనంబులు ఛత్రవటము నృహరి

తే.గీ. పావన నృసింహ మిమ్ముల భజనసేతుఁ
గరుణఁ బ్రహ్లాదు రక్షించుకరణి వేడ్క
జెలఁగి నా వాంఛ ఫలియింపఁజేసి ప్రోవు
వజ్రగిరి నరసింహ! సద్వర్ణితాహ్వ! 103

**రాజనీతి:**

రాజ్యాన్ని, ప్రభుత్వాన్ని, అధికారాన్ని అధ్యయనం చేయడమే రాజనీతిశాస్త్ర అధ్యయనం. ఆధునిక కాలంలో రాజనీతి శాస్త్రము 'శక్తినీ', అధికారాన్నీ' అధ్యయనం చేస్తోంది. స్థూలంగా రాజ్యం, ప్రభుత్వం రాజకీయాల గురించి అధ్యయనం చేస్తుందని చెప్పవచ్చు. ఈ అధ్యయనం మంత్రి స్థాయిలో ఉన్నవారు చేస్తున్నారు. అయితే ఈ శతక కర్త రాజు దగ్గర యోగ్యుడైన మంత్రిని గురించి వివరిస్తూ రచించిన ఈ పద్యం ద్వారా కవికిగల రాజనీతిజ్ఞతను తెలుపుతుంది.

సీ. స్థిరతరాఖండ లక్ష్మీ ధురంధరుఁ జేయు
మహిలోనఁ బ్రగ్గడ మంత్రియైన
ససతీ సుపుత్రుగా సమయించి గైకొను
మహితుఁడై నృపుఁడు దామంత్రియైన
నతిలోభ మొదవి(0చి యశము క్షేత్రముఁ బాపు)
మానక వైశ్యుండు మంత్రియైన

నాయంబు లోకార్చి యధమునిఁ జేసి తా
మనఁజూచు శూద్రుండు మంత్రియైన
నటు గనుక రాజు తాను మహా వివేకి
యగుచు మనవలె సిరులచే నతిశయముగ
మాన్యుఁడై నట్టి ప్రగ్గడ మంత్రిజేసి
వజ్రగిరి నరసింహ! సద్వర్ణితాహ్వ! 65

పై పద్యంలో రాజు దగ్గర మంత్రి ఎలా ఉండాలి, ఎవరిని మంత్రిగా నియమించుకోవాలి అనే విషయాలను తార్కికంగా తెలిపాడు.

**దానగుణం:**

తాము సంపాదించిన సొమ్ము తాము తినగలుగుతారా తినలేరుకదా! అలాగే దానధర్మము చేయక దోచి దాచిన సంపద చివరకు దొంగలకో! దొరలకో అనేది చెప్పటం కష్టం! కవి చెప్పినట్లు తేనెటీగలు జీవితాంతము కూడ బెట్టిన తేనెను అవి తినగలుగుతున్నాయా? తినలేవు! అలాగే సంపాదించిన సంపదను తాము తినక, ఇతరులకు దానం చెయ్యక చివరకు పోయేనాడు ఎవరైన వెంట తీసుకపోయారా అని తెలుసుకొని సంపాదించిన దానిలో లేని వారికి, బీదవారికి కొంచెమైన దానం ఇవ్వడం వల్ల పుణ్యం కలుగుతుందనే విషయాన్ని తెలుపుతూ దానగుణ విశిష్టతను తెలిపాడు. శేషప్ప కవి రచించిన నరసింహ శతకంలో కూడా ఇలాంటి భావాలున్నాయి.

సీ. పరగ ధర్మం బొనర్పఁగఁ జాల కెవ్వేశ
స్థిరము లీ సిరియును జీవ మనుచుఁ
గూడఁ బెట్టుకొనుచుఁ గొంచెమైనను బాత్ర
దానంబు సేయక తాము దినక
సరఘులు తేనియల్ సమకూర్చి పరులపాల్
సేయు విధంబునఁ జేర్తు రవని
పాలుని బాలై నఁ బావకు బాలైన
ముచ్చుల పాలైన మూఢు లగుచు
తే.గీ. వెంటఁ గట్టుక పోయిరె విత్తమెవ్వ
రైన మును పనిచి త్తంబునందు తెలివిఁ
గలిగి ధర్మంబు సేయంగ వలయు నరుఁడు
వజ్రగిరి నరసింహ! సద్వర్ణితాహ్వ! 67

**హితబోధ:**

పరుల సొమ్మును దోచుకోని జీవించడం కంటే బిక్షమెత్తుకొని బ్రతకటమే మంచిదని, అపకీర్తితో సంపాదించి తినటంకంటే చనిపోవడం మంచిదని చెప్తూ సమాజంలో మానవుడు నీతి, నిజాయితీగా జీవించాలని కవి హితబోధ చేసాడు.

సీ. పరగ నత్యాసక్తి బ్రతుకుటకంటెను
నవనిలోపల షండుఁడౌట మేలు
పరధనంబులను నపహరించి మనుకంటెఁ
బెంపొందు నింటింటి భిక్ష మేలు
సముచితోక్తులఁ బల్కఁ జతురత లేకున్న

నరులకుఁ జూడ మౌనంబు మేలు
అపకీర్తిని ఘటించు నన్నంబుఁ దినుకంటెఁ
దనువు త్యజించు చందంబు మేలు
తే.గీ. నరకముల నొందు సామ్రాజ్య గరిమకన్న
నీ పదాంభోజ పరిచర్య నిష్ఠ మే ల
టంచు వర్తింతు రనఘులై యార్యజనులు
వజ్రగిరి నరసింహ! సద్వర్ణితాహ్వ ! 78

అన్యోన్య దాంపత్యం: సమాజంలో భార్య భర్తల మధ్య సంబంధం గురించి చెప్తూ అనురాగవతియైన స్త్రీ భార్యగా వచ్చి పతియే ప్రత్యక్ష దైవంగా, ఎల్లప్పుడూ మనసులో భర్తని తలచుకుంటూ, భర్త మనసు తెలుసుకొని మెలగుగల భార్య ఉన్నప్పుడు ఆ ఇల్లు సుఖసంతోషాలతో కలకలలాడుతుందని తెలిపాడు.

సీ. పతియె దైవంబని పతియె పెన్నిధి యని
పతిభక్తి నాత్మలోఁ బాయ కెపుడు
పతికి సౌఖ్యామోద భావయై మెలఁగుచుఁ
బతి కనుకూలయై పరిఢవిలుచుఁ
బతిచిత్త మెఱిఁగి యేపట్ల మెలంగుచుఁ
బతిఁ బ్రాణపదముగా మతిఁ దలఁపుచుఁ
పతిని సద్రూప సంపద నలరింపుచుఁ
బతికి శాశ్వత పుణ్యఫల మొసఁగుచుఁ
తే.గీ. బుట్టినటువంటి యిలు దాను మెట్టినయిలు
బావనము సేయు నటువంటి పరమసాధ్విఁ
గలుగు ధన్యుండు నీ దయఁ గాంచు వాఁడు
వజ్రగిరి నరసింహ! సద్వర్ణితాహ్వ! 68

**శత్రుత్వం:**

సమాజంలో అనేక రకాలైన శత్రుత్వాలుంటాయి. రాజుకి, పొరుగు రాజ్యం ఆక్రమించుకోవడానికి చూసే శత్రుత్వం. కాని ఈ శతకంలో సామాజిక శత్రుత్వాల గురించి కవి తెలిపాడు. అవి సమాజంలో అత్యంత లోభిని అప్పు అడిగేవాడు వాడు, జార స్త్రీకి భర్త, దొంగలకు వెన్నల, సంగీతానికి సందడి, వయసు కాంతకు ముసలివాడు, ఇతరుల బలసంపదలకు చాడీలు చెప్పేవాడు, వేడుకలకు దుఃఖము, కోడలికి అత్త, సత్యానికి అబద్ధం ఇలా సామాజంలో ఒకదానికి ఒక వైరి సంబంధాన్ని చెప్తూ చివరగా పాపములకి నీ పాదములు నరసింహా అంటూ పద్య రచన చేసి కవి విష్ణుపాదలకు గల ప్రాశస్త్యాన్ని తెలుపుతూ కవికిగల వైష్ణవ భక్తిని తెలిపాడు.

సీ. గడుసు లోభులకెల్ల నడుగువాఁడే వైరి
తగ జారకాంతకు మగఁడె వైరి
తమకంబు దడబాటు తనదుబుద్ధికె వైరి
నెఱ దొంగలకును వెన్నెలయ వైరి
సంగీత విద్యకు సందడి ళి-తగ-రి-వైరి
వయసు కాంతకు ముదివాఁడె వైరి

చాడికాఁ డొరుల బలసంపదలకు వైరి
తథ్యంబునకు నన్నృతంబె వైరి
తే.గీ. వేడుకలకెల్ల దుఃఖంబు విడని వైరి
యాడుకొను కోడలికి నెల్ల నత్త వైరి
పాపముల కెల్ల నీ పదాబ్జములె వైరి
వజ్రగిరి నరసింహ! సద్వర్ణితాహ్వ ! 74

**అవివేకం:**

సమాజంలో ఉన్నటువంటి మూఢత్వం, అవివేకం, వెఱ్ఱితనం మొదలైనవాటి గురించి కవి ఈ విధంగా తెలిపాడు. భార్యని సరిగా చూడనివాడు, బావమరిది ఇంట్లో జీవించేవాడు, వారకాంతల వలపు నమ్మినవాడు, ఇతరుల పొందుకై వెళ్ళినవాడు, అకారణంగా గోడవపడేవాడు, నివసించరాని చోట నివసించేవాడు, నవ్వరానిచోట నవ్వేవాడు, తల్లిదండ్రులను వదిలేవాడు, ధర్మాన్ని గుర్తించనివాడు, కావాలని నిన్ను కాకుండా ఇతరులను పూజించేవాడు వెఱ్ఱివాడని తెలిపాడు.

సీ. అన్యుల కింపుగా నాలి నొల్లని వాఁడు
బావమఱఁదు లిండ్ల బ్రతుకువాఁడు
లలి వారకాంతల వలపు నమ్మినవాఁడు
నగరాని వరుసల నవ్వువాఁడు
మగనాలి పొందుకై మరులు సెందినవాఁడు
నూరకే కలహంబుఁ గోరువాఁడు
వాసెరుంగనిచోట వసియింపనగు వాఁడు
పగఁ దల్లిదండ్రులఁ బాయు వాఁడు
తే.గీ. ధర్మ మొసఁగక చిహ్నంబు దాచు వాడు
గోరి నిను మాని యితరులఁ గొల్చు వాఁడు
వెఱ్ఱి వారికి వాఁడె పో వెఱ్ఱి వాడు
వజ్రగిరి నరసింహ! సద్వర్ణి తాహ్వ! 76

**ముగింపు:**

ఈ శతకం ప్రధానంగా భక్తి భావంతోపాటు సాంఘికాచార ధర్మాలను, లోకజ్ఞతను, దానధర్మాలను గూర్చి, పతిభక్తిని గురించి, సతీసౌశీల్యాన్ని గురించి, కర్మ ఫలాన్ని గురించి, లోక వ్యవహారాన్ని గురించి, సామాజిక నీతిని గురించి, మనుష్యుల ప్రవర్తనల గురించి, దుష్టమంత్రుల అవినీతిని గురించి సూటిగా కవి తెలియజేసాడనంలో సందేహంలేదు.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. విఠల్ రెడ్డి, కోడూరు (పరిష్కరణ), 1986, 'వజ్రగిరి నరసింహ శతకము', ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, పరిశోధనాలయం, హైదరాబాద్.
2. వెంకటప్పయ్య, వెలగా (సం) 2013, 'తెలుగు శతక మంజరి', నవరత్నబుక్ హౌస్, విజయవాడ.
3. విఠల్ రెడ్డి, కోడూరు 'పీఠిక' 1986, 'వజ్రగిరి నరసింహ శతకము', ప్రాచ్యలిఖిత గ్రంథాలయం, పరిశోధనాలయం, హైదరాబాద్.
4. శేషప్ప, కాకుత్సస్థం, 'నరసింహ శతకము', 2014, వసుంధర పబ్లికేషన్స్, విజయవాడ.

# బద్దెన సుమతీ శతకం-నీతిప్రబోధాత్మకం

**డా.ఈతకోట ఈశ్వర రావు**
అసోసియేట్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం.
Email: dreswar6@gmail.com Ph.8106916469

పరిచయం :

తెలుగు సాహిత్యప్రక్రియలలో శతకాలు విశిష్టమైనవి. ఆయాకాల పరిస్థితులకు అనేక శతకాలు అద్దాలుగా నిలిచాయి. ఆత్మాశ్రయ కవిత్వానికి శతక సాహిత్యము పెట్టింది పేరు. శతకకర్తలు ప్రీత్యప్రీతులు, కష్ట నిష్ఠురాలు, మెప్పుదెప్పులు శతకాలలో కుప్పతెప్పలుగా కానవస్తాయి. ఇతర సాహిత్యప్రక్రియ ద్వారా తాను తానుగా వెలిబుచ్చలేని తన విషయాలను శతకాలలో కవి వెలిబుచ్చగలడు. కాబట్టి మిగతాప్రక్రియలలో లేని స్వాతంత్ర్యం కవికి ఈ ప్రక్రియలో లభించింది. చివరకు భక్తి ప్రధానమైన శతకాలలో కూడ కవులు తమతమ కాలాలలోజరిగిన విషయాలను నేరుగానో, విభిన్నంగానో వెలిబుచ్చ గలిగారు. సాంఘిక జీవితములో ఏర్పడిన సంఘటనలను, పరిణామాలెన్నింటినో శతకాలలో శతకకర్తలు వివరించారు.

సుమతీ శతకమును రాసిన మహాకవి ఎవ్వరో ఇంతవరకెవ్వరును నిశ్చయముగా తెలిపినవారు కారు. ఈ శతకమునకు ఉండినంత ప్రచారము మరే తెలుగు గ్రంథానికి లేదు. క్రీ.శ. 1910 లో వనపర్తిలో శ్రీ మానవల్లి రామకృష్ణ కవి భద్ర భూపాలుని నీతిశాస్త్ర ముక్తావళిని ముద్రించి దానికొక ఉత్తమ పీఠికను రచించి అందిట్లు వ్రాసిరి."ఇతడే భద్ర భూపాలుడు (బద్దెన) సుమతి శతకమును రచించెనని ప్రథమ పద్యము చూచిన దోచును. కాని యీ పద్యము నాకు లభించిన యైదు ప్రతులలో నొక్క దానిలో మాత్రమే యున్నది. రెండు ప్రతులలో ప్రారంభము లేదు. సుమతి శతకమునకును దీనికిని పాఠభేదము గానవచ్చుచున్నది. జాతీయ వాచకములలో భేదమగుపడును. సుమతి శతకమును రచించినవాడు భీమకవి యను లోక ప్రవాదమేకాక సుమతి శతకము తాళపత్రములలో ప్రథమ పద్యము భీమన పేరుతో నుండ నేను జూచియున్నాడను. ఇతడు వేములవాడ భీమ కవియా? లేక చదలవాడ భీమ కవియా? నృసింహపురాణమును రచించినవాడు దాక్షారామ వేశ్యలను వర్ణించినందున వేములవాడ భీమకవియే యని తోచుచున్నది... కావున సుమతి శతకమెవ్వరు రచించిరో గుర్తెరుగవలయును. నీతులు బద్దెన నీతులు వలెనున్నవి కాని శైలి మాత్రము భేదముగా నున్నది. ఇదియును పైయంశము వలెనే యనిశ్చితము. నీతిశాస్త్ర ముక్తావళిలో శ్రీ మానవల్లివారు ప్రకటించిన దానిలో మొదటి పద్యమిట్లున్నది."శ్రీవిభుడ, గర్వితారి క్ష్మాపర దళనోపలబ్ధ జయలక్ష్మీ సం భావితుడ, సుమతి శతకముఁ గావించిన ప్రౌఢ, గావ్య కమలాసనుడన్" శ్రీ.మా. రామకృష్ణ కవిగారన్నట్లుగా సుమతీశతకము నీతి శాస్త్రముక్తావళి శైలిలో చాలా భేదము కలదు. అందుచేత సుమతీ శతకమును ముందు రచించి తర్వాత నీతి శాస్త్ర ముక్తావళిని రచించి యుండిన సుమతి శతకములోని శైలీ సూచక పదజాలము కొంతయైనను రెండవదానిలో పడవలసి యుండవలెను. అట్టి జాడలేవియు కానరావు. భీమకవి వ్రాసెననుటకు తాళపత్రపద్యము లేవియు శ్రీకవిగారుదహరింప లేదు. అంతేకాదు వేములవాడ భీమకవియు చాలా ప్రాచీనుడు. నన్నయ తిక్కనల కాలపు శైలియే వేరు. సుమతిశతకములోని శైలి శ్రీనాథుని అనంతర శైలిగా కనిపిస్తున్నది. కాళిదాసుని గురించి మనకెంత తెలియునో తుదకు సుమతి శతక కర్తను గురించియు మనకంతే తెలిసినదనవలెను."

కవియెవ్వరో తెలియనప్పుడు కవి కాలమెట్లు తెలియును. అయినను శతకములోని శైలినిబట్టి కొంత యూహింపవచ్చును. భద్ర భూపాలుడు క్రీ.శ. 1150కి పూర్వమందే ఉండిన వాడనియు అతనిని అతని పద్యాలను నీతి సారములో రుద్రదేవుడును సకల నీతి సమ్మతములో మడికి సింగనయు మరికొందరును నుదాహరించిరని ఆ

కవిగారు తెలిపినారు. సింగనాదులు సుమతి శతకము నుండి పద్యాలనేల యుదహరింపలేదు. మడికి సింగన తర్వాతిదే ఈ సుమతీ శతకమని చెప్పవచ్చును. నీతి శాస్త్రముక్తావళిలో తిక్కనయు అతనికి పూర్వులును వాడిన పదాలెక్కువగా కలవు. కెలసము, పొరచి, ఎత్తికోలు, పురులు, ఒరిమే, కురగట, మున్నగు బహు ప్రాచీన పదములతడు వాడినాడు. అయితే ఈ పదాలను తిక్కన తర్వాతి వారును వాడిరని పరిశోధించి చూపించ వచ్చును. కాని అవి పరిశోధన శ్రమకు లోనైనవే అగును. శతకములో నిట్టి శబ్దాలు కానరావు.

ఆరుద్ర సుమతీ శతకం బద్దెనది కాదని అభిప్రాయపడ్డారు. బద్దెన కాలం క్రీ.శ. 13వ శతాబ్ది అని నిర్ణయించారు. వేమన పద్యాలు సేకరించిన మూడేళ్ళకే సి.పి. బ్రౌన్ సుమతి శతక పద్యాలను కూడా సేకరించి – 150 పద్యాలను అచ్చుకు సిద్ధం చేశాడు. ఇందులో 85 పద్యాలకు ఆంగ్లానువాదం కూడా చేశాడు. సుమతి శతకాన్ని మొట్టమొదట 1842లో ముద్రించిన వాడు కూడా బ్రౌనే. ఆ తర్వాత వావిళ్ళవారు ప్రచురించారు. వేమన శతకంలో లాగా సుమతీ శతకంలో కూడా చాలా పద్యాలు ప్రక్షిప్తాలు. ఎవరో రాసి శతకంలో చేర్చి వుంటారు. సరైన సుమతీ పద్యాలను నిర్ణయించటం కష్టం సుమతీశతకంమీద పరిశోధన చేసిన మచ్చ హరిదాసుగారు సుమతీ శతక పద్య సంఖ్యను 206గా నిర్ణయించారు.

**నీతి శతకములు:**

“భక్తి శతకములు, తాత్త్విక శతకములు కేవలము ముక్షువుల కుద్దేశింపబడి నట్టివి, నీతి శతకములు పూర్వ గ్రంథములను లోకానుభవమును ఆధారముగా చేసికొని ఇహ జీవితమును పురస్కరించుకొని రచింపబడినట్టివి. ఇందలి నీతులు మానవసంఘమునందలి వివిధ వ్యక్తులకు సంబంధించినవి. కనుక నీతిశతకములు సర్వజనహితకరములైనవి. పాఠకుల ప్రవర్తనను చక్క చేయుట కివి తోడ్పడును. నీతి శతకకవి జీవితసమస్యను చర్చించును. నీతి శతకములందు రాజనీతి, గృహనీతి, లోకనీతి, ప్రవృత్తి నీతి అనునవి ముఖ్యములైనవి. రాజనీతియందు రాజధర్మములు, ప్రజారక్షణ సేవక ధర్మములు ముఖ్య విషయములు. గృహనీతి లేదా సంసారనీతిలో మాతాపితృపుత్ర సంబంధములు. అనుకూలవతియగు భార్య, పర స్త్రీలయెడ వర్తన, స్త్రీ ధర్మములు, స్త్రీలపట్ల ఆనాటి పురుషుల దృష్టి, వారకాంతలు అను విషయములు ప్రాముఖ్యము వహించును. లోకనీతిలో లోకవృత్తము, సంఘవిమర్శ, చుట్టములు, ఆశ్రితులు. అర్థార్జనము, సమకాలిక జీవితము, విషయసంపద అను విషయములు ముఖ్యమైనవి. మానవుని నైతికవర్త నము, సత్యము, దయ, దానము, లోభిత్వము, శౌర్యము మున్నగునవి ప్రవృత్తి నీతిలోని ప్రధానాంశములు. ఇట్లు విషయ బాహుళ్యమును బట్టి నీతి శతకములు సర్వజన పఠనీయములగు చున్నవి.”

“శతకములలో సుమతి శతకం తెలుగువారికి ఇలవేల్పు. భాషా సాహిత్యములకు శైలికి, నడకకు, శబ్దార్థాలంకారములకు, రీతితత్త్వ బోధనకు, బోధనా విధానమునకు ప్రతీకగా నిలుచునది సుమతి శతకం” అన్నారు కె. గోపాలకృష్ణరావు. “తెలుగువారికి చాలా సన్నిహితమైన వాటిలో సుమతి శతకం ఒకటి. సాహిత్యంలో రీతులు, అభిరుచులు మారినా సుమతి శతకం మాత్రం తరతరాలుగా మనవారిని అలరించి నీతిని అందిస్తూనే ఉన్నది” అని వెల్లడించారు ఎమ్. కులశేఖరరావు. మచ్చ వారిదాసు సుమతి శతకంలోని ఛందఃశిల్పం గురించి, కవితా రీతి గురించి చక్కగా విశ్లేషించారు. “శ్రీరాముని దయచేతను నారూఢిగ సకల జనులు నౌరాయనగా ధారాళమైన నీతులు నోరూరగ చవులుపుట్ట నుడివెద సుమతీ”్న అనే పద్యం ప్రక్షిప్తమని కొందరి అభిప్రాయం. అయినా సమస్త జనులు ఆదరిస్తారని, అందరికీ నచ్చేలా చెప్తానని కర్తకి అన్వయిస్తే సమంజసంగానే వుంటుంది. తాను చెప్పే నీతులు అనే భావం ఈ శతక రాజుల నిరసన: సుమతి కారుడు ప్రజల పక్షం వహించాడు. ప్రజల్ని పట్టించుకోని రాజుల్ని నిరసించాడు. రాజులు, అధికారులు ఏవిధంగా ఉండకూడదో, ఏవిధంగా ఉండాలో వివరించాడు. రాజు ప్రజల కోసమే అని స్పష్టం చేశాడు. “అడిగిన జీతంబియ్యని మిడిమేలపు దొరను గొల్చుట” వ్యర్థమన్నాడు వెట్టిచాకిరీ కూడదని ఆనాడే తెలిపాడు. సుమతి కారుడు ప్రజల బాధల్ని, గోడుని వినేవాడే రాజు. ఆ విధంగా వినక పోతే –

"అధికార రోగ పూరిత బధిరాంధ కశవము జూడ బావము సుమతీ" అన్నాడు. అటువంటి ప్రజల పక్షం వహించనివాడు అధికారం అనే రోగంతో కలిగిన గుడ్డి, చెవిటి పీనుగు వంటి వాడే అని కళ్ళెర్ర జేశాడు. ఇటువంటి బధిరాంధక శవంతో సమానుడైన రాజును చూడటం కూడా పాపమేనట! రాజు అధికారుల అలసత్వాన్ని, అశ్రద్ధనీ ఉపేక్షించకూడదు. శిక్ష అనేది లేకపోతే విశృంఖలత్వం పెరగదా? కాబట్టి తప్పులు తెలుసుకొని సక్రమమార్గంలో పరిపాలించలేని నృపుని రాజ్యం మూరు?ని తపస్సులా, లేమిలో పడుచు భార్యలా వ్యర్థమంటాడు. 'భూతల పతి జారుడు' కారాదు. 'నరపతి మేర' తప్ప కూడదు. "ఎప్పుడు తప్పులు వెదకెడు" రాజుని ఆశ్రయించటం ప్రమాదకరం. రాజులకు బొంకకుండా ఉండటమే అలంకారమట. "దగ్గఱ కొండెము సెప్పెడు ప్రెగ్గడ పలుకులకు రాజు ప్రియుడై మఱితా నెగ్గు ప్రజకాచరించుట బొగ్గులకై కల్పతరువు పొడుచుట సుమతీ"మన్మథుడినైనా దగ్గరకి రానివ్వదట! కాబట్టి పర స్త్రీ వ్యామోహం వద్దని హెచ్చరించాడు.

సుమతీ శతకంలో కులాల ప్రస్తావన కనబడుతుంది. కుల వ్యవస్థ గురించి ఆ కాలపు అభిప్రాయాలు, స్థితిగతులు తెలుసుకోవడానికి ఈ పద్యాలు తోడ్పడతాయి తప్ప అతను కుల పక్షపాతి అనో, కుల వ్యతిరేకి అనో భావించకూడదు. ఒకచోట కోమటి పురికి ప్రాణం అంటాడు. మరొక చోట కోమటిని నమ్మకూడదంటాడు. 'వెట్టిగొల్లవాడు' అన్నాడు. "నమ్మకు మగసాలెవాని" (కంసాలి) అని పేర్కొంటాడు.

సుమతీ శతకంలో వేమనంత సూక్ష్మ పరిశీలనతో కాకపోయినా – కొంత లోక పరిశీలనతో కొన్ని జీవిత సత్యాలు వివరించబడ్డాయి. లోక రీతికి సంబంధించిన ఈ జీవన ధర్మాలు సుఖమయ జీవితానికి సోపానాలు. అక్కరకు రాని చుట్టాన్ని వదిలెయ్య వలసిందే నన్నాడు. అప్పుచేసి పప్పుకూడు తినవద్దన్నాడు. 'అమ్మా' అని ఆప్యాయంగా అనురాగంతో పిలవని నోరు నోరే కాదట! మనకి ఉపకారం చేసిన వాడికి తిరిగి ఉపకారం చేయటం గొప్పకాదు మనకి అపకారం చేసినవాడికి కూడా ఉపకారం చేయటమే మానవత్వం అవుతుందని గొప్పగా బోధించాడు. అవసరాన్ని బట్టి "నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగుట" తప్పదట! మన బంధువులు, స్నేహితుల స్వభావాలు ఎలావుంటాయో బాగా పరిశీలించి చెప్పిన అక్షరాక్షర సత్యం ఇది: "ఎప్పుడు సంపద గలిగిన నప్పుడు బంధువులు వత్తురదియెట్లన్నం దెప్పలుగ చెఱువు నిండిన కప్పలు పదివేలు చేరు గదరా సుమతీ" ఎక్కడ పడితే అక్కడ నిష్కారణంగా నవ్వితే నవ్వుల పాలవుతారని హితవు పలికాడు. శత్రువు ఇంట్లో భోజనం. ఇతరుల ద్రవ్యం ఉంచుకోవడం, పరుల మనస్సు బాధపడేలా మాట్లాడటం తగదన్నాడు. సిరిసంపదలు మాయగా భావించాలిట! తన కుమారుని గుణగణాలను ఇతరులు మెచ్చు కొన్నప్పుడే తండ్రికి పుత్రోత్సాహం కలుగుతుంది. ఇటువంటి "సత్యాలెన్నో చక్కగా ఈ శతకంలో వివరించబడ్డాయి.

**సుమతీ నీతిప్రబోధాత్మకం**

"శ్రీరాముని దయచేతను.. నారూఢిగ సకల జనులునౌరాయనగా..ధారాళమైననీతులు..నోరూరగ చవులువుట్ట నుడివెద సుమతీ! ఇది బద్దెన రచించిన సుమతీ శతకంలోని మొట్టమొదటి పద్యం. శతకం కాని, ఏదైనా కావ్యం కాని రాసేటప్పుడు మొదటి పద్యాన్ని సర్వసాధారణంగా శ్రీ తో మొదలుపెడతారు. అలాగే మొట్టమొదటి పద్యంలో దైవస్తుతి ఉంటుంది. బద్దెన రాసిన ఈ శతకంలో ప్రతిపద్యం చివరసుమతీ అనే మకుటం వస్తుంది. బద్దెన పద్యంలో తన పేరును పెట్టుకోకుండా రాశాడు ఈ శతకాన్ని. 'సుమతీ' అంటే 'మంచి బుద్ధి/మనస్సు కలవాడా!' అని అర్థం. మంచిబుద్ధిగలవాడా! మీకు కొన్ని నీతులు చెబుతాను, వినండి. ఈ నీతులు నేను చెబుతున్నానంటే అందుకు నా ఇష్టదైవమైన శ్రీరాముని అనుగ్రహమే కారణం. నేను చెప్పబోయేవన్నీ రానున్న కాలంలోనూ ప్రసిద్ధికెక్కుతాయి. అవి ఎవరూ అడ్డుచెప్పలేని ఉత్తమమైనవి. ఒకటి వింటే మరొకటి వినాలనిపించేలా ఉంటాయి. ఎంతో ఉపయోగకరమైనవి కూడా. ఈ నీతులు విన్నవారు చెప్పే విధానం బాగుంది అని ఆశ్చర్యపోతారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సుమతీశతకంలోని కొన్ని పద్యాలనైనా కంఠతా చేయాలి. అని తన మొదటి పద్యంలోనే బద్దెన నీతి ప్రబోధం చేసారు.

ప్రయోజకుడు కాని కొడుకు పుడితే అతడు ప్రయోజకుడు కాకపోవటమే కాకుండా, తండ్రిలో ఉన్న సుగుణాలకు చెడ్డపేరు తీసుకువస్తాడు. చెరకుగడ చివర కంకి మొలిస్తే, మొలిచిన చోట తీపి ఉండదు. అక్కడ లేకపోవటమే కాక, గడలో ఉన్న తీపినంతటినీ కూడా ఈకంకి చెడగొడుతుంది. ఇది ప్రపంచమంతటా ఉన్న సత్యం. కొఱగాని కొడుకు అంటే ఏపనీ చేతకానివాడు, నేర్చుకోని వాడు, ఏ పనీ చేయనివాడు అని అర్థం. ఇలాంటివారినే అప్రయోజకులు అని కూడా అంటారు. కొందరు పిల్లలు ఏ పనీ చేయకుండా, బద్ధకంగా, సోమరిగా ఉంటారు. అంతేకాక పనికిమాలిన పనులు అంటే చేయకూడనిపనులు చేస్తూ, తండ్రి పేరు చెడగొడతారు. అందరిచేత చివాట్లు తింటారు. అటువంటి కుమారుడిని చెరకులో పుట్టిన వెన్నుతో పోల్చి చెప్పాడు బద్దెన. ప్రపంచంలో ఉండే నిజాలు తెలిస్తేనే కాని ఇటువంటి వాటితో పోలిక చెప్పలేరు. "కొఱగాని కొడుకుపుట్టిన కొఱగామియె కాదు తండ్రి గుణములు చెరచున్ చెఱకు తుద వెన్ను పుట్టిన చెఱకున తీపెల్ల చెరచు సిద్ధము సుమతీ!" అంటూ నీతి ప్రబోధం చేసారు.

అందరికీ ఎప్పుడో ఒకప్పుడు ఏవో ఇబ్బందులు, కష్టాలు వస్తాయి. అటువంటి సమయంలో బంధువులు వారికి చేతనైన సహాయం చేయాలి. అలా చేయనివారు బంధువులు కారు. అటువంటివారిని దూరంగా ఉంచాలి... అని చెబుతూ ఎటువంటివాటిని దూరంగా ఉంచాలో ఈ పద్యంలో ప్రబోధిస్తాడు. "అక్కఱకు రాని చుట్టము / మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమున దా / నెక్కిన బాఱని గుర్రము..గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ! " కష్టాలలో ఉన్నప్పుడు సహాయపడని బంధువును తొందరగా దూరం చేసుకోవాలి. అలాగే ఆపదలు కలిగినప్పుడు, మొక్కుకున్నప్పటికీ దేవతలు కరుణించపోతే, ఆ దేవతను పూజించటం వెంటనే మానేయాలి. అలాగే యుద్ధాలలోఉ పయోగించటం కోసమని రాజుల వంటివారు గుర్రాలను పెంచుకుంటారు. యుద్ధరంగంలో శత్రువు మీదకు దాడికి వెళ్లడంకోసం ఆ గుర్రాన్ని ఎక్కినప్పుడు అది పరుగెత్తకపోతే దానిని కూడా వెంటనే వదిలివెయ్యటం మంచిదని భావం.

"వినదగునెవ్వరు చెప్పిన...వినినంతనే వేగపడక వివరింపదగున్...కనికల్ల నిజము తెలిసిన...మనుజుడెపో నీతిపరుడు మహిలోసుమతీ!" మంచిమనస్సు కలవాడా! ఎవరు ఏమి చెప్పినా దానిని శ్రద్ధగా వినాలి. అయితే విన్న వెంటనే తొందరపడి ఒక నిశ్చయానికి రాకూడదు. బాగా ఆలోచించి తెలుసుకొని, ఆ చెప్పిన విషయం అసత్యమో, సత్యమో అని ఎవరు తెలుసుకుంటారో వారు నీతి తెలిసినవారు. సుమతీ శతకంలో ఇది బాగా ప్రసిద్ధిచెందిన పద్యం. తరచుగా ఈ పద్యాన్ని అందరూ వాడుతుంటారు. ఎప్పుడైనా ఎవరైనా ఏదైనా విషయాన్ని చెప్పినప్పుడు దానిని శ్రద్ధగా వినాలి. అవతలి వారికేం తెలియదు అనుకోకూడదు. విన్న తరవాత తొందరపడి ఆ విషయం మీద ఒకనిర్ణయానికి రాకూడదు. వారు చెప్పిన విషయంలో ఎంత నిజం ఉందో, ఎంత అబద్ధం ఉందో ముందుగా తెలుసుకోవాలి. ఎవరైతే అలా తెలుసుకోగలుగుతారో వారిని నీతిపరులుగా చెప్తారు. తొందరపాటుతనం ఉండకూడదని బద్దెన ఈ పద్యం ద్వారా నీతిని బోధించాడు. తొందరపడి నిర్ణయం తీసుకుంటే అప్పుడు నష్టపోవడమేకాక, ఆ తరవాత కూడా బాధపడవలసి ఉంటుంది. ఈ భువిలో తెలివితేటలకుండే శక్తి గురించి మావటిని గురించిన "లావుగలవానికంటెను...భావింపగ నీతిపరుడు... "పద్యంలో ఎంతో అసాధారణమైన జ్ఞానంతో చెప్తాడు. తమకు చాలా బలం ఉంది అని గర్వంతో విర్రవీగేవారి గురించి వర్ణిస్తూ "బలవంతుడ నాకేమనిపలువురతో నిగ్రహించి పలుకుట మేలాబలవంతమైన సర్పము చలిచీమల చేతచిక్కి చావదె సుమతీ! " ఇది లోకంలో ఉన్న వాస్తవం. అటువంటి వాస్తవంతో పోల్చి, మనుషుల ప్రవర్తనను వివరించాడు బద్దెన. అవసరానికి డబ్బు అప్పుగా ఇచ్చేవాడు, జబ్బుచేయకుండా లేదా జబ్బు చేసినప్పుడు చికిత్స చేసే వైద్యుడు, తాగటానికి అవసరమయిన నీటినిచ్చే జీవనది, పెళ్లి వంటి శుభకార్యాల సందర్భాలలో పూజలు చేయించేందుకు బ్రాహ్మణుడు... ఈ సౌకర్యాలు లభించే ఊరిలో మాత్రమే నివసించాలని అనుభవపూర్వకంగా నైతికబోధ చేస్తాడు. "ఉపకారికి నుపకారము విపరీతము కాదు సేయ

వివరింపంగా...నపకారికి నుపకారము...నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ" మనకు ఎవరో ఒకరు అపకారం చేసినవారుంటారు. వారికి ఎప్పుడో ఒకప్పుడు మన అవసరం వస్తుంది. అటువంటప్పుడు మనం వారు చేసిన తప్పును ఎత్తిచూపుతూ వారికి సహాయం చేయకుండా ఉండకూడదు. వారు తెలియక తప్పుచేశారులే అని మంచిమనసుతో భావించి, ఆపదలో ఉన్నప్పుడు తప్పకుండా సహాయం చేయాలి. అటువంటివారే నేర్పరులవుతారని బద్దెన ఈ పద్యం ద్వారా నీతిని వివరిస్తాడు.

"తన కోపమె తన శత్రువు...తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ...తన సంతోషమె స్వర్గము...తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ! "తనకు ఉన్న కోపమే తనకు హాని చేసే శత్రువు. తనలో ఉన్న శాంతగుణమే తనకు రక్షగా ఉంటుంది. ఇతరుల దుఃఖాన్ని పోగొట్టటానికి తాను చేసే పనే తనకు బంధువు, చుట్టం. తనకు ఉండే సంతృప్తే స్వర్గం అంటే సంతోషాన్ని కలిగించేచోటుతో సమానం. తనకు ఉన్న బాధే దుఃఖాలను, ఇబ్బందులను కలిగించే స్థానమని విజ్ఞులు చెబుతుంటారు.ఇది వాస్తవం. కోపంతో ఉన్న మనిషి పశువుతో సమానం. ఏం చేస్తున్నదీ వారికే తెలియదు. ఆ కోపంలో విచక్షణ పోగొట్టుకుంటారు. కోపం తగ్గిన తరవాత తాము చేసిన తప్పు ఏంటో తెలుసుకుంటారు. అయితే అప్పటికే జరగరాని నష్టం జరిగిపోతుంది. అందువల్ల కోపాన్ని అణచుకుంటే మంచిదని ఈ పద్యంలో కవి వివరిస్తున్నాడు. ఇది వ్యక్తిత్వవికాసానికి అద్భుతమైనపద్యం. జీవితంలో చదువు, ఉద్యోగం, సంసార బంధనాల్లో క్షణికమైన ఆవేశంలో తనువులుబాసే జీవితాలు ఎన్నింటికి ఈ పద్యం గొప్ప వికాసాన్ని కలిగిస్తుంది. దుష్టుని శరీరమంతా విషంవ్యాపించి ఉంటుందని దుర్గుణాలు ఉన్న మనుషుల గురించి "తలనుండు విషము ఫణికిని...వెలయంగా దోకనుండు వృశ్చికమునకున్...తలతోక యనక యుండును...ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ! "దుష్టగుణంగలమానవులను దృష్టిలో ఉంచుకుని ఈపద్యంద్వారా వ్యక్తపరుస్తాడు. "కనకపు సింహాసనమున శునకము కూర్చుండ బెట్టి... ", "ఎప్పుడు సంపదలు గలిగిన నప్పుడు బంధువులు వత్తురు... ", "ఇత్తడి బంగారమగునె..., ", " అల్లుని మంచితనమును... " ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడి...వంటి ఎన్నో పద్యాలు తరతరాలుగా తల్లిదండ్రులు తమ పిల్లలకూ, పంతుళ్ళు తమ శిష్యులకూ సుమతీ శతకంలోని నీతులను ఉపదేశిస్తున్నారు. ఇన్నివందల సంవత్సరాల తరువాత కూడా ఇందులోని సూక్తులు నిత్య జీవనానికి సంపూర్ణంగా వర్తిస్తాయి. చెప్పదలచిన విషయాన్ని సూటిగా, కొద్ది పదాలలో చెప్పిన విధానం అత్యద్భుతం.

"సరసము విరసము కొఱకే,...పరిపూర్ణ సుఖంబు లధిక బాధల కొఱకే,పెరుగుట విరుగుట కొఱకే,ధర తగ్గుట హెచ్చు కొఱకె తథ్యము సుమతీ! " హాస్యపు మాటలు విరోధముకొరకే, సంపూర్ణమైన సౌఖ్యములు విస్తారమైన బాధలకే, పొడవుగా ఎదుగుట విరిగిపోవుటకే, ధరవరులు ఎక్కువగా తగ్గుట మరల అభివృద్ధి పొందుటకొరకేనని మనుషులు తెలుసుకోవాలంటాడు. "స్త్రీల యెడ వాదులాడకు,.." స్త్రీలతో గొడవ పడకు, పిల్లలతో స్నేహం చేసినా వారి వలె మాట్లాడకు, నీలో ఉన్న మంచి గుణములను విడవకు,అధికారుల/ప్రభువుల గురించిచెడుగా మాట్లాడకు."అడియాసకొలువు గొలువకుగుడిమణియము సేయబోకు..." ప్రయోజనములేని చోట పని/శ్రమ చేయకు, గుడిని ఆక్రమించకు, చెడువారితో స్నేహం చేయకు, అడవి దారిలో నగరానికి (ఆపదలు ఉన్న మార్గంలో) ఒంటరిగా నడవకూడదని నీతిబోధ చేస్తాడు. మనుషులు ఎలా జీవించాలి, ఏమి చేయాలి, సరైన ప్రవర్తన గురించి, ఎలా ప్రవర్తించాలో నియంత్రించే సాధారణ నీతిసూత్రాలన్నో, సుమతీ శతకపద్యాలను చదవటం, వినటం, ద్వారా ఎలా నడచుకోవాలో తెలుస్తుంది. ఎలాంటి ప్రవర్తన సరైనదో మంచిమనస్సుతో గ్రహించటంద్వారా అర్థం అవుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య సమీక్ష -2వ సంపుటి-డా.జి.నాగయ్య
2. తెలుగు సాహిత్య చరిత్ర -డా.ద్వా.నా.శాస్త్రి
3. సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు



❖❖❖

# పోతులూరి వీరబ్రహ్మం గారి కాళికాంబ శతకము - నేటి సమకాలీనత

డా॥ బత్తల అశోక్ కుమార్

అకడమిక్ కన్సల్టెంట్, తెలుగు&తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

Email: ashokbathala@gmail.com Ph.9490194780

మన సాహిత్యం సార్వకాలికమైంది. అయితే అన్నీ సార్వజనీనదృష్టితో చూడలేము. కొన్ని కావ్యాలు, కొంతమంది కవులు రాసిన రచనలు సార్వకాలికంగా నిలుస్తాయి. అలాంటి వారిలో వేమన ముందు వరుసలో ఉండగా, కాలజ్ఞాన తత్త్వాలతో సమాజాన్ని జాగృతం చేసిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి లాంటి వారు కూడా మనకు తెలుగు సాహిత్యంలో తారసపడతారు. ఆయన రాసిన కాళికాంబ శతకంలో నేటి సమకాలీన సమాజానికి అన్వయం చేసుకునే అంశాలు చాలానే మనకు కనిపిస్తాయి. ఆ దృష్టితో మనం ఆయన రాసిన పద్యాలను గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**పోతులూరి వీరబ్రంహ్మేంద్ర స్వామి జీవితం :**

గంగా నది తీరంలో బ్రహ్మాండపురవాసులైన విశ్వబ్రాహ్మణ పుణ్యదంపతులైన పరిపూర్ణయాచార్యులు, ప్రకృతాంబలు సంతానార్థులై కాశీయాత్ర చేశారు. కాశీనగరంలో పరమశివుడు కలలో కనిపించి విష్ణువు ఆమెకు కుమారుడుగా జన్మిస్తాడని చెప్పాడు. కొంతకాలానికి ప్రకృతాంబ గర్భం ధరించింది. నవమాసాలు నిండుతున్న సమయంలో స్వగ్రామానికి బయలుదేరగా, సరస్వతీ నదీ సమీపంలో మగబిడ్డను స్వస్తిశ్రీ చాంద్రమానేన కీలక నామ సంవత్సర (1608) కార్తీక శుద్ధ ద్వాదశినాడు ప్రసవించింది. వీరబ్రహ్మం జన్మించిన మరుసటిరోజు పరిపూర్ణయాచార్యులు కాలధర్మం చేశారు. ప్రకృతాంబ సమీపంలోని అత్రి మహాముని ఆశ్రమంలో చేరుకుని తనబిడ్డను పెద్దవాణ్ణి చేయమని కోరి తను కూడా తనువు చాలించింది. కర్ణాటక లోని స్కందగిరి పర్వతసానువులో స్థితమైన పాపాఘ్ని మఠాధిపతులు (ప్రస్తుతం ఇది చిక్‌బళ్లాపూర్ జిల్లా లోని కళవారహళ్లిలో ఉన్నది) అయిన విశ్వబ్రాహ్మణ పుణ్యదంపతులు యనమదల వీరభోజయచార్యులు, వీరపాపమాంబ సంతాన భాగ్యం కోసం పుణ్యక్షేత్రాలు సందర్శిస్తూ అత్రి మహాముని ఆశ్రమం చేరుకుంటాడు. సంతాన ప్రాప్తి కై పరితపిస్తున్న ఆ పుణ్య దంపతుల చెంతకు, దైవ స్వరూపులు అయిన బ్రహ్మన్ని ఆశ్రమ వాసులు అందజేస్తారు. ఆ పిల్లవాడు వీరప్పయాచార్యులుగా పాపాఘ్ని మఠాధిపతి గారింట సనాతన సంప్రదాయాల నడుమ పెరుగుతూ వస్తాడు. (ఈనాడు కర్ణాటక లోని పాపాఘ్ని మఠం బ్రహ్మం గారి ప్రథమ మఠంగా పేరు గాంచి దివ్య క్షేత్రంగా వెలుగొందుతున్నది). అతి చిన్న వయసులోనే, బ్రహ్మం గారు కాళికాంబపై సప్తశతి రచించి అందరిని అబ్బురపరుస్తాడు. బ్రహ్మం గారి పదవ ఏట వీరభోజయచార్యులు స్వర్గస్తులవుతాడు. అటు పిమ్మట దేశాటన నిమిత్తమై బయలుదేరబోతు తన తల్లి ఆశీర్వాదాలు కోరతాడు. అందుకు వారి తల్లి, నాయన ! వీరంభోట్లయ్య (బ్రహ్మం గారు చిన్న నాడు వీరంభోట్లయ్యగా పిలువబడ్డారు, పాపాఘ్ని ప్రస్తుత మఠాధిపతుల వద్ద దీనికి సంబంధించి శాసనాలు ఉన్నాయి), మఠాధిపత్యం స్వీకరించవలసిన నీవు ఇలా తల్లిని వదిలి పెట్టి దేశాటనకు బయల్దేరితే ఎలాగంటూ శోక సంద్రంలో మునిగి పోతుంది. పుత్రుని మీద ఉన్న మమకారం కారణంగా ఆమె అనుమతిని నిరాకరించగా ఆమెను అనేక విధాలుగా అనునయించి జ్ఞానబోధ చేశాడు. ఆ సందర్భంలో ఆయన పిండోత్పత్తి జీవి జన్మ రహస్యాలను తల్లికి చెప్పి ఈ అనుబంధాలు మోక్షానికి ఆటంకమని దానిని వదలమని తల్లికి హితవు చెప్పాడు. శరీరం పాంచభౌతికమని ఆకాశం, గాలి, అగ్ని, పృథ్వి, నీరు అనే అయిదు అంశాలతో చేయబడిందని సమస్త ప్రకృతితో కన్ను, ముక్కు, చెవి, నోరు, చర్మము అనే జ్ఞానేంద్రియాలద్వారా సంబంధం ఏర్పరచుకొని జ్ఞానం సంపాదిస్తామని, వీటి ద్వారా 'నేను' అనే అహం జనిస్తుందని, ఆత్మ సాక్షిగా మాత్రమే ఉంటుందని, బుద్ధి జీవుని నడిపిస్తుందనీ, బుద్ధిని కర్మ నడిపిస్తుందని, దానిని తప్పించడం ఎవరికీ సాధ్యపడదనీ, ఈ

విషయాన్ని గ్రహించి ఎవరు పరబ్రహ్మను ధ్యానిస్తారో వారు మోక్షాన్ని పొందుతారని బోధించి ఆమె వద్ద సెలవు తీసుకుని దేశాటనకు బయలుదేరాడు.

**వీరబ్రహ్మం రచనలు - సామాజిక చైతన్యాలు :**

తన కాలంనాటి సమాజంలోని మూఢాచారాల మీద, అంధవిశ్వాసాల మీద వీరబ్రహ్మంగారు విప్లవ శంఖం పూరించాడు. తాను ఆచరించి చూపి ఎంతో ఆదర్శప్రాయమ్కెన ఆచార్యుడుగా నిలిచాడు. అందుకే వీరబ్రహ్మంగారు భారతదేశంలో సాంఘిక విప్లవానికి నాందిపలికాడు. అందరికి ఆదర్శ ప్రాయుడై తన రచనల ద్వారా ముఖ్యంగా కాలజ్ఞానం ద్వారా రాబోయే కాలంలో జరిగే చెడును, మంచిని ముందే పసిగట్టి సంస్కరణలను చేపట్టాలని సామాజిక మార్పు అవసరమని గట్టిగా వాదిస్తూ, సమాజం సుఖ శాంతులతో జీవించాలంటే మానవ సమాజం ఆటుపోట్లను ఎదుర్కోవాలని, వ్యక్తి సంస్కరణ అవసరమని, తద్వారా సామాజిక సంస్కరణ సాధ్యమని స్పష్టం చేసిన సంస్కరణవాది వీరబ్రహ్మంగారు.

ఒక పూర్వకవిని ఇప్పుడెలా చూడాలి? అన్నది మరో ప్రశ్న. వాల్మీకి మొదలుకొని నేటి రచయితలదాకా విభిన్న కాలాల్లో, విభిన్న సందర్భాలలో రచయితలు రచనలు చేస్తూ, తమ కాలం నాటి పరిస్థితులను బట్టి కొన్ని అంశాలు చెబుతారు. కొన్ని బోధనలు చేస్తారు. అవి తర్వాతి కాలానికి యధాతధంగా అన్నీ వర్తించవు. కొంత కాలానికి కొన్నిటికి కాలం చెల్లిపోతుంది. కొన్నిటికి విలువ ఉంటుంది. వీరబ్రహ్మం గారి సాహిత్యంలో అయినా అంతే. అందువల్ల ఈనాటి సమాజం ముందుకు నడవడానికి, వీరబ్రహ్మంగారి సాహిత్యంలో ఏవేవి పనికొస్తాయో, ఆ పద్యాలనే ఆ తత్వాలనే స్వీకరించాలి.

వీరబ్రహ్మంగారి రచనలలో 'కాళికాంబ సప్తశతి' ఈనాటి సమాజానికి, మిగతా రచనల కన్నా, అవసరమైన కావ్యం. కారణం వీరబ్రహ్మంగారి రచనలలో మిగతావాటి కన్నా 'కాళికాంబా సప్తశతి'ని సాంఘిక స్వభావం ఎక్కువ ఉండడమే. వీరబ్రహ్మంగారు తక్కిన రచనలలో చెప్పిందంతా ఒక ఎత్తు, 'కాళికాంబా సప్తశతి'లో చెప్పింది ఇంకో ఎత్తు. ఆధునిక సమాజానికి ఈ కావ్యమే మరింత సమీపంగా ఉంటుంది. ఆయన రాసిన కాళికాంబ శతకం నేటి సమకాలీన సమాజానికి ఏమైనా మార్గదర్శనం చేయగలుగుతుందా అన్న కోణంలో కాళికాంబ శతకాన్ని పరిశీలించడం జరిగింది. ఇందులో నేటి సమకాలీన సమాజం వీరబ్రహ్మం కాళికాంబశతకం ద్వారా చెప్పిన అంశాలను అన్వయించుకోవడానికి మూడు అంశాలు ఉన్నాయి. వాటిని చర్చించే ప్రయత్నం చేస్తాను.

**నేటి యువతకు మార్గదర్శనం :**

నేటి యువత అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నా, ఇంకా ఏదో తెలియని నైరాశ్యంలో, ఒత్తిడికి లోనవుతూ... ఈ సంఘర్షణను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటుండటం ఆధునిక సమాజంలో నిత్యకృత్యంగా మారింది. భారతీయ ఆధ్యాత్మికవేత్తలు, సామాజిక వేత్తలు ఎంతోమంది యువతను సన్మార్గంలో నడిపించేందుకు తమవంతుగా రచనలు, బోధనలు చేస్తూనే ఉన్నారు. అయినా ఇంకా ఏదో తెలియని నైరాశ్యంతో యువత ఉండటం ఒక వెలితిగానే భావించవచ్చు. వీరబ్రహ్మేంద్రస్వామి తన బోధనల్లో అన్ని వర్గాలవారికి హితవు చెప్పడం గమనించవచ్చు. అలాగే యువత యొక్క శక్తి సామర్థ్యాలను తట్టిలేపుతూ... బలవన్మరణాలు చేసుకోవడం మహా పాపమని, చచ్చి ఎవరిని సాధిస్తావని యువతను ప్రశ్నించాడు.

> చచ్చి యెవరినైన సాధింపగా లేము
> చాక బాధకముల సాధకముల
> సమయజేసి పరము సాధించుకొనరయా
> కాళికాంబ! హంస కాళికాంబ!!
> (కాళికాంబ సప్తశతి పద్యం-189, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ, పుట-42)

యువత దేశ భవిత కావాలని ఆయన ఆకాంక్షించారు. అంతే కాకుండా ఏదైనా కార్యం విఫలమైతే తిరిగి ప్రయత్నించాలని ఆయన సూచించాడు. ఏకాగ్రత ముఖ్యమని బోధించాడు.

నేడు మనం విరివిగా ప్రచారం చేస్తున్న ధ్యానం గురించి ఆయన తన రచనల్లో పొందుపరచడం జరిగింది. “సాధనమున పనులు సమకూరు ధరలోన” అని వేమన చెప్పినట్లుగా వీరబ్రహ్మంగారు కూడా

“దృష్టినిలిపెనేని దేవుడు దిగివచ్చు
దృష్టి నిలుపడేని నష్టపడుచు
దృష్టిలోన సర్వసృష్టి పుష్టమ్మొను
కాళికాంబ! హంస కాళికాంబ!!

(కాళికాంబ సప్తశతి పద్యం-193, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ, పుట-43)

అంటూ కర్తవ్యబోధ చేస్తాడు. ఈ అంశాన్ని మనం సమకాలీన దృష్టితో ఇప్పటికీ ఆయన రచనల నుంచి ఈ అంశాన్ని స్వీకరించవచ్చు.

పట్టు పట్టెనేని పట్టు వీడగరాదు
పట్టు వదలెనేని పదవిలేదు
పట్టి విడుచుకంటె ప్రాణమ్ము లిలిడ మేలు
కాళికాంబ! హంస! కాళికాంబ!

(కాళికాంబ సప్తశతి పద్యం-398, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ, పుట-79)

ఏదైనా కార్యాన్ని సాధించాలంటే పట్టుదల ఉండాలని ఆయన బలంగా ఆకాంక్షించారు. ఆ పనిని సాధించాలి కానీ, మధ్యలో వదిలివేయడం సరికాదని, అలా వదిలి వేయాల్సివస్తే ప్రాణాలను కూడా ఫణంగా పెట్టడంలో తప్పులేదని చెప్పాడు. అంతేకానీ కార్యక్రమాన్ని నిర్వహించకుండా ఖాళీగా ఉండమని ఆయన చెప్పలేదన్నది మనం గ్రహించాలి. కాళికాంబ శతకంలో ఆయన బోధించిన పద్యాలు కొన్ని నిరాశా నిస్పృహతో ఉన్న యువతకు దారిదీపంగా నేటికీ నిలుస్తాయి.

**కులరహిత సమాజానికి బాటలు :**

భారతీయ సమాజంలో కులం ఒక పెద్ద సమస్యగా కొనసాగుతోంది. వృత్తుల విభజన చివరకు కుల విభజనగా రూపాంతరం చెంది సమాజంలో ఆధిపత్య ధోరణులను, అస్పృశ్యత పద్ధతులను కలిగించే దశకు చేరింది. కులవ్యవస్థ బలంగా కూరుకుపోవడం వల్ల పాలక వర్గాలకు, సంప్రదాయ వర్గాలకు అనేక ప్రయోజనాలను చేకూర్చుతుంది. అన్నింటికీ అతీతంగా వుండాల్సిన ఆధ్యాత్మిక రంగంలో కూడా కుల ధోరణులు ప్రభావం వ్యాపించింది. ఆధ్యాత్మిక సాధనకు, కులానికి సంబంధం లేదని, అది కొన్ని వర్గాలకే పరిమితం కాదని వీరబ్రంహ్మం ఎత్తి చూపారు.

మన పండితులకు పూర్వులైన చాలామంది మునులు, ఋషుల పుట్టుకలకు మూలమే లేదని, మరి అలాంటప్పుడు వారు ఎలా బ్రాహ్మణులు అవుతారని వీరబ్రహ్మంగారు ప్రశ్నిస్తారు.

“కులము కులమనుచు గొణిగెడు పెద్దలు
చూడనైరి తొల్లి జాడలెల్ల మునుల
పుట్టువులకు మూలమ్ము లేదండ్రు
కాళికాంబ! హంస కాళికాంబ!!

(కాళికాంబ సప్తశతి పద్యం-21, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ, పుట-13)

పోతులూరి వీరబ్రంహ్మేంద్రస్వామి కులవ్యవస్థను తీవ్రంగా నిరసించారు. జీవాత్మ, పరమాత్మలను తెలుసుకోవడానికి, ఆత్మజ్ఞాన ప్రబోధం లక్ష్యంగా అన్ని కులాల, మతాల వారిని తన శిష్యులుగా చేర్చుకున్నారు.

కర్నాటక, ఆధ్ర ప్రాంతాల్లో విస్తారంగా సంచార జీవనం సాగిస్తూ విభిన్న వర్గాల వారికి ఆత్మజ్ఞాన ప్రబోధం చేశారు. తన శిష్యులలో పంచముడైన కక్కయ్య, దూదేకుల మతానికి చెందిన సిద్ధయ్య, ఉన్నత వర్గాలకు చెందిన గరిమరెడ్డి అచ్చమ్మలు అందరినీ సమానంగా ఆదరించారు. మూఢాచారాలను ఖండించాడు. సనాతన ధర్మాలకు సరియైన నిర్వచనం చెప్పారు.

''మతము మత్తు గూర్చు మార్గమ్ము కారాదు
హితము గూర్పవలయు నెల్లరకును
హితము గూర్పలేని మతము మానగవలె''
(కాళికాంబ సప్తశతి పద్యం-693, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ, పుట-129)

అజ్ఞానంతో ఉన్నా, పాండిత్య గర్వంతో ఉన్నా పరమాత్మను తెలుసుకోవడం అసాధ్యమని బోధించాడు. మహత్తరమ్మైన ఆధ్యాత్మిక విప్లవానికి కారకుడయ్యాడు వీరబ్రహ్మంగారు.

ఎవరి వృత్తిని వారు నిష్ఠాతంగా ఆచరించాలి. వృత్తే దైవంగా భావించి వృత్తికి అంకితమవ్వాలి. కృషితో దేనినైన్నా సాధించవచ్చు, ఆత్మతృప్తి లేనివారు శాంతిమయమ్మైన జీవితాన్ని గడపలేరు. పరుల సొమ్ముకు ఆశపడక ఉన్నదాంతో తృప్తి చెందాలి. జీవుడే దేవుడు - జీవాత్మ పరమాత్మ వేరుగాదు, సృష్టిలో ప్రతిదాన్ని బ్రహ్మమయంగా భావించాలి. నిరంతర బ్రహ్మ చింతనలో ఉండే మనస్సు నియమ నిబద్ధతతో నిర్మలంగా ఒడిదుడుకులు లేని గమనంతో మోక్షం వైపు సాగుతుందని, కులాలకతీతంగా చెప్పడం మనం గమనించవచ్చు. నేటి ఆధునిక సమాజంలో ఇంకా కులం గురించి చర్చ చేస్తుండటం మనం గమనించవచ్చు. వీరబ్రహ్మం చూపిన మార్గంలో మనం ఆచరణకు పూనుకుంటే కులరక్కసి సమాజం నుంచి వైదొలగుతుందని ఆశించవచ్చు.

రాచరికపు వ్యవస్థ సమాజాన్ని రాచి రంపాన పెట్టరాదని ప్రజలను కన్నబిడ్డలుగా కాచి రక్షించాలని బ్రహ్మంగారు హితబోధ చేశాడు. ధన గర్వంతో ప్రజలను ఇబ్బంది పెడుతున్న జమీందారులను, అధికార దర్పంతో ఉన్న సంస్థానాధీశులను తన బోధనతో మెప్పించి, వారిలో మార్పు తీసుకొని వచ్చి సాంఘిక విప్లవానికి కారకుడైనాడు.

అన్నమయములైన వన్ని జీవమ్ములు
కూడులేక జీవకోటి లేదు
కూడు దినెడికాడ కులభేద మేలొకో
కాళికాంబ! హంస! కాళికాంబ!
(కాళికాంబ సప్తశతి పద్యం-660, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ, పుట-124)

సంపద అమితంగా పెరగడంవల్ల కొందరిలో అహంకారం పెరుగుతుంది. ఆ అహంకారం విచక్షణను దూరం చేస్తుంది. చివరకు వారు కష్టాలపాలవుతారని, సంపదతోపాటు వినయాన్ని వృద్ధి చేసుకోవాలని అలాటింవారే ధన్యులని బ్రహ్మంగారి బోధ. అహంకార, మమకారాలను ఎదగనీయకుండా జాగ్రత్త పడేవారే ఆధ్యాత్మిక జీవితంలో పురోగతి సాధిస్తారని, భౌతిక జీవితంలో కూడ ఇలాంటి లక్షణాలున్న వారే రాణించగలరని తత్త్వబోధ చేశారు.

''కులమతాల జాఢ్యములలో నదపియించు
దీన జనుల సేద దీర్చు వాడ
మానవుండె ధరను మాధవుండనువాడు
కాళికాంబ! హంస కాళికాంబ!!
(కాళికాంబ సప్తశతి పద్యం-699, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ, పుట-130)

కులమత జాడ్యాలలో నలిగిపోయే ప్రజలకు అండగా నిలిచి, వారి బాగోగులకోసం నిలిచి, పాటుపడే మనుషులే దేవుళ్ళుగా మారుతారంటూ పై పద్యంలో ఉదహరించారు.

**మహిళా సాధికారికతకు పెద్దపీట :**

"ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుంది" అని మహాకవి గురజాడ స్త్రీ అభ్యుదయాన్ని కాంక్షించిన వ్యక్తిగా ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో మనకు కనిపిస్తాడు. అయితే క్రీ.శ. 17వ శతాబ్దంలోనే స్త్రీపురుషులు ఇరువురూ సమానమని బ్రహ్మంగారు నమ్మారు. అదే నమ్మకాన్ని ప్రజలకు కల్పించడానికి ప్రయత్నించారు. భక్తి భావం ఇద్దరికీ ఒకటేనని, పురుషులకు, స్త్రీలకు వేరువేరుగా మోక్షం ఉండదని, జ్ఞానం కూడా అందరికీ ఒకటేనని, అయితే వారి వారి స్థాయిల్లో సాధన చేయడాన్ని బట్టి వుంటుందని తేల్చి చెప్పారు.

స్త్రీలకు ఎనలేని ప్రాధాన్యతనిచ్చారు. అందుకు ఆయన రాసిన కాళికాంబ శతకంలోని క్రింది పద్యాన్ని మనం ఉదహరించుకోవచ్చు.

"తల్లిదండ్రీ గురువు దైవమ్ములందున
తల్లి పూజ్యముఖ్య మెల్లరకును
సృష్టి కంతటికిని స్త్రీ ప్రధానముగదా
కాళికాంబ! హంస కాళికాంబ!!
(కాళికాంబ సప్తశతి పద్యం-24, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ, పుట-15)

భర్త చనిపోయిన తర్వాత భార్య తమ ముత్తయిదవ చిహ్నాలను తొలగించుకోవాల్సిన అవసరం లేదని సూచించారు. మహిళలు మంగళకరంగా భావించే తాళిబొట్టు, నుదుట కుంకుమ, పసుపు, పూవులు భర్త చనిపోయిన తర్వాత కూడా ధరించవచ్చుని, తాళితప్ప మిగిలిన వస్తువులన్నీ మహిళ పుట్టుకతోనే ఆమెకు సంక్రమించాయని అలాంటి వాటిని భర్త చనిపోయిన తర్వాత ఎందుకు తొలగించాలని ప్రశ్నిస్తాడు. తాను జీవసమాధి స్థితి పొందాక కూడా తన భార్య గోవిందమాంబ ముత్తయిదవ చిహ్నాలను తొలగించవద్దని, నిత్య సుమంగళిగా వుండాలని సూచించాడు.

ఇందుకు సంబంధించిన ఒక ఐతిహ్యాన్ని కూడా వీరబ్రహ్మం భక్తులు నమ్ముతారు. వీరబ్రహ్మం జీవసమాధి పొందిన తరువాత ఇరుగు పొరుగు బ్రాహ్మణులు-ముత్తయిదవ చిహ్నాలు మీ తల్లిగారు తొలగించుకోలేదని పెద్దకుమారుడు గోవిందయ్యను నిత్యం ప్రశ్నిస్తుండటంతో ఒకరోజు బ్రహ్మంగారి సమాధిపైన వున్న పెద్దబండరాయిని తొలగించి చూడగా, అందులో బ్రంహ్మంగారు ధ్యానస్థితిలో వున్నాడట. దీంతో కోపించిన గోవిందమాంబ గోవిందయ్యను శపించిందని, అందుకే ఆయన వారసులు ఎవరూ బ్రంహ్మంగారి వారసత్వాన్ని కొనసాగించలేరని అన్నదట. ఇది నిజమో ఏమో తెలియదు కానీ, బ్రంహ్మంగారు మాత్రం తన తరువాత తన కొడుకు కూతురు ఈశ్వరమ్మ వారసులే బ్రంహ్మంగారి మఠం ఆధిపత్యాన్ని వహిస్తారని కాలజ్ఞానంలో చెప్పారట. అందువల్లనే గోవిందయ్య కొడుకు సంతతి కాకుండా ఈశ్వరమ్మ కొడుకు పరంపరలో ప్రస్తుతం బ్రంహ్మంగా కో మఠం వారసత్వ పీఠాధిపతి బాధ్యతలను వహిస్తున్నారు. దీన్ని బట్టి బ్రహ్మంగారు తాను భవిష్యత్‌ను కాలజ్ఞాన దృష్టితో చూచిన వ్యక్తిగా మనకు కనిపించడం తెలుస్తుంది.

**ముగింపు :**

బ్రహ్మంగారి కాలంలో కులమతాల పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు ఎక్కువై సఖ్యత కుదరక సమాజంలో అల్లకల్లోలంగా మారింది. అలాంటి సమాజంలో సర్వమత సమానత్వాన్ని బోధిస్తూ బ్రహ్మంగారు ప్రజలను చైతన్యపరుస్తూ సమసమాజ స్థాపనకు కృషి చేశాడు.

"సర్వదేవతలను సర్వమతాలను
సమముగా నెఱుంగు సజ్జనుండు
దుర్జనుండు లాతి దోషమ్ములను నెంచు
కాళికాంబ! హంస కాళికాంబ!!
(కాళికాంబ సప్తశతి పద్యం-486, ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురణ, పుట-93)

ఎవరైతే సర్వమతాలను, సర్వకులాలను, సర్వదేవతలను సమానంగా ప్రేమిస్తాడో అతనే సజ్జనుడని, ఎవరైతే ఎదుటి మతంలోని దోషాలను లెక్కిస్తాడో అతనే దుర్జనుడని ప్రబోధిస్తూ, ఏ మతం మీకు మంచిదిగా కనిపిస్తుందో ఆ మతాన్ని పాటించదని, మతోన్మాదంతో హింసను ప్రేరేపించవద్దని దూరద ృష్టితో ఆనాడే బోధించాడు సద్గురు బ్రహ్మంగారు. ఆయన కాళికాంబ సప్తశతిలో చెప్పిన పద్యాలలో కొన్ని నేటి సమకాలీన సమాజంలో ఉన్న సామాజిక రుగ్మతలను రూపుమాపడంలో కీలకపాత్ర పోషిస్తాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆ దిశగా వీరబ్రహ్మంగారి కాళికాంబ సప్తశతిని అధ్యయనం చేయాల్సిన అవసరం చాలా ఉంది.

**ఆధార గ్రంథాలు**

1. సుబ్బరామయ్య, చిరువెళ్ళ (1991) – శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, సాయిరాం ప్రింటర్స్, నెల్లూరు.
2. రాజమల్లాచారి, కన్నెగంటి (1988) – పోతులూరి వీరబ్రహ్మంగారి జీవితం – రచనల పరిశీలన, సరోజా పబ్లికేషన్స్, నరసరావుపేట.
3. సుబ్బాచారి, పులికొండ (సంపాదకత్వం) (2019), కాలికాంబ సప్తశతి, ప్రజాశక్తి బుక్‌హౌస్, విజయవాడ.
4. సుబ్బయ్య, చాటకొండు (1933), శ్రీ వీరబ్రహ్మంగారి జీవిత చరిత్ర, జానకీ ముద్రాక్షరశాల, ప్రొద్దుటూరు.
5. వీరరాఘవాచార్యులు, కొండూరు (1963), మన గురుదేవుడు, వీరరాఘవ గ్రంథావళి, తెనాలి.

❖❖❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# శ్రీ కాళహస్తీశ్వర శతకం - నవజీవన సందేశం

**డా.బి.వి.యస్.గౌతమ**

పోస్ట్ డాక్టరల్ ఫెలో, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు
Email: bvsgoutham44@gmail.com, Ph.9652241261

పూర్తి తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలించినట్లయితే శతక ప్రక్రియ అన్నది ఒక గొప్ప రత్నంగా వెలుగుతూ ఉన్నది. శతక ప్రక్రియ భక్తి ప్రవృత్తితో మొదట తెలుగులో పుట్టినా సామాజిక ప్రవృత్తులన్నీ మన్నించి విస్తరించింది. ఎన్నో ప్రక్రియల స్వభావాన్ని తనలో నింపుకొని ఈ రోజు కొనసాగుతున్న ప్రక్రియ శతకం.

శతక ప్రక్రియ మాత్రము సజీవస్రవంతి వలె ఆంధ్ర వాఙ్మయారంభదశ నుండి నేటి వరకు కొనసాగుతున్నది. తెలుగు సాహిత్యంలో కొన్ని విశిష్ట ప్రక్రియలు పండితులకే కొరకునపడవు. అలాంటిది ఈ శతకమని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఇంకా ఈ శతక సాహిత్యం అందరిలోకి పోవడానికి గల ప్రధాన కారణం కవి చెప్పదలుచుకున్న విషయాన్ని అలంకార ప్రమాణంగా క్లుప్తంగా చెప్పడం అది వెంటనే అన్నది కూడా అర్థం అయిన విధంగా ఉండటం అన్నది ప్రధాన కారణం. ఒక సుదీర్ఘమైన నవలలో చెప్పే అంశాన్ని ఒక పద్యంలో చెప్పే వెసులుబాటు పద్యం మనకు కల్పిస్తుంది.

గ్రహదోషంబులు దుర్నిమిత్తములు నీకళ్యాణనామంబు ప్ర
త్యహముం బేర్కొనుత్తమోత్తముల బాధంబెట్టగానోపునే?
దహనుం గప్పంగంజాలునే శలభసంతానంబు నీ సేవఁ జే
సి హతక్లేసులు గారుగాక మనుజుల్ శ్రీ కాళహస్తీశ్వరా!

ఈ పద్యంలో మొదటి మాటను గమనించగానే అందరూ ధూర్జటి మహాకవి జ్యోతి శాస్త్రాన్ని వ్యతిరేకించాడేమో అనుకుంటారు. జ్యోతిశాస్త్రం అనేది గ్రహాల కదలికలను సూచిస్తుంది తప్ప వ్యక్తుల జాతకాల మీద గ్రహాల ప్రభావం చూపించేది తక్కువ. స్థూలంగా కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మాత్రం సరిపోతుంది. మహాభారతంలో నారదుడు ధర్మరాజును “జ్యోతి శాస్త్రం ఆధారంగా రాబోయే ఉత్పాతాలను పసిగడుతున్నావా” అని అడుగుతాడు.

ఆ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎన్నో శాస్త్రాలకు, విద్యలకు అధ్యుడైన పరమశివుడి నామస్మరణ చేసే వారిని గ్రహదోషాలు ఏమి చేస్తాయి అంటూ గొప్ప ఆత్మవిశ్వాసాన్ని ధూర్జటి ఈ పద్యం ద్వారా అందిస్తున్నాడు. ప్రతిరోజు దిన ఫలాలు చూసుకొని కంగారుపడే వారికి ఈ పద్యం ఒక మేలుకొలుపు. ఇటువంటి పద్యాలు మనుషులు ఎటువంటి సవాలునైనా ఆత్మవిశ్వాసం పరమాత్మ విశ్వాసంతో అధికమించగలరని నిరూపిస్తాయి. ఈరోజు అనేక సామాజిక సవాళ్లతో సతమతమవుతున్న యువతరానికి ధూర్జటి అందించే నవజీవన సందేశమే శ్రీ కాళహస్తీశ్వర శతకం.

మరొక పద్యంలో

అమరస్త్రీల రమించినం జెడదు మోహంబింతయున్, బ్రహ్మప
బము సిద్ధించిన నాసదీఱదు. నిరూఢ క్రోధమున్ సర్వలో
కములన్ మ్రింగిన మాన, చిందుఁగల సౌఖ్యంబొల్ల, నీ సేవఁ జే
సి మహాపాతిక వారిరాశిఁ గడతున్ శ్రీకాళహస్తీశ్వరా!

శమనిషికి శత్రువులు ఎక్కడో లేరు అని ధూర్జటి అన్నారు. అర్షడ్ వర్గాలైన క్రోధ లోభ మోహ మదమాచార్యలే మనిషికి అసలైన శత్రువులని ఆ శత్రువులు జయించిన వాడికి సమాజంలో ఎదురయ్యే అనేక సమస్యలను పరిష్కరించడం

పెద్ద విషయమేమీ కాదు పదవి వ్యామోహం వల్ల పెదవిద్య అమూహం వల్ల మనిషి ఎంతగా పతనమైపోతాడో ఈ పద్ధతిని తెలియజేస్తుంది. ఆశ వెనుక మంచి పరిగెత్తి పరిగెత్తి మనిషి అలసిపోవాలి తప్ప ఆశకు హద్దు అనేది లేదు అని ఈ పద్యం గుర్తుకు చేస్తుంది అర్షద్ వర్గాలు మాయలో పడి జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్నా యువతరానికి ఈ పద్యం మరొక మేలుకొలుపు నిన్ను జయించగలిగితే ప్రపంచాన్ని జయించినట్టే అనే వ్యక్తితో వికాస సందేశమే ఈ పద్య సారాంశం అలాగే

రాజుల్ మత్తులు, వారిసేవ నరక ప్రాయంబు, వారిచ్చు నం
భోజాక్షి చతురంత యాన తురగీ భూషాదు లాత్మ వ్యథా
బీజంబుల్, తద పేశ చాలుc బరితృప్తిం బొందితిన్ జ్ఞాన ల
క్ష్మీ జాగ్రత్ పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా!

మరొక ప్రసిద్ధమైన పద్యంలో జ్ఞానమార్గం యొక్క ప్రాధాన్యతను దూజేటి మహాకవి వర్ణిస్తాడు ఈ పద్యంము భావము రెండు ప్రసిద్ధమే నేటి కాలంలో రకరకాల నాయకులను నాయకులను నమ్ముకుని వారికి ఎన్నో రకాల సేవలు చేస్తూ వారు ఏదో ఇస్తారని జీవితాంతం ఎదురుచూస్తూ సమయం వృధా చేసుకుని చేసుకునే వారికి ఈ పద్యం ఒక జ్ఞాన బోధ చేస్తుంది. ఇతరుల జీవితాలను జీవితాలనుంచి మనుషులను వేరు చేసేది ఆలోచన శక్తి లేదా యుక్త యుక్త వివేచన మనిషి జీవిత లక్షణం జ్ఞాన స్వామి పరిచిన జ్ఞానం అనే సంపదను పొందడానికి మనిషి ప్రయత్నం చేయాలి తప్ప అంతిమంగా ఆత్మ వేదకు కారణం అవుతున్న కోరికలను మనిషి బానిస కాకూడదు బానిస కాకూడదు అన్నది ఈ పద్యంలోని నవీన సందేశం

చివరగా పద్యం

కొడుకుల్ పుట్టినటంచు నేస్తు రవివేకుల్ జీవన భ్రాంతులై
కొడుకుల్ పట్టనె కౌంవేంద్రువ కనేకుల్ వారిచే నే గతుల్
వడినెన్. బుర్వులు లేని యా కుకునకున్ బాటిల్లెనే దుర్గతుల్
చెడునే మోక్షపదం బపుత్తకునకున్ శ్రీకాళహస్తీశ్వరా!

అనే పద్యంలో ధూర్జటి ఆధునిక కాలంలో అత్యంత చర్చిని అంశమైన సంతాన ప్రస్తావం చేస్తాడు వివాహం కాలేదని కొంతమంది అయ్యాక సంతానం కలగలేదు అని కొంతమంది కలిగిన కొడుకులు పుట్టలేదు అని కొంతమంది బాధపడుతూ ఉంటారు ఈ రోజు సంతానం కాడడం అనేది అతిపెద్ద సామాజిక సమస్యగా కనపడుతుంది సంతాన ఉత్పత్తి కేంద్రాలు ఉబ్బడి ముబ్బడిగా పెరగటం అందుకు తార్కాణం నిజానికి కలిగే సంతానం సత్సంతానం కావలె తప్ప అబ్బాయా అమ్మాయా అనేది ప్రధానం కాదు సంతానం కోసం ప్రయత్నించిన కలగకపోవడం దంపతులు తప్పు కాదు వంద మంది కొడుకులకు కొడుకులు కలిగిన దృతరాష్ట్రుడు సాధించినది ఏమిటి? అసలు సంతానమే లేని సుఖ మహర్షి సాధించింది ఏంటి రెండో 24 లో చర్చించుకో చర్చించబడుతున్నాయి ఈ సమస్యను ధూర్జటి ఎన్నో వందల సంవత్సరాలు ముందే ప్రస్తావించాడు.

**ముగింపు :**

ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని రాశారు. ఈయన శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన కవి. ఇతను శ్రీ కాళహస్తీశ్వర మాహాత్మ్యము, శ్రీకాళహస్తీశ్వర శతకం రాశారు. శ్రీకాళహస్తీశ్వర శతకం భక్తి శతకంగా ప్రఖ్యాతి పొందింది. నేడు మనం చదువుతున్న ముఖ్యమైన శతకాలలో శ్రీకాళహస్తీశ్వర శతకం ఒకటి. ఈ శతకం 16వ శతాబ్దం లో వచ్చినప్పటికీ నేటికీ ఈ శతకం, దానిలోని పద్యాలు దేదీప్యమానంగా ప్రజల నోటిలో నానుతున్నాయి. దీనిలో శివ భక్తిని చూపిస్తూ ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర అనే మకుటంతోఈ శతకాన్ని రాశాడు. ఈ శతకం మత్తేభ, శార్దూల పద్యాలతో రచించారు.

ఈ శతకంలో ధూర్జటి 116 పద్యాలు ఉన్నాయి. దీనిలో శైవభక్తి, ఆత్మాశ్రయ భావన, రాజు నిందతో పాటు, వైరాగ్య భావాలకు సంబంధించిన ఎన్నో పద్యాలను రాశాడు. ధూర్జటి తన్నుతాను ఆత్మ పరిశీలన చేసుకున్న విధానం తాను అనుభవించిన బాధలను, భయాలను, కోరికను తన ఇష్ట దైవమైన పరమేశ్వరుడికి నివేదించుకున్నాడు. అంతేకాకుండా నిర్భయంగా రాజులని నిరసించిన తీరు సంసారిక జీవితం పట్ల విముఖతను ప్రకటించడం వంటివి ఈ శతకంలో ఉన్న ముఖ్య విషయాలుగా మనం చెప్పుకోవచ్చు.

శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని కేవలం భక్తి శతకంగా అందరూ చూసినప్పటికీ సామాజిక కోణంలో చూస్తే ఎన్నో రకాలైన విశ్లేషణ చేయవచ్చు. ఈ అత్యాధునిక యుగంలో అన్ని శతకాలను సామాజిక కోణం నుంచి ఆలోచించి యువతకు శతక సాహిత్యాన్ని మరింత చేరు చేసే అవకాశాన్ని కల్పించిన వాళ్ళమవుతాము. "హితేన సహితం సాహిత్యం" సమాజానికి మేలు చేకూర్చేది సాహిత్యం. సాహిత్యం అనేది సమాజానికి ఉపదేశాన్ని, ఆనందాన్ని కలిగించే విధంగా ఉంటుంది. సమాజంలో ఉండే దురాచారాలను, అనవసర కట్టుబాటును వేలెత్తి చూపే విధంగా సాహిత్యం ఉంటుంది. నిత్యజీవితంలో ప్రజలు ఎదుర్కొన్న బాధలను, ఆనందాలను, అనుభవాలను, జీవన విధానాలను కవులు తమ సాహిత్యం ద్వారా తెలియజేశారు.

ఆధార గ్రంథాలు:

1.గోపాలకృష్ణారావు, కె. 1976. ఆంధ్ర శతక సాహిత్య వికాసము, హైదరాబాద్, ప్రతిభా ఆర్ట్స్ ప్రింటర్స్.
2.వీరస్వామి, పల్లేరు. 2005. తెలంగాణా శతక సాహిత్యం, వరంగల్లు, అశోక్ కఅష్ఠ ఆఫ్ సెట్ ప్రింటర్స్.
3.వేంకటకృష్ణశర్మ, వేదము. 1954. శతకవ్మాయ సర్వస్వము, మద్రాసు, వేదము వేంకటరాయశాస్త్రి బ్రదర్స్.
4.వెంకటప్పయ్య, వెలగా (సం) 2013, తెలుగు శతక మంజరి, విజయవాడ, నవరత్నబుక్ హౌస్.
5.వెంకటావధాని, దివాకర్ల. 1961. ఆంధ్రవ్మాయ చరిత్రము, హైదరాబాదు, తెలుగు అకాడమి.
6.గోపాలకృష్ణారావు, కె. 1975. ఆంధ్ర శతక వ్మాయం. హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
7.గురజాడ, గరికిపాటి. 2020. మనుచరిత్ర– వ్యక్తిత్వ వికాసం, విజయవాడ, శ్రీరాఘవేంద్ర పబ్లిషర్స్.

❖❖❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# కుమారశతకంలో చతుర్విధ పురుషార్థాలు - నవజీవన దృక్పథం

## ఎ. ఆశాజ్యోతి

తెలుగు అధ్యాపకులు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళాడిగ్రీ కళాశాల, నాగర్ కర్నూల్.
Email: asha7216@gmail.com , Ph.9963375784

**పరిచయం**

తెలుగు సాహితీప్రక్రియలలో శతకానిది ప్రత్యేకస్థానం. సంస్కృత, ప్రాకృతంలోని ప్రక్రియలను అనుసరిస్తూ తెలుగులోకి వచ్చింది ఈ శతకం. శతకానికి ఇతర ఏ భాషలో లేని ప్రాధాన్యత తెలుగులో ఉంది. ఈ శతకాలను భక్తి, శృంగార, నీతి శతకాలు... అంటూ అనేక రకాలుగా విభజించవచ్చు. శతకం మకుట నియమం కలిగి, సరళమైన శైలిలో ఉండటం వలన మిక్కిలి ప్రజాదరణ పొందింది. నీతి శతకాలు నైతిక విలువలను, వివేచన జ్ఞానాన్ని బోధిస్తాయి. అలాంటి నీతి శతకాలలో కుమార శతకం ఒకటి . ఈ శతకాన్ని ఫక్కి అప్పల వేంకట నరసింహ కవి రచించాడు.

**కవి పరిచయం**

ఫక్కి అప్పల వేంకట నరసింహ కవికి పక్కి వెంకట నరసయ్య, పక్కి వెంకట నరసింహ కవి అనే నామాంతరాలు కూడా ఉన్నాయి.'పక్కి కులోద్భవుడు అప్పల నరసింహుడు ననీ1860 రౌద్రి నామ సంవత్సరంలో కుమార శతకాన్ని రాశానని' కుమార శతకాంత పద్యాల్లోఆయనే స్వయంగా చెప్పుకున్నాడు. ప్రసిద్ధమైన కుమారి, కుమార శతకాలను ఈయనే రచించాడు. కుమార శతకం నైతిక విషయాలకు ఆలవాలం. అవన్నీ సమాజానికి ఉపయోగపడేవే. వాటిలో చతుర్విధ పురుషార్థాలు ఏ విధంగా ప్రతిఫలించాయి? అవి ఈ కాలానికి ఎలా అన్వయించు కోవాలి? ఏ కోణాల నుండి చూడాలి అనే అంశాలను ఈ పత్రంలో ప్రస్తావించుకుందాం.

**చతుర్విధ పురుషార్థాలు**

ధర్మార్థ కామ మోక్షాలనే నాల్గింటి కలిపి చతుర్విధ పురుషార్థాలు అంటారు. వాటికి నైఘంటికార్థాలు ఏమున్నాయో చూద్దాం.

ధర్మం - న్యాయము, పుణ్యము, ఆచారము, కర్తవ్యము అని నిఘంటు అర్థాలు. లోక వ్యవహారాలను అందరికీ న్యాయం జరిగే పద్ధతిలో నిర్వహించేది ధర్మం అని నిఘంటు నిర్వచనం. కవి కూడా ధర్మానికి ఒక నిర్వచనం ఇచ్చాడు.

వినుు లోకంబున ధర్మం
బనగా గులాచారమట్ల యరసి నడువ దా
గనునా యుష్కీర్తుల నిహ
మున బరమున బొందు సౌఖ్యములను కుమారా! (33)

'తన కులమునకు దేవునిచే విధింపబడినట్లుగా నడుచుటయే ధర్మం అనబడును' అనే అర్థం చెప్పుకోవచ్చు.నవజీవనంలో కులం అంటే వృత్తి అని అర్థం కూడా ఉంది. అయితే వృత్తితో అన్వయించుకోగలిగితే వృత్తినియమాలను సక్రమంగా అవలంబించినట్లయితే అదే ధర్మం. అంటే విధి నిర్వహణ అని చెప్పుకోవచ్చు. ఈ శతకంలో కొన్ని విధాలైన ధర్మాలను పేర్కొన్నాడు కవి. అవి రాజధర్మం, వృత్తి ధర్మం,వ్యక్తి ధర్మం మొదలైనవి.

**రాజధర్మం**

మనుజులు తమ సౌఖ్యము కొఱ
కును సంరక్షణము నవని గోరుదు రొగి నే
జనపాలుడు సంరక్షిం
పను దగియును బ్రోవ డతడె పాపి కుమారా! (71)

అప్పటి రాజులు ఇప్పుడు రాజకీయ నాయకులు. పాలకులు వాళ్లే కనుక. సామాన్యులను సంరక్షించటం రాజు ధర్మం, బాధ్యత కూడా అలా చేయకపోతే పాపి అవుతాడు. అలాగే

మండల పతి దండార్హుల
దండింపక యుండరాదు ధారుణి నత డా
ఖండల సమానుడైనను
మెండగు పాపంబు నొంది మెలగు కుమారా! (72)

శిక్షార్హులు దేవేంద్రునితో సమానులైనారాజు వారిని శిక్షింపకపోతే వారు మరిన్ని పాపాలను, దుష్కర్మలను చేస్తారు. అంటే సత్పురుషులను హింసిస్తారు. కాబట్టి అధిపతి అయిన రాజు శిక్ష విధించాలి. సత్పురుషలను కాపాడటం ఎంత ముఖ్యమో దుష్టులను శిక్షించటం కూడా అంతే అవసరం. అది రాజధర్మం. ఉదాహరణకు పంట పొలంలో కలుపు మొక్కలను, పంటకు పట్టిన చీడను తొలగించకపోతే అవి పంటనే నాశనం చేస్తాయి. కాబట్టి యజమాని పంటను కాపాడడానికి కలుపును, చీడను తొలగించినట్లు పాలకులు తప్పుచేసినవారిని శిక్షించాలి.

గృహ దాహకునిం బర దా
ర హరున్ బంధు హిత కార్య రహితుని దుష్టో
త్సహ పరుని జంప నరపతి
ఇహపరములయందు కీర్తి నెసగు కుమారా! (73)

గరళము బెట్టెడు వాని
న్బరు జంప దలంచు వాని బను లెల్ల బయ
ల్పర చెడి వానిం బర ధన
హరుని నృపతి జంపి పుణ్యు డగును కుమారా! (74)

వంటివారిని శిక్షించాలని కవి ఉద్దేశ్యం. అవి నేటి ప్రభుత్వాలకూ వర్తిస్తాయి. ప్రభుత్వాలు కవి చెప్పిన ధర్మమార్గాన్ని పాటిస్తే కచ్చితంగా సమాజంలో మార్పు వస్తుంది.

**వృత్తి ధర్మం**

నర వరుడు నమ్మి తను నౌ
కరిలో నుంచునెడ వాని కార్యములందున్
సరిగా మెలంగ నేర్చిన
పురుషుడు లోకమున గీర్తి బొందు కుమారా! (11)

ఉద్యోగం పొందటానికి ఎంత కష్టపడతామో ఉద్యోగం పొందిన తర్వాత అంతే కష్టపడి అధికారికి నమ్మకంతో మెలుగుతూ విధులను నిర్వర్తించాలి అని అర్థం. నేటి సమాజంలో వృత్తి ధర్మం బాగా లోపించింది. ఎవరు ఏ పనికి నియమితులు అవుతున్నారో వారు ఆ పనిని సరిగా చేయడం లేదు. ప్రభుత్వ ఉద్యోగుల గురించి చెప్పనవసరం

లేదు. ఒక చిన్న పనికోసం రోజుల తరబడి తిప్పించుకునే అధికారులున్నారు. అలాంటి వారికి పై పద్యం చెంపపెట్టులాంటిది.

**వ్యక్తిధర్మం**

వ్యక్తిగా మనం చేయవలసిన విధులు, ఇతరులతో, ఎదుటి వ్యక్తులతో ప్రవర్తించాల్సిన తీరు వ్యక్తి ధర్మంలోకి వస్తాయి. గురువులను, తల్లిదండ్రులను చూసుకొనే పద్ధతిని, స్త్రీల పట్ల మెలగాల్సిన విధానాన్ని కవి చెప్పాడు.

ఆచార్యున కెదిరింపకు
ప్రోచిన దొర నిందసేయబోకుము, కార్యా
లోచనము లొంటిజేయకు
మాచారము విడువ బోకు మయ్య కుమారా! (16)

గురువు చెప్పినట్లు చేయాలి. ఆదుకున్న వాళ్లను నిందించరాదు. తెలుగులో ఒక సామెత కూడా ఉంది 'తిన్నింటివాసాలు లెక్కపెట్టకూడదు' అని. అదే ఉద్దేశంతో ఇక్కడ కవి 'ప్రోచిన నింద చేయబోకుము ' అని చెప్పాడు. తప్పక చేయవలసిన పనులను వెంటనే చేయాలి. ఆచారం అంటే మంచి ప్రవర్తన అని, దానిని ఎప్పుడూ విడవకుండా ఉండు అని చెప్తున్నాడు కవి. ఇక్కడ మనం గమనించవలసిన విషయం ఏంటంటే గురువుకి ఎదురు చెప్పకుండాచెప్పిన పని చెప్పినట్లుగా చేయాలి అంటే గురువు పట్లవినయ విధేయతలు కలిగి ఉండాలి అని చెప్తున్నాడు. కానీ నేడు సినిమాల ప్రభావం, సోషల్ మీడియా ప్రభావం వల్ల గురువుల మీద జోకులు వేయడాలు, గురువులని ఆటపట్టించడాలు, గురువు ఏమైనా అంటే ఆత్మహత్య చేసుకోవటం చివరికి గురువునే చంపే వరకూ దిగజారింది నేటి విద్యార్థిలోకం.

ఛత్తీస్ ఘడ్ బిలాస్పూర్లోని ఓ ప్రైవేట్ పాఠశాలలోఒక ఉపాధ్యాయురాలిపైకక్ష పెంచుకున్న ఐదుగురు విద్యార్థులు ఏకంగా ఆమెను అంతమొందించేందుకు ప్రణాళిక రచించారు. సోడియం నీటితో కలిపినప్పుడు పేలుడు సంభవిస్తుందని ఆన్లైన్ వీడియో ద్వారా తెలుసుకున్నారు. ఉపాధ్యాయురాలు వాష్ రూమ్ కి వెళ్లే సమయంలో ఫ్లష్లో సోడియం అమర్చారు. ఇంతలో నాలుగో తరగతి విద్యార్థినిఫ్లష్ ను ఉపయోగించడంతో పేలుడు సంభవించి తీవ్రంగా గాయపడింది.

మధ్యప్రదేశ్ లోని చతర్పూర్ లో ఒక విద్యార్థి పాఠశాలకు ఆలస్యంగా వచ్చాడని హెడ్మాస్టర్ దండించడంతో ఆ విద్యార్థి హెడ్మాస్టర్ పై పగబట్టి ఆయన బాత్రూంకి వెళ్తుండగా తుపాకీతో కాల్చి చంపాడు. ఇలాంటి ఉదంతాలు నేడు సమాజంలో ఎక్కువైపోయాయి. ఒకప్పుడు ఇటువంటివి జరిగిన సందర్భాలు లేవు. అప్పటి సమాజంలో ఇప్పుడున్నంత వైపరీత్యం లేదు. తల్లిదండ్రులలో నైతిక విలువలు ఉండడం. ఆ నైతికతకు శతకాలుసహకరించడం కారణం. ఈ కాలంలో తల్లిదండ్రులతో సహా పిల్లలు కూడా శతకాలు వంటి నీతి పద్యాలను చదవకోపోవటంవల్ల ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

**తల్లిదండ్రులు**

తనకు చదువు చెప్పిన గురువు కంటే పది రెట్లు తండ్రిని, తన తండ్రి కంటే పది రెట్లు తల్లిని గౌరవించాలని కవి చెప్పాడు.

తనకు విద్యాభ్యాసం
బును జేసిన వానికన్న బొలుపుగ బది రె
ట్లను దూగు తండ్రి వానికి
జననియు బదిరెట్లు తూగు జగతి కుమారా! (23)

మాతృదేవోభవ పితృదేవోభవ ఆచార్యదేవోభవఅన్నది మన సంప్రదాయం. తల్లిదండ్రులకు అంత పెద్ద పీట వేసిన వారే తప్పు దారిన పడితే వాళ్ళను కూడా తెగించమన్నాడు కవి.

ఋణమధిక మొనర్చి సమ
ర్పణ జేసిన తండ్రి విద్యరాని కొడుకు ల

క్షణ శాలి రాణి దుశ్చా
రిణి యగు జననియును తలపరిపులు కుమారా!(100)

అప్పుచేసి కొడుకుకు అప్పజెప్పే తండ్రి, చదువురాని కొడుకు, అందగత్తె అయిన, భార్యమంచి నడవడిక లేని తల్లిని శత్రువులుగా భావించాలి. వాళ్లని విడిచిపెట్టడమే మేలు అని కవి ఉద్దేశం.

**స్త్రీలు**

పుట్టినది మొదలు పరసతి
బట్టగ చూచుట యనింద్య పద్ధతి యనుచు
న్నట్టి పురుషుండు పుడమిన్
బుట్టిన జనతతుల గీర్తి పొందు కుమారా (17)

బాల్యం నుండి పరస్త్రీలను మనసులో తలచుకోవడం కూడా దోషం అని ఆలోచించేవాడు కీర్తి సంపన్నుడని కవి చెప్పాడు. ఇక్కడ స్త్రీలను ఎలా గౌరవించాలో, స్త్రీలకు ఎంతటి ప్రాధాన్యం ఇవ్వాలో, ఇచ్చినవారికి ఎటువంటి కీర్తి కలుగుతుందో చెప్పాడు. స్త్రీలను గౌరవించకపోతే తప్పకుండా ఇక్కట్లు పడాల్సిందేనని గ్రహించాలి.

**అర్థం**

చతుర్విధ పురుషార్థాలలో రెండవది అర్థం. డబ్బు, ధనం, ధర్మబద్ధమైన సంపాదన అని ఇక్కడ అర్థం. సంపద ఉన్నప్పుడు మంచి వాడినైనా చెడ్డవాడినైనా లోకం సంభావించే విధానం మారుతుంది. దీనికి ఉదాహరణగా కవి ఒక పద్యం చెప్పారు

సిరి జేర్చు బంధువుల నా
సిరియే శుభముల నొసంగు చెలువుల గూర్చున్
సిరియే గుణవంతుండని
ధరలో బొగడించు నంచు దలపు కుమారా!(36) అటువంటిదే మరోపద్యం
ధనవంతుడె కులవంతుడు
ధనవంతుడె సుందరుండు ధనవంతుండే
ఘనవంతుడు బలవంతుడు
ధనవంతుడె ధీరుడనుచు దలపు కుమారా! (87)

ఇది నూటికి నూరు శాతం పాటింపబడుతున్న విధానం నేడు. ధనం మూలం ఇదం జగత్ అన్న నానుడికి సమానార్థకం. ధనవంతుడి చుట్టూనే లోకం మొత్తం తిరుగుతోంది. డబ్బున్నవాడి మాటనే లోకంలో చెల్లుతోంది. ధనవంతుడే అందరికంటే బలవంతుడు.

**కామం**

ధర్మబద్ధమైన కోరిక కామం. అది మితిమీరి పోతేనే ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. ఈ కోరికలు ఎలా ఉంటాయంటే ధనం మీద మితిమీరిన వ్యామోహం అన్యాయాలకు, లంచగొండితనాలకు దారితీస్తుంది. స్త్రీల పట్ల అక్రమాలు, అఘాయిత్యాలకు తావవుతుంది. ఇక దీని గురించి మాట్లాడాలంటే ఎంతైనా మాట్లాడవచ్చు. లంచగొండితనం గూర్చి కవి ఇలా అన్నారు.

పుడమిని దుష్టత గలయా
తడు లంచంబులను బట్టదలుచును మిడి యౌ

నడవడి విడి యందఱి వెం
బడి ద్రిప్పుకొనుచును గీడు పరప కుమారా! (12)

ఈ భూమిపై దుష్టుడు సక్రమమైన మార్గాన్ని విడిచి పెట్టి, లంచాలను తీసుకుంటాడు. పనికోసం తన వెంట తిప్పుకుంటాడు. అలాంటి వారు ఈ కాలంలో ఎక్కువగా కనబడతారు. వాళ్ళను దుష్టులు అన్నాడు కవి. ఈ పద్యంలో మిడియౌ నడవడి అన్న ప్రయోగంలో మిడి అనే పదానికిమిడిసిపాటు, గర్వం అని నిఘంటువుల అర్థం. అలాగే నడవడి పదంతరువాత కొన్ని పుస్తకాలలో మిడి అనీ, కొన్ని పుస్తకాలలో విడి అనీరెండు రూపాలున్నాయి. దుష్టుడి కోణంలో చూసినపుడు మిడి పదానికిమిడిసిపాటు అనే అర్థాన్ని తీసుకొంటే దాని తరువాత విడి అనే ప్రయోగం పొసగదు. అంటే మిడిసిపాటు తనాన్ని విడిచిపెట్టి అనే అర్థం వస్తుంది. దుష్టుడు మిడిసిపాటు తనాన్ని ఎలా విడిచిపెడతాడు? అలా కాకుండా మిడియౌ నడవడి మిడి అంటే అన్వయం కుదరదు. మిడి అనే పదానికి జీఎన్ రెడ్డి గారి పర్యాయపద నిఘంటువులో ఉన్నతము అని అర్థం కూడా ఉంది. కాబట్టిమిడి యౌనడవడివిడిఅనే ప్రయోగంగా గ్రహిస్తే ఉన్నతమైన లక్షణాలను విడిచిపెట్టి అనే అర్థం వస్తుంది. అది సరిగా సరిపోతుంది. అప్పుడు మిడి అనే పదానికి ఉన్నతమని, నడవడి తరువాత విడి అని గ్రహిస్తే విడిచిపెట్టి అని సరిపోతుంది.

కామం అంటే కోరిక. ఆ కోరికలు మనస్సు అధీనంలో ఉంటాయి. అలాంటి మనస్సును అధీనంలో పెట్టుకుంటే కోరికలు అదుపులో ఉంటాయి. జ్ఞానం కలుగుతుంది. లోకంలో మెప్పును పొందుతాం. దానికి నిదర్శనమైన పద్యం కవి చెప్పాడు.

ఆజ్ఞ యొనర్చెడి వృత్తుల
లో జ్ఞానము కలిగి మెలగు లోకులు మెచ్చన్
బ్రాజ్ఞతను కలిగియున్నన్
బ్రాజ్ఞులలో బ్రాజ్ఞుడౌదు ప్రబలి కుమారా! (2)

మనిషి ఆజ్ఞ ప్రకారం నడుచుకునే మనసు, చేసే పనులలో వివేకం కలిగి ఉన్నట్లయితే లోకులు మెచ్చుకుంటారు. పండితులు కూడా గొప్పగా చూస్తారు. ఎందుకంటే మనసు మనిషి చెప్పినట్లు వింటే, తెలివితో మంచి నిర్ణయాలు తీసుకుంటారు. దాని వల్ల అనవసరమైన కోరికలు కూడా పుట్టవు, చెడ్డ పనులు చేసే ఆస్కారం ఉండదు.

**మోక్షం**

మోక్షానికి కైవల్యం, విడుదల అని అర్థాలు చెప్పవచ్చు. ఒక పనిని కొనసాగించడానికి ఏర్పడిన అడ్డంకులు తొలగిపోవడం, clearance వంటివాటిని నవీన కాలంలో, నవ జీవిన విధానంలో మోక్షం అని భావించాలి. అలాంటివన్నీ సక్రమంగా చేసిననాడు, భౌతికమైన బంధాలు తెగి కైవల్యం కూడా అందుతుంది.

ధీరుడు తనదకు సంపద
జారిన యెడ జింత నొంద జాలక దా ల
క్ష్మీ రమణుని వర చరణాం
భోరుహములు గొలిచి ముక్తి బొందు కుమారా! (43)

మనిషి సంపదలు పోయినా బాధ పడకుండా, సన్మార్గంలో చరిస్తాడో, ఎప్పుడైతే పదవి, సంపద వంటి వ్యామోహాలను విడిచి పెడతాడో, ఏవి కలకాలం ఉండవని తెలుసుకుంటాడోఅప్పుడు శాశ్వతమైన దాని గురించి ఆలోచిస్తాడు ఆ శాశ్వతమైనది మోక్షం అని తెలుసుకున్నప్పుడు దానికై మార్గాలను వెతుక్కుంటాడు. ఆ క్రమంలో ధర్మబద్ధంగా నడుచుకుంటాడు. అలా అన్నిటికీ అంతస్సూత్రంగా ఉన్నది ధర్మమని గ్రహించిన రోజు, దానికి బద్ధులై

జనులు నడిచిన రోజు తప్పకుండా కవి కోరిన సమాజం ఏర్పడుతుంది. కవి ఆశయం, కుమార శతక లక్ష్యం నెరవేరుతుంది.

**ఉపయుక్తగ్రంథాలు**

1. అప్పల వేంకట నరసింహ కవి, ఫక్కి. 1933. కుమారశతకము. గుంటూరు: ఎం ఎస్. శర -కో. పుబ్లిషర్స్
2. ఆరుద్ర. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. (సంపుటం -4). హైదరాబాదు: తెలుగు అకాడమి.
3. వేంకటకృష్ణశర్మ, వేదము. 1954. శతకవ్మాయ సర్వస్వము(సంపుటం-1). మద్రాసు: వేదము వేంకటరాయశాస్త్రి బ్రదర్స్ ప్రచురణ.
4. వేంకటావధాని, దివాకర్ల. 1961. ఆంధ్రవ్మాయ చరిత్రము. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ.
5. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2010. శబ్దరత్నాకరము. గుంటూరు: విక్టరీ పబ్లికేషన్స్
6. సుబ్బారావు, వంగూరి. 1957. శతక కవుల చరిత్రము. నరసాపురము: కమల కుటీర్ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్.

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025**

# సుమతీ శతకం- సామాజిక దృక్పథం

## గడ్డం నాగేందర్

పరిశోధక విద్యార్థి, హైదరబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

Email: Nagendra.arjuna@gmail.com Ph.94935 99821

వ్యాససంగ్రహం :

తెలుగు సాహిత్యంలో శతకాలకు ఒక ప్రత్యేక స్థానము ఉంది. తెలుగులో ఉన్న నీతి శతాకాలలో సుమతీ శతకం ప్రసిద్ధమైనదిగా పేరుంది. ఈ శతకాన్ని బద్దెన అనే కవి రచించాడు. సుమతి అంటే మంచి బుద్ధి కలవారు అని అర్థం. అసలు బుద్ధి అంటే మతి. ఇది సరిగా ఉంటే అంతా బాగుంటుంది, బుద్దితో చేసిన ఏ పని అయిన అనుకున్నట్లుగా పూర్తి అవుతుంది. బుద్దితో వ్యవహరించే తీరు వారికే కాక చుట్టూ ఉన్నవారికి సైతం అంతా బాగుంటుంది. అందుకే బద్దెన కవి సమాజాన్నంతా బాగుచేసి అంతా సుఖశాంతులతో ఉండాలనే మంచి సంకల్పంతో ప్రతి ఒక్కరు నీతి కలిగి ఉండాలనే భావనతో చేసిన ఈ సుమతీశతకం రచించి మానవాళికి అందించారు.

**1. ఉపోద్ఘాతం**

సుమతీ శతకం కర్త మీదా కొన్ని సాహితీలోకం కొంత చర్చ ఉన్నది."సుమతీ శతక కర్త" అని ఈ రచయితను ప్రస్తావించడం కనబడుతుంది. క్రీ.శ. 1220-1280 మధ్య కాలంలో బద్దెన లేదా భద్ర భూపాలుడు అనే కవి సుమతీ శతకం రచించాడని సాహితీ చరిత్రకారుల రచనల్లో దొరికిన పద్యాల ఆధారంగా తెలియజేశారు. కాకతీయుల పాలనా కాలంలో రుద్రమదేవి (1262-1296) రాజ్యంలో ఒక చోళ సామంత రాజుగా ఉన్న బద్దెన రాజనీతికి సంబంధించిన సూక్తులతో 162 పద్యాలు గల మరో లఘుకృతి "నీతిశాస్త్ర ముక్తావళి" అనే గ్రంథాన్ని రాశాడు. బద్దెన మహాకవి తిక్కనకు శిష్యుడు.కమలాసన, కవిబ్రహ్మ అను బిరుదులు కలవాడు.సుమతీ బద్దెనయే రచించినట్లయితే తెలుగు భాషలో వచ్చిన మొదటి శతకాలలో అది ఒకటిగా నిలుస్తుంది. పాలకురికి సోమనాథుని వృషాధిప శతకము, యాథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకము వచ్చిన కాలంలోనే సుమతీ శతకం వచ్చింది.

తెలుగులో ఉన్న నీతి శతకాలలో బద్దెన రాసిన సుమతీ శతకం ప్రసిద్ధమైనది. సాహిత్యంలో కవులు సమాజాన్ని మంచి తోవలోకి తీసుకెళ్ళడానికి మానవాళి సంక్షేమం కోసం ఎన్నోశతకాలు రచించారు. ఐతే ఎంతోమంది సాహిత్యకారులు,పిల్లలు ఇష్టపడే శతకాలలో సుమతీ శతకం ఒకటి. బద్దెన కవి సుమతీ శతకంలో సులువైన చిన్న చిన్న పదాలతో అల్లిన పద్యాలలో ఎంతో గొప్ప నీతులు చెప్పగలిగాడు. తెలుగు వారి జీవితంలోనూ, భాషలోనూ సుమతీ శతకనీతులు భాగాలై పోయాయి. చిన్న పిల్లలకు పూర్వం ప్రాథమిక తరగతి దశనుండి ఈ సుమతీ శతకాన్ని నేర్పేవారు.చిన్న వయసులో మంచి మాటలు మనస్సుకు హత్తుకునే విధంగా పద్య పాదాలు ఉన్నాయి. ఆ తర్వాత వాటిని జీవితంలో పాటించి మంచి నడవడిక కలిగే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో తెలుగు రాష్ట్రాల్లో విద్యా శాఖవారు ప్రాథమిక దశలో పిల్లకు నీతిని మంచి గుణాలను పెంపొందించేందుకు సుమతీ పద్యాలను పాఠ్యాంశంలో చేర్చారు. ఈ శతకాన్ని అనుసరించి అభినవసుమతీ శతకము - ధర్భా సుబ్రహ్మణ్యశర్మ రాశారు.

**2.తెలుగు శతకాలు - మకుటం**

సుమతీ శతకంలోని కొన్ని పద్యాలు బద్దెన కాలం నాటి సామాజిక పరిస్థితిని గురించీ చెప్పబడ్డాయి. కొన్ని పద్యాలు మానవులు ఆచరించాల్సిన నీతులు బోధిస్తున్నాయి. శతకము అనగా వంద.. ఉదాహరణకు విశ్వదాభిరామ వినురవేమ అనేది వేమన శతకమునకు ముకుటము, అలాగే సుమతీ అనేది సుమతీ శతకముకు ముకుటము ఈ శతకాలలో నీతి బోధనా ఉంది. అలాగే ఇతర శతకాలు రాసిన వారు వారి పద్యాలలో వెంకటేశ్వరా, దాశరథి అనే

మకుటాలు ఇతర శతకాలకు ఉన్నాయి. సాధారణంగా ఇతర కావ్య, సాహిత్య ప్రక్రియలు పండితులకు పరిమితమైనాగాని, శతకాలు మాత్రం సామాన్య ప్రజానీకంలో ఆదరణపొందాయి. ఇలా తెలుగులో శతక సాహిత్యము పామరులకూ పండితులకూ వారధిగా నిలిచింది. వీటిలో వేమనశతకానికీ, సుమతీ శతకానికీ సమాజంలో మంచి ప్రాచుర్యం ఉంది. సుమతీ శతకం 108 నీతి పద్యాల సమాహారం.బద్దెన చెప్పిన నీతిపద్యాలను చిన్న పిల్లలను ఎంతో ఆకట్టుకుంటూ వాటినుండి నీతిని గ్రహించేలా ఉపయోగపడుతున్నాయి.

"సుమతీశతకము నీతులనిధి. భాష, శైలి, పాకము, సతి మృదు మధురము లనుటకంటె నధికముగఁ జెప్పవలసినది లేదు. పద్య ము తేట తెల్లముగ నుండి, వేమన పద్యమువలె, నరఁటిపండు వలె విడిపోయి, పండిత పామరజనైక వేద్యముగ నుండును.(శతక కవుల చరిత్రము. పుట57)

సరళమైన చిన్న పద్యాలలో చెప్పబడిన నీతికి నిత్య జీవితంలోనూ, సమాజంలోని భిన్న పరిస్థితులకు ఉపయోగపడేలా ఉన్నాయి.నేటి సమాజానికి ఉపయోగ పడే ఎన్నో విషయాలు,విశేషాలు ఈ శతకంలో ఉన్నాయి.ఈ శతకం పండితులకు,ఉపాధ్యాయులకు,సాహితీ అభిమానులకు ఎన్నో ఇష్టమైన పద్యాలు ఉన్నాయి ఈ శతకంలో పూర్తి పద్యం రానివారు కూడా ఒకటి రెండు పాదాలను ఉటంకిస్తారు. అందులో కొన్ని ఉదాహరణలు"అక్కరకు రాని చుట్టము, అప్పిచ్చువాడు వైద్యుడు,ఇత్తడి బంగారమగునె,తను వలచినదియె రంభ ఖలునకు నిలువెల్లవిషము,బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ,కనకపు సింహాసనమున శునకము కూర్చుండ బెట్టి,ఎప్పుడు సంపదలు గలిగిన నప్పుడు బంధువులు వత్తురు" అనే పద్యంలోని పదాలు నిత్య జీవితంలో వాడుతుంటారు.

ఈలాంటి పద్యాలు తెలియని తెలుగువారు ఉండరని చెప్పవచ్చు. సుమతి శతకంలోని ఎన్నో పద్యభాగాలను గమనిస్తే సామెతలు లేదా జాతీయములుగా పరిగణించదే పదాలు ఉన్నాయి. 'సుమతీ శతకం' రచనావిధానం నీతిశాస్త్ర ముక్తావళిలాగ ప్రౌఢంగాఉండదు. లలిత శబ్దాలతో, హృదయంగమమైన శైలిలో చాలా సరళంగా, లలితంగా, సూటిగా, ధారాళంగా, కమ్మదనంతో ఈ శతక పద్యాలు ఉంటాయి. మొదటి పద్యంలో బద్దెన చెప్పిన 'ధారాళమైన నీతులు, నోరూరగ చవులు పుట్టనుడివెద' అనే విషయాన్ని చెప్పి మొత్తం శతకం రచన ద్వారా సార్ధకం చేసుకొన్నాడు. కవి తన పాండిత్య ప్రదర్శన కన్నా చక్కని జాతీయాలు, తెలుగు పలుకుబళ్ళు, సామెతలు మొదలైన వాటితో పద్యాలను రాశాడు.ఈ శతకం కేవలం పిల్లలే కాకుండా పెద్దలు కూడా గ్రహించాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి.

### 3 సుమతీ శతకం -సామాజిక దృక్పథం

నేటి సమాజంలోని ప్రజల జీవన విధానం వారు నిత్య జీవతంలో ఎదుర్కుంటున్న ఆటుపోట్లు ,సరైన నిర్ణయాలు తీసుకోకపోవడం,తోటివారితో ప్రవర్తించే తీరును బట్టి ప్రజలు విభిన్న సందర్భాలల్లో పలు విధాలుగా ప్రవర్తిస్తున్నారు.ఇలా ప్రజలు సమాజంలోని ఎన్నో ఇబ్బందులను ఎదుర్కుంటూ సరైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయంలో వ్యక్తిత్వ అవగాహనకు ఈ శతకంలోని పద్యాలు ఎంతో ఉపయోగపడుతాయి.ఇలాంటి పద్యాలను పరిశీలించిన సాహితీ కారులు కొన్ని విషయలు సమాజానికి తెలియజేసారు.

విద్యార్థిలోకమునకే గాక,పెద్దలకుఁగూడను పకరించు నీతులందుఁగోళొల్లలుగా నున్నవి. శృంగార రస భావములుసహితము మనసున కెక్కునట్లు అమృతగుళికలవలె నాజూకుగ, తక్కిననీతులతోఁగూడ మిళి తము జేసి, రసవత్తరముగ నక్కడక్కడ నుటంకించుటయందు బద్దెన సిద్ధహస్తుఁడు.(శతక వాఙ్మయము.పుట79)

సమాజంలో సాధారంగా ప్రతి మనిషి వేరొక మనిషిమీదా ఆధారపడి తమ పనులను పూర్తి

చేసుకుంటారు.సమయానికి సహాయం చెయ్యని చుట్టం వలన కలిగే నష్టాన్ని బద్దెన కవి ఎంతో సామజిక దృష్టితో పద్యాన్ని రాసాడు.

అక్కఱకు రాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమునఁ దా
నెక్కినఁ బాఱని గుఱ్ఱము
గ్రక్కున విడువంగ వలయుఁ గదరా సుమతీ !

సాధారణంగా పూర్వం నుండే చుట్టాలు అంటే బంధుజనం అవసరానికి సహకరిస్తారనే విశ్వాసం ఉండేది. ఆపదలో భగవంతుని ప్రార్థిస్తే మొర ఆలకించి ఇబ్బంది తీరుస్తాడని ప్రార్థించడం జరుగుతుంటుంది.

పూర్వం ఈ శతక రచన కాలానికీ, అంతకు పూర్వమూ గుఱ్ఱాలపై యుద్ధం చేసేవారు. ఆ యుద్ధసమయాన తానెక్కి ఉన్న గుఱ్ఱం తాను చెప్పినట్లు నడుస్తూ సహకరించనిచో పైమూడింటినీ వదిలేయాలని కవిచెప్తున్నాడు.అంటే మనకు ఆపదలో సహకరించనివారు ఉన్నా లేకున్నా ఒకటే అని ఆయన చెప్తున్నారు.

నేటి కాలంలో ఎంతో మంది కుటుంబ పోషణకి అవసరాల కోసం దొరికిన పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వచ్చే జీతం మీద ఆధారంగానే ఇంట్లో ఖర్చులు, పిల్లల పోషణ,నివాసానికి సరిపడా ఖర్చులు పెడుతుంటారు. ఇలాంటి సందర్భాలలో జీతం రాకపోతే పడే ఇబ్బందులను కవి ఈ పద్యంలో తెలియజేసాడు.

అడిగిన జీతం బియ్యని
మిడిమేలపు దొరను గొల్చి మిడుకుట కంటెన్
వడి గల యెద్దులఁ గట్టుక
మడి దున్నుక బ్రతుక వచ్చు మహిలో సుమతీ!

సమాజంలో ఎవరైనా కొలువు అంటే ఉద్యోగం చేసేది జీతంకోసమే. అదే కదా జీవ నోపాధి, మరి అవసరమైనపుడు జీతం సొమ్ము ఇవ్వలేని వాని వద్ద పని చేయడం వృధాకదా! దానికంటే పొలందున్నుకుని బ్రతుక వచ్చంటాడు కవి.ఆ రోజుల్లో అందరికీ కాస్తోకూస్తో పొలం ఉండేది దానిని దున్ను కుని ఏదో ఒక పంట వేసుకుని జీవించేవారు. ఈ ఆధునిక కాలంలో పంట పొలాలన్నీ నీరులేక బీడు భూములైపోయాయి, కొన్ని అపార్ట్మెంట్స్ గా వెలిశాయి. కొన్ని రియల్ ఎస్టేట్ వెంచార్లుగా మారిపోయాయి. మరికొన్ని ప్రమాదకరమైన కర్మాగారాలుగా కూడా రూపొందాయి. పనిని నమ్ముకొని పనిచేస్తే సమయానికి జీతం వస్తుందినే ఆశతో కార్మికులు ఉంటె వారి అవసరాలను ఉపయోగించుకొని కొందరు కంపెనీ ఓనర్లు వారి జీవితాలతో ఆడుకుంటున్న సంఘటనలు నేడు ఎన్నో కనిపిస్తున్నాయి. బద్దెన తన నీతి బోధక విషయాలను తెలిపే విధానంలో నిత్యజీవితంలో వ్యక్తులు మంచి గుణాలకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం ద్వారా వచ్చే కష్టనష్టాల గురించి గురించి ఈ పద్యంలో తెలియజేసారు.

ఉత్తమ గుణములు నీచున
కెత్తెఱఁగున గలుగ నేర్చు నెయ్యెడలం దా
నెత్తిచ్చి కఱఁగి పోసిన
నిత్తడి బంగారమగునె యిలలో సుమతీ!

మంచి గుణములు కలవాడే ఈ లోకంలో గుర్తింపబడతాడు.నీచుడు అంటే అధముడు లేక తుంటరి రివాడు మంచి గుణాలను కలిగి సభ్యసమాజంలో గుర్తింపు పొందలేక మంచిగా బతకడం చేతకాక మంచిగుణములను ఆచరించలేడు. అలానే ఇత్తడిని ఎన్నిమార్లు కరగించినా బంగారంగామారదు, అలాగే మంచిగుణములు నేర్చుకోవాలనే

ఆశక్తి లేనివాడు ఎన్నిమార్లు తెలియ పరచినా ఇత్తడి లాగే మిగిలిపోతాడు అని బద్దెన కవి మంచిగా బతకలేని వారి గురించి ఈ పద్యంలో తెలియజేసారు.

ఎప్పటి కెయ్యది ప్రస్తుత
మప్పటి కా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తానొవ్వక
తప్పించుక తిరుగువాఁడు ధన్యుడు సుమతీ!

ఈ పద్యంలోనూ లోకంలో మానవులకు హెచ్చరిక చేశాడు కవి. ఇతరుల మనములు నొప్పించక,చాకచక్యంగా మాట్లాడాలని. ఇతరులనూ బాధించక, తానూ బాధపడక లౌకికంగా , జీవించాలని కవి సూచిస్తున్నారు .

ఎప్పటికెయ్యది ప్రస్తుత
మప్పటికా మాటలాడి యన్యుల మనముల్
నొప్పింపక తా నొవ్వక
తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ

ఎప్పటికిన్ ం ఏ ం అది అంటే ఆయా సందర్భాలను బట్టి. ఎయ్యది అంటే ఏ మాట. ప్రస్తుతం అంటే అనుకూలంగా ఉండి మన్నన పొందుతుందో. (ఏ సమయంలో ఏ మాట మాట్లాడితే అక్కడ గౌరవమర్యాదలు కలుగుతాయో)

ఆ మాటలు అంటే అటువంటి పలుకులుతో అన్యులమనముల్ అంటే ఇతరుల మనసులను. నొప్పింపక అంటే బాధపడేటట్లు చేయకుండా,తాను కూడ నొవ్వక అంటే బాధపడవలసిన స్థితి కల్పించుకుని బాధపడకుండా. (తన మాటలకు ప్రతిగా ఇతరులు తన మనసు కష్టపెట్టేలా మాట్లాడనివ్వకుండా). తప్పించుక అంటే అటువంటి పరిస్థితులను తొలగించుకొని. తిరుగువాడు అంటే ప్రవర్తించే వ్యక్తి. ధన్యుడు అంటే కృతకృత్యుడుఅని బద్దెన కవి తెలియపరుస్తున్నాడు.

బద్దెన కవి అడవిలో దొరికే కాయలను ఉదాహరించి మన చుట్టూ ఉండే వారితో ఎలా ఉండాలో ఈ పద్యంలో తెలియజేసాడు.

ఏఱకుమీ కసుగాయలు
దూఱకుమీ బంధుజనుల దోషము సుమ్మీ
పాఱకుమీ రణమందున
మీఱకుమీ గురువులాజ్ఞ మేదిని సుమతీ!

ఈ పద్యంలోని ఉన్నపండని కాయలు అంటే కసుకాయలు , పిందెలు , వాటిలో పసరు ఉంటుంది. అవితినడం వలన అనారోగ్యం పాలవుతారు, అంతేకాక అవి పెద్దవై పండి కమ్మని రుచితోకూడిన పండ్లను మానవులకు అందిస్తాయి, అలా పెరగనీయకుండా పిందెలుగా ఉన్నపుడే కోయడం మంచిది కాదు. అది పండుగ మారి జనాలు రుచి చూస్తూనే అందుకే పిందెలుకోయకూడదని అన్నాడు కవి. బంధువులను తిట్టకూడదు. రక్తసంబంధీకులూ, దూషించడం చాలానేరం, పుణ్యాకార్యాలకూ, కర్మక్రతువుల సమయాన వచ్చేవారు వారే.అలాంటి వారిని దూషించడం నిన్ను నీవుదూషించు కున్నట్లే, అసలు ఎవ్వరినీ దూషించరాదని చెప్పుకుంటూ తమ చుట్టాలను దూషించడం ఇంకాపాపం అనికవి తెలియజేస్తున్నాడు. జన బహుల్యంలో ' పెద్దల మాట పెరుగన్నపు మూట' అంటారు. ఎంతో అనుభవంతో చెప్పేపెద్దల మాటలను తప్పక పాటించి, ఆపద లను తప్పించుకోడమో, ప్రమాదాల బారినపడకుండా ఉండటమో,మంచి విధానాలను రూపొందించుకోడమో,మంచి నిర్ణయాలు తీసుకోడం చేయాలి, వారు తమజీవిత

మంతా అనుభవించీ,చూసిన అనేకవిషయలు చెప్తారు, కాబట్టి పెద్దలమాట తప్పక విని తీరాలీ అని కవి చెప్తున్నారు.

మనకు శుభాన్ని ప్రసాదించని విద్య
శుభముల నొందని విద్యయు
అభినయమున రాగరసము నందని పాటల్
గుభగుభలు లేని కూటమి
సభమెచ్చని మాటలెల్ల చప్పన సుమతీ!

ఎంతో కష్టపడి నేర్చుకున్న చదువు మంచిని కలిగించనప్పుడు, అలాగే మనసు ఉల్లాస పరచడానికి వినే పాటలు ఇంపును హాయిని కలిగించక, ఉత్సాహము కలిగించని కలయిక, సభలో ఎన్ని మాటలు మాటల్డిన మెచ్చని వారు ఉంటె ఇలా ఏమి చేసిన ప్రయోజనము లేనివిగా అవుతాయి.చేసి పనికి గౌరవం ఉన్నపడే మనం ఆ పనికి పూనుకోవాలి.

సిరి దా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్
సిరి దాఁ బోయిన బోవును
కరిమింగిన వెలగపండు కరణిని సుమతీ!

ఈ పద్యంలో దాగి ఉన్న అంతరార్థం ఏమిటంటే మనకు సంపద వచ్చినప్పుడు కొబ్బరికాయలోకి నీరు వచ్చిన విధంగా రమ్యంగానే ఉంటుంది. అలాగే పోయినప్పుడు ఏనుగు మింగిన వెలగపండులో గుంజు మాయమైనట్లే పోతుంది.సమాజంలో సంపద ఉన్నప్పుడు ప్రజలు ఎవర్ని లెక్కచేయని వాళ్ళు ఏమి లేని పరిసితులను కుడా అర్థం చేసుకోవాలి. అప్పుడే జీవితంలో ఎలా మెలగాలి అనే విషయం తెలుస్తుంది. అంటే సంపద ఉన్నప్పుడు లేనప్పుడు ఉన్న పరిస్థితులను కవి ఈ పద్యంలో తెలియజేసాడు.

చీమలను పెట్టిన పుట్టలు పాములు వశపరుచుకున్నట్లు మన జీవితంలో మనం కష్టపడి సంపాదించింది ఇతరులు తీసుకపోతే వచ్చే నష్టాన్ని బద్దెన కవి ఈ పద్యంలో తెలియజేసారు.

చీమలు పెట్టిన పుట్టలు
పాముల కిరవైనయట్లు పామరుఁడు దగన్
హేమంబుఁ గూడఁ బెట్టిన
భూమీశుల పాలఁ జేరు భువిలో సుమతీ!

ఈ పద్యంలో చీమలు వర్షాకాలంలో తాము కష్టపడకూడదని ఆహారాన్ని తెచ్చుకుని తాముకష్టపడి ,కట్టుకున్న మట్టి పుట్టలో దాచు కుంటాయి. వాటిని బాగా గమనించిన పాము ఆపుట్టలో దూరి తన నివాసంగా మార్చుకుని ఆచీమ లనే తినేస్తుంటుంది. నేటి సమాజంలో కుటుంబం కోసం అనేక విధాలుగా కష్టపడి సంపాదించి, కూడబెట్టి, దానధర్మాలు చేయక తినక,దాచిన సొమ్ము దొంగలపాలో అవ్వడమో, కొడుకులు తండ్రి సంపాదించినా సొమ్మును దోచుకోవడం లాంటి ఎన్నో సంఘటనలను ఇప్పుడు చూస్తున్నాం.సంపాదించిన సంపాదనకు తగిన ప్రభుత్వ శిస్తు కట్టలేదని ప్రభుత్వం పన్ను రూపంలో తీసుకుంటుంది. కావునా ఉరికే ధనాన్ని దాచుకోవడం, మట్టి గడ్డలను దాచుకున్నట్లే, దాన ధర్మాలతో వాటికి మంచి స్థాయి కల్పించి మానవులూ పుణ్యాన్ని సంపా దించుకోవాలని ఈ పద్యంలో బద్దెన తెలియజేసాడు.

సమాజం మన మంచి కోరుకునే వాళ్ళు అన్ని విధాలుగా ముందుకు వెళ్ళాలని అభివృద్ధి చెందాలని

కోరుకుంటారు అలాంటి సమయంలో చాలా విషయలను వినాల్సి వస్తుంది.అప్పుడు సమయ సందర్భాలకు అనుగుణంగా ఎలా ఉండాలో ఈ పద్యంలో బద్దెన సామాజిక దృష్టితో తెలియజేసాడు.

వినదగునెవ్వరు చెప్పిన
వినినంతనే వేగపడక వివరింపదగున్
కనికల్ల నిజము తెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలోసుమతీ!

సుమతీ శతకంలో ఈ పద్యం బాగా ప్రసిద్ధిచెందిన పద్యం. తరచుగా ఈ పద్యాన్ని అందరూ వాడుతుంటారు.. తొందరపాటుతనం ఉండకూడదని బద్దెన ఈ పద్యం ద్వారా నీతిని బోధించాడు మంచి బుద్ధి కలవారు ఎవరు ఏమి చెప్పినా దానిని శ్రద్ధగా వినాలి. అయితే విన్న వెంటనే తొందరపడి ఒక నిశ్చయానికి రాకూడదు. బాగా ఆలోచించి తెలుసుకొని, ఆ చెప్పిన విషయం అసత్యమో, సత్యమో అని ఎవరు తెలుసుకుంటారో వారు నీతి తెలిసినవారని వారె సరైన మార్గంలో పయనిస్తారు.ఎప్పుడైనా ఎవరైనా ఏదైనా విషయాన్ని చెప్పినప్పుడు దానిని శ్రద్ధగా వినాలి. అవతలి వారికేం తెలియదు అనుకోకూడదు. విన్న తరవాత తొందరపడి ఆ విషయం మీద ఒకనిర్ణయానికి రాకూడదు. వారు చెప్పిన విషయంలో ఎంత నిజం ఉందో, ఎంత అబద్ధం ఉందో ముందుగా తెలుసుకోవాలి. ఎవరైతే అలా తెలుసుకోగలుగుతారో వారిని నీతిపరులుగా చెప్తారు.తొందరపడి నిర్ణయం తీసుకుంటే అప్పుడు నష్టపోవడమేకాక, ఆ తరవాత కూడా బాధపడవలసి ఉంటుంది.

**ముగింపు**

ఈ సుమతీ శతకంలో సమాజంలోని సామాన్య జనులకు ఉపయోగపడే ఎన్నో నీతులు నిత్య జీవితంలో తీసుకోని నిర్ణయాలు సమాజంలోని వ్యక్తుల ప్రవర్తనకు సంబంధించి చాలా విషయాలను సుమతీ శతకం ద్వార తెలుసుకొనిరోజువారీ వ్యవహారాల్లో జాగ్రతగా వ్యవహరించే వీలు ఉంటుంది.నేటి సమాజంలో ఇప్పటికి మనకు ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా బద్దెన రాసిన సుమతీ శతకం మార్గనిర్దేశం చేస్తుంది.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. బద్దెన సుమతీ శతకం.విజయవాడ:విక్రమ్ పబ్లిషర్స్ ప్రై.లిమిటెడ్
2. కుసుమ కె. మూర్తి.వేమన,సుమతీ శతక పద్యాలకుపురాణ కథలు.హైదరాబాద్: సర్వ స్వామ్యములు, 1999 మొదటి ముద్రణ.
3. గోపాల కృష్ణారావు, కె. ఆంధ్ర శతక వాఙ్మయం.హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ,1975 ముద్రణ.
4. గోపాల కృష్ణారావు, కె. ఆంధ్ర శతక సాహిత్య వికాసము. హైదరాబాద్:ఆంధ్ర సారస్వత పరిషత్తు,1976 ప్రథమ ముద్రణ.
5. లక్ష్మణకవి, ఏమగు.(ఆంధ్ర అనువాదం) శ్రీ హరి రవ్వ (దీపికా వ్యాఖ్యాసహితం)బర్తృహరి నీతిశతకము.హైదరాబాద్: శ్రీ పావని సేవా సమితి,2004 ముద్రణ.
6. వంగూరి సుబ్బారావు 'శతకకవుల చరిత్ర'.నరసాపురం: కమల కుటీర్ పబ్లికేషన్, 1957 ముద్రణ.

❖❖❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# భర్తృహరి నీతి శతకం - ఆధునిక రాజకీయ నేపథ్యం

## కర్నె మల్లికార్జున్

పరిశోధక విద్యార్థి తెలుగుశాఖ, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

Email: karnemallikarjun5209@gmail.com, Ph.6303744239

**ఉపోద్ఘాతం:**

తెలుగు శతక రచన ప్రారంభం నన్నయ భారతంలో 'నాగీ' గీతాలలోనే పురుడు పోసుకుందని కొందరి విమర్శకుల మాట. పాల్కూరికి సోమనాథుడు మాట ప్రకారం మల్లికార్జున పండితుడు రాసిన 'శివతత్వసారము' మొదటి శతకం అని కొందరి అభిప్రాయం. కానీ సంఖ్య, మకుట నియమాలు లేవు అన్న కారణంతో శివతత్వసారమును మొదటి శతకంగ అంగీకరించకపోయినా అదే యుగానికి చెందిన పాల్కూరికి సోమనాథుడు రాసిన వృషాధిప శతకం అన్ని శతక లక్షణాలు పునికిపుచ్చుకున్న మొదటి శతకం అని అంటారు. కానీ ప్రముఖ పరిశోధకురాలు ముదిగంటి సుజాత రెడ్డిగారి ప్రకారం సుమతీ శతకమే పూర్తి లక్షణాలున్న మొట్టమొదటి శతకం అనే వాదన కూడా లేకపోలేదు1. తెలుగులో సంఖ్య, మకుట, ముక్తక నియమాలతోపాటు వృత్త నియమం ఉండాలన్న వాదన ఉంది2. భిన్న వాదనలు ఏ ప్రక్రియలోనైనా ఉంటాయి. ఆ వాద ప్రతివాదనలే ఆ ప్రక్రియను సాహిత్యంలో నిలబెడుతాయి.

భర్తృహరి ప్రాచీన భారతదేశ శాస్త్రీయ సంస్కృత సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ప్రముఖ కవి మరియు తత్వవేత్త. అతని ప్రసిద్ధ రచనలలో నీతిశతకం నైతిక తత్వశాస్త్రం, నైతిక ప్రవర్తనను అన్వేషించే ప్రాథమిక గ్రంథంగా నిలబడింది. భర్తృహరి జీవించిన కాలంపై కొంత వివాదం ఉన్నా ఆయన విక్రమర్కుకుడి ఆస్థానంలో ఉన్నట్లు కూడా వాదోపవాదాలు లేకపోలేదు. భర్తృహరి లోకజ్ఞత అసమానమైనది. మానవ జీవిత సంక్లిష్టతల మధ్య ధర్మబద్ధమైన జీవితాన్ని గడపడానికి ఆచరణాత్మకమైన మార్గాన్ని అందించే లక్ష్యంగా మూడు శతకాలు పదానువాద పద్ధతిలో తెలుగులోకి ముగ్గురు కవుల కృషి ఫలితంగా వచ్చాయి. భర్తృహరి నీతి శతకంలో ప్రధానంగా స్వీయ క్రమశిక్షణ, ధర్మబద్ధమైన నడవడి, మనిషి అస్థిరమైన స్వభావాన్ని జంతువుల స్వభావంతో పోలిక చెప్పడం, నేడు నైతికమైన జీవితాన్ని జీవించడానికి మనిషికి కావాల్సిన బోధ ఈ శతకంలో చెప్పబడింది. అలాగే నేటి జీవన మానవ సంబంధ భాంధవ్యాల దృష్ట్యా నమ్మకం, స్నేహం మరియు వృత్తి పరమైన, వ్యక్తిగతమైన విషయాలలో దిశా నిర్దేశం చేసేలా సాగుతుంది. తిడుతూ చెప్పినవాడు మంచి చెప్పే విధంగానీతి శతకం కూడా ఎల్లప్పుడూ తిడుతూనే మంచి మార్గం వైపు నడిపిస్తుంది.

ముఖ్యంగా భర్తృహరి నీతి శతకం సమకాలీన సమాజంలో సొందర్భోచితంగ కాలాన్ని మరియు సంస్కృతిని దాటి నేటి కాలానికి అన్వయించే శాశ్వత ప్రమాణాలను అందించిన ఘనమైన శతకం. నాటి కాలంలో రాజనీతి నేటి కాలంలో రాజకీయ నీతిని ప్రతిబింబిస్తుంది. రాజకీయ నీతిలో కాలాన్ని దాటి కాలజ్ఞానం చెప్పిన తాత్వికుడిగా భర్తృహరి నేటి కాలంలో జీవించాడేమో! అన్న సందేహం కలగక మానదు. నేటి కాలంలో రాజకీయం అన్న పదమే అర్థోపకర్ష చెందిన పదంగా మారిపోయింది. నేటి రాజకీయ నాయకుల మనస్తత్వం, వారికి విద్యపై ఉన్న దృక్పథం, వారి పరిపాలన, వారి రాజకీయ నీతి వంటి విషయాలు గురించి భర్తృహరి నీతి శతకంలో చాలచక్కగా చెప్పాడు.

**అ. రాజకీయ నాయకుల ప్రవర్తన :**

తే. సత్య మనృతంబు పరుషోక్తి సరసభాష
ప్రాణిహింసయు దయయు లోభంబు నీఁగి
కనకసంగ్రహవ్యయములు గలుగు వార
రమణికైవడి బహురీతి రాజనీతి. (భర్తృ.నీతి:39)

రాజకీయ నాయకులు ఒకసారి సత్యం చెబుతారు. ఎప్పుడంటే తన ప్రత్యర్థి తప్పు చేసిన విషయంలో నేటి కాలంలో చూస్తున్నాం ఎన్నికల బరిలో తప్పుడు సమాచారం పొందుపరిచి గెలిచిన తరువాత తిరిగి ప్రత్యర్థి దాన్ని గుర్తించి న్యాయస్థానం ఎక్కడం. మధ్యంతర పదవీకాల రద్దులు నేడు రాజకీయ నాయకులు శత్రువు విషయంలో సత్యం చెప్పిన సందర్భంలోనే జరుగుతున్నాయి. ఒకప్పుడు అబద్ధం చెపుతాడు తన తప్పును కప్పి పుచ్చుకోవడానికి. నేడు రాజకీయ నాయకుల సత్యం–అసత్యాలను నిర్ధారించడానికి ప్రజలు వారి జీవిత కాలం పణంగా పెడుతున్నారు. ఒకసారి రాజకీయ నాయకుడు హింసిస్తాడు ఓటు వేసిన ప్రజలు న్యాయం కోసం పోరాటం చేసినప్పుడు. మరొకప్పుడు దయ చూపిస్తాడు కరువుకాటకాల బారిన పడిన ప్రజలతో 'చిత్ర' విచిత్రంగ జాలి, దయ, కరుణ ఇంద్రజాలంతో. ఇంకొకసారి పిసినారి తనాన్ని చూపుతాడు వ్యవసాయ, రక్షణ రంగాలకు వాటాలు పంచే విషయంలో. మరొకసారి దాతృత్వాన్ని ప్రదర్శిస్తాడు రైతులు–సైనికులు మరణించిన సందర్భంలో నష్టపోయిన కుటుంబాలకు సంతాపం తెలుపుతూ, వారి ఓదార్పును డబ్బుతో వెలగట్టి వ్యయం చేస్తాడు ఒకసారి. గెలిచిన ప్రతిసారి ఆస్తులు విలువలు రెట్టింపు చేస్తూ సంపాదిస్తాడు. వారకాంతతో కవి రాజును పోల్చాడు కానీ వారికైనా నీతి నియమాలు ఉంటాయి కానీ రాజకీయ నాయకుడికి ఉండవు. ఊసరవెల్లి పరిసరాలను బట్టి తన ఊపిరి కోసం రంగులు మారిస్తే అలా నేటి మేటి ఆధునిక రాజకీయ నాయకుడు తన ఉనికి కోసం పరిస్థితులను బట్టి రంగులు మారుస్తాడు.

క. మనుజులలో నెవ్వఁడు దగఁ
దనవాఁడనువాఁడు దుష్టధరణీశునకుం
దనకయి వ్రేలిమి వ్రేల్చెడు
జనునితనువుఁగాల్చు వాయుసఖుఁడదయుండై. (భర్తృ.నీతి:47)

నేటి రాజకీయ నాయకుల పట్ల ప్రజలు ఎంత అభిమానం, గౌరవం, నమ్మకం కలిగివున్న వారికి ఉన్న రాజకీయ దర్పం వల్ల కన్నుమిన్ను గానక ప్రవర్తిస్తుంటారు. ప్రజలు వారి జీవన పోరాట నిమిత్తం రాజకీయ నాయకుల పరిపాలనను వేలెత్తి చూపితే అంతవరకు ప్రజలు వారిపై చూపిన అభిమానంను మరిచి ఎలాగైతే నిప్పు మన తన అనే భేదం లేకుండ యజ్ఞం చేసే పండితులను సైతం కాల్చి వేస్తుందో అలాగే రాజకీయ నాయకులు ప్రజలపై అధికార మదాన్ని ప్రయేగించి ప్రజలను హింసిస్తారు.

ఉ. మౌనము చేత మూఁగయు సమంచితవక్త ప్రలాపి చెంగటం
బూని వసింప దిట్ట దమముందట దవ్వగ నుండెనేని శా
లీనుడు దాల్మి భీరుఁడవలిప్తుడు దాలిమి లేనిబంటు భూ
జానులసేవ దుష్కర మసాధ్యము యోగులకైన నిద్ధరన్. (భర్తృ.నీతి:48)

రాజుల దగ్గర రాజకీయ నాయకుల దగ్గర హద్దులు వారి అవసరాల నిమిత్తం మారుతు ఉంటాయి. వారి దగ్గర ఏమి మాట్లకుండగా మౌనంగా ఉంటే వీడు మూగవాడు అంటూ జమకడతారు. అదే వారికి నేర్పుతో సలహాలిస్తే అసంబద్ధ ప్రలాపి వీడు ఎక్కువగ మాట్లాడుతున్నాడు నక్క వినయాలు కలిగినవాడు అంటూ మాట్లాడుతారు. పోనీ వారికి దగ్గరగా చేరుకొని సలహాలిస్తే వీడికి రాజకీయ నాయకుడు అంటే భయభక్తులు లేవని బెదిరిస్తారు. అలాగని ఓర్పు లేకుండా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడితే గర్వం కలవాడు అని మందలిస్తారు. రాజుల దగ్గర, రాజకీయ నాయకుల దగ్గర మాట్లాడిన తప్పే, మాట్లాడకపోయిన తప్పే, కూర్చున్న తప్పే, కుర్చోకపోయిన తప్పే వారు ఎదుటి వ్యక్తులతో ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తారో ఎవరికీ తెలియదు.

**ఆ. విద్యపై రాజకీయ నాయకుల దృక్పథం :**

ఉ. హర్తకుఁగాదు గోచర మహర్నిశము సుఖపుష్టి సేయు స
త్కీర్తిఘటించు విద్య యను దివ్యధనం బఖిలార్థికోటికిం
బూర్తిగ నిచ్చినం బెరుఁగు బోదు యుగాంతపువేళ నైన భూ
భర్తలు దద్ధనాధికుల పట్టున గర్వము మాను టొప్పగున్. (భర్తృ.నీతి:13)

విద్య అనే ధనాన్ని దొంగలు దొంగలించలేని ఆస్తి. విద్య నేర్చుకున్నవాడు సుఖంగ జీవనం గడుపుతాడు. విద్య అనే సంపదను ఇతరులకు ఎంత పంచిపెట్టిన తరగని ఆస్తి. ప్రళయము సంబవించిన నశించనిది విద్య. అలాంటి విద్య పట్ల నేటి రాజకీయ నాయకుడు నాయకులు విషం కక్కే ప్రయత్నం చేస్తున్నారు. విద్య నేర్పే నేటి టీచర్ వ్యవస్థను పట్టించుకోకుండా వారి రాజకీయ ఎత్తుగడలకు బలి పశువుగ ఎంచుకున్నారు. ఆంధ్రాతెలంగాణమున 'DSC' అనే నోటిఫికేషన్ ను పావుగా వాడి వారి రాజకీయ ప్రస్థానంను కొనసాగిస్తున్నారు. విద్య పట్ల, విద్య నేర్పే గురువుల పట్ల నేటి రాజకీయ నాయకులకు చిత్తశుద్ధి కనబడుటలేదు. విద్య నేర్పే పండితుల పట్ల రాజకీయ నాయకులు గర్వం ప్రదర్శించడం మానుకోవాలి.

తే. ప్రభులు పండితు లగువారి వలన గర్వ / కలనమానుఁడు వారు మీకలిమి తృణము
లీలఁబోలింప లేమి మృణాళగుణము /భూరిమదవారణములకు వారణంబె. (భర్తృ.నీతి:14)

నేటి కాలంలో రాజకీయ నాయకులు జ్ఞానవంతులైన పండితుల వారి పట్ల గర్వమును ప్రదర్శిస్తారు. డబ్బు ఉంటె ఎంతటి కార్యనిర్వహణ అధికరులనైన అదుపులో పెట్టవచ్చు అంటూ విర్రవీగుతారు. కానీ నిజమైన అధికారులు, పండితులు రాజకీయ నాయకుల యొక్క ధనాన్ని గడ్డి పోచగా పరిగనిస్తారు. తామరతూళ్ళ దారంతో ఏనుగును అపగలరా? అట్లాగే నిజమైన ప్రజా ప్రయోజన అధికారులు రాజకీయ నాయకుల ఎత్తుగడలకు లొంగరు. వారిచ్చే డబ్బుకు ఆశపడి ప్రజలు వారిపై పెట్టుకున్న నమ్మకాన్ని అమ్ముకోరు.

చం. వనజభవుండు గోపమున వాహన మైనమరాళభర్తకు
వనజవనీవిహారకలనంబు దొలంగఁగఁ జేయుఁ గాని గుం
భనమున దుగ్ధజీవనవిభాగవిధాననిరూఢనైపుణీ
జనిత మహాయశోవిభవసారము హంసకు మాన్పఁజాలునే. (భర్తృ.నీతి:15)

బ్రహ్మకు తన వాహనం అయిన హంస మీద కోపం వస్తే తామర వనంలో విహరించకుండ మాత్రమే చేయగలడు. కానీ నీటిని పాలని వేరుచేయగల నైపుణ్యాన్ని అలా చేయడం వలన వాటికి వచ్చే కీర్తి ప్రతిష్టలను మాత్రము పోగొట్టలేడు కదా! అలాగే పండితులపై రాజులకు కోపం వస్తే తమ దేశం నుండి వెళ్ళగొట్టగలరు కానీ వారి సర్వశాస్త్ర పరిశీలన చాతుర్యాన్ని తొలగించలేరు కదా. అట్లాగే రాజకీయ నాయకులు నిజాయితీగల ఉన్నతాధికారులను తన ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు బదిలీ చేయగలడు కానీ అప్పటి వరకు వారు ప్రజలకు చేసిన సేవ, ప్రజల మనుసులో వారు వేసిన ముద్రను చెరపలేరు కదా!. వారు ఈ ప్రాంతం నుండి ఏ ప్రాంతానికి వెళ్ళిన వారి నిజాయితీ, నిబద్దతను పోగొట్టలేరు కదా!.

**ఇ. రాజకీయ నాయకుల పరిపాలన :**

చ. సకలకలావిభూషితులు శబ్దవిదుల్ నయతత్వబోధకుల్
ప్రకటకవీంద్రు లేన్నపతిపజ్జను నిర్ధను లై చరింతు రా
వికృతపుజాడ్య మాదొరది విత్తము లేక యవారు పూజ్యులం
ధక జనదూషితంబులు ఘనంబులు గావె యమూల్యరత్నముల్. (భర్తృ.నీతి:12)

నేటి సమాజంలో సకల కళా విద్యలు యందు ప్రావీణ్యం కలిగిన వ్యక్తులు ఉన్నారు. వారు ఎంత మందికినైన విద్యను బోధించగల సామర్థ్యం కలిగిన వారు. అలాంటి వారు ఏ రాజకీయ నాయకుల ప్రాంతంలో తిండికి కూడా

నోచుకోని స్థితిలో ఉంటూ,నేర్చుకున్న విద్య తనకు బతుకుదెరువును చూపించలేదని విలపిస్తు బ్రతుకుతున్నారంటే దానికి కారణం వారు నేర్చుకున్న విద్య కాదు. వారిని పరిపాలించే పాలకుల అలసత్వ రాజకీయం. విద్య నేర్చుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించకుండ, కళల యందు ప్రావీణ్యం కలిగిన వారికి ఉపాధిని అందించకుండా ఏ రాజకీయ నాయకుడు 'నిమ్మకు నీరెత్తినట్లు' ప్రవర్తిస్తున్నాడో అది ఆ రాజకీయ నాయకుడికే అవమానం. అలాగే నేటి సమాజంలో చదువు ఉండి కూడా ఉద్యోగం రాలేదని దూషించే వ్యక్తులు లేకపోలేదు అలాంటి వారు గుడ్డి వారు. అలాంటి అంధకులు అమూల్యమైన రత్నముల వంటి విద్య నేర్చిన వ్యక్తుల గురించి దూషించినంత మాత్రాన వాటి యెక్క విలువ ఎక్కడ తగ్గదు.నేటి సమాజంలో విద్య నేర్చుకున్నవారికి విలువ ఉద్యోగం సంపాదించినప్పుడే వస్తుందనుకుంటారు. కానీ ఆ విద్య వలన సిద్ధించిన ఆ వ్యక్తి యెక్క వ్యక్తిత్వం,వ్యక్తి నడవడి గురించి ఆలోచించే మనుషులే కరువయ్యారు.

తే. ధరణి ధేనువుఁ బిదుకంగఁ దలఁచి తేని
జనుల బోషింపు మధిపవత్సములమాడ్కి
జనులు పోషింపఁ బడుచుండ జగతి కల్ప
లత తెరంగున సకలఫలంబు లొసఁగు. (భర్తృ.నీతి:38)

నేటి రాజకీయ నాయకులు ప్రజలపై ప్రత్యక్ష పన్ను, పరోక్ష పన్ను,ఇంటి పన్ను,భూమి పన్ను మొదలైన పన్నులు వేస్తున్నారే తప్ప ఆ పన్నుల నుండి వచ్చిన రాబడి ప్రజల శ్రేయస్సు కొరకు వినియోగించకుండ స్వప్రయోజనాల కోసం ప్రజల సొమ్మును వినియోగిస్తున్నారు. ప్రజల నుండి ఆర్జించిన సొమ్మును ప్రజల కోసం వినియోగించాలి. ఆవు తన యజమానికి సగభాగం పాలిచ్చి అలాగే తన దూడకు కూడా చక్కగా సగభాగం పాలిచ్చి పెంచుతుంది. అలాగే ఆవు లాంటి భూమిపై రాజకీయ నాయకులకు అధికారం ఉన్నా దాని నుంచి వచ్చిన లాభంలో తిరిగి సగభాగంనుధరణి బిడ్డలైన ప్రజల అవసరాలు తీర్చాలి. కానీ నేటి కాలంలో ప్రజలను కన్న బిడ్డలవలే చూసుకునే చిత్తశుద్ధిగల నాయకులే కరువయ్యారు.

**ఈ. రాజకీయ నాయకుల నీతి :**

చ. ఖలు లగువారలం దురధికారసమర్థులఁ జేసి తానిర
ర్గళగతి యై నికృష్టనిజకర్మము విస్మృతిపా లొనర్చి ని
శ్చలగుణవైరి యై విధివశంబున సంపద గాంచి త్రుళ్ళుచు
మెలఁగునృపాలుదేశమున మేలు లభించునె యెట్టివారికిన్. (భర్తృ.నీతి:49)

ప్రజలు నమ్మకంతో గెలిపించిన నాయకుడు ఆ నమ్మకాన్ని ఒమ్ము చేసి గెలిచిన వెంటనే తన చుట్టూ దుర్జనులు,మూరు?లకు పదవులను అప్పజెపుతాడు. తను పూర్వం అధికారం లేనప్పుడు జీవించిన జీవితాన్ని మరచి అధికార మధంతో ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తాడు. మంచి వారికి శత్రువు అయి కన్నుమిన్ను గానక తనకు ఆ గెలుపును ప్రసాదించిన దేవుళ్ళలాంటి ప్రజలనే ఇబ్బందులకు గురిచేస్తుంటాడు. గెలిచిన రాజకీయనాయకుడు గతాన్ని మరిచి,వర్తమానంలో మురిసి,భవిష్యత్తుకై ఆరాటపడుతుంటాడు.

తే. అజ్ఞయును గీర్తియును భూసురావనంబు
దానమును భోగమిత్రసంత్రాణనములు
షడ్గుణంబులు గలుగ వేజనులయందు
వారిఁగొల్చిన ఫలమేమి వసుమతీశ. (భర్తృ.నీతి:40)

శాషించే శక్తి,మంచి కీర్తి,సత్పాత్రదానము,సుఖానుభవము,బ్రాహ్మణ పరిరక్షణ,ఆపన్నులైన మిత్రులను రక్షించడం అనే ఆరు గుణాలు లేని రాజును సేవించడం రాజకీయనాయకుడిని ఎన్నుకోవడం సరికానిది.శాసించే శక్తి లేని

వారు నేడు రాజకీయ నాయకులుగా చెలామణి అవుతున్నారు. ప్రజలు ఓటు వేసి రాజకీయ అధికారాన్ని వీరి చేతిలో పెట్టినా వీరు శాసించలేని పక్షంలో డబ్బు, గొప్ప పలుకుబడి ఉన్న వారి చేతిలో కీలుబొమ్మలు కావాల్సిందే. అలాగే మంచి కీర్తి లేని నాయకులకు ప్రజలు అధికార పగ్గాలు ఇచ్చిన వారి చెడు నడత వలన అధికార దుర్వినియోగానికి పాల్పడుతారె తప్ప ప్రజల మానధనము గురించి ఆలోచించరు. అలాగే నాటి కాలంలో బ్రాహ్మణ పరిరక్షణగా నేటి కాలంలో వారి స్థానాన్ని భర్తీ చేసే కర్యనిర్వహకుల పరిరక్షణ లేని నాయకుడిని గద్దెనెక్కించడం కూడా ఎంతమాత్రం సరికానిది. అలాగే ప్రజలకు సరైన పాత్రధానము అంటే కనీస అవసరాలయిన కూడు,గూడు,గుడ్డను అందించలేని నాయకులు వ్యర్థమే. నేడు రాజకీయ నాయకులు ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికి,ఎన్నికల తరువాత నువ్వు ఎవరో? నేను ఎవరో? అన్నట్లు ఓట్లేసి గెలిపించిన ప్రజలతో వ్యవహరిస్తుంటారు. అలాగే సుఖానుభవము సుఖము ఎల్లకాలం తనవద్ద ఉండదని గ్రహించని నాయకులు ఎల్లప్పుడూ వారి సుఖాల కోసం ప్రజలధనము వెచ్చించి వృధాగ డబ్బును ఖర్చు చేస్తారు అలాంటి వారిని ఎన్నుకోవడం సరికాని పని.

**ముగింపు :**

భర్తృహరి చెప్పిన నీతి శతకం రాజకీయ నాయకులకు దిశానిర్దేశం చేసే కరదీపిక వంటిది. నేటి రాజకీయ నాయకులు భర్తృహరి చెప్పిన నీతిని ప్రామాణికంగా తీసుకొని పరిపాలన సాగిస్తే ప్రజల యొక్క మన్నన వారిపై ఎప్పుడూ ఉంటుంది. పరిపాలన సాగించే రాజైన, రాజకీయ నాయకుడైన అధికార గర్వాన్ని పక్కనపెట్టి ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకునే వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలి వారిని ఎలాంటి కష్టానికి గురిచేయకుండ రాజకీయ నాయకుడు పరిపాలన సాగించాలి అన్న నీతి సారాన్ని భర్తృహరి నీతి శతకం ప్రభోదకంగ తెలియజేస్తుంది.

**సూచికలు :**

1.సుజాత రెడ్డి, ముదిగంటి & నారాయణ రెడ్డి,సి(సంపాదకత్వం). 2015.తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర.హైదరాబాద్బీతెలంగాణ సారస్వత పరిషత్తు.

2.సుజాత రెడ్డి, ముదిగంటి నారాయణ రెడ్డి, సి(సంపాదకత్వం). 2015. తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర.హైదరాబాద్బీ తెలంగాణ సారస్వత పరిషత్తు.

**ఆధార గ్రంథాలు:**

1.నాగయ్య. జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటం 2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.

2.భర్తృహరి. 2012. భర్తఅహరి సుభాషితములు. విజయవాడ: లిఖిత ప్రచురణలు.

3.ఆరుద్ర. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. (సంపుటం 4). హైదరాబాదు: తెలుగు అకాడమి.

4.సుబ్బారావు, వంగూరి. 1957. శతక కవుల చరిత్రము. నరసాపురము: కమల కుటీర్ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్.

5.ప్రసాద్, మొండెపు. 2013. శతకాలలో స్త్రీల పట్ల వవక్ష. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

6.నారాయణరెడ్డి, సి. 1977.ఆధునికాంధ్ర కవిత్వం: సంప్రదాయములు -ప్రయోగములు. గంజి బజార్: శివాజీ ప్రెస్.

7.భర్తృహరి. 1990. సుభాషిత త్రిశతి. విజయవాడ: జి. వి. హెచ్. పబ్లికేషన్స్.

8.గోపాలకృష్ణారావు, కె. 1976. ఆంధ్ర శతక సాహిత్య వికాసము. హైదరాబాద్: ప్రతిభా ఆర్ట్ ప్రింటర్స్.

9.వీరస్వామి, పల్లేరు. 2005. తెలంగాణా శతక సాహిత్యం. వరంగల్లు: అశోక్ కఅష్ణ ఆఫ్ సెట్ ప్రింటర్స్.

10.గురజాడ, గరికిపాటి. 2020. మనుచరిత్ర- వ్యక్తిత్వ వికాసం. విజయవాడ: శ్రీరాఘవేంద్ర పబ్లిషర్స్.

11.వేంకటకృష్ణశర్మ, వేదము. 1954. శతకవ్మాయ సర్వస్వము. మద్రాసు: వేదము వేంకటరాయశాస్త్రి బ్రదర్స్.

12.వెంకటప్పయ్య, వెలగా (సం) 2013, తెలుగు శతక మంజరి. విజయవాడ: నవరత్నబుక్ హౌస్.

13.వెంకటావధాని, దివాకర్ల. 1961. ఆంధ్రవ్మాయ చరిత్రము. హైదరాబాదు: తెలుగు అకాడమి.

14.గోపాలకృష్ణారావు, కె. 1975. ఆంధ్ర శతక వ్మాయం. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక** సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ **జూన్- 2025**

# భాస్కర శతకము - ఆధునిక జీవన సమన్వయం

**నడింపల్లి నీరజ**

పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు

Email: neeraja29051999@gmail.com Ph.70755 91083

**ఉపోద్ఘాతం :**

లలిత కళలు ఐదు. చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, నృత్యం, సాహిత్యం. లలిత కళల్లో అన్నిటికంటే చివరదైనా సాహిత్యానికి ఆదరణ ఎక్కువ. ఎందుకంటే ఈ సాహిత్యం ఛందోబద్ధంగా, లయాత్మకంగా ఉండి మార్పు చెందడానికి వీలుండదు. "హితేనా సహితం సాహిత్యం" సమాజానికి మేలు చేకూర్చేది సాహిత్యం. సాహిత్యం అనేది సమాజానికి ఉపదేశాన్ని, ఆనందాన్ని కలిగించే విధంగా ఉంటుంది. సమాజంలో ఉండే దురాచారాలను, అనవసర కట్టుబాటులను వేలెత్తి చూపే విధంగా సాహిత్యం ఉంటుంది. నిత్యజీవితంలో ప్రజలు ఎదుర్కున్న బాధలను, ఆనందాలను, అనుభవాలను, జీవన విధానాలను కవులు తమ సాహిత్యం ద్వారా తెలియజేశారు. సాహిత్యం ఉపదేశాత్మకంగా ప్రస్తుత సమాజానికి ఉపయోగపడుతున్నప్పటికి సాహిత్యం కూడా అపవాదులు ఎదుర్కొంటున్నది. సాహిత్యంలో అశ్లీల వర్ణనలు చేశారని సాహిత్యాన్ని మొత్తం నిందించటం ఎంత మాత్రం సబబు కాదు. సాహిత్యాన్ని ఆధునిక జీవనానికి ఎలా అన్వయించుకోవాలో తెలియకపోతే సాహిత్యం వ్యర్థమైనదిగా కనిపిస్తుంది. సాహిత్యంలో వ్యర్థమైన సాహిత్యం 10% ఉంటే సమాజానికి ఉపయోగపడే సాహిత్యం 90% ఉన్నది.

సాహిత్యాన్ని చూసే వ్యక్తి దృష్టిని బట్టి సాహిత్యం కనిపిస్తుంది. సాహిత్యంలో ప్రాన్నయ యుగం నుండి దక్షిణాంధ్ర యుగం వరకు కవులందరూ ఎంచుకున్న ప్రక్రియ పద్య ప్రక్రియ. సాహిత్యంలో పద్య ప్రక్రియ లోనే ఎక్కువ రచనలు జరిగాయి. సాహిత్యం అనే చెట్టుకు పద్య ప్రక్రియ అనేది ఒక కొమ్మగా చెప్పుకోవచ్చు. కవులు "అల్పాక్షరాల్లో అనల్పార్థం రచన" అనే విధంగా తాము చెప్పదలుచుకున్న భావాన్ని పద్యాలలో రచించారు. తెలుగులో పద్యాలు కొన్ని నియమాలతో శతకం ప్రక్రియగా రూపొందింది. మొదటి శతకం " శివతత్త్వసారం" ను మల్లిఖార్జున పండితారాధ్యుడు రాశాడు. దీనిలో సంఖ్య నియమం, మకుట నియమం లేకపోవడం వలన దీనిని తొలి శతకంగా పరిగణించడంలేదు. తెలుగులో శతక ప్రక్రియ 12వ శతాబ్దంలోనే ఏర్పడింది. మొట్టమొదట శతకమును రాసినది పాల్కురికి సోమనాథుడు. ఇతను రాసిన శతకం 'వృషాదీపశతకం'. సర్వ లక్షణాలు కలిగిన తొలి శతకంగా దీన్ని చెప్తారు.

శతకం అనగా 100 అని అర్థం. శతకంలో 100, 101, 108, 116 పద్యాలు ఉంటాయి. ప్రతి శతకంలో ప్రత్యేకంగా మకుట నియమం ఉంటుంది. ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు శతక ప్రక్రియ దేదీప్యమానంగా వెలిగిపోతుంది. నేటికీ అనేక రకాల శతకాలు వెలువడుతున్నాయి. హాస్య శతకాలు, అధిక్షేప శతకాలు, భక్తి శతకాలు, నీతి శతకాలు అని శతకాలలో వైవిధ్యంతో అనేక రకాల శతకాలు వెలబడుతున్నాయి. ప్రాచీన కవులు మనిషి ఎలా జీవించాలి, ఎటువంటి వారితో స్నేహం చేయాలి, చెడ్డవారిని ఎలా గుర్తించాలి, ఎటువంటి సంతానం కలిగితే లాభం, నాయకులు ఎలా ఉండాలి, భార్య-భర్తలు ఎలాంటి ప్రవర్తన కలిగి ఉండాలి అనే అనేక విషయాలను శతకంలో చెప్పారు. ప్రస్తుతం నేను తీసుకున్న అంశం "భాస్కర శతకం- ఆధునిక జీవన సమన్వయం". ఈ శతకాన్ని రాసింది మారవి వెంకయ్య. ఇది భక్తి, నీతి శతకంగా ప్రసిద్ధి చెందినది. ఈ శతకంలో ధనవంతుడిని పేదవాడు ఎలా చెరుతారు అని, గొప్ప వారికి అయినా రాసిపెట్టకపోతే జరగదు అని, పరాక్రమవంతుడైన కొడుకు వలన కలిగే లాభం, దాతలు ఎటువంటి వారికి చేసే దానం ఉపయోగం, అల్పుడు ఎవరిని ఆశ్రయిస్తే లాభం

జరుగుతుంది, ఎవరిని ఆశ్రయిస్తే లాభం జరుగదు అనే విషయాలను సమాజానికి ఉపయోగపడే అంశాలు ఈ కింద పద్యాలలో చర్చిద్దాం.

ఉ. శ్రీగల భాగ్యశాలి కడఁజేరగ వత్తురు తారుదారె దూ
రాగమన ప్రయాసమున కాదట నోర్చియునైన నిల్వ ను
ద్యోగముచేసిబీ రత్ననిలయుండని కాదె సమస్తవాహినుల్
సాగరుఁ జేరుటెల్ల మునిసన్నుత! మద్గురుమూర్తి! భాస్కరా! (భాస్కర శతకం -1)

మనుషులు ఎన్ని కష్టాలు పడినా చివరికి ధనవంతుడి దగ్గరకు చేరుతారు. అది ఎలాగంటే నదులు ఎన్ని వంకర్లు తిరిగినా, ఎంత దూరం ప్రయాణించిన చివరికి రత్నములను తనలో దాచుకొని ధనవంతుడైన సముద్రంలో చేరినట్లుగా చేరుతుంది. ప్రస్తుత కాలంలో విద్యార్థులు పరీక్షలు వచ్చినప్పుడు భగవంతున్ని ఆశ్రయిస్తారు. అది ఎలాగంటే విద్యార్థులు పరీక్షల ఉత్తీర్ణత కోసం మనం కోరిన కోర్కెలు తీరుస్తాడని భగవంతున్ని ఆశ్రయింస్తాం. పరీక్ష రోజు, రిజల్ట్స్ రోజు భగవంతుడిని ప్రత్యేకంగా ప్రార్థిస్తారు. 'బెల్లం చుట్టు ఈగలు ముసిరినట్టు' సంపద ఉన్నవారి చెంతకే ప్రజలు ఎన్ని కష్టాలుపడి అయినా చేరుతారు.

ఉ. కాని ప్రయోజనంబు సమకట్టదు తా భువి నెంత విద్యవాఁ
డైనను దొడ్డరాజు కొడుకైన నదెట్లుబీ మహేశుపట్టి వి
ద్యానిధి సర్వవిద్యలకుఁ దానె గురుండు వినాయకుండు దా
నేనుఁగు రీతి నుండియు నదేమిటి కాడఁడు పెండ్లి? భాస్కరా! (భాస్కర శతకం -31)

మనిషి తాను ఎంత చదువుకున్నవాడైనా, గొప్ప రాజు కొడుకైనా తలరాతలో రాయని పని జరగదు. ఎలాగంటే ఈశ్వరుడి యొక్క కుమారుడైనా, విద్యాసంపన్నుడై, అన్ని విద్యలకు తానె గురువైనా, సర్వ విఘ్నాలకు అధిపతి ఐనా, ఏనుగంత బలవంతుడు అయిన ఆ వినాయకుడు తన పెళ్ళి తాను చేసుకొలేకపోయాడు. ప్రస్తుత కాలంలో ఉపాధ్యాయుడు తన విజ్ఞానాన్ని విద్యార్థులకు పంచి ఎంతో మందిని ఉన్నత అధికారులుగా తీర్చిదిద్దినా, ఉపాధ్యాయుడు తనకు తాను ఉన్నత పదవులు పొందలేడు. ఉపాధ్యాయుడికీ ఎంత విజ్ఞానం ఉన్నప్పటికీ కూడా తన రాతలో రాసిపెట్టి లేదు కనుక ఉపాధ్యాయుడు ఉన్నతాధికాన్ని పొందలేడు.

చ. ఘనుఁడగు నట్టివాఁడు నిజకార్య సముద్ధరణార్థమై మహిం
బనివడి యల్పమానవునిఁ బ్రార్థనఁ జేయుట తప్పుగాదుగాబీ
యనఘతఁ గృష్ణజన్మమున నా వసుదేవుఁడు మీఁద టెత్తుగాఁ
గనుఁగొని గాలిగానికడ కాళ్ళకు మ్రొక్కఁడెనాఁడు భాస్కరా! (భాస్కర శతక0 -37)

పరాక్రమవంతులైనా, మంచివారైనా కాలం కలిసి రానప్పుడు చెడ్డవారిని వేడుకొనడం తప్పుకాదు. పూర్వం శ్రీకృష్ణుడిని కంసుని చెర నుండి తప్పించడానికి వసుదేవుడు గాడిద కాళ్ళు పట్టుకోలేదా. ప్రస్తుత కాలంలో విద్యావంతులు కొన్ని సందర్భాల్లో తనకంటే అల్పులను అర్థించవలసి వస్తుంది. ఎలాగంటే ప్రజ్ఞావంతుడైన విద్యార్థి నిండుగా ఉండే కుండ తొణకదు. ప్రస్తుత కాలంలో అల్పుడు ఏమి తెలియకపోయినా అన్ని విషయాలు తెలిసినట్టు విర్రవీగుతుంటాడు, ఆడంబరాలకు పోతాడు. పాండిత్యం ఉన్న పండితుడు అన్ని విషయాలు తెలిసిన నిశ్శబ్దంగా ఉంటాడు. ఎలాగంటే అన్ని ఉన్న విస్తరి అనిగిమనిగి ఉంటుంది. ఏమీ లేని విస్తరి ఎగిరెగిరి పడుతుంది అనే సామెత సమాజంలో వాడుకలో ఉన్నది. దీనిని బట్టి తెలివైనవాడు, నీచుల మధ్య వ్యత్యాసం తెలుస్తుంది. అన్ని విద్యలు తెలిసిన వాడు నిశ్శబ్దంగా ఉంటాడు. ఏమీ తెలియనివాడు అన్ని తెలిసినవాడిలా విర్రవీగుతుంటాడు.

ఉ. పూనిన భాగ్యరేఖ చెడిపోయిన పిమ్మట నెట్టి మానవుం
డైనను వాని నెవ్వరుఁ బ్రియంబునఁ బల్కరు పిల్వ రెచ్చటం

దానది యెట్లొకో యనినఁ దథ్యము పుష్పము వాడి వాసనా
హీనత నొందియున్నయెడ నెవ్వరు ముట్టుదురయ్య భాస్కరా ! (భాస్కర శతకం -60)

కుబేరుడు అంతటికి వాడికైనా సమయము కలిసిరాక ధనము కోల్పోయిన అంతకుముందు తనతో చాలా ప్రేమగా మాట్లాడినవారు ధనము కోల్పోయిన తర్వాత తనతో ప్రేమగా మాట్లాడరు. వారిని ఇదివరకులా ఎక్కడికి పిలవరు. వాడిపోయి వాసన లేని పువ్వును ఎవరూ తీసుకోరు కదా. ఏ పువ్వు అయినా సువాసన వస్తున్నంత కాలం, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించినంత వరకే దానిని ప్రేమగా చూసుకుంటారు. వాసన లేకుండా వాడిపోయిన పువ్వును పక్కన పడేస్తారు. విద్యావంతుడైన పండితుడు పదోన్నతి పొందకపోతే అతనిని ఇతరులు ఎవరూ గుర్తించరు, లెక్కపెట్టరు. అతనితో ఎవరు స్నేహము చేయరు. అతనికి సమాజంలో విలువ ఉండదు. కాలం కలిసి రాక ఉన్న ఉద్యోగం పోయినా, తెలివైనవాడికి ఉద్యోగం రాకపోయినా అతడు విద్యావంతుడైనా అల్పుడిగా భావిస్తారు. అతనిని కించపరిచే విధంగా మాట్లాడుతారు.

ఉ. బల్లిదుఁడైన సత్ప్రభువు పాయకయుండినఁగాని రచ్చలోఁ
జిల్లరవారు నూరుగురు సేరినఁ దేజము గల్గ దెయ్యెడన్
చల్లని చందురుం డెడసి సన్నపుజుక్కలు కోటియున్న రం
జిల్లునె వెన్నెలల్ జగము చీఁకటులన్నియు బాయ! భాస్కరా! (భాస్కర శతకం -67)

ఏ సభలోనైనా సమర్ధుడైన న్యాయాధికారి ఉంటేనే అది బాగుంటుంది. అది ఎలాగంటే రాత్రి యందు ఎన్ని నక్షత్రాలు ఉన్నా దానికి శోభ కలిగించే చంద్రుడు లేకపోతే కాంతి ఉండదు. చీకటిని నక్షత్రాలు పోగొట్టలేవు. చంద్రుడు తన వెన్నెల కిరణాలతో చీకటిని తొలగించి, చల్లదనాన్ని, కాంతిని ఇస్తాడు. పాఠశాలలో సమర్థుడైన ప్రధాన ఉపాధ్యాయుడు ఉంటేనే పాఠశాల బాగుంటుంది. ఎలాగంటే పాఠశాలలో అనేకమంది ఉపాధ్యాయులు ఉన్నా వారందరికి భిన్న అభిప్రాయాలు ఉంటాయి. కానీ వారందరిని ఏకతాటిపై నడిపించే ప్రధానోపాధ్యాయుడు లేనిదే పాఠశాల అభివృద్ధి చెందదు. ఏ రంగంలో అయినా సమర్థులైనవారు ఉంటేనే ఆ రంగం అభివృద్ధి చెందుతుంది దానికి తగిన సామర్థ్యం ఉన్న వ్యక్తుల వలనే కీర్తి ప్రతిష్టలు కలుగుతాయి.

**ముగింపు :**

మారవి వెంకయ్య రాసిన ఈ భాస్కర శతకంలో పద్యాలలో లక్ష్య-లక్షణ సమన్వయంతో ఉన్నాయి. మొదటి రెండు వరుసలు లక్షణాన్ని చెప్పి, తరువాత రెండు వరుసలు దాని ఉదాహరణ ఇచ్చినట్లుగా పద్యాలు రాశారు. ఈ శతకంలో దృష్టాంతాలంకారంతో పద్యాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇది నీతి, భక్తి శతకముగా ప్రసిద్ధి పొందినది. మారవి వెంకయ్యను మారయ వెంకయ్య అని కూడా పిలుస్తారు. ఇతను భాస్కర శతకంతో పాటు నందనందన శతకం అనే శతకం కూడా రాశారు. కానీ భాస్కర శతకం పొందినంత ప్రజాదరణ, ఖ్యాతి నందనందన శతకం పొందలేకపోయినది. ఇతను వేణీసంహారం, ప్రబోధ చంద్రోదయం, నందనందన శతకం, భగవత్కీర్తనలు అనే రచనలు చేసినా, భాస్కర శతకానికి లభించిన ఖ్యాతి ఇతని యొక్క ఏ రచనలకు లభించలేదు. ఇతనికి 'చతురసాహిత్య లక్షణ చక్రవర్తి', 'ప్రతివాదిమదగజ పంచానన' అనే బిరుదులు ఉన్నాయి. ఇతను 16వ శతాబ్దానికి చెందినవారు. ఇతను సూర్య భగవానుని భక్తుడు అవ్వడం వలన అరసవెల్లి సూర్యభగవానుడి పేరు మీద శతకం రాశారు. ఇతను తన భాస్కర శతకంలో 'భాస్కరా' అనే మకుటంతో శతకాన్ని రాశారు. భాస్కర శతకాన్ని సూర్యభగవానుడికి అంకితం ఇచ్చాడు. భాస్కర శతకమును ఉత్పలమాల, చంపకమాల వృత్త పద్యాలతో రాశారు. పురాణాల నుండి ఎన్నో ఉదాహరణలుగా ఇచ్చాడు. సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను నిర్మోహమాటంగా విమర్శించాడు. మనిషి

మనుగడకు కావాల్సిన మంచి లక్షణాలు ఏమిటి? ఎలా ఉండాలి? అన్నవి ఈ శతకంలో వివరించాడు. మానవుడి జీవితంలో ఎదురయ్యే చిన్న విషయాలను కూడా సూక్ష్మంగా పరిశీలించి శతకం ద్వారా తెలియజేశారు.

ప్రాచీన కాలం నుండి నేటి వరకు కవులు శతక ప్రక్రియని ఎంచుకోవడానికి కారణం ఏమిటంటే చెప్పదలుచుకున్న విషయాలను సూటిగా, సూక్ష్మంగా, కొంచెం కటువుగా, కొంచెం మృదువుగా తమ భావాన్ని వ్యక్తం చేయడానికి శతక ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆనాటి సమాజం యొక్క స్థితిగతులు, ఆచారాలు, ఆర్థిక పరిస్థితులు, మత పరిస్థితులు, ఆ కవి ఏ ప్రాంతం వారు అనేది కూడా ఈ శతకాల ద్వారా తెలుసుకోవచ్చు. పద్యం అనునది చంధోబద్ధంగా ఉంటుంది కనుక అది ఎప్పటికీ నిలిచి ఉంటుంది. అంతరించిపోతుంది అనే భయం ఉండదు. సమాజంలో ఉన్న మంచి, చెడులను కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది.

**ఉపయుక్త గ్రంథ సూచిక :**

1. భాస్కర శతకము, మారవి వెంకయ్య
2. డాక్టర్. ద్వా.నా.శాస్త్రి. 2004, తెలుగు సాహిత్య చరిత్ర, ప్రతిభ పబ్లికేషన్స్ , హైదరాబాదు.
3. సుబ్బారావు,వంగురి. 1957, ఆంధ్ర శతక కవుల చరిత్రము, కమల కుటీర్ పబ్లికేషన్స్, నరసరావుపేట.
4. ఆరుద్ర. 1960, సమగ్రాంధ్ర సాహిత్యం,మచిలిపట్నం.

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక** సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# దార్ల మాట శతకం - సామాజిక దృక్కోణం

**బొమ్మ మహాలక్ష్మి**

ఎం.ఏ తెలుగు ద్వితీయ సంవత్సరం, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురము
Email: neeraja29051999@gmail.com Ph.70755 91083

## 1.ఉపోద్ఘాతం

ఆంధ్ర వాఙ్మయంలో వెలువడిన అనేకానేక ప్రక్రియలలో శతకప్రక్రియ ఎంతో విశిష్టమైంది. శతకం కావ్యమంత సమగ్రం కాకపోయినా, ప్రత్యేకమైంది. ఉదాత్త కావ్య శ్రేణిలో నిలువలేకపోయినప్పటికీ, కవితా శక్తి విరాట్ స్వరూపం అందులో పరిపూర్ణంగా ప్రదర్శితం కాకపోయినప్పటికీ, రస చర్చకు తావు లేకపోయినప్పటికీ, కవిహృదయానికది కమనీయ దర్పణం. పండితులను, పామరులను సరిసమానంగా రంజింపజేసే విశిష్టరచనా ప్రక్రియ శతకం. శతకం ఎంత ప్రాచీనమో అంతే ఆధునికం. వెల్లువలా ఎన్ని సాహిత్య ప్రక్రియలు వచ్చినా ఏ మాత్రం వన్నె తగ్గని ప్రక్రియ శతకం. తెలుగులో వందల సంఖ్యలో శతకాలు వచ్చాయి. తమిళం, కన్నడ భాషలో శతకాలు ఉన్నప్పటికీ తెలుగులో ఉన్నన్ని లేవు.

"మకుటాత్మకమగు శతముక్తక సముచ్చయమే శతకం", అని సాహితీవేత్త గోపాలకృష్ణారావు గారు నిర్వచించారు. సంఖ్యా నియమం, మకుట నియమం, రసవృత్త నియమం అనేవి శతక లక్షణాలు. ఈ లక్షణాలను సంస్కృత శతకాలను అనుసరించి తెలుగు శతకకర్తలు గ్రహించారు. మల్లికార్జున పండితారాధ్యుడు (క్రీ. శ. 1160-1170) శతక రచనకు మార్గదర్శకుడై 'శివతత్వ సారం' అనే శతకాన్ని రచించి ప్రథమాంధ్ర శతకకర్తననే గౌరవాన్ని పొందాడు.

శతకాలలో శైవభక్తి, వైష్ణవ భక్తి, దేవీ భక్తి, వివిధ భక్తి, వేదాంత, నీతి, అధిక్షేప, శృంగార, హాస్య శతకాల వంటివి ఎన్నో ధోరణులు కనిపిస్తాయి. ఎక్కువ శాతం శతకాలు సామాజిక స్పృహతో నిండి ఉంటాయి. అత్యాధునిక యుగంలో అలాంటి సామాజిక స్పృహ కలిగిన విశిష్టమైన శతకం "దార్ల శతకం". దారి పూలతోట దార్ల మాట అనేది మకుటం.ఆధునికత ఎంతవరకు మానవ మనుగడకు ఉపయోగపడుతుందోవివరించిన విధాన్ని దార్లశతకంలో మనం చూడవచ్చు.

## 2.కవి పరిచయం

ఆచార్యదార్ల వెంకటేశ్వరరావు గారు తూర్పు గోదావరి జిల్లా అమలాపురం దగ్గర కాట్రేనికోన మండలం, చెయ్యేరు అగ్రహారంలో శ్రీలంకయ్య, శ్రీమతి పెదనాగమ్మ దంపతులకు తృతీయ కుమారుడిగా జన్మించారు. దార్ల వారికి చిన్నతనం నుండి సాహిత్యమంటే అభిమానం.ఎనిమిదవ తరగతిలోనే ఆయన రాసిన హాస్య సంభాషణలు, ఉత్తరాలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యేవి. కవిత్వ రచన మాత్రం కళాశాల నుండి రాయడం మొదలుపెట్టారు. ఆయన మొట్టమొదటి కవిత 'జీవితవాన'(1992). కళాశాల మ్యాగజైన్లో తన మిత్రుల పేర్లతో కథలు, కవితలు రాసినట్టు తన ఆత్మకథ మొదటి భాగంలో రాసుకున్నారు.

ఈయన రాసిన మొదటి కథ 'దాబామామ్మగారు'(1996) ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమయ్యింది. తర్వాతి కాలంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చేరిన తరువాత అక్కడ జరిగిన సంఘటన నేపథ్యంతో 'రాఖీ' అనే కథను రాశారు. అలా కొన్ని కథల్ని రాసినా, తర్వాతి కాలంలో తన రచనా వ్యాసంగాన్ని కవిత్వం పైనే మరలించారు. తన జీవితంలో ఎదురైన అనుభవాల నేపథ్యంతో రాసిన వచన కవితలను 'దళిత తాత్త్వికుడు'(2004) పేరుతో ప్రచురించారు. మారికొన్ని కవితలను కలిపి 2016లో 'నెమలి కన్నులు' కవిత్వాన్ని ప్రచురించారు. దార్ల వారు చేపట్టని తెలుగు సాహిత్య ప్రక్రియ అంటూ లేదు. ఏ ప్రక్రియలో నైనా తన ముద్రను వేశారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం లో తెలుగుశాఖ అధ్యక్షులుగా పదవిని అలంకరించారు.

దార్లవారి శతకంలోనేటి సామాజిక సమస్యలను గురించి చాలా చక్కగా పొందుపరిచారు. ఆధునిక యువత, రాజకీయ వ్యవస్థ, సాహిత్య పఠనం, ఆధునిక కార్పొరేట్ వ్యవస్థకు సంబంధించిన విషయాలను నేటి కాలానికి అన్వయించి సరళమైన రీతిలో పద్యాలను చెప్పారు.

**3.ఆధునిక యువత**

ఆధునిక కాలంలో యువతరాన్ని ఫోన్ఏ విధంగా నియత్రిస్తుందో, ఫేస్ బుక్, వాట్సాప్ వంటి వాటి మాయలో ఎలా పడుతున్నారో కింది పద్యాలలో చక్కగా వివరించారు.

చుట్టు తిప్పుకొనుచు చూడమనుచునుండు.
పిచ్చి పిచ్చివన్ని తెచ్చి పిచ్చి
పట్టినట్లు చేయు పాపి మొబైలురా
దారి పూలతోట దార్ల మాట.

ఫేసుబుక్కు తీసి పెంటలో విసిరినా
ఫోను తెరిచి చూడ పొర్లి వచ్చు
వదలనట్టి జిడ్డు వాట్సప్పు మనకుండె
దారి పూలతోట దార్ల మాట.

ఆధునిక కాలంలో యువత బుక్ అనే మాట మరిచి ఫేస్బుక్ అనే మాయలో పడి గుర్తుతెలియని వ్యక్తులతో స్నేహం చేస్తున్నారు. చాటింగ్లు చేస్తూ ఎలా పెడదారి పడుడుతున్నారో పైపద్యంలో చెప్పారు. వాట్సాప్ మాయలో పడి ఎప్పుడెప్పుడు మెసేజ్లు వస్తాయో అని వాట్సప్ ఓపెన్ చేయడం తప్ప ఒకసారి అయినా బుక్ ఓపెన్ చేసి చదివే ఆలోచన నేటి యువతలో కనిపించడం లేదు. మొబైల్ ఎప్పుడు మనిషి మనసుని తన వైపుకు లాగుతూ ఉంటుంది కొత్త కొత్త వీడియోలు నోటిఫికేషన్లతో మనిషిని ఆకర్షిస్తూ దాని చుట్టూ తిప్పుకునే ప్రయత్నం చేస్తుంది. మానవుడు కూడా ఫోన్ మాయలో పడి పిచ్చి వాళ్ళలా తయారవుతున్నారు. మనుషులను పిచ్చివాళ్లను చేసి ఫోన్ ఆడుకుంటుంది. ఫోన్ మనిషి చెప్పినట్లు వినాలి కానీ ఫోన్ చెప్పినట్లు మనిషి వినకూడదు. కానీ ప్రస్తుత సమాజంలో ఫోన్ మనిషిని నడిపిస్తూ ఫోన్ చెప్పింది చేసే విధంగా తనాధీనంలోకి తీసుకుంటుంది. మొబైల్ ఫోన్ అనేది వ్యక్తి యొక్క అవసరాలకు తగినంత మాత్రమే వాడుకోవాలి మితిమీరి ఉపయోగించడం వల్ల మానవుడు ఫోన్ ఆధీనంలోకి వెళ్ళిపోతున్నాడు. మొబైల్ చెప్పినట్టు మానవుడు నేడు ప్రవర్తిస్తున్నాడు. ఇలా అధికంగా మొబైల్ ను వాడడం వల్ల మానవుని ఆలోచనాశక్తి రాను రాను తగ్గిపోతుంది. దీని కారణంగా మానవులలో సృజనాత్మకత అనేది సన్నగిల్లుతుంది.

**4.ఆధునికరాజకీయ వ్యవస్థ**

నేడు రాజకీయం భ్రష్టు పట్టి పోయింది. అలాంటి రాజకీయ వ్యవస్థను తన పద్యాలతో ఖండించారు దార్లవారు.

కప్పలన్ని కలిసి చెప్పలేనంతగా
వర్షమొదవు వేళ హర్షమొందు
ఎన్నికలకు ముందు ఎంత హడావిడో
పూలతోట దార్ల మాట.

త్రాగి కారు నడుప తప్పయినప్పుడు
ఓటు వేయునపుడు నోటునిచ్చి
తనకు వేయుమనుట తప్పు కాదందురా
దారి పూలతోట దార్ల మాట.

వర్షానికి ముందు కప్పలన్ని ఎలా గుంపులు గుంపులుగా చేరుతాయో అలాగే ఎన్నికలకు ముందు ఓట్ల కోసం ప్రజల దగ్గరకు రాజకీయనాయకులు గుంపులు గుంపులుగా వస్తారు. అలాగే ఓట్లు వేసాక ప్రజలను, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా వెళ్ళిపోతారు. గెలవడం కోసం చెప్పే మాటలు ఓటు వేసేంతవరకే. ఒక్కసారి ఓటు వేశాక వారు చెప్పిన మాటలు హామీలు గుర్తు రావు నేటి రాజకీయ నాయకులకు.

తాగి వాహనం నడపడం తప్పు అని పోలీసులు ఎలా చెపుతారో, ఎన్నికల సమయంలో ఓట్ల కోసం రాజకీయ నాయకులు ప్రజలకు డబ్బు, మద్యం పంపిణీ చేసేటప్పుడు ఆ విషయాన్ని ఎలా విస్మరిస్తారని ప్రశ్నించారు కవి. తాగడం తప్పు అని, తాగి కారు నడిపితే తప్పు అని తెలిసిన నాయకులకు ఓటుకు మద్యం ఇస్తే తప్పు అనేది తెలియడం లేదు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న పోలీసులు మద్యం తాగి వాహనం నడపకూడదు అంటారు. ప్రభుత్వాన్ని నడిపిస్తున్న రాజకీయ నాయకులు వారి ఓట్ల కోసం మద్యాన్ని పంపిణీ చేస్తే అది తప్పుగా కనిపించదు.నేటి రాజకీయ వ్యవస్థ ఎలా మారిపోయిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

**5.సాహిత్యపఠనం**

సాహిత్య పఠనం మనిషిని ఏరకంగా సంస్కరిస్తుందో కింది పద్యాల ద్వారా వెల్లడి చేశారు కవి.

సర్వవేళలందు సాహితీ పఠనంబు
మలినమవ్వవేళ మనసునంత
సంస్కరించి మనకు సమదర్శనమునిచ్చు
దారి పూలతోట దార్ల మాట.

కలిమిలేములన్ని కావడికుండలు
ఒడిదుడుకులు తెలిపి ఓర్పునిచ్చి
సత్త్వ గుణము నేర్పు సాహిత్య పఠనంబు
దారి పూలతోట దార్ల మాట.

సాహిత్య పఠనం చేయడం వల్ల మనకున్న ప్రపంచజ్ఞానం , ఊహాశక్తి పెరుగుతుంది. నాటకీయంగాసంభాషణాత్మకంగా ఉండే కథలు మన మస్తిష్కం మీద దీర్ఘకాలిక ప్రభావం చూపుతాయి. తెలివితేటలు పెరుగుతాయి సాహిత్య పఠనం వల్ల ప్రపంచం నలుమూలల్లోని ఎన్నెన్నో కొత్త విషయాలు బోధపడతాయి. ఎన్నో రకాల మనస్తత్వాలు తెలుస్తాయి. ప్రపంచంలో మనకు తెలియని ఎన్నో విషయాల పట్ల జ్ఞానం పెరుగుతుంది . ఎన్నో సమస్యలను పరిష్కరించుకునే విధానం తెలుస్తుంది. మన భావవ్యక్తీకరణ శక్తి అభివృద్ధి చెందుతుంది. భాష పైన పట్టు పెరుగుతుంది. అంతేకాకుండా సాహితి పఠనం చేయడం వలన మనకి వ్యక్తిత్వ వికాసం, సామాజిక వికాసం పెంచుకునేల దార్ల శతకం బోధిస్తోంది. సాహిత్యం ఒక పాశుపాతాస్త్రం, దాన్ని మనలోని పశుత్వాన్ని సంహరించి మానవత్వాన్ని పెంచేందుకువినియోగించాలి. సమాజంలో ఎలా బతకలో, ఒడిదుడుకులు ఎదురైనప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో సాహిత్య అధ్యయనం వల్ల అలవరచుకోవచ్చు. ఓర్పు, సహనం, నైతికత సాహిత్య పఠనం వల్లనే మనలో పెంపొందుతాయి. ఆధునిక కాలంలో యువత మానసిక సమస్యలను ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. వారిలో ఓర్పు , స్థిరమైన ఆలోచన లేకపోవడం వల్ల సమస్యలను పరిష్కరించుకోలేకపోతున్నారు. యువత సాహిత్య పఠనానికి దూరంగా వెళుతూ ఐటీ కు దగ్గర అవడం వలన మానసిక సమస్యలు ఎదురవుతున్నాయి. ఏదైనా ఒక సమస్య వచ్చినప్పుడు పరిష్కరించుకునే సామర్థ్యం లేకపోవడం వల్ల ఒత్తిడికి గురి కావాల్సి వస్తుంది. సాహిత్యం మనకు జీవితాన్ని ఎలా సంతోషంగా ముందుకు సాగించాలని నేర్పిస్తుంది. సాహిత్యం చదవడం వల్ల సమాజంలో అన్ని విషయాల పట్ల మనకు అవగాహన కలుగుతుంది.

**6.ఆధునిక కార్పొరేట్ వ్యవస్థ**

నేడు అన్ని రంగాల్లోనూ ప్రభుత్వ సంస్థలు పోయి కార్పోరేట్ సంస్థలు నెలకొన్నాయి. మనుషుల జీవన విధానం కూడా పూర్తిగా మారిపోయింది. కార్పోరేట్ వైద్యవ్యవస్థ సామాన్యులకు ఎలాంటి కంటకంగా మారిందో కింది పద్యంలో వివరించారు.

సంతకంబు పెట్టు సర్జరీకనుచుండు
కథల కథల గుట్ట కార్పొరేటు
జబ్బుమాటకన్న డబ్బుదే మాటరా
దారి పూలతోట దార్ల మాట.
సందు వెతుకుకొనుచు సర్వరంగంబులు
వామనుండువోలె వచ్చునండి
కమ్మగాను చెప్పు కార్పొరేటు కథలు
దారి పూలతోట దార్ల మాట.

నేటి కార్పొరేట్ వ్యవస్థల దోపిడీ ఎలా ఉందంటే,ప్రస్తుత కాలంలో మనిషి ప్రాణాల కంటే డబ్బుకు విలువఎక్కువ ఉంది. అందుకు నిదర్శనం కార్పొరేట్ వ్యవస్థ. అందులో భాగంగానే ఆసుపత్రులలో ముందు సంతకాలు చేయించుకుంటారు. బాధితుల ప్రాణాలకు వారే బాధ్యులుఅంటారు. కానీ డబ్బు మాత్రం కట్టాల్సిందే. పైగా గొప్ప గొప్ప చదువులు చదువుకున్నవారే కార్పొరేట్ సంస్థలలోఉంటారు.

**7. ముగింపు**

“దార్ల శతకం” అనేది సాంప్రదాయిక భావనలకు వ్యతిరేకంగా ఉండి, సమాజంలోని అనేక స్థాయిలలో మార్పు, ప్రగతి, విలువల పెరుగుదల, ఇంకా ప్రజల జీవనశైలిని పెంచుకోవడంపై దృష్టి సారించింది. సామాజిక దృకోణం నుండి, సమాజంలో ఉన్న అవగాహన, అన్యాయాలు, వివక్షతలు, మరియు పరిష్కార మార్గాలను అందించింది.

ఇది సాధారణ వ్యక్తి యొక్క అనుభవాలను, వారి దుర్గతులను, అభ్యుదయాన్ని మరియు స్వాతంత్ర్యాన్ని ప్రతిబింబించే ఒక శక్తిమంతమైన సాధనంగా మారింది. శతకంలోని పద్యాలు సాధారణ ప్రజల నుంచి సామాజిక అంశాల వరకు విస్తరించి, సమాజంలో ఉన్న విభేదాలపై పట్టు తీసుకుంటాయి. ఈ శతకం ద్వారా, దార్ల వారు తన సమాజానికి ముఖ్యమైన సందేశాలు అందించారు. మార్పును ఆకాంక్షించే సమాజానికి ఇది ఒక మేల్కొలుపు శతకం.

**ఆధార గ్రంథాలు**

1.వెంకటేశ్వర రావు, దార్ల. 2021. దార్ల మాట శతకం. మంజుశ్రీ ప్రచురణలుబీ హైదరాబాదు.
2.నాగయ్య. జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటం %-% 2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.
3.భర్తృహరి. 2012. భర్తృహరి సుభాషితములు. విజయవాడ: లిఖిత ప్రచురణలు.
4.ఆరుద్ర. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. (సంపుటం %-% 4). హైదరాబాదు: తెలుగు అకాడమి.
5.సుబ్బారావు, వంగూరి. 1957. శతక కవుల చరిత్రము. నరసాపురము: కమల కుటీర్ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్.
6.గురజాడ, గరికిపాటి. 2020. మనుచరిత్ర- వ్యక్తిత్వ వికాసం. విజయవాడ: శ్రీరాఘవేంద్ర పబ్లిషర్స్.
7.ప్రసాద్, మొండెపు. 2013. శతకాలలో స్త్రీల పట్ల వవక్ష. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
8.నారాయణరెడ్డి, సి. 1977. ఆధునికాంధ్ర కవిత్వం: సంప్రదాయములుప్రయోగములు. గంజి బజార్: శివాజీ ప్రెస్.
9.భర్తృహరి, 1990. సుభాషిత త్రిశతి. విజయవాడ: జి. వి. హెచ్. పబ్లికేషన్స్.
10.గోపాలకృష్ణారావు, కె. 1976. ఆంధ్ర శతక సాహిత్య వికాసము. హైదరాబాద్: ప్రతిభా ఆర్ట్స్ ప్రింటర్స్.

❖❖❖

ISSN 2457-0796
**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక** సంపుటి-28 : సంచిక-8(2) హైదరాబాద్ జూన్- 2025

# ఆంధ్రనాయక శతకం - కుటుంబ వ్యవస్థ

**కొమరం అనిత**

ఎం.ఏ తెలుగు ద్వితీయ సంవత్సరం, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురము
Email: komaramanitha3@gmail.com, Ph.9390070810

**ఉపోద్ఘాతం:**

శతకం అంటే 100 లేదా 108 పద్యాలతో రచించే ఒక సాహితీ ప్రక్రియ. శతక సాహితీ ప్రక్రియలో ఒకటే మకుటం గల పద్యాలు కనీసం 100 రాస్తారు. "ఆంధ్ర వ్మాయంలో వేర్వేరు శాఖలుగా వికాసం చెందిన కావ్య ప్రక్రియల్లో శతకం ఒకటి. తెలుగులో శతకం సంస్కృత ప్రక్రియను అనుసరించి ప్రారంభం అయ్యింది. తెలుగులో 12వ శతాబ్దంలో శతకం ఆవిర్భవించింది. సమాజం హితం కోరె శతక ప్రక్రియ తెలుగులో ప్రాచీనం నుండి ఆధునికం వరకు సాగుతూనే ఉంది. అలాంటి వాటిలో ఆంధ్రనాయక శతకం ముఖ్యమైనది.

ఆంధ్రనాయక శతకాన్ని కాసుల పురుషోత్తమ కవి రచించాడు. శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు మీద నిందాస్తుతిగా ఈ శతకం రచించబడింది. తెలుగు భాషలో భక్తి శతకాలు, నీతి శతకాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ ఇలాంటి వ్యాజస్తుతి శతకాలు అరుదు. నిందలో స్తుతిని, స్తుతిలో నిందను నిబంధించి భాక్తి తత్వాన్ని ప్రభోదించిన శతకం ఇది. ఇందులో 108 సీస పద్యాలు ఉన్నాయి. "చిత్రచిత్ర ప్రభావ దాక్షిణ్యభావ హత విమతజీవ శ్రీ కాకుళాంధ్రదేవ"ఇందులోని మకుటం.

**ఆంధ్రనాయక శతకం-కుటుంబ జీవన చిత్రణ**

ఆశ్రమధర్మాలలో అత్యంత ప్రధానమైనది గృహస్థాశ్రమం. గృహస్థాశ్రమ ధర్మానికి మన సంప్రదాయ గ్రంథాలు ఎంతో ప్రాధాన్యతనిచ్చాయి. గృహస్థుగా మనిషి కృతకృత్యుడయ్యాకనే తదుపరి ఆశ్రమ ధర్మాలను స్వీకరించ గలుగుతాడు. భార్య, భర్త, సంతానంతో కూడుకున్న ఈ ఆశ్రమ ధర్మాన్ని చాకచక్యంగా మనిషి పరిపూర్ణం చేసుకోవాలి. ఆధునిక పరిభాషలో దీన్ని కుటుంబ వ్యవస్థ అంటున్నారు.

నేటి నాగరిక ప్రపంచలో అనేక కారణాల వలన అభివృద్ధి పేరుతో కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి. అటువంటి పరిస్థితులలో ఆంధ్రనాయక శతకం ద్వార నేటి సమాజం ఎలాంటి స్పూర్తి పొందాలి? ఆ కాలంలో పరమాత్మ తన కుటుంబ జీవనాన్ని ఎలా కాపాడుకున్నారు? నేటి మానవులు తన కుటుంబ జీవనాన్ని కాపాడుకోవడానికి పరమాత్మ నుండి ఏం తెలుసుకోవచ్చు?. తన కుటుబం విచ్ఛిన్నం కాకుండ ఎటువంటి జాగ్రతలు తీసుకోవాలి... అనే అంశాలను ఈ శతకం ద్వార సమీక్షించబోతున్నాను.

**కుటుంబ గౌరవం**

సీ. కడు దొంగతనమున గని తల్లి వైచిన దనబిడ్డనిగ బెంచె నిను యశోద
జనని గర్భము దించుకొనినవేఱొకతల్లి కడుపు జేసికొనంగ గలిగెనన్న
తంఁడ్రి వివాహయత్నము సేయ నొల్లక తగులుక వచ్చె నీధర్మపత్ని
యన్న రారాజు కీనున్న నీసోదరి యింటికి జోగిరా నంటుకొనియె

తే.గీ. నిట్టి నీసంప్రదాయంబు గుట్టు బెట్టు
రట్టు సేయురు గనుమ నాబట్టుతనము,
చిత్ర చిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ,

హత విమతజీవ, శ్రీ కాకుళాంధ్రదేవ! (ఆంధ్ర.నాయ. 42)

ఒక సంఘంలో కానీ సమజలో కానీ ఒక వ్యక్తి చేసే పని ద్వార తనకు గౌరవం లభిస్తుంది. కుటుంబగౌరవం అనేది భార్య, భర్త, పిల్లలు ఇలా రకరకాల పాత్రలపై ఆధారపడుతుంది. ఆంధ్రనాయక శతకంలో కృష్ణావతార ప్రస్తావనలో కనిపిస్తుంది. కృష్ణుడు పుట్టగానే కన్నతల్లి వద్ద కాక యశోద మాత దగ్గర పెరగవలసి వస్తుంది. అలాగే రుక్మిణీ దేవి తనతండ్రి చేసిన పెళ్లి ప్రయత్నాలని వద్దని కృష్ణుడితో వివాహానికి సిద్ధపడుతుంది. నేటి కాలంలో పిల్లలు తల్లిదండ్రుల మాట కాదని తమ కష్టాలని తామే కోరి తెచ్చుకుంటున్నారు. భారతీయ కుటుంబ వ్యవస్థలో ప్రేమాభిమానాలతో పిల్లలను పెంచి పెద్ద చేయటం తల్లిదండ్రుల బాధ్యత. అలాగే తల్లిదండ్రులను సేవించడం సంతానధర్మం.

**అన్నదమ్ములు**

సీ. నాగలి రొక లన్నకు నిచ్చి శంఖాది పంచాయుదమ లీవు పట్టినావు
తాటిటెక్కంబు కోల్తల పెద్ద కెత్తించి గరుడధ్వజం బీవు గట్టినావు
వెలరాని కఱవోని వలువ జ్యేష్ఠున కిచ్చి కనకాంబరం బావు గట్టినావు
మద్య మగ్రజునకు మత్తిల ద్రావించి జున్ను పాల్ పెరు గీవు జుఱ్ఱినావు

తే.గీ. తగవరివె యన్నదమ్ముల ధర్మ మీవె
తీర్చవలె గానిమఱియొండు తీర్పగలడె.
చిత్ర చిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ,
హత విమతజీవ, శ్రీ కాకుళాంధ్రదేవ! (ఆంధ్ర.నాయ. 36)

అన్నదమ్ములు అంటే కేవలం ఒక తల్లికడుపున పుట్టిన వాళ్ళు మాత్రమే కాదు. కుటుంబ విలువలను వారసత్వాన్ని ముందు తరాలకు అందించే వాళ్ళు. అనుబంధాలు ఆప్యాయతలు పంచుకుంటూ, అమ్మనాన్నల ఆలనా పాలన చూసుకునేవాళ్ళు. ఆంధ్రనాయక శతకంలో కృష్ణావతార ప్రస్తావనలో అన్నదమ్ముల మధ్య భేదం కనిపిస్తుంది. నాగలి, రోకలి అన్నకిచ్చి, శంఖ చక్రాలను, పంచాయుధాలను కృష్ణుడు ధరిస్తారు. విలువైన పట్టు వస్త్రాలను ధరిస్తూ అన్నకి పనికిరాని వస్త్రాలు ఇస్తాడు. ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా ఉండేవాళ్ళ మధ్య అవసరం వస్తే తప్ప కలుసుకోలేని పరిస్థితులు నేడు వచ్చేసాయి. తమ్ముడు, అన్నా పిలుపుల కంటే ఆస్తులు, డబ్బు, హెూదాలు ఎక్కువయ్యిపోయాయి. ఒకటిగా కలిసి కుటుంబ ఆదర్శాలు, సంప్రదాయాలను ముందుకు తీసుకు వెళ్ళేది అన్నదమ్ములు.

**వివాహం**

సీ. కడలి రాయనిముద్దుకన్నియ బెండ్లాడి యూచుగా నిల్లాట ముందు టేమి
సహజ నోక్కరైను పండవునకు బెండ్లి జేసితి నీవు పెద్ద వేమి
చిరరతిప్రౌఢను జిన్నబిడ్డని కీవు గూర్చితి వారీతి గూడు నేమి
యుగములనాటి పెన్మగువను మూసలన్న కొగి చేసితివి తగుం దగు మఱేమి

తే.గీ. తెలియ నవ్యక్తుడవు గావు తెలిసికొన్న
నిట్టివాడని తెలియలే దెవ్వరికిని
చిత్ర చిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ,
హత విమతజీవ, శ్రీ కాకుళాంధ్రదేవ! (ఆంధ్ర.నాయ. 27)

భారతీయ కుటుంబ వ్యవస్థకు పునాది వివాహ వ్యవస్థ. భారతీయ కుటుంబ వ్యవస్థకే కాదు, ఏ జాతి

కుటుంబ వ్యవస్థకైనా పునాది వివాహ వ్యవస్థే. ఇది సమాజంలో తరువాత తరువాత ఏర్పడిన జాతి, మత, కుల, స్థాయీ భేదాలకు అతీతమయ్యింది. విష్ణుమూర్తి సాగరకన్య అయిన లక్ష్మిని పెండ్లాడి ఆ సాగరంలోనే నివాసం ఏర్పరచుకొని ఇల్లరికం ఉంటాడు. తన చెల్లిని పాండవుడైన అర్జునిడికిచ్చి వివాహం చేస్తాడు. అలాగే నేటి కాలంలో కూడా మనం ఎన్నో రకాల వివహాలను చూస్తూ ఉంటాము. కొంత మంది పెద్దల అంగీకారంతో వివాహం చేసుకొంటే, మరికొంతమంది పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహాలు చేసుకుంటారు. అలాగే ఈ ఆధునిక కాలంలో తల్లిదండ్రులు కూడా చిన్నపిల్లలకు ఇష్టం లేకపోయినా బాల్య వివాహాలను చేస్తున్నారు. పిల్లలు తన తల్లిదండ్రుల పట్ల గౌరవంతో వారి అనుమతితో వివాహం చేసుకోవాలి. అలాగే తల్లిదండ్రులు కూడ పిల్లల యొక్క ఇష్టాయిష్టలను తెలుసుకోవాలి.

**భార్య గొప్పతనం :**

సీ. తా వచ్చెద నటంచు ధైర్యలక్ష్మి మహీజ వెంట రా నడవికి వెడలినావు
సుగ్రీవుఁడున్నచో సొమ్ముఁదా నిడ సీత యాజాడ నతనిపొం దతికినావు
ముందు జానకి లంక మూరి?ంచి చొచ్చినన్ దెచ్చిన రిపుల సాధించినావు
వైదేహి భవదంకవసతిఁగూర్చున్నచో భువనసామ్రాజ్యముల్ పొందినావు

తే.గీ. గట్టిగా మైథిలినిఁబెట్టఁబట్ట నట్టి
పౌరుషము లబ్బె నేనాఁటిపూరుషుఁడవో,
చిత్ర చిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ,
హత విమతజీవ, శ్రీ కాకుళాంధ్రదేవ! (ఆంధ్ర.నాయ. 65)

కుటుంబ వ్యవస్థలో భార్యభర్తల బంధం ఎంతో ప్రత్యేకమైనది. వారి బంధం వివాహ బంధంతో బలపడుతుంది. ఆంధ్రనాయక శతకంలో రామావతార ప్రస్తావనలో భార్య గొప్పతనం గురించి చెబుతారు. సీతాదేవి రాముడిని పెళ్ళిచేసుకోకపోతే తనకు అంత అదృష్టం దక్కేది కాదేమో!. ఆమె నగలతోనే సుగ్రీవునితో మంచి స్నేహం ఏర్పడ్డది. ఇలా పురాణాలలోనే కాదు నిజజీవితంలో కూడా భార్య భర్తకు ఎల్లప్పుడు తోడుగా ఉంటుంది. తన కుటుంబంలో కానీ సమాజంలో కానీ తనకు అన్యాయం జరిగినా అన్నీ లోపల దాచుకొని బయటకు నవ్వుతూ జీవించేది భార్య మాత్రమే. అన్నీ ఉన్నప్పుడు, ఏమి లేనప్పుడు ఎల్లప్పుడూ తోడుగా ఉండేది భార్య మాత్రమే.

**సంతానం:**

సీ. అయవారు చదివించినట్లుగాం జదువక మతికొట్టి తిట్టఁగ వెఱపుఁ గొనక
తనయుఁడెంతో పరధ్యనంబుగా నున్నఁ దండ్రి వల్లని చెప్పఁదగఁడె ధాత్రి?
నీకు గోపం బేమి? నీహరిరూపంబున స్తంభంబులోఁ బుట్టి చటులనేత్ర
దంష్ట్రానఖ ప్రభ దహన కీలలఁ బోలి భగ్గు రనంగఁబైఁ బడి హిరణ్య

తే.గీ. కశిపుఁ దనుమాడి ప్రహ్లాదుఁ గరుణనేలి
తండటి కసహ్యమయ్యె నిన్నపుడెకనఁగబీ
చిత్ర చిత్ర ప్రభావ, దాక్షిణ్యభావ,
హత విమతజీవ, శ్రీ కాకుళాంధ్రదేవ! (ఆంధ్ర.నాయ. 62)

కుటుంబ వ్యవస్థలో భార్య, భర్త, సంతానము, సత్యం ఈ నాలుగు కూడా ఎంతో ముఖ్యం ఒకరిపై ఒకరు ప్రేమ ఆప్యాయతలతో ఉండాలి. పిల్లలు తల్లిదండ్రులను గౌరవించాలి. తండ్రీ కొడుకుల గొడవలలో తలదూర్చి భయంకరంగా నరసింహ అవతారంలో విష్ణుమూర్తి తండ్రిని చంపుతారు. తండ్రికి కొడుకుని ప్రశ్నించే హక్కు లేదా!.

అంటే పిల్లల్ని చెడు మార్గం నుండి మంచిదారిలోకి మలిచే బాధ్యత తండ్రికి ఉంది. కానీ అదే అనువుగా పిల్లల్ని హింసించడం భయపెట్టడం చేయకూడదు. అలాగే పిల్లలు కూడా తల్లిదండ్రుల పట్ల గౌరవం లేకుండ ప్రవర్తిస్తారు. పిల్లలు తమ తల్లిదండ్రులకి కాళ్ళు కడిగి ప్రతి రోజు సేవించకపోయిన పరవాలేదు కానీ మూడు పూటలా అన్నం పెట్టి మేమున్నాం అన్న భరోస ఇస్తే చాలు.

**ముగింపు:**

నేటి కాలంలో మానవుడు మితిమీరిన ధనాశతో మానవత్వపు విలువల్ని మరచి అధర్మమార్గంలో పరుగులు తీస్తున్నాడు దీని మూలంగా తన కుటుంబ వ్యవస్థ చిన్నభిన్నమౌతుంది. తల్లిదండ్రుల్ని భార్య పిల్లల్ని ప్రేమతో చూడాల్సింది. లాభనష్టాలతో చూస్తున్నారు. మానవుడు కుటుంబ వ్యవస్థను తన ఐహిక జీవితానికి వరంగా చేసుకోవాలి గాని, కుటుంబ విచ్చిన్నానికి శాపంగా మార్చుకోకూడదు.

**ఆధార గ్రంథాలు:**

1.పురుషోత్తమ కవి, కాసుల . ఆంధ్రనాయక శతకం.
2.నాగయ్య. జి. 2009. తెలుగు సాహిత్య సమీక్ష (సంపుటం 2). తిరుపతి: నవ్య పరిశోధక ప్రచురణలు.
3.భర్తృహరి. 2012. భర్తృహరి సుభాషితములు. విజయవాడ: లిఖిత ప్రచురణలు.
4.రుద్ర. 2012. సమగ్ర ఆంధ్ర సాహిత్యం. (సంపుటం 4). హైదరాబాదు: తెలుగు అకాడమి.
5.సుబ్బారావు, వంగూరి. 1957. శతక కవుల చరిత్రము. నరసాపురము: కమల కుటీర్ ప్రెస్ అండ్ పబ్లికేషన్స్.
6.ప్రసాద్, మొండెపు. 2013. శతకాలలో స్త్రీల పట్ల వవక్ష. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
7.నారాయణరెడ్డి, సి. 1977. ఆధునికాంధ్ర కవిత్వం: సంప్రదాయములు
8.ప్రయోగములు. గంజి బజార్: శివాజీ ప్రెస్.
9.భర్తృహరి, 1990. సుభాషిత త్రిశతి. విజయవాడ: జి. వి. హెచ్. పబ్లికేషన్స్.
10.గోపాలకృష్ణారావు, కె. 1976. ఆంధ్ర శతక సాహిత్య వికాసము. హైదరాబాద్: ప్రతిభా ఆర్ట్స్ ప్రింటర్స్.
11.వీరస్వామి, పల్లేరు. 2005. తెలంగాణా శతక సాహిత్యం. వరంగల్లు: అశోక్ కఅష్ణ ఆఫ్ సెట్ ప్రింటర్స్.
12.వేంకటకృష్ణశర్మ, వేదము. 1954. శతకవ్మాయ సర్వస్వము. మద్రాసు: వేదము వేంకటరాయశాస్త్రి బ్రదర్స్.
13.గురజాడ, గరికిపాటి. 2020. మనుచరిత్ర- వ్యక్తిత్వ వికాసం. విజయవాడ: శ్రీరాఘవేంద్ర పబ్లిషర్స్.

❖❖❖

# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 8(2) జూన్- 2025 ISSN 2457-0796




అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

## తెలుగు శతక సాహిత్యం- సామాజిక దృక్పథం

25-26 నవంబరు, 2024

సదస్సు నిర్వహణ

తెలుగుశాఖ, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం